253

DESI

IN

South Indian Languages & Literature

The DESI element in South Indian Literature does not seem to have attracted the attention of Scholars, even as much as the DESI element in those languages. Scholars like Dr. Caldwell and Kittel etc. have tried to collect, and to point out the characteristic features of this element in the vocabularies of the South Indian languages. Prakrit Grammarians like Hemachendra, have collected the DESI element found in the Prakrits, in works like "Desinamamala" of which a good number of words have also been identified with the Dravidian.

It cannot be denied that there was an under-current of Non-Aryan thought and language in the country—especially in South India, which after a time got inextricably mixed up with the Aryan to the advantage of both. Yet DESI in language is sometimes identified with "Tadbhava". Similarly Sanskrit Lakshanikas have endeavoured to interpret the DESI in literature in terms of the "Marga" method, which having been espoused by the Sanskrits, gained an upper hand and only served to undermine the original DESI; yet this survived as an under-current in the lower strata of society. With the advent of foreign domination and consequent change in the outlook on life and customs,

the hold on DESI is gradually being lost. It is that we study and preserve what is yet left.

An attempt is here made to deal with the vari aspects of DESI with a view to get at the comm literary and prosodial tradition, underlying the devel ment of the indigenous forms of Literature in So India. If this can rouse any interest in a comparat study of the Dravidian prosody and of forms of in genous Literature of South India the object of work is fulfilled.

K. R.

తొలి పలుకు

దక్షిణహిందూదేశమున వ్యవహారములోనున్న నాగరకభాషలును తత్తద్దేశమందలి కొన్ని యనాగరకభాషలును జేరి యొక ప్రత్యేక కుటుంబముగా నేర్పడుననియు నిది సంస్కృతాద్యార్య భాషావర్గముకంటె భిన్నమనియు నాధునిక భాషాతత్త్వవేత్తలలో పలువురి యభిప్రాయమై యున్నది. ఇవి యార్యభాషాజన్యములేయని తలంచువారును గొందఱు గలరు. తత్త్వాన్వేషణము విషయమున, మత, రాజకీయ వైజ్ఞానికాది వ్యక్తిగతాభినివేశములకు తావులేదుగదా. నేటి హైందవ విజ్ఞానమును నవీన ప్రాచీనములగు రెండు భిన్న వైజ్ఞానిక సంస్కారముల సంపుటియని టాగోరు వంటి పలువురు అనేకులు తలంచియున్నారు. వీనిలో నార్య విజ్ఞానము పైచేయి కలదిగుటచే దేశీయ విజ్ఞానము మరుగువడి—దానితో సమ్మేళనమును బొంది—దానికి వన్నెగూర్చినదైనది. దీని స్వరూపలక్షణముల నిప్పుడు కనిపట్టుట దుష్కరమే యగును. కాని కొన్ని జాడలు లేకపోలేదు. దక్షిణదేశభాషా నిర్మాణమునందలి విశేష లక్షణములను బట్టియు, "దేశి" పదజాలమునుబట్టియు వీని ప్రత్యేకత నిరూపింపఁదగియున్నట్లే, యీ భాషలలోని ప్రాచీన సారస్వతమునందలి ఛందస్సాహితీ రీతుల విశేషలక్షణములనుబట్టి ప్రాచీన దక్షిణదేశీయంబగు "దేశి" వాఙ్మయసంప్రదాయ విశేషములలోఁగల ప్రత్యేకత యెంతవరకు నిరూపింపఁదగునో యను విషయమును పరిశీలించుటయే యీ రచనయొక్క ముఖ్యోద్దేశము. మార్గ సాహిత్యప్రాబల్యముచే మరుగుపడి యంతరించి పోవుచున్న మన ప్రాచీన "దేశి" సాహిత్యము నుద్ధరింపవలసిన యావశ్యకత యెంతేనియు కలదు. ఇది భావి పరిశోధకుల దృష్టి నాకర్షింపగలిగినచో నీ రచన సఫలతజెందును.

తమిళమున తొలియుగమునందలి రచనలు దేశీయప్రభువుల
గాభిమానముల మూలమున సంకలితములై సంరక్షింపబడినవి. ఇ
రాష్ట్రలికాలమున తెలుఁగు “దేశి” సాహిత్య సృష్టి నోము నోచుకొన
ఇప్పటి మాప నాంధ్రసాహిత్యో జ్జీవనోద్యమమైనను ప్రాచీన ‘‘
సాహిత్యోద్ధరణ ప్రవణంబగుగాక.

మద్రాసు,
1-3-1949.

కోరాడ రామకృష్ణయ్య.

విషయసూచిక

		పుట.
1. భాషాసారస్వతములు-దేశి	...	1
2. దక్షిణదేశభాషల విశేషలక్షణములు	...	4
3. దక్షిణదేశభాషా సారస్వత లక్షణములు	...	58
4. ఆంధ్రము—తెలుఁగు	...	88
5. ఛందస్సాహితీరీతులు	...	118
6. దేశి రచనలు	...	213

దక్షిణదేశ భాషా సారస్వతములు
దేశి

ఈ దక్షిణ హిందూదేశమున వ్యవహారములో నున్న భాషలలోఁ బ్రధానమైనవి నాలుగు : అఱవము, తెలుగు, కన్నడము, మలయాళము అనునవి. వీనినే ద్రావిడభాషలనియు నందురు. ఇవి వ్యాకరణ సంస్కారమును బొంది, వివిధశాఖలతోఁ గూడిన సారస్వతములు గలవగుటచే సంస్కారయుక్తములని చెప్పఁబడుచున్నవి. అవ్యాకృతములై సారస్వతము లేనివగుటచే సంస్కార హీనములని చెప్పఁబడు తుళు, కొడగు, కుయి, గాండు మొదలగునవి మఱికొన్ని దక్షిణోత్తర దేశముల వ్యవహారమునఁ గలవు. వీని కన్నిటికిని సంస్కృత ప్రాకృతములతోఁ సంసర్గము విశేషముగా నున్నను, ప్రత్యేక లక్షణములుగా గ్రహింపఁబడుచున్న కొన్ని భాషా సంప్రదాయములను బట్టియు, వీనికి సమానము సహజమునగు ధాతుకూటమును బట్టియు, పదజాలమును బట్టియు నీ దక్షిణదేశ భాషలొక ప్రత్యేక కుటుంబమునకుఁ జెందినవని పలువుర భాషాతత్త్వవేత్తల యభిప్రాయము. ఇట్లివి యొక్క కుటుంబమునకుఁ జెందినవగుటచేత భాషా సంప్రదాయముల విషయముననేగాక, వీనియందలి ప్రాచీన సారస్వత చరిత్ర నన్వేషించి పరిశీలించినచో, వీనిలోని ఛందస్సాహిత్య సంప్రదాయముల విషయమునఁగూడ సన్నిహిత సంబంధము సామ్యము నంతర్వాహినిగాఁ గనఁబడ వచ్చుననుటకు సందేహము లేదు.

ఇట్లే భాషావిషయమునను ఛందస్సాహితీరీతుల విషం
మునను, ఈ దక్షిణదేశ భాషలకు సహజము సమానమున
సంప్రదాయ పద్ధతియే "దేశి" యని వ్యవహరింపఁబఁ
చున్నది. ఈ భాషలకు సంస్కృత భాషా సాహిత్య సం
దాయముల సంపర్కము గలిగిన పిదప తద్రీతు లీ దే
భాషలలో ననుసరింపఁబడిన పద్ధతియే "మార్గ" పద్ధ
తియైనది. లాక్షణికు లీ భాషలకు లక్షణము చెప్పినపుడ
అప్పటి కీ దేశమున విఖ్యాతిఁగాంచిన సంస్కృత భాషా వ్యాక
రణ పద్ధతులనే యనుసరించినవారైనను, తద్భిన్నమగు
సంప్రదాయమునకుఁ జెందిన శబ్ద జాలమును, లక్షణ రీతు
లను — దేశ్యమని, అచ్చయని విభాగించి ప్రత్యేకముగాఁ
జూపియేయున్నారు. ఛందో విషయమున సంస్కృతము
నందలి యక్షరగణబద్ధములగు వృత్తములను తాము చేపట్టి
నపుడు వానికి స్వీయ దేశీయాచారానుసారంబుగ ప్రావ
ళ్ళనెడి మంగళసూత్రములను గట్టియే గ్రహించియు,
మాత్రాగణ బద్ధంబులగు దేశీయ ఛ్ఛందో రీతులను జాత్యుప
జాతి భేదంబుచే ప్రత్యేకించియు వాని దేశీయతాగుణమును
వ్యక్తముచేసినవారైనారు. ఇఁక సంస్కృత సాహిత్య
రీతులను అందలి రీతి గుణాలంకార రసవర్ణనాదులతోఁగూడ
గ్రహించి పురాణ ప్రబంధ ఫక్కీలో నిమిడ్చికొని మార్గ
పద్ధతి నత్యాదరముతో విస్తరింపఁజేసియు, దేశీయంబులగు
ద్విపద షట్పదాది పదరచనలు, రగడలు, వచనములు,
యక్షగానములు, ఉదాహరణాది గ్రంథములు మొదలగు
వానికి చాటు ప్రబంధములనియు దేశి రచనలనియు నొక

విభాగము కల్పించుటచే నీని దేశీయతా లక్షణమును ప్రత్యేకించి చూపినట్లైనది. తమిళభాషా సాహిత్యము లపై సంస్కృత ప్రభావము కొంచెము తక్కువగుటచే, అందీ మార్గ పద్ధతి కొంత ప్రవేశించినను, దేశి పద్ధతియే బాగుగా [illegible] యుండినది. కన్నడాంధ్రములందు మార్గపద్ధతిదే పై చేయి యగుటచే దేశి రచనాపద్ధతి కొంత వెనుకబడినను కేవల మడుగంటిపోలేదు. దేశి మార్గములను దేశీయములుగఁ జేయు యత్నములు—అనఁగా వీనికిహృద్యముగు సమ్మేళనము కుదుర్చు ప్రయత్నములును కొనలు సాగినవి. కన్నడాంధ్రములందు పురాణ ప్రబంధ కవులు మార్గ పద్ధతిని విస్తరింపఁజేసినను, ద్విపద, షట్పది, యక్షగానోదాహరణ వాఙ్మయ శాఖలు దేశి వాఙ్మయమునకు పట్టుగొమ్మలై నిలిచినవి. కాని యీ భాషలలోని దేశి రచనలుగాని దేశి పద్ధతులుగాని మార్గ పద్ధతులవలె పండితులయొక్కయు లాక్షణికులయొక్కయు దృష్టి నంతగా నాకర్షింపలేదు. కావున భాషా విషయమునందువలెనే ఛందస్సాహితీ రీతులందును గల దేశి సంప్రదాయములను, వాని విశేష లక్షణములను బరిశీలింపవలసిన యావశ్యకత యెంతేనియుఁ గలదు. దక్షిణ దేశీయభాషల ప్రత్యేక సంప్రదాయములనుగూర్చియు నందలి శబ్దజాలముయొక్క విశేష లక్షణములనుగూర్చియు, ప్రత్యేక పరిశీలనము భాషా తత్త్వజ్ఞులచేఁ జేయఁబడుచునే యున్నది. కావున ప్రస్తుత మీ సందర్భమున వాని ప్రత్యేక లక్షణములను మాత్రము సంగ్రహముగఁ బరిశీలింతము.

II

దక్షిణదేశ భాషల విశేష లక్షణములు

ఈ దక్షిణదేశ భాషలన్నియు నొక్క కుటుంబమునకే చెందినవనియు, నొక మూల భాషనుండి వచ్చిన సజాతీయ భాషలనియుఁ జెప్పుట కాధారములైన "ద్రావిడ భాషా విశేష లక్షణ" ములు మాత్ర మీ క్రింద సూచింపఁబడుచున్నవి. ఇవి ద్రావిడ భాషా సామాన్యములనియు, నితర దేశీయ భాషా విలక్షణములనియుగూడఁ జెప్పవచ్చును.

1. పదనిర్మాణమునుబట్టి చేయఁబడుచున్న విభాగ పద్ధతిని ఈ ద్రావిడ భాషలను "సంయుక్త ధాతురూప పద భాషలు (Agglutinative languages) అని చెప్పుదురు. ఈ భాషలలో నర్థభేదములను సూచించుటకు ధాతువుపై ధాతువు, పదముపై మరియొక పదము చేరుచుండునేగాని, సంస్కృతాద్యార్య భాషలలోవలె ఉపసర్గలుగాని ప్రత్యయములు గాని చేరవు. సంస్కృతభాషా వ్యాకరణ సంప్రదాయ దృష్టినిబట్టి ప్రత్యయము లనఁబడునవి కొన్ని యిటీవల కనఁబడుచున్నను, వాని పూర్వ స్వరూప చరిత్రముల నించుక నన్వేషించినచో నవియు ప్రత్యేక స్వాతంత్రములగు పదములే యని గుర్తించుట కష్ట సాధ్యము కాఁబోదు. ప్రత్యయాంతములై యున్న ఆర్య భాషల సాహచర్య ప్రాబల్యకారణమున, ని ద్రావిడభాషలును ప్రత్యయాంతత్వమును బొందు మార్గమునఁ బడుచున్నట్లగపడుచున్నవేగాని, సహజముగ నట్టివి కావు.

2. ధాతువు—దాని లక్షణము :

(1) ద్రావిడ ధాతువులు సామాన్యముగా క్రియా బోధకములేయైనను, అట్టివి కానివికూడఁ గొన్ని కలవు. అట్టివి గుణవాచకములు సంఖ్యా సర్వనామ వాచకములు నగును—కాఱ్, కెం, మేల్, కీళ్. ఒన్, ఇర్, అఱ్, నాన్, నీన్.

(2) ధాతువులు సామాన్యముగా నేకాచ్ ధాతువులు, ఆ, ఈ, పో, సా, వర్, తెర్, పోల్, ఆడ్, నిల్, చెల్ etc. మూల ధాతువుల సంయోగముచే మరల భిన్న ధాతువు లేర్పడుచుండుటయుఁ గలదు. అర్థభేద సూచకముగను ధాత్వంతర సంయోగమేర్పడును. ఇట్లే కాచ్చు లనే కాచ్చులగును.

(3) క్రియాబోధక ధాతువులకు విధ్యర్థక మధ్యమ పురుషైక వచనమున స్వతంత్ర ప్రయోగము కలదు.

ఈ, తే, వా, చూల్, పో, నడ్(డు).

(4) ధాతువు నామవాచకముగను క్రియా వాచకముగను గూడ వ్యవహరింపఁబడుచుండును.

త—శోల్, తఱి, ముఱి ; తె—చెప్పు, ఒక కట్టుకట్టు;

ఒక వెలుఁగు వెలుఁగు. , ఒక పలుకు పలుకే

(5) ధాత్వంతమందలి హల్లు ద్విత్వమును బొంది భిన్నార్థములను సూచించును.

i. నామమును విశేషణముగాఁ జేయుటకు :

ఆఱ్ — ఆఱ్ఱుంగత్తై — ఏటిగట్టు, నఱ్ — నట్టిల్లు, కోఱ్ — కోఱ్ఱుయిర్ — కుట్టుసురు, మాడు — మాట్టుత్తోల్.

ii. అకర్మక ధాతువును సకర్మముగాఁ జేయుటకు. ఓడు — ఓట్టు.

iii. భూతార్థమును సూచించుటకు. తగు—తక్క.

iv. నామవాచకములఁ గల్పించుటకు. పాడు—పాట్టు—పాట. కూడు—కూట్టం—కూటము.

(6) ధాతుగతమగు హ్రస్వాచ్చు దీర్ఘత్వమును బొంది నామవాచక మగుచుండును లేదా స్వల్ప భేదమును బొంది ధాతువు నామవాచకమగును.

నడు—నాడు.

కడు—కాడు.

విళ్—విణ్, విన్ను (ఆకాశము)

మిళ్—మీన్ (చేప, నక్షత్రము)

వెళ్—వెళ్ళి—వెండి, కాణ్—కణ్—కన్ను.

కెయ్—కై, కయి, చెయి.

(7) అర్థ భేదమును సూచించుటకుగా ధాతువుపై భిన్న ధాతువులు చేర్పఁబడుచుండును. ఇవి రెండును గలసి మఱియొక ధాతువుగా నేర్పడును. చేర్పఁబడిన యీ ధాతువు స్వరూపము వ్యవహారమున మార్పునొందుచుండె. నా మిగిలిన భాగమే ధాతువుయొక్క యవశిష్ట భాగమై

తెలిసికొనుట సుభల సాధ్యము కాకపోవుటచే కాల్డ్వెల్ పండితుఁడు ధాతువులపైఁ జేరు కు, గు, చు, జు, తు, దు, బు—మొదలగు వానిని ధాతువులపై చేరు అనుబంధములుగా గ్రహించినాఁడు. ఇవి ధాతువుల క్రియా బోధకత్వమును సూచించుటకుగాఁ జేర్పఁబడిన అగు, ఇసు, ఉతు, మొదలగు సహాయ ధాతువుల యవశిష్ట రూపములయి యుండునని తలంప వచ్చును. వీనితోఁ గూడినవే మరల నీ భాషలలో ధాతువులుగాఁ బరిగణింపఁబడఁ జొచ్చినవి.

వెళ్ + అగు = వెలుగు—వెలుంగు.
గెల్ + ఉచు = గెలుచు—గెలువు—గెల్వు—గెల్పు.
తిర్ + అగు = తిరుగు—తిరుపు—త్రిప్పు.
తిర్ + ఉతు = తిరుందు—తిరుత్తు—; తె. తిర్దు—తిద్దు—దిద్దు.
నిఱ్ + ఉతు = నిఱ్ + ఉంతు—నిఱుంతు—నిండు—నింపు.
అడ్—అడై + ఇసు = అడైసు—అడైచ్చు—; తె. అడచు, అణచు.

ఈ యవశిష్ట భాగములే కొన్ని నామవాచక రూపములలోఁ గానవచ్చుచు, ధాతువులనుండి నామవాచక రూపములను జేయుటకుఁ జేర్పబడిన యనుబంధములుగా (formative particles) గ్రహింపబడుచున్నవి.

వెళ్—వెలుగు, వెళక్కు— etc.
కాయ్—కాజ్గు—కాఁగు.
గెల్—గెలుపు—గెల్పు.
కోయ్—కొమ్బు—కొమ్ము.

వేమ్ — వేమ్బు — వేము.

తీర్ — తీర్పు.

తూఱ్ — తూర్పు.

కాయ్ — కాపు.

మరు — మరుందు — మందు.

తిర్ — తిరుందు — తిరుత్తం = correction.

(8) ధాతువుల కర్థభేదమును గలిగించుట కుపసర్గలను జేర్చుట సంస్కృతాద్యార్య భాషలలోవలె నీ భాషలలో సహజముగనే లేదు.

సంస్కృతమునందుపసర్గతోఁ గూడిన క్రియా రూపము లట్లే—లేదా యించుక స్వరభేదముతో ప్రాకృతములలోనికి వచ్చినవి. ఈ ప్రాకృతములనుండి యేర్పడినవని చెప్పఁబడు చుండిన యాధునికార్యభాషలలో నా యుపసర్గలను వాడుకొను పద్ధతి లోపించి ధాతువులపై క్రియా విశేషణములను జేర్చి ధాతుపల్లముల నేర్పాటుచేసికొను విధానము ఇటీవలి కాలమున వాడుకలోనికి వచ్చుటచే, నిది ద్రావిడభాషా సంపర్క సంప్రదాయ బలమునఁ గలిగినదని చెప్పవలయునే కాని ఆధుని కార్యభాషలయందును, ద్రావిడ భాషలయందును నొక్కటే తీరున నేర్పడినదని తలంచుట కవకాశము లేదు.

(9) ద్రావిడభాషలలోని క్రియారూపములు క్రియావిశేషణములనుండి యేర్పడినవి. ఇందు సంస్కృతమందువలె దశ లకారములు లేవు. సంస్కృతమునను, ఆధుని కార్యభాషల లోను సంపూర్ణ క్రియల స్థానమున క్రియా విశేషణములను వాడుట ద్రావిడభాషా సంపర్క బలముచేతనే యైయుండును.

౩. వర్ణసమామ్నాయము :

(1) అ, ఇ, ఉ, ఎ, ఒ హ్రస్వదీర్ఘములు గలవు. ఈ భాషలలో సంస్కృతములోవలె ఋ, ౠ వర్ణములు లేవు. ఋ వర్ణము "రి" కారముగాఁ బలుకఁబడును. ఋషి–రుషి–లేదా–రిషి; కృష్ణ–కిట్ట. ఎ, ఒ, హ్రస్వములు సహజములు. ఐ, ఔ లు అయి, అవులుగా మారును. కొన్ని పదముల తుదిని అర్ధ మాత్రములగు ఇకార ఉకారములు పలుకఁబడును. హల్లులు:- వర్గాక్షరములలో క, చ, ట, త, ప లు వాని వర్గానునాసికలు మాత్రమే కలవు. బిందువు లేదు. కచటతపలే పద మధ్యమందు సరళములుగా నుచ్చరింపబడును. మహాప్రాణములు లేవు. శ, ష, స లు లేవు. య, ర, ల, వ లు శకటరేఫ ఱకార ళకారములు పదాంత నకారమును గలవు. ఇది యిపుడు తమిళమున మాత్రమే కనబడుచున్నను దాని పరిణామ మితర భాషలలోను గనిపట్టవచ్చును.

(2) తెలుఁగు కన్నడములకు సంస్కృతభాషా సంపర్క మెక్కువగుటచే నివి తమిళముకంటె మూల భాషకు మిగుల దూరస్థముగాఁ గనఁబడును. మూలభాషలోని రూపములు తెలుఁగున కన్నడముకంటెను విశేషముగా మారిపోయినవి.

(3) పదాదిని క, ట; త, ప, మ వర్ణములు మాత్ర మే యచ్చుతోఁ గూడి యైనను రావచ్చును. చకారము ఇ, ఉ, ఎ, ఒ లతోఁ గూడియే వచ్చును. వకారము ఉ, ఊ, ఒ, ఓ లతోఁ గూడిరాదు. యకారము ఆకారముతోఁ గూడియే వచ్చును. ర, ల లు పదాదిని నిలువవు. ఇది తొల్కాప్పి

యకే చెప్పిన తమిళభాషా సంప్రదాయము. ఇది తక్కిన భాషలకును వర్తించుచునేయున్నది. కాని యీ ద్రావిడ భాషా సంప్రదాయములకు విరుద్ధమైన రూపము లాయా భాషలలో నేర్పడుటకు వానిలోఁగలిగిన వర్ణ సమీకరణ వర్ణ వ్యత్యయాదులు కారణము లగుచున్నవి.

(4) ఈ భాషలలో సంస్కృత శబ్దజాలము తత్సమ రూపమున విశేషముగాఁ బ్రవేశించియుండుటచేత, నందుసహజముగ లేని మహాప్రాణములు శ, ష, స లు మొదలగు వర్ణములా శబ్దములతోపాటు చేరి వ్యవహరింపఁబడుచున్నవి. తమిళము నందా శబ్దములు దేశీయోచ్చారణ సంప్రదాయానుసారము మార్పు నొందియే వ్యవహరింపబడుటచేత నందీ వర్ణములకు తావు చిక్కలేదు.

4. ధ్వని లక్షణములు :

(1) పదాంతమందు ముఖ్యముగ పరుష వర్ణాంతములగు పదముల తుది నొక అర్ధమాత్రోకారము నుచ్చరించుట యీ భాషల కొక సహజ లక్షణముగాఁ గనబడుచున్నది. ప్రాచీనభాషలో ననేకములగు ధాతువులు హలంతములే యైనను కాలక్రమమున తమిళమున పరుషాక్షరములపైని, తెలుఁగు కన్నడములలో హల్వర్ణములపైని, ఒక పొట్టి "ఉ" కారమును జేర్చి—ఆ పదములను అజంతములుగాఁ జేసి పలుకు నలవాటు ప్రబలినది. కావుననే తెలుఁగుకన్నడములు ప్రాయిక ముగా నజంతభాషలైనవి. సంస్కృతహలంత శబ్దములకుఁ గూడఁ దెనుగున ఉవర్ణము చేర్పఁబడుచున్నది. ఉదా—వాక్కు,

విల్—విల్లు; సీర్—సీరు, etc. వాక్ వాక్కు, రోడ్ రోడ్డు. ఇది యీ భాషకొక యపూర్వపూర్ధవము చేకూర్చినది.

(2) స్వరసామ్యము (Harmonic Sequence of vowels) ఏక పదమందు సన్నిహితములగు నక్షరములలోని స్వరము లొక దానిని బట్టి మరియొకటి మారుట. సమీపాక్షరము లోని "ఇ"కారము—ముందు వెనుకల అక్షరములలోని "ఉ" కారమును "ఇ" కారముగా మార్చుచుండును. పూర్వ మకారముండినచో ఉకారము మారదు. పరమందలి ఉకా రము పూర్వమందున్న ఇకారము నుకారముగా మార్చు టయుఁ గలదు. ఇది తెనుగుఁన విశేషముగాఁ గానవగును.

హరి+కు = హరికి. రామున+కు = రామునకు.
తమ్ముని+కు = తమ్మునికి. కత్తి+లు = కత్తులు.
కొట్టితి+వు = కొట్టితివి.

(3) పరుష సరళముల వినిమయము :

ద్రావిడ భాషలలో ముఖ్యముగా తమిళ మలయాళ ములలో పదాదిని సరళముండదు. పదమధ్యమున పరుష ద్విత్వమే గానవచ్చుచుండును. పదమధ్యమునందలి పరుషము నిటీవలి కాలముననే సరళముగ నుచ్చరించు నలవాటు ప్రబ లినది. కాని ప్రాచీనకాలమునుండియు నీ యలవాటే కలదని చెప్పవీలులేదు. తొల్కాప్పియర్ వ్యాకరణమున క, చ, ట, త, ప, ఱ అను పరుషాక్షరములు మాత్రమే చెప్పబడియుండుటచే నాకాలమున పదమధ్యముననునివి పరుషములుగ నేపలుకఁబడి

కాలక్రమమున నజ్మధ్యస్థములైనపుడు, ననునాసిక సంయోగము గలిగినపుడును సరళోచ్చారణము గలవైన ట్లగపడు చున్నది. కావుననే "దంతం" అను సంస్కృత పదము—"తందం" అని తమిళమున పలుకఁబడవలసి వచ్చినది. ఈ సంప్రదాయ మితర దేశీయ భాషా విలక్షణ మనక తీరదు.

గ్రియర్సన్ పండితుఁడు ప్రాకృతములలో నీ మార్పు గలుగుటకు ప్రాచీనములగు ద్రావిడభాషల సంపర్కమే కారణ మని తలంచినాఁడు. అది విలక్షణముగాఁ గలిగిన ద్రావిడ భాషల సంపర్కముచేతనే యిట్టి మార్పుగలిగి యుండును. కాని యిది ప్రాకృతభాషలయందే సహజముగ గలిగినదనుట కవకాశము లేదు. పదమధ్యమందు ద్విత్వాక్షరముతక్క భిన్న పరుషాక్షరముల సంయోగ మీ భాషా పదములలో రాదు. ట్ర, ట్ప, అంత స్థానునాసికములతోడి సంయోగము నే పద మధ్యమున రావచ్చును. పదాది నేవిధమైన సంయుక్తాక్షర మును రాఁగూడదు. ఈ కారణముచేత నే—"బ్రాహ్మణ" శబ్దము "పిరమిణ" యగుట తటస్థించినది. భిన్న హల్సం యోగ మెచ్చటగలిగినను వానిమధ్యమున నచ్చొకటిచేరి దానిని భిన్నాక్షరములుగా మార్చుచుండును. అనఁగా పరుషాక్షర సంయోగోచ్చారణము ద్రావిడ భాషలను వ్యవహరించువారి యుచ్చారణ సంప్రదాయములకు విరుద్ధమైనదన్న మాట.

కావుననే—శ్రీ—సిరి, లేదా తిరు, భక్తి—బగితి, స్నేహ—సినేహ, హర్ష—హరుష, భాగ్య—పాక్కి యం— ఇత్యాది తద్భవరూపము లేర్పడినవి. ఇటీవలకొని, తెలుఁగు

పదముల మొదట గాననగు రేఫ సంయోగమునకు వర్ణ ప్లుతియే కారణము. వరై-వ్రాయు, మరం-మ్రాను. etc.

మహాప్రాణముల యుచ్చారణముకూడ ద్రావిడభాషా సంప్రదాయమునకు విరుద్ధము. ఈ భాషలలో మహాప్రాణములు లేవు. కావుననే తద్భవములలో నవి యల్పప్రాణములుగ మారుచుండుట. భూతి-బూది; వ్యధ-వెత. శ, ష, స, లును లేవు. ఇవి తద్భవములలో చకారముగ మారుచుండును. లేదా లోపించుచుండును. cf. సంధ్యా-త. అంది, శ్రావణ—ఆవణి, సీస—ఈయం, శ్రేణి—ఏణి.

ర, ల, లు పదాదియందు రావు. కావుననే తమిళమున నుచ్చారణ సౌకర్యముకొరకు వాని ముందు అ, ఇ, ఉ లు చేర్పఁబడుచుండును, రాజ్—అరశ్, లోకం—ఉలగం. తెలుఁగులో దేశ్యశబ్దముల మొదటి రేఫ లకారములు వర్ణ ప్లుతిచే గలిగినవే. ఉరల్-రోలు; ఎఱక-రెక్క, ఉల్-లో.

తమిళములో పదాదిని హకారముకూడ లోపించును—హారం—ఆరం, హోమం—ఓమం, హేతు—ఏతు, హరి—అరి.

హింగు—ఇంగువ, హరివాణం—అరివాణం.

(4) హ్రస్వ ఎకార, ఒకారములు, ట, డ, ణ అను మూర్ధన్యాక్షరములు, శకటరేఫ, ఱ-కారములు, తమిళమున నిలిచియున్న తాలవ్య నకారమునకు భిన్నమగు పదాంత నకారము, అనునవి యీ భాషలకు విలక్షణము లగు వర్ణములని చెప్పవలసియున్నది. ఎ, ఒ లును మూర్ధన్యములగు ట, డ, ణ, లు నీ ద్రావిడభాషలకు సహజములు. వైదికభాషలో

గాని, సంస్కృత ప్రాకృతములలోగాని, యివి ప్రత్యేక పరిస్థితులను బట్టియో, అనార్య జనులయొక్కయు, వారియుచ్చారణ పద్ధతులయొక్కయు సంపర్కము వలననో, కాలక్రమమున నేర్పడినవేగాని, ఆ యా భాషలకు సహజములని చెప్పుటకుఁ దగిన యవకాశము లేదు. శకటరేఫ, ఱ కారములు పదాంత నకారము నిప్పటికిని తమిళ మళయాళములలోననేకములైన శబ్దములలో ప్రాధాన్యమును వహించి నిలిచి యున్నవి. తొల్కాప్పియన్ నాటికే, అతఁడు తమిళభాషను వ్యాకరించు నప్పటికే ఆ భాషలో నవి కలవు. అంతకుఁ జిరపూర్వమే యా భాషాసాహిత్యములు వ్యాప్తిగాంచియున్నవి. కన్నడాంధ్రములందివి క్రమమున కొన్ని మార్పులను జెందియున్నను, ఈ భాషలలోని ప్రాచీన వాఙ్మయమున ఱకారమును, ఇటీవల కొంతకాలమువరకు శకటరేఫయును వ్యాప్తిలో నుండినవి. ఈ వర్ణములు సంస్కృతాద్యార్య భాషలలో లేకుండుటేగాక, ఆధునికార్య భాషలలో ద్రావిడభాషా సంసర్గమువలన సుమారు క్రీ. శ. 10-వ శతాబ్దినుండి బయలుదేరినవేగాని, వీనికి మూలము లనఁదగు ప్రాకృత భాషలలోఁగూడ నీవర్ణములు కానరావు, కావున నివి యాద్రావిడ భాషలకు విలక్షణము లనుటకు సందేహము లేదు. ద్రావిడ భాషలన్నిటిలోను సజాతీయములని చెప్పఁదగిన పెక్కుశబ్దములలోను ధాతువులలోను నీ వర్ణముల యునికి నిశ్చయింపఁ దగియుండఁగా, నిన్ని శబ్దములలోని యీ వర్ణములు నేవో కొన్ని సంస్కృత శబ్దములలోని షకార రకారాదివర్ణసంయోగము వలన జనించినవని చెప్పుట కేవలము హాస్యాస్పదము.

(5) ఈ భాషలలోఁ గొన్నిటిలోని యనుస్వార—బిందు సంప్రదాయము సంస్కృతభాషా సంసర్గ సంస్కారములను బట్టి వచ్చిన దేగాని, వర్గానునాసికము వ్రాయుటయే యీ భాషలలోని సహజసంప్రదాయము. ఈ యలవాటే యిప్పటికిని తమిళభాషా విలేఖనమున ననుసరింపఁ బడుచున్నది. తెలుఁగు కన్నడములలో ప్రాచీనవేంగిలిపి కాలము నాటికి ద్రావిడసంప్రదాయమే దేశీయశబ్దముల విషయమున ననుసరింపఁబడినను, కాలక్రమమున సంస్కృతలిపి సంప్రదాయమే ప్రబలఁజొచ్చినది. కావుననే, దిగు ంబఱు, పసుపు ంబఱు, కొడిక్కి-మొదలగు కొన్ని శబ్దములలో బిందువు పూర్వస్వరము ననుసరించునట్లుగా దిగుంబఱు పసుపుంబఱు అని వ్రాయక దిగుమ్బఱు, కొడిజ్కి అను వ్రాతయొక్క సంప్రదాయమును బట్టి మ, జ ల స్థానములందే బిందురూపమగు బొట్టునుంచుటచేత—ఈ శబ్దములను చదివినవారు దిగుబంఱు, పసుపుంబఱు, కొడికిం—అని చదువుట తటస్థించినది. అనుస్వారము తల్లేఖన పద్ధతి సహజముగ ద్రావిడభాషా సంప్రదాయమునకుఁ జెందినవి కావని ఆ నాటి శాసనములలోని వ్రాతయు— దానికి భిన్నమగు సంప్రదాయమున కలవాటుపడినవారు వానినిచదువుటలోఁబడిన తబ్బిబ్బులే, మనకు వ్యక్తము చేయుచున్నవి.

(6) సంధి :—ఈ భాషలలోని సంధి సామాన్యముగా పరరూప సంధియే. సంధి లేనపుడు సాధారణముగా యకార వకారము లాగమములగును. సవర్ణ దీర్ఘ, గుణ, వృద్ధి, యణా దేశాదు లిందురావు. ప్రాచీన ప్రాకృత భాషావస్థయందును

పదమధ్యమందు హల్లులు లోపించినపుడు ఉద్వృత్తాచ్చుల నడుమ యవలను జేర్చుట ద్రావిడభాషా సంపర్క బలమునే సూచింపఁగలదు.

(7) వర్ణములలోని మార్పులు :—తమిళమునందలి ఇకారము తెలుఁగు కన్నడములలో ఎకారముగా మారును.

ఇ-ఎ గా మారుట :—

త. ఇళ, తె. ఎల. క. ఎళె; త. విళంగు—క. బెళగు-
తె. వెలుఁగు; త. పిఱ—తె. పెఱ—క. పెఱె etc.

ఉ—ఒ—ముళై-మొళె; పుకళ్—క. పొగళ్, తె. పొగడు;
ముదల్-మొదలు; కుళం-కొళం-కొలను.

ఆ-ఏ—త. ఆఱు-ఏఱు; ఆళ్-ఏలు; యానై - ఏనుఁగు;
ఆండు-ఏండు.

పదమధ్య పరుషము సరళముగా మారుట :—

త. పుకళ్-పొగడు; పుకై-పొగె, పొగ; అకళ్-అగళ్,

పదాది కకారము గకారముగా మారుట :—

త. కూన్ - గూను; కిళి - గిళి; కూండు - గూడు,
కీర్-గీరు, కుటి-గుడి.

పదమధ్య తకారము సకారముగా మారుట :—

త. నుతల్-నొసల్-నొసలు; మొదలై-మొసలి,

ణ, ఴ, ళ కారములు తెలుగున న, డ, ల లగును :—

త. అణ్ణన్ - అన్న; కణ్ - కన్ను; మాణ్ - మాను, పూణ్ - పూను, పుగఴ్ - పొగడు, పాఴ్ - పాడు, అఴు - ఏడు, కోఴి - కోడి.

కుళం - కొలను, ఆళ్ - ఏలు, విళంగు - వెలుంగు, ఇళమ్ - ఎల.

“ఴ”కారము తెలుఁగులో రేఫ ఱకారములుగా మారుట కలదు :—

త. పుఴల్, క. పొఴల్ - ప్రోలు; త. కీఴ్ - క. కెఴగె - తె. క్రింద; ముఴంగు - మ్రోఁగు, పొఴుదు - పొఱ్తు - ప్రొద్దు; ముఴుకు - మునుఁగు.

“న్ఱ” - తెలుఁగు కన్నడములలో ణ్డ, న్ద గా మారును :—

త. ఒన్ఱు - ఒన్దు - ఒణ్డు; కున్ఱు - కొండ; తిన్ఱి - తిండి; కన్ఱు - కందు.

5. లింగవివక్ష :

ద్రావిడ భాషలలోని నామవాచక శబ్దములు రెండు విధములుగ విభాగింపఁబడినవి. తమిళమున ఉయర్ తిణై - అఱ్ఱిణై అని, తెలుఁగులో మహత్తులు - అమహత్తులు అని. వివేకముగలవారిని సూచించునవి “ఉయర్ తిణై” విభాగమునకును తద్భిన్నములు “అఱ్ఱిణై” విభాగమునకును జెందును. స్త్రీతిర్యగ్జడ భిన్నంబులు - మహత్తులు, స్త్రీతిర్యగ్జడ వాచకములు - అమహత్తులు, అని తెలుఁగు

వైయాకరణుల విభాగము. తెలుఁగులో స్త్రీవాచక శబ్దములు కూడ తిర్యగ్జడ వాచకములతోఁ జేర్చబడినవి. ఇట్టి విభాగ మితరభాషా కుటుంబములలో నెచ్చటను లేదు. స్త్రీ పురుష భేదమును, స్త్రీ పురుష వాచక శబ్దములనుజేర్చి చెప్పుటచే (ఆడగుఱ్ఱము మగగుఱ్ఱము అను రీతిగా) సూచింపఁబడును. కావున నిది వ్యాకరణమునకు లేదా శబ్దములకు సంబంధించి నదికాదు. అర్థమునుబట్టి వచ్చినది.

మహత్తులలో తమిళ కన్నడముల-లింగభేదము సర్వ నామ ప్రత్యయములను జేర్చుటచే సూచింపఁబడినది-అవన్, అవళ్. బహువచనమున స్త్రీపుం భేదము లేదు. "అవర్" అనునదొక్కటే రూపము. బ్రాహుయిభాషలో మహత్తు లలోఁగూడ లింగభేదమును సూచించు మార్గము లేదు. కుయి, కురుక్, మాల్టో, గోండి, కొలామి. తెలుఁగుభాష లలో స్త్రీ ప్రత్యయము వేరుగాలేదు. అమహత్తు ప్రత్యయమే స్త్రీలింగ సూచకమగుచున్నది. కావుననే స్త్రీవాచక శబ్దములు అమహద్వర్గములోనే చేర్పఁబడినవి. బండి వచ్చినది, గుఱ్ఱము వచ్చినది అన్నట్లే "సీత వచ్చినది" అన్నప్పుడునుగూడ తిర్యగ్జడ వాచక ప్రత్యయమే చేర్పఁబడుచున్నది. తమిళ కన్నడములందు మాత్రము స్త్రీవాచక శబ్దములకు "ఆళ్" అను ప్రత్యేక చిహ్నము కల్పింపఁబడుటచేత, వండి వందదు, కుదిరై వందదు, అని చెప్పినను, సీతా వందాళ్, అమ్మా వందాళ్ అని స్త్రీ వాచక శబ్దములకు "అళ్" ప్రత్యయము చేర్చి చెప్పుదురు

కుయి, గోండి, భాషలలో స్త్రీవాచక శబ్దములకు బహువచనమునఁగూడ నపుంసక - అమహద్రూపమే వాడఁబడును. తమిళ కన్నడములందువలె స్త్రీలింగ వివక్ష లేకపోవుట చేతను, ద్రావిడభాషా కుటుంబములోనిదేయైనను వీనికి కొంత దూరస్థమై ఆర్యభాషల నడుమ తన వ్యక్తిత్వమును, విశేష లక్షణములను నిలుపుకొనియున్న బ్రాహుయి భాషలో నిట్టి లింగ వివక్షయే లేకపోవుటచేతను, లింగ వివక్షయనునది కాల్డ్వెల్ పండితుఁడు చెప్పిన ట్లీభాషలలోఁ గాలక్రమమున, సక్రమాభివృద్ధినంది యేర్పడినదిగాఁ దలంపవలసియున్నది.

వచనము:—ఏకవచన బహువచనములే యీ భాషలలోఁ గలవు. ద్వివచనము లేదు. వచనమును సూచించుటకు సర్వనామ ప్రత్యయములును, కళ్, గళ్, లు అను ప్రత్యయములును జేర్పఁబడును.

6. విభక్తిస్వరూపము :

ఈ భాషలలోని విభక్తులను సూచించునవి స్వతంత్ర శబ్దములే, లేదా వాని యవశిష్టభాగములు. ఇవి నామముపైఁ గాని క్రియా విశేషణ రూపముపైగాని చేరి వాని ప్రత్యేకతను నిలుపుకొనుచునే యున్నవి. నామవాచక శబ్దముపై విభక్త్యర్థక శబ్దము చేరినపుడు స్థాన బలిమిచేతనే పూర్వమందలి నామము పరమందలి దానికి విశేషణమగుచున్నది. వచనములు రెండే. బహువచనమున నామముపై విభక్త్యర్థక శబ్దమునకుఁ బూర్వము బహువచన చిహ్నము

చేరుచున్నది. సంస్కృతాది భాషలలో ప్రతి విభక్తి యందును ప్రతి వచనమునకు నొక్కొక ప్రత్యేక చిహ్నము కలదు. వచనమును మాత్రము సూచించు ప్రత్యయము వేరుగానుండదు. ద్రావిడ భాషలలో విభక్తిప్రక్రియ యొక్క రీతికలదేగాని, సంస్కృతము నందువలె శబ్దములయొక్క స్వరూపమునుబట్టి మారుచుండునదిగాదు. ఒక విభక్తి యర్థమును సూచించుట కనేక శబ్దములు ప్రయోగింపఁబడు టయుఁగలదు. సామాన్యముగా విభక్తి చేరినను ప్రకృతి ప్రాతిపదికయందును మార్పేమియు జరుగదు. దాని విశేషణత్వమును వ్యక్తముచేయుట కొకప్పుడు ప్రత్యేక చిహ్నములు చేర్పఁబడును. నామవిభక్తివలెనే క్రియావిభక్తి ప్రక్రియయు నొకేరీతి గలది. ధాతువుపై కాల వాచక చిహ్నములు, లేదా తత్తదర్థబోధక శబ్దములు వానిపై సర్వనామ రూపములు చేర్పఁబడుటచే క్రియారూపములు సిద్ధించును. ధాతుస్వరూపమున మార్పేమియు గలుగదు.

మొత్తముమీద విభక్తి లక్షణమంతయు, భిన్నశబ్ద-ధాతు-సంయోగ రూపమును, విశేషణ విశేష్యభావ సంబంధ మూలకమునై యున్నట్లగపడక మానదు.

7. విశేషణములు :

ఇవి సామాన్యముగా గుణ వాచకములు, సంబంధ వాచకములు. వీనికి విభక్తులు లేవు. వీనియందలి తర తమ భావము సంస్కృతమందువలె ప్రత్యయముల మూలముగా సూచింపఁబడదు. విశేషణములు విశేష్యములను బోలి లింగ

విభక్తి వచనములందు పొందిక గలిగియుండవలసిన యావశ్యకతయు లేదు. భిన్నశబ్దసంయోగముచేతనే తరతమ భావములు వ్యక్తము చేయఁబడును. సామాన్యముగా నామవాచక శబ్దముల షష్ఠీ రూపము విశేషణమగును. క్రియాజన్య విశేషణములును విశేషణములే. శిరియ, పెరియ, ఉయర్ న్ద.

8. ఉత్తమపురుష సర్వనామ బహువచన రూపము :

మనము, మేము, వంటివి-(ఎదుటివానిని చేర్చి చెప్పునదొకటి, ఎదుటివానిని పరిహరించి తమనుమాత్రమే చెప్పునదొకటి) —— సంస్కృతాద్యార్యభాషలలో లేవు. మరాఠీ - గుజరాతీలలో నిటీవల నట్టి రూపములేర్పడుట ద్రావిడభాషా సంపర్క బలమువలననే యైయుండును.

9. ఈ భాషలలో ప్రథమపురుషలో ప్రత్యేక సర్వనామ శబ్దము లేవు :

ఆ, ఈ, ఏ—అను నిర్దిష్టార్థక రూపములపై —పుం స్త్రీవాచక చిహ్నములను జేర్చుటచే నవి యేర్పడుచున్నవి. అవన్, ఇవన్, ఎవన్-వాఁడు, వీఁడు, ఎవఁడు; అవళ్, ఇవళ్.

10. సంబంధార్థక సర్వనామముల కీ భాషలతో వాడుక లేదు. వీనికిఁ బదులు క్రియావిశేషణములనే వాడుదురు.

11. ఈ భాషలలోని క్రియారూపము :

ఒక కాలమున నిది సర్వనామ ప్రత్యయములు లేకయే యుండిన ట్లగపడును – (cf. త. క. శెయ్‌గుమ్ – కెయ్‌గుమ్, తె. చేయున్ – చేసెన్.) మలయాళమున

నిష్పత్తికినీ లేవు. కాలవాచక, సకర్మకాకర్మక, ఆత్మనేపద, కర్మార్థ, విధ్యాద్యర్థ, ప్రేరణ వ్యతిరేకార్థములగు చిహ్నములును లింగవచనద్యోతక చిహ్నములు నొకదానిప్రక్క నొకటి ధాతువుపై చేర్పఁబడి యెట్టి మార్పు నొందకయే క్రియారూపము లగుచుండును. క్రియా రూపములలో సామాన్యముగా తుదిని నిలుచు సర్వనామ చిహ్నమునకు పూర్వభాగమంతయు విశేషణమగును. అనఁగా సర్వనామ చిహ్నములు ధాతువుపైగాక, కాల సూచక చిహ్నములతోఁగూడిన క్రియా విశేషణముల పై నిలుచుచుండును. భిన్నధాతు సంయోగముచే నర్థభేదము లేర్పడుచు, ధాతు పల్లవములు, శబ్ద పల్లవములు కల్పితములగుచుండును. ఉపసర్గ లీ భాషలలో లేవు. కర్మణ్యర్థము భిన్నధాతు సంయోగముచే సూచింపఁబడునేగాని, సంస్కృతమందువలె దీనికి ప్రత్యేక క్రియారూపము లేదు. ఈ భాషలలో సనాద్యంత ధాతువృత్తి లేదు. అన్నంతమగు ధాతువుపై తత్తదర్థబోధక ధాత్వంతరములను జేర్చుటచేతనే ఆయా రూపము లేర్పడుచున్నవి. చేయన్ ఇచ్ఛయించినాడు, చేయన్ దలచినాడు.

12. వ్యతిరేకార్థక క్రియారూప ప్రక్రియ యీ భాషల విశిష్ట లక్షణములలో నొకటి.

13. ఈ భాషలలో సముచ్చయార్థకములకు బదులు క్రియాజన్య విశేషణ రూపములే వాడబడుచుండును: వాఁడు వండి పెట్టి పోయినాఁడు.

14. నామక్రియలు (Appellative verbs) :

నామవాచక శబ్దములకు విశేషణములకు సర్వనామ చిహ్నములను జేర్చుటచే నీ భాషలలో నామక్రియ లేర్పడును. (నేను రాజను, నీవు కవివి. త. కోనేన్, అడియేన్, ఎల్లామ్, ఎల్లీర్.) సంస్కృతా ద్యార్యభాషలలో నిట్టివి లేవు.

15. వాక్య నిర్మాణము :

నామమునకు ముందు విశేషణమును, క్రియకు ముందు క్రియా విశేషణములును నిలుచుచుండును. వాక్యము కర్తృవాచి పదముతోఁ బ్రారంభించి క్రియాపదముతో నంత మందును. వాక్యమున మొదట విశేషణములతోఁ గూడిన కర్తృవాచి పదమును తరువాత కర్మయు, తరువాత క్రియా విశేషణము, వాక్యాంతమున క్రియాపదము నిలుచుట యనునది యిందలి వాక్య నిర్మాణపద్ధతి. సంస్కృతమున వాక్యములో నే శబ్ద మెచ్చటనైనను రావచ్చును. విశేషణ ములకు విశేష్యంబులంబోలె లింగవచన విభక్తులగును. ద్రావిడభాషలలోని వాక్యము అందలి పదముల స్థాననియ మము, అందు వానికి గలిగిన విశేషణ విశేష్యభావ సంబం ధముపై నాధారపడి యేర్పడినది. అది సంస్కృత ప్రాకృత ములందువలె విభక్తి ప్రత్యయములు లోపించుటచే నాధుని కార్యభాషలతోపాటు ఇటీవల నేర్పడినదికాదు. ప్రాకృతా వస్థలోఁగూడ విభక్తి ప్రత్యయములుండనే యుండినవి. ఆధునికార్య భాషలలో నవి లోపించి, వాని స్థానమున ప్రత్యేకపదములు వచ్చుటకును వాక్యనిర్మాణపద్ధతి మారుట కును ద్రావిడభాషా సంపర్కమే కారణ మనకతప్పదు.

ప్రాకృతములలోవలె ద్రావిడ భాషలలో సంస్కృత విభక్త్యంత శబ్దముల రూపము లోక కాలమున నుండి, తరువాత లోపింపలేదు. ఈ భాషలలో నట్టివి మొదటి నుండియు లేనే లేవు.

16. శబ్దజాలము :

ఈ ద్రావిడభాషా కుటుంబములో దక్షిణ హిందూ దేశమునందలి భాష లేకాక, ఉత్తర దేశమునందలి గాండు, కుయి, ఒరెయన్, బ్రాహుయి మొదలగు ననాగరక భాషలుకూడఁ జేరియున్నవి. ఈ యనాగరక భాషలను గూర్చి పరిశోధన మింక జరుగవలసియున్నను, వాయవ్య దిగ్భాగమున బ్రాహుయి భాషయు, మధ్య దేశమున గాండు, కుయి, ఒరెయన్, మొదలగు భాషలును - ఆర్యభాషల నడుమ నింత కాలమునుండియు నిలిచి వాని ప్రభావమున కపరిమితముగ లోనైయున్నను, వానికి సహజములగు ద్రావిడ భాషా లక్షణముల నింకను విడువకుండెననుటయే ఆశ్చర్యకరము. దీనివలన ద్రావిడభాషలను వ్యవహరించిన జనమీ దేశమందంతటను వ్యాపించి యుండిరనియుఁ దెలియవచ్చుచున్నది. సంస్కృత భాషా సంపర్కము తత్ప్రభావము ద్రావిడభాషలపై నపరిమితముగా ప్రబలుటచేత సహజములగు దేశ్య శబ్దము లనేకములు ఆర్య శబ్దములచే వ్యవహారమునుండి తొలగింపఁబడిన నగుటచే, నిప్పటి స్థితిలో సంస్కృత శబ్దజాలము లేకయే ద్రావిడ భాషలకు నిలువలేనిస్థితి యేర్పడినను నేర్పడవచ్చును. అంతమాత్రముచే సామాన్య వ్యవహారమునకుఁ దగిన శబ్దజాల మీ

భాషలలో లేనే లేదనుట యుక్తముకాదు. ఇప్పటి హైందవ సంస్కృతిని నాగరికతను వ్యక్తీకరింపఁగల దేశి శబ్దజాల మొకప్పుడీ భాషలలో లేకపోవచ్చును. ప్రాకృత భాషల లోను, ఆధునికార్యభాషలలోను గల "దేశి" శబ్ద జాలము నంతను ఏదోవిధముగా సంస్కృత ధాతుపాఠములోని యే ధాతువులతోనో ముడిపెట్టి సంస్కృత జన్యమని సాధించుటకై చేయబడిన యత్నము కొంతమాత్రమును సఫలము కాలేదు.

ద్రావిడ భాషాతత్త్వమును గనుగొనుటకు పెక్కుమంది విదేశీయపండితులును కొందరు దేశీయులుగూడ కృషి సల్పుచునే యున్నారు. ద్రావిడ భాషలలోని దేశ్యపద జాలమంతయు నార్యభాషాజన్యమని ఋజువుచేయగలిగిన సాహసికులెవ్వరు నింకను బయలుదేరలేదు. ఇతరములగు దక్షిణ దేశ భాషలతోఁ బోల్చి దొరికినంతవరకైనను ఈ దేశ్య శబ్దముల మూల రూపముల నన్వేషణకు దొరకొని సాధింపకయే, యీ భాషలను సహజములగు ధ్వని పరిణామ పద్ధతుల నన్వేషించి నిర్ణయింపకయే యేదో యొక తెలుఁగు భాషలో మాత్రమే యనేకవిధ పరిణామములను బొంది యేర్పడిన కొన్ని దేశి శబ్దములను ఏ యక్షర సామ్యమును బట్టియో—యేవో కొన్ని సంస్కృత ధాతువులతో ముడిపెట్టి వ్యుత్పత్తులను కల్పించి రూప నిష్పత్తి చేయుటకై చేయఁబడిన యత్నములు సఫలములనిగాని, భాషా తత్త్వ శాస్త్ర సమ్మతములనిగాని తలంచుట కవకాశము లేదు. క్రీ. శ. 7 వ శతాబ్దినాఁడే కుమారిల భట్టాచార్యుఁడీ సంస్కృత పండితు

లెట్లా భాషలలోఁజేరిన యన్యభాషా శబ్దములకు సంస్కృత ధాతువులనుండి వ్యుత్పత్తులను గల్పించి,నిష్పత్తిచేయుచుండిరో సూచించియే యున్నాఁడు. పాప్, వయిర్, అతర్-మొదలగు ద్రావిడ శబ్దములకు-పాప శబ్దముతోను, వైరి శబ్దముతోను (తర్తుం న శక్యత ఇతి అని) తృా ధాతువుతోను సంబంధము కల్పించి తచ్ఛబ్ద నిష్పత్తి సాధింతురని చెప్పి ఆనాడే ఇట్టి సాహసిక నిష్పత్తి కల్పనోద్యమమును ఖండించి వారించి నాఁడు. అనఁగా దీనివలన నాతని కాలమునకు ద్రావిడభాష లనఁబఁడునవి ప్రత్యేకములగు దేశీయ భాషలుగా నేర్పడి యుండినవనియు, నివి సంస్కృత జన్యములో ప్రాకృత జన్య ములో, లేదా ప్రాకృత భాషా వికారములనియో తలంపక, అవి స్వతంత్రములగు దేశ భాషలనియే ఆ కాలమున నాతఁడు తలంచియున్నాఁడనియుఁ దెలియవచ్చుచున్నది. భరతుని నాటికే ద్రావిడము, ఆంధ్రము అనునవి భిన్న భాషలగుటయే గాక, శకారకోఘ్రాది భాషలకంటెను, శౌరసేనీ మొదలగు ప్రాకృతములకంటెను భిన్నములేయను భావమే ప్రబలినట్లు తెలియుచున్నది. కావున నివి 10-వ శతాబ్ది ప్రాంతమున నాధునికార్య భాషలవలెనే ప్రాచీన ప్రాకృతములనుండి యేర్పడినవనుట యేమాత్రమును సంభావ్యముకాదు.

కుమారిలభట్టు సూచించిన పిక నేమాది వి దేశీయ భాషా శబ్దములవలెనే, దేశీయభాషా శబ్దములును వేదభాషయందును సంస్కృతమందునుగూడ నా యా కాలములందుఁ జేరియుండు ననుటకు సందేహము లేదు. అట్టివానినిగూర్చి ద్రావిడభాషా తత్వ పరిశీలకులగు గ్రియర్సన్, గండర్టు, కిట్టెల్, కాల్డ్వెల్

మొదలగువారు చర్చించి నిర్ణయించియే యున్నారు. వైదికభాషలోని అణు, అరణి, కటుక, కపి, కర్మార, కుట, కుండ, నీల, పుష్ప, ఫల, మయూర, మొదలగు శబ్దములును, బ్రాహ్మణములలోఁ గానవచ్చు, అటవి, కంబళ, తిల, మర్కట, వళక్ష, వ్రీహి, శవ మొదలగునవియు దేశీయములగు ననార్య ద్రావిడ భాషలనుండి గ్రహింపఁబడినవే యని భాషాతత్త్వజ్ఞులు తలంతురు. కాని పికనేమాది శబ్దములు సంస్కృతీయములేయని వాదించినట్లే, పై శబ్దములన్నియు సంస్కృతీయములే యనువారును లేకపోరు. ఇది యిట్లుండ క్రీ. శ. 11 వ శతాబ్దిని ప్రాకృతవ్యాకరణమును రచించిన హేమచంద్రుఁడా భాషలలోఁ జేరిన దేశ్య శబ్దములనుగూర్చి "దేశి నామమాల"యను నొక గ్రంథమునే రచించినాడు. వీనిలోఁ గొన్ని తద్భవరూపములు ప్రక్షిప్తములై యుండిన నుండవచ్చునుగాని, అంతమాత్రమున "దేశి" నామమాలను రచింపఁదలఁచిన హేమచంద్రునకు "దేశి" తద్భవభేద పరిజ్ఞానమే లేకపోయినదనుట యుక్తముగాదు. వీనిలో కోల్, ముండా భాషాపదములును కొన్ని చేరియుండవచ్చును. కాని యీ దేశినామములలోని యీ క్రిందివి ద్రావిడభాషా పదములనుటకు సందేహము లేదు.

అక్కా – వృద్ధభగినీ, (అంబార్థస్తు సంస్కృత సమః), అత్తా–పితృష్వసా, శ్వశురభార్యా; భావ; మమ్మా, మామా; ఉడిదో–మాషాధాన్యం (cf ఉఁద్దు–ఉద్దు); ఊరో–గ్రామః; కల్లా – కల్లు; కురుల – కుటిలకేశే; ఖడ్డం – శ్మశ్రు; చించా–ఆమ్లికా; ణేసరో – రవిః; (కన్న – నేసర్, త. ఞాయిఱు);

పసింౘి-కనకం; పావో-సర్పః; పుల్లీ-వ్యాఘ్రః; ముంగుసూ-నకులం; ముద్దీ-చుంబితం; రొట్టం-తండులపిష్ఠం; మాడియం-గృహం; మొగ్గర - కుట్మల-మొగ్గ; వెళ్లం - ధవళం, కావి-సిలివర్ణా; కస్సా-పంకః etc.

ఇవి దక్షిణదేశభాషలన్నిటిలోను సమానముగాఁ గొంతవరకు సరూపములునై కనఁబడుచున్నవి. తద్భవములు కూడ నీ భాష లన్నిటిలోను నట్లే కనఁబడునని చెప్పవచ్చును, గాని వానికి ప్రకృతియనఁదగిన శబ్దము సంస్కృతమున సహజమా, భాషాంతరములనుండి సంక్రమించినదా యను విషయము • పరిశీలనార్హంబగును. ద్రావిడభాషా కుటుంబమునకుఁ జెందిన బ్రాహుయిభాష యిప్పటికిని బెలూచిస్థానమున, తన యనార్యత్వ చిహ్నములను, ద్రావిడభాషా లక్షణములను నిలుపుకొని బెలూచిస్థాను ప్రాంతమున నిలిచి యుండుటచేతను, వింధ్యప్రాంతమునందలి కొండ జాతులలో గోండు, మాల్టో, ఒరెయాన్ మొదలగు ద్రావిడభాష లిప్పటికి వ్యాప్తిలో నుండుటచేతను, ఈ దేశ మార్యజనాక్రాంతమగుటకుఁ బూర్వమే యీదేశ భాగమునందంతటను ద్రావిడాదిభాషలను మాట్లాడినజనులు నివసించియుండిరే కాని యిది నిర్జనారణ్యమనఁదగదు. కావున వారితో నార్యులకీ దేశము ప్రవేశించుటకు పూర్వమునుండియు సంసర్గము కలుగుచునేయుండి, హిందూదేశమునకు వచ్చి నెలకొనినపిదప హెచ్చుగాఁ గలిగినదనియు నిశ్చయింపఁ దగియున్నది. కావుననే ఋగ్వేద కాలమునుండియుఁ గలిగిన యీ యనార్య ద్రావిడ సంపర్కమువలన నార్యభాషలోఁ దొలుత కొన్ని

యనార్య శబ్దములుమాత్రమే ప్రవేశించినను, కాలక్రమమున
నీ యనార్య ద్రావిడజన మార్యభాషను నేర్చి వ్యవహరింప
వలసిన వారైనపుడా భాషారూపములను స్వీయోచ్చారణ
సంప్రదాయాను సారముగాఁ బలుకఁజొచ్చుటచే, వైదిక
సంస్కృతభాషాధ్వని సంప్రదాయములలో మార్పు గలిగి
ప్రాకృత భాషలను నవి యేర్పడినవని చెప్పనగును. ఈ కార
ణము చేతనే తొలియుగమున కొన్ని యనార్య శబ్దములు
మాత్రమే చేరుటయు, తరువాతి కాలమున అనఁగా మధ్య
హిందార్యావస్థలో లేదా ప్రాకృత భాషావస్థలో ధ్వనుల
మార్పులే విశేషముగాఁ గనబడుటయుఁ దటస్థించినదే గాని,
భాషానిర్మాణము వ్యాకరణరూపములలో మార్పులు విశే
షముగాఁ గనఁబడలేదు. వైదిక యుగమునందలి భాషలో
గల రూప సంపత్తి తగ్గినదేగాని, వ్యాకరణపద్ధతిమారలేదు.

ఇంకను మరికొంత కాలమునకు దేశమునందలియనార్య
జను లార్యసంఘములో నంత్యజాతివారై స్థిరపడుటతటస్థించిన
తోడనే,అనార్యభాషలలోని వాక్య నిర్మాణపద్ధతులు వ్యాక
రణ సంప్రదాయములుగూడ నార్యభాషలగుప్రాకృతములపై
తమ ప్రభావమును నెరపి, ప్రాకృతములకు క్రమేణ యప
భ్రంశావస్థను, ఆధునికార్య భాషావస్థను దెచ్చి పెట్టినవి.
కావుననే ప్రాకృతావస్థలో నార్యభాషాధ్వనుల యుచ్చారణ
విషయములోనే కనబడఁజొచ్చిన యనార్యసంప్రదాయములు
ఆధునికార్యభాషలలో వ్యాకరణ పద్ధతియందును, భాషా
నిర్మాణ రీతులయందునుగూడఁ జొరబడినవి. వైదికయుగము
నుండియు కొద్దిగనో గొప్పగనో దేశ్యశబ్దములాభాషలోచేరు

చునే యున్నవి. వానికి సంస్కృత ధాతువులనుండి వ్యుత్పత్తులను పండితులు కల్పింప యత్నించుచునే యుండిరి. ప్రాకృతావస్థలో నీ శబ్దజాలము పెరిగిపోవుటచేతనే వైయాకరణులు దేశి నామమాల లను పట్టికలనే తయారు చేయవలసిన వారైనారు. ఇవి దేశభాషలనుండి ప్రాకృత భాషలలో సంక్రమించినవనియే నిశ్చయింపవలసియున్నది.

ఈ "దేశి" శబ్దములకు దేశభాషా శబ్దములతోఁ గల సంబంధమును బరిశీలించి వ్యుత్పత్తుల నారయవలసినదే గాని, సంస్కృత సంబంధమే యెట్లో చూపి వాని యార్యత్వమునో, అదేశీయత్వమునో స్థాపించు నుద్దేశముతోడనే కృషి సల్పవలయునని వాదించువారి నే మనగలము? కుమారిల భట్టాచార్యుఁ డా కాలమున ననినట్లే "తద్యథా ద్రావిడాది (దేశీయ) భాషా స్వీదృశీస్వచ్ఛంద కల్పనా, తదా పారశీక యవన రౌమకాది భాషాసుకిం వికల్ప్య కిం ప్రతిపత్స్యన్త ఇతి న విద్మః"–అనియే మనము ననవలయును. ఈ ఆంధ్ర దేశ్యము యొక్క మూలరూపముల నితర దక్షిణదేశ భాషా రూపములతోఁ బోల్చి కనుఁగొనకయే, మూలభాషా శబ్దములనుండి విశేషముగా మార్పుజెందియున్న యిప్పటి తెలుఁగు రూపముల నే సంస్కృత రూపములతో ముడివెట్టి వ్యుత్పత్తులను గల్పింప యత్నించుటవలనఁ బ్రయోజనమేమి? ఇకనైనను దక్షిణదేశీయములై సన్నిహితములై యున్న భిన్నభాషా రూపములకుఁ గల పరస్పర సంబంధము, వానిపరిణామక్రమమును గూర్చి విశేషపరిశోధనలు జరుగవలసినదేగాని, ద్రావిడభాషా

తత్త్వజ్ఞాన సంపాదనమునకు—ప్రాకృత భాషలను గూర్చి యింకను పరిశోధనలు జరుగవలయుననుట, యెంతమాత్రము ప్రయోజనకారిగాఁ గనఁబడదు.

ప్రాకృత వైయాకరణులవలెనే దేశభాషా వైయాకరణులు నీ భాషాశబ్దములను తత్సమ, తద్భవ, దేశ్యములనియే విభాగించిరి. తద్భవము లేర్పడు పద్ధతులీ భాషలన్నిటిలో చాలవరకు సమానములే. అనఁగా నీ భాషలలో లేనివర్ణములను పరిహరించి, వీరి యుచ్చారణ సంప్రదాయానుసారముగా నా శబ్దములను మార్పు నొందించి గ్రహించుటయే ఆ పద్ధతి. తత్సమ శబ్దముల విషయమునఁ గొంత భేదము కలదు. తమిళమునకు సంస్కృతభాషాప్రభావ మంతగా తగులకపోవుటచే, నీ రెండుభాషలకు సమానములుగానున్న వర్ణములతోఁగూడిన సంస్కృత శబ్దములే యాభాషలో తత్సమములనుపేర నట్లే గ్రహింపఁబడినవి. కావుననే మహాప్రాణములు, శ,ష, స లు మొదలగు సంస్కృత వర్ణము లీ భాషలో ప్రవేశింపలేదు. కన్నడాంధ్రములలో ద్రావిడ భాషలకు విజాతీయములగు వర్ణములతోఁగూడిన సంస్కృతశబ్దములనుగూడ నట్లే గ్రహించి వానిపై మహదమహత్సూచక ప్రత్యయములను జేర్చి వాడుకొను నలవాటు ప్రబలినది. ఇట్టి తత్సమభాష సంస్కృత పండితుల శిష్ట వ్యవహారముననే బయలుదేరియుండును. ఈ భాషలలోఁ దొలుత శిష్ట వాఙ్మయమును లేవదీసినవారును వీరే యగుటచే నా శిష్టమార్గకవితయందీ భాష ప్రాధాన్యము వహింపఁ జొచ్చినది.

ఇక దేశ్యము:—తత్సమ తద్భవములతో పాటు దీనికిని ప్రాకృత వైయాకరణులనగానే, దేశభాషా వైయాకరణులును ఒక విభాగ మేర్పరచినారు. ప్రాకృతములలోని శబ్దజాలము వ్యాకరణ రూపములు నన్నియు సంస్కృతభాషారూప జన్యములే యగుటచే నచ్చటి భాషయంతయు సంస్కృతభవమే యగును. కొన్ని శబ్దములు మాత్రమే దేశభాషలనుండి యెరువు తెచ్చుకొనంబడినవగుటచే వానిని వారు "దేశి" యని వ్యవహరించిరి. కాని దేశభాషలకు సహజమై యందు వ్యవహారములో నున్న శబ్దజాలమును "దేశి" యని విభాగించుటలో నర్థమేమి? భాషయంతయు దేశియేగదా. ఎంత శబ్దజాలము తత్సమ, తద్భవరూపములన భాషలోనికివచ్చినను "తల్లిసంస్కృతంబెయెల్ల భాషలకును" అని చెప్పిన కేతనాది లాక్షణికు లా భాషయందెంత గౌరవముకలవారైనను, "దానివలన కొంత" వరకే "గానంబడియె" ననియు "కొంత తాన కలిగె ననియు నంతయు నేకమై తెలుంగు బాస నాగ వినుతికెక్కెననియు"—చెప్పిరే కాని, వారీ భాషయంతయు నిందలి దేశ్య శబ్దజాలము—వ్యాకరణ రూపములు, ధాతుకూటము, అనునదంతయు గూడ సంస్కృత ప్రాకృతములనుండి యేర్పడినదే యని యెంత మాత్రము తలంచినట్లులేదు, అట్లు చెప్పనూలేదు. వారాంధ్ర భాష "వికృతి" అని చెప్పినంతమాత్రమున, అందలి తద్భవ తత్సమభాగమే "వికృతి" యని వారు తలంచిరనియే మనము భావింపవలయును గాని, భాషయంతయు ప్రాకృతమువలె నామూలాగ్రముగా సంస్కృత భవమని తలంచిరని గాదు.

టకు వీలులేదు. "వికృతి" శబ్దమున కట్టి యర్థము, తెలుఁగు ప్రాకృత పరిణత రూపమేయనియు నార్యభాషా వర్గమునకుఁ జెందినదే యనియుఁ దలంచి దానిని సమర్థింపఁ జూచిన యాధునిక పండితుల కల్పనయే కాని వేరుకాదు. వారు తమ భావమును ప్రాచీనాంధ్ర వైయాకరణులకుఁ గూడ నంటగట్టి తమ వాదమునకు బలము చేకూర్చుకొనన నెంచిరేగాని ప్రాచీన వైయాకరణుల కట్టి భావ మెన్నఁడు నున్న ట్లగపడదు. దైవభాషయందు వారికిఁ గల గౌరవము చేతను, దేశభాష లన్నిటిలోనుఁ గూడ సంస్కృతశబ్దజాలము ఇంతో అంతో కనఁబడుచుండుటచేతను, వారట్లు చెప్పి యుందురు. చెప్పినను వెంటనే కొంత తానగలిగెనని చెప్పి వాస్తవస్థితిని వెలిబుచ్చియే యున్నారు. ఇంతేగాక ఒక్క వ్యాకరణ రూపమునైనను సంస్కృత భవమని వారు నిరూపింపయత్నింప లేదుగదా. కావుననే వానితోపాటు ఈ భాషలో సహజముగాఁ గలిగిన యీ శబ్దములను అచ్చ తెనుఁగులని, అందరికి సులభముగాఁ దెలిసెడివని కేతన చెప్పియున్నాఁడు.

"తలనెల వేసవి గుడి మడి
పులి చలి, మడు గూరు, పేరు బూరుగు, మగవా
డలుక యని యెల్లవారికిఁ
దెలిసెడి యా పలుకు లచ్చ తెనుఁగన బరగున్"

ప్రాకృత వైయాకరణులవలె, సంస్కృతమునుండి వచ్చినవని చెప్పుటకు వీలులేనివి, అర్థము సులభముగాఁ

దెలియనివియగు శబ్దములనుగాదు వీరు "దేశి" అని చెప్పి నది. ఈదేశి శబ్దములకు "ఊరో గ్రామః" అన్నట్లు అర్థము చెప్పవలసిన యావశ్యకతయు, కేతనాదులకుఁ గలుగలేదు. ఇది "కలితీ" లేని అచ్ఛమైన—స్వచ్ఛమైన, తేరిన—తేట తెనుఁగు. తెనుగుదేశము నందలి యెల్లవారికి నప్రయత్న ముగనే, సహజముగనే తెలిసెడి పలుకులు గావున—వీని కచ్చ తెనుఁగని కేతన పేరుబెట్టినాఁడు. దీనినే "సహజాంధ్ర దేశ భవము" అని విడమరచి చెప్పి కేతన భావము నీక్రింది విధముగా మరింత వ్యక్తము చేసినాఁడు విన్నకోట పెద్దన—

> ఈ మూడు తెలుంగులలో
> నేమిటనున్ దొరలకున్న నెల్ల జనులకున్
> లోమిగులఁ దేట పడియెడు
> నామాటల యచ్చ తెనుఁగు లన నెగడొందున్.

తత్సమ తద్భవ దేశ్య శబ్దములు (దేశ్యము లనఁగా నన్య దేశ్యములని యీతనిభావము) ఎల్లజనులకు నర్థము కాక పోవచ్చునుగాని, సహజాంధ్ర దేశ్యములైన అచ్చ తెనుఁగుమాటలు ఎల్ల జనులకున్ మిగులఁ దేటపడియెడు నవియే. వీని కర్థము చెప్పనక్కరలేదు. ఈ "అచ్చ తెనుగు" అనునది "తద్భవము" దొరలని దని పెద్దన చక్కగా వ్యక్తమే చేసినాడు. కాని తరువాతి వారు తద్భవ మునుగూడ అచ్చ తెనుఁగులోనే చేర్పఁ గడఁగినారు. తొలుత సంస్కృత భూయిష్ఠ రచనకు పోటీగా నీ యచ్చ తెనుఁగు రచన ప్రారంభమైనది. కాని అప్పకవినాటికీ కేతన

పెద్దనల సంప్రదాయము మారి అచ్చతెనుఁగున కర్థభేదమే కలిగినది—

దైత్యజమన తత్సమమనఁ దద్భవమన
దేశ్యమన గ్రామ్యభాష నాఁ దెనుఁగు నాల్గు
విధములగు నందుఁ దత్సమ విడిచి మూఁడు
నాంధ్రములె యెందు నందు గ్రామ్యంబు దిరుగు.

దీనినిబట్టియే "తత్సమేతరంబగు భాషయచ్ఛయనంబడు" అని బాలవ్యాకరణ సూత్రముకూడ నేర్పడినది. కేతన పెద్దనలు "అచ్చతెనుగు, దేశ్యము" అనువానిని భిన్నములుగాఁ జేసి, అచ్చతెనుఁగు సహజాంధ్రదేశభవమనియు దేశ్యము "బహుదేశానేయములై యాయా నెలవులఁ జెవులకుఁ దీయములగు పలుకు" లనియు, "తేరనాడిన దేశ్యంపు బలుకులని"యుఁ జెప్పగా, అప్పకవి "దేశ్య" మునే శుద్ధాంధ్రదేశ్యమని, అన్యదేశజాంధ్రమని, రెండు భాగములుగాఁ జేసినాఁడు. ఈతని శుద్ధాంధ్ర దేశ్యమనునది కేతన పెద్దనల యచ్చతెనుఁగే. అది "ఆంధ్రదేశపురస్థాయులైన సకల జనములకును మఱుగు దేశంబు లేక తేటతెల్లమిగాఁ బల్కు మాటలతోఁగూడినది. అట్టివి పాలు, పెరుగు, నేయి మొదలగునవి.

ఆంధ్రులు నానా దేశంబులయందు నిలిచి, తెలుఁగులె తత్తద్దేశోక్తులంటఁ బలికిన నాశబ్దము లన్యదేశ జాంధ్రములయ్యె. ఇట్టివి బహుదేశానేయము లగుటచే మాండలికములు (Provincialisms) అనవచ్చునేమో. కాని యివి శుద్ధాంధ్ర

దేశ్యములు వలె నంత సులభముగా నర్థమగునవిగా మాత్రము లేవు. అయినను వీనిలో పెక్కింటి కితరభాషలలో సజాతీయ రూపము లగపడుచునే యున్నవి. శుద్ధాంధ్రములు నచ్చ తెలుఁగులు ననఁబడుచున్నవానిలో- కేతన చెప్పినవి.

తల, నెల, వేసవి, గుడి, మడి, పులి, చలి, మడుగు, ఊరు, పేరు, బూరుగు, మగవాఁడు, అలుక అనునవి. పెద్దన యిచ్చినవి వీనికంటె భిన్నములే.

ఎనుములు, గుఱ్ఱములు, మొదవులు, ఎడ్డులు, బండులు పండులు, ఉప్పు, పప్పు, అనుములు, కొల్లులు, ఆముదము, ఆకులు, పోకలు, నెయ్యి, నూనె.

ఇట్లు భిన్నములైనను ఇవన్నియు చాలవరకు నిత్య వ్యవహారమునఁ బ్రయోగింపఁబడు వస్తువుల పేళ్ళగుటచే నెల్లవారికి దెలిసెడి పలుకులే. అప్పకవి యిచ్చినవి యిట్టివే—పాలు, పెరుగు, నేయి, ఉట్టి, ఱోలు, బిడ్డ మొద లగునవి. కాని కేతన అచ్చతెనుఁగు శబ్దముగాఁ జేర్కొనిన "వేసవి"—శబ్దమును అప్పకవి అన్యదేశ్యముగా నిచ్చినాఁడు. ఇది తద్భవమే యనియు విశాఖ శబ్దభవమని సులభముగా వాదింపవచ్చును. శబ్దరత్నాకరకారుఁడును దీనిని వైకృతమనియే తెల్పినాఁడు. కేతన పొరబడి యట్లు చెప్పినాఁడనియు కొందరనవచ్చును. కాని దీని నీ భాష లోని యితరశబ్దములతోడను, ఇతర సన్నిహిత భాషా శబ్ద ములతోడనుఁబోల్చి చూచినచో నిది దేశీయమేగాని తద్భ వము కాదని తెల్లముకాకపోదు. "వేసవి"-వేసఁగి-వేసంగి శబ్దములు కన్నడమునందలి బేసగి, బేసగె; త. వేనిల్. వేనల్

అను సమానార్థక శబ్దములతోఁ బోల్పఁదగియున్నవి. ఇంకను కని కన్న-బిసు, బిసి, బెం, బెచ్చనె, బిసికల్ (సూర్యకాంతి -వేడిమి) బెంకి; త-వెయిల్, వెయ్యిల్, వేనిల్; తె-వేడి, వెట్ట, వేఁగు; వేయించు, వేడిమి; వెచ్చన; వేపు-వేపుడు, మొదలగు శబ్దములతో సంబంధించియుండుటచే, నిది దేశీయమేగాని, ''విశాఖ'' శబ్దముతో సంబంధించినదిగాఁ దోపదు. నిత్య వ్యవహారములో నున్న యితర శబ్దములకుఁ గూడ చాలవరకు నితర దక్షిణదేశ భాషలలో సజాతీయ శబ్దములను సులభముగనే పోల్చుకొనవచ్చును. అట్టివి యీ భాషలన్నిటిలో సజాతీయ (cognate) రూపములుగలవగుట చేతనే యవి దేశమునకు సహజములు, దేశ్యములు నగుచున్నవి.

తల—త. తలై; క. తలె.

నెల—త. నిల, నిలా.

మడి—త. మడి; క. మడి=a fold, తె. మడత.

పులి—త. పులి; క. పులి, హులి.

చలి—త. కుళిర్; క-మ. కుళిర్=to be cool, coolness.

మడుగు—త. మడు; క. మడు=a pool of deep water.

ఊరు—త-క-తు. ఊర్. a town, village.

పేరు—త. పెయర్, పేర్ cf. (పేచు—to speak); క. పేళ్=to speak.

బూరుగు—క. బూరుగు; త. పూళై; మ. పూళ = silk cotton.

మగవాఁడు—త. మగన్; క. మగఁ=son.

అలుక—త. అలంగు, అలుంగు = to shake, tremble. త. అలై =to shake.

ఎనుము—త. ఎరుమై; క. ఎర్మె, ఎమ్మె; తు. ఎమ్మె.

గుఱ్ఱము—త. కుదిరై; క. కుదిరె.

ఎడ్లులు—ఎద్దులు; క. ఎత్తు ఎత్తు-ఎద్దు=ox. త-మ. ఎరుదు; తు. ఎరు=an ox.

బండులు—త. పండి, వండి; క. బండి; మ. వణ్డి-వణ్డిల్ = a carraige.

పండు—త-క. పఴమ్.

ఉప్పు—త-క-మ-తు. ఉప్పు.

పప్పు—త. పరుప్పు; క. పప్పు.

ఆకు—క. ఆకు=a leaf, a herb.

పోక—త. పాకు, పాక్కు.

నూనె—నూల్+నెయ్, cf. త. ఎళ్ నెయ్.

నేయి—క. నేయ్, నేయి=ghee, త. నెయ్=fat, ghee, oil.

పాలు—త-క. పాల్.

ఉట్టి—త. ఉఱి; క. ఉఱి.

పట్టి—క. పడు, పడె=to obtain, to catch. త. పఱ్ఱు = to catch.

వంచు—క. బళ్కు; త. వళ్-వళై, వణ్, వాంగు.

ఱోలు—త. ఉరల్; క. ఒరల్, ఒరళ్.

ఎక్కు—త-క-మ. ఏఱు = to ascend, mount, to climb. తు. ఏరు; క. ఎక్కు.

అన్యదేశ్యములని వీరిచ్చిన శబ్దములలో పెక్కు పైవాని వలెనే తేటతెల్లములు, సులభముగ నర్థమగు శబ్దములుగాఁ గనఁబడుటలేదు. ఇవి సామాన్యముగా కావ్యభాషలో నాయా ప్రాంతములవారు ప్రయోగించిన ప్రాంతీయ శబ్దములని తోచుచున్నది. తమిళ వైయాకరణుఁడగు—తొల్కాప్పియరుకూడ ఇయఱ్చ్చొల్, (సులభముగఁ దెలియ నచ్చు తమిళ శబ్దములు) తిరిచొల్ (కావ్యభాషా పదములు) తిశైచ్చొల్ (విదేశీయ పదములు) వడచొల్ (సంస్కృతమునుండి వచ్చినవి) అనియే యా భాషాశబ్దములను విభాగించినాఁడు. అందాతఁడు చేసిన "తిశైచ్చొల్" అను శబ్దముల విభాగమువంటిదే—మన భాషలోని "అన్యదేశ్య" విభాగము కావచ్చును. ఆంధ్రులై నానా దేశములందు నిలిచి తెలుఁగులై తత్తద్దేశోక్తులంట బలికినవి అన్యదేశజాంధ్రము లన్నారు. వీరు ప్రత్యేకముగా కావ్యభాషాపదము లను విభాగమును జేయకపోయినను ఆ శబ్దములు ఆయా ప్రదేశములందలివారు, రచించిన కావ్యముల నుండియే గ్రహింపబఁడియు నుండవచ్చును. వీరుదాహరించిన శబ్దముల తీరు నట్లే కనఁబడుచున్నది. పెక్కు శబ్దములు సమాసములు—

నెత్తమ్మి, లేమావి, తెమ్మర, వలరాజు, రేఱేడు, అలరుపిండు, వాలుగంటి, క్రొమ్మించు, కెమ్మోవి, కెంజాయ, కమ్మతావి, రేమెండ, క్రొన్నెల, నెమ్మోము, వేనవేలు ఇత్యాదులు.

ఇవి చాలవరకు నిత్యవ్యవహారములో లేక ప్రాతవడ్డ మాటలుగానే కనఁబడుచున్నవి. ఈ విషయమునే అప్పకవి కూడ "ప్రాఁదెనుఁగుల" ప్రశంసను దెచ్చి మనకుఁ దెలుపు చున్నవాఁడువలె నున్నాఁడు. ఇది తొల్కాప్పియర్ చేసిన "తిరిచొల్" వర్గముతో సరిపోవును.

తొల్లింటి కవుల వాక్యము
లెల్లను బ్రాఁదెనుగులయ్యె నిప్పటివారలు
చెల్లుబడి వాడు నవియే
దెల్లమిగా నింకఁ బ్రాఁత తెనుఁగులు నృహరీ"

ఇట్టి ప్రాఁదెనుగుల కుదాహరణముగా పుడమి, సిరి, పడతి, నెడవిలుతుఁడు, పసిడికడుపు వేల్పు, మొదలైన శబ్దముల నిచ్చినాఁడు. అయితే యివి యాయా మండలంబులందలి వ్యవహారమునుండి యీ లాక్షణికులు సేకరించిన వనుటకును వీలుకనఁబడదు. కావున నాయా మండలమందలి కవులచే తమ కావ్యములందు ప్రయోగింపబడినవై, యందరకు సులభముగా నర్థము కానివగుటచే, నిట్టి శబ్దములు— అప్పకవి చెప్పినట్లు "ఆంధ్రులె నానా దేశములందు నిలిచి తత్తద్దేశోక్తులంట బలికినవేమైనను" నవి వారి కావ్యముల నుండియే సంగ్రహింపఁబడిన వగుటచేతఁ దొల్లింటి కవుల వాక్యములలోనివి యగుటయుఁగూడ తటస్థించియుండును. ఇట్టివి అన్యదేశ్యములని పేర్కొనఁబడినను వాస్తవముగా నవి మాండలికములే. కావుననే వీనికి నితర దక్షిణ దేశ భాషలలో సజాతీయములగు రూపములు సులభముగాఁ గనఁబడుచునే యున్నవి.

కేతన పెద్దనలు అచ్చతెనుఁగు దేశ్యము, అని ప్రత్యేక విభాగములఁజేసి చెప్పఁగా అప్పకవి 'దేశ్యము'— అనుదానినే శుద్ధాంధ్రదేశ్యము, అన్యదేశజాంధ్రము అని రెండు భాగములుగాఁజేసి చెప్పుటయేగాక "అచ్చ దెనుఁగను" దానికి వేరొక యర్థమునుగూడ గల్పించినాఁడు.

"నెలకొను సంస్కృత తత్సమ
ములు దొరలక తజ్జ దేశ్యములు మూటను సం
ధిలి కేవలాంధ్రములు నా
నలరు గృతుల నచ్చ తెనుఁగులంద్రు తెలుగునన్."

దీనినిబట్టి తద్భవములు శుద్ధాంధ్ర దేశ్యములు (అనగా కేతన పెద్దనలు చెప్పిన అచ్చతెనుఁగులు) అన్య దేశ్యజాంధ్రములు (అనగా కేతనాదులు చెప్పిన దేశ్యములు), ఇవన్నియు గలిసి, అప్పకవి మతములో నచ్చ తెనుఁగులయినవని తెలియుచున్నది. ఇంతమాత్రమే కాదు. ఈతఁడింకను మరి రెండు రకముల తెలుఁగులనుగూడ నీ యచ్చ తెనుగులలోఁ జేర్పఁదలఁచినాఁడు. అవి తెలుఁగు మఱుంగులు ప్రాదెనుగులు ననునవి.

"తెలుఁగుమఱుంగులు ప్రాఁదెను
గులు తద్భవదేశ్యములును గూర్చి మృదుపదం
బులుగాఁగ నచ్చతెనుఁగులు
మెలకువతోఁ జెప్పఁదగు శమీప్రాంత గృహా."

తొల్లింటి కవుల వాక్యములు ప్రాదెనుఁగులు. తెనుఁగునఁ గావ్యరచనచేయఁదలఁచినవాడు తొల్లింటి కవులు

ప్రయోగించిన శబ్దములను మాండలికములైనను గ్రహించి తాను ప్రయోగించుకొనుననుటలో నాశ్చర్యము లేదు. కాని అప్పకవి కాలమునకు "తెనుఁగుమఱుగుల"ను నవి యీ భాషలో విశేషపదములుగా నేర్పడుట తటస్థించినదని మనము గుర్తింపవలసియున్నది. వీనికి ప్రత్యేకముగా లక్షణము చెప్పక తెనుఁగు మఱుగులనునవి ఇట్టివి అని మాత్ర ముదాహరించి యూరకున్నా డప్పకవి—

"అబ్ధిమేఖలకుదయించినట్టి సీతఁ
జేకొనియె రాఘువుండని చెప్పుచోట
కడలిమొల నూలిచేడియ గనిన పడుచుఁ
దెచ్చుకొనె రాముఁడనఁగను దెనుఁగు మఱుగు."

అనఁగా సంస్కృత సమాసముల యర్థమును దెలుపుటకుఁగా, దేశ్యపదములతోఁ జేయఁబడిన దీర్ఘసమాస పదములే తెలుఁగు మఱుగులని తేలుచున్నది. సహజముగఁ దెలుఁగులో నిట్టి దీర్ఘ సమాసములుండవు. సంస్కృత దీర్ఘ సమాసములను తత్సమ శబ్దములుగాఁ దెచ్చికొని తెలుఁగులోఁ బ్రయోగించుటకు వెనుకాడిన తరువాతి కవులు కొందఱా దీర్ఘసమాసముల యర్థమును దెనుఁగుపదములతో మాటి డొంకతిరుగుడు తెనుఁగు సమాసములుగాఁ జేసి ప్రయోగించుచు నట్టివానిని అచ్చతెనుఁగు సమాసములని చెప్ప మొదలిడిరి. ఈ రీతి రచన అప్పకవికి చిరపూర్వమే ప్రారంభమైనది. కన్నడాంధ్రములయం దిదే మొట్టమొదట "జాణ్ణుడి" "జాను తెనుఁగు" అను పేర వెలసినది. సంస్కృత సమాసముల యర్థము సులభమైన తెలుఁగు

పదములలోఁ గొంత జాణతనము వ్యక్తమగునట్లుగా మఱుగు వెట్టియు చెప్పఁబడినదగుటచేత నట్టిది జాను దెనుఁగయినది. సంస్కృతపద ఘటిత దీర్ఘ సమాసములకంటె, మృదువు లైన తెనుఁగు పదములతోఁ దదర్థ బోధకములగు సమాసములు రచింపఁబడినచో, నట్టి జాను తెనుఁగురచన సర్వజన సామాన్యమును ప్రసన్నతగలదియుఁగూడ నగునుగదా. ఈ విషయమే పాల్కురికి సోమనాథుఁడు

"అరూఢ గద్యపద్యాదిప్రబంధ
పూరిత సంస్కృత భూయిష్ఠ రచన
మానుగా సర్వసామాన్యంబుగామి
జాను దెనుఁగు విశేషము ప్రసన్నతకు"

అని చెప్పి అట్టి జాను తెనుఁగెట్టిదో, వృషాధిప శతక మందలి జాను దెనుఁగు పద్యమున తాను స్వయముగా రచించి చూపినాఁడు. అప్పకవి రచనలో అచ్చ తెనుంగని పేర్వడిసిన యా తెలుఁగు మఱుంగులకును, సోమనాథుని వృషాధిప శతకమందలి యుదాహరణములోని "జాను తెనుఁగునకు"ను నేమియు భేద మగపడదు. రెండు నొక్కటియే. ఆ నాటి జానుదెనుఁగే కాలక్రమమున నప్పకవినాటికి తెనుఁగు మఱుంగై యచ్చ తెనుఁగు పేర్వడసి అచ్చ తెనుఁగు కావ్యరూపమును దాల్చినది. ఇది తొలుత దీర్ఘ సమాసయుక్తమై తత్సమ బహుళంబగు భాష నరికట్టుటకుఁగానే దేశమున బయలుదేరినదే యైనను అప్పకవి కాలమునుండియు నీ యచ్చ తెనుఁగనునది "అచ్చ తెనుఁగు

శాస్త్రము'' లలో వెఱ్ఱితలలు వేయుటకు మొదలుపెట్టి, అతి దీర్ఘములగు డొంక తిరుగుడు సమాసములతో నిండిపోయి, యీ సంస్కృత భూయిష్ఠ రచన కంటెను మఱుగై దుర్బోధంబు గాఁజొచ్చినది. సోమనాథుని రచనలోని ''బలుపొడ తోలు సీరయును'' (వ్యాఘ్రచర్మాంబర మనుటకు) అను పద్యములోని జానుదెనుఁగునకును తరువాత నప్పకవి ''తెనుఁగు మఱుఁగు'' న కుదాహరణముగా నిచ్చిన ''కడలి మొలనూలి చేసియగనిన పడుచు'' (అబ్ధిమేఖల కుదయించి నట్టి సీత అనుటకు) అనుదానికిని భేదమే మాత్రమును లేదుగదా. తత్సమరూపములనుగూడఁ జేర్చుకొనిన గాని యీ విధమగు రచన సాధ్యముగాదని కాఁబోలు వానిని గూడఁ జేర్చుకొని దీనినంతను ''అచ్చతెనుఁగని'' వీరు పేరు పెట్టినారు. ఈ విధముగా కేతన పెద్దనల నాటి ''అచ్చ తెనుఁగు'' అప్పకవినాటికి మారు రూపుజెంది, క్రొత్త యర్థమునుగూడ సంపాదించినది.

కేతన పెద్దనల అచ్చతెనుఁగు దేశ్య శబ్దములును, అప్పకవి చెప్పిన శుద్ధాంధ్రాన్యదేశ జాంధ్రములనుగూడ సహజములగు నాంధ్రదేశ్యములే యనుటకు సందేహము లేదు. కావుననే వీని కితర దక్షిణదేశ భాషలలో సజాతీయ రూపములు గానవచ్చుచున్నవి. ఈ లాక్షణికుల అన్యదేశ్యములలో సజాతీయములేగాక యితర దక్షిణదేశ భాషా రూపములుగూడ జేరియుండవచ్చును. ఈ క్రింది యాంధ్ర దేశ్యములకు సజాతీయ శబ్దములను సులభముగా గనిపట్ట వచ్చును :—

ఎఱుకువ:—"ఎఱుక" రూపాంతరము. క. అఱికె, అఱికె, అఱివు, అఱిత, అఱియమె; త. మ. అఱిక్కై, అఱివు. (కువ. cf మెలకువ, తేకువ, వేకువ, మక్కువ etc.).

నెత్తమ్మి:—నెఱ + తమ్మి; త. నిఱై; క. నెఱె (= full)

ఎరగలి:—కార్చిచ్చు. ఎరియు = మండు, కాలు. క. ఉరి = to burn, blaze. తుళు - ఎరి, త. మ. - ఎరి = flame, blaze.

ఎసకంబు:—క. ఎసె (= to shine, to be brilliant) ఎసక (=splendour, beauty).

నొసలు:—క. నొసల్ (=forehead), త. మ. నుదల్; తు. నెసల్ cf. తె. నుదురు.

ఇంతి:—(ఇల్+తి) ఇల్ - త. మ. క. ఇల్=being, place. క. అల్లి, ఇల్లి= in that place, in this place.

తేఁటి:—(తేన్+ఈ) తేనెటీఁగ - తేన్+ఈ+తేన్టీ- తేఁటీ, తేఁటి, అయినది. "ఈఁగ" అనునది ఈ + గళ్ = ఈగలు అను బహువచనరూపమునుండి కత్తిరింపఁబడి యేర్పడిన యేకవచన శబ్దము. త. తేన్, క. తేన్, జేను (=honey).

బెక్కసము:—క. బెక్కస = astonishment, amazement, surprise. బెక్కసంపడు.

నెమ్మి:—క. నమ్బుగె, నమ్మిగె; నమ్బు (=to confide, trust, rely upon) నెమ్బుగె, నెమ్బి = నమ్బి, నమ్బికె. (cf. నెమలి - నవిల్)

మక్కువ, మచ్చిక :—క. మచ్చు = devotion, to like. cf. మరుగు-మరల్

చెచ్చెర:—క. చెచ్చర, చచ్చర (=haste, with haste, care.)

పొచ్చెము:—క. పుసి=to become or prove false, to lie; త. పొయ్, పొయి = a falsehood. క. పుసె=a falsehood, a lie, uselessness.

కడిమి :—క. కడిమె (=That which is firm, strong). కడు (=firmness, hardness.) క. కడి.

ఏడ్తెఱ :—ఏడు (Time, year) తెఱ (తెఱవు) = opening, clearing, course. కాలముయొక్క తెఱపి, అభ్యుదయము.

లగ్గు :—అల్ - ధాతువు. క. అల్ = to be fit, proper, to be desirable, desired. అల్ + అగు = అలగు- అల్గు - లగ్గు = what is desirable = శుభము.

వెన్ను:—క. బెన్, బెన్ను, బెమ్; త. వెన్ = The back. బెన్ననె=at the back.

వీనులు :—విను - ధాతువు. వీను - నామవాచకము. ఇతర ద్రావిడభాషలలో నీ ధాతువగపడదు.

ఎక్కలి:—cf. క. ఎక్కటి=greatness, wonder.

తివురుట :— తివురు = తిమిరు, తివిర్ = to rub, to annoy, to rub on. "తివిరి యిసుమున తైలంబు తీయవచ్చు" తివిరి=గట్టిగా రాచి-నూరి. by rubbing hard, దీనినుండి, తివురు = ప్రయత్నించు అను నర్థము వచ్చినది. తివురు ధాతువున కిది లాక్షణికార్థముగాని, తొలి యర్థము కాదు.

ఉక్కు :—క. ఉక్కు = steel, ఉక్కె ; త. మ. ఉరుక్కు, cf. ఉచ్చు = to draw or attract towards oneself.

మేటి :—క. మేటి = loftiness, greatness, superiority = a big man, chief, త. మేట్టిమై, మేల్ = what is aloft, upwards. మేడు = height, rising ground.

బాగు :—క. బాగు = bending, a bend, curve. తనకు బాగున్నది - తన వైపునకు వంగినది. "బాగు" కన్నడమునుండి తెనుఁగున సంక్రమించిన శబ్దముగా గ్రహింపవలసి యుండును.

జోఁటి, జోఁటి :—జోడిమికలది. క. జోడిసు = to couple, unite, to string together. జోడిమి = proportion fitness.

వేనలి :—త. వేనలి.

పొలపంబు :—క. పొళె = shine. పొళపు = Radiance, lustre, brightness.

విన్ను :—త. విణ్ = sky. క. వెళ్.

మన్ను :—క. త. మణ్ =earth, clay. మణ్, మణ్ణు.

నెల్లి :—నెల్లికూర. త. క. నెల్లి=myrobalan, ధాత్రి.

ఉల్లము :—త. ఉళ్ళం ; క. త. ఉళ్ = the inner side, what is inside, మనస్సు. ఉళ్ళంజిసు = to frighten the mind.

కొఱలుట :—తు. కొరలు = to blaze or shine. cf. తె. కొఱవి; క. కొళ్ళి=a firebrand.

వీఁక :—వీఁగు. క. బీగు; త. వీంగు, (త. మ. వీఙ్ఙు–వీకుఙ) to be great or grand, puffed up. cf తె. "విఱ్ఱవీగు" (inflated, proud.)

కాఱియ :—కాఱులు. క. కాఱ్ =wildness, ferocity, wickedness, a bad man, an enemy. కాఱాగు = to become troublesome, hostile, కాఱ్ మాతు = to utter bad language.

గ్రద్దలు :—త. కఴు = a kite.

వేఁట :—త. వేట్టమ్; క. బేఁటె = hunting. బేట్టె; తుళు. బోట్టె.

కౌను :—పదాదియందలి ఔకారము ద్రావిడభాషా సంప్రదాయసిద్ధము కాదు. తద్భవములయందు కొన్నింట గనఁబడవచ్చునుగాని దేశ్యములందు సహజము కాదు. కావున నిది "కవును" శబ్దమునకు రూపాంతరమై యుండును. ఇది కవి, కవు, కవియు (to cover, to come upon, to overspread) అను ధాతువునుండి యేర్పడినదై యుండును. "కవుంగలి" దీనికి సంబంధించినదే యై యుండును.

పాలిండులు :—సమస్త పదము – పాల్ + ఇల్లు = పాలకు స్థానములు. పాల్. త. క. పాల్, పాలు; త. క. ఇల్.

ఒగి :—క. ఉగి = to pull, to draw towards. ఒగె = to comeforth, to arise, appear, to be born,

మొగి :—(cf. ఒక్క మొగిని) క. మొగసు = to exert one's self, to act zealously. త. ముయల్ = to apply one's self to a thing, to make effort.

తెమ్మెర :—ఇది దక్షిణదేశ భాషలలో నతి ప్రాచీనశబ్దము. ప్రాచీనభాషలోనిది తెమ్+ఎరల్ = దక్షిణపు గాలి, అను నర్థమున ఏర్పడినది. "తెమ్మొరల్" అను శబ్దము తెనుగుదేశపు వాడుకలో "తెమ్మొరలు"

అను రూపమును బొందగా, ఈ భాషలో "లు" అనునది బహువచన ప్రత్యయముగా రూఢి చెందిన పిదప "తెమ్మెరలు" అనుదానిలోని తుది "లు" బహువచన ప్రత్యయమే యైయుండునను భ్రమచే నా 'లు' ను విడదీసి "తెమ్మెర" అను నేకవచన రూపమును గల్పించినారు. ఈ విధముగా "తెమ్మెర" శబ్ద మీ భాషలో నేర్పడినది. క. తెం - తెంక - తెంబు = The south ; త. మ. తెన్, తెఱ్కు, తెక్కు; క. తెంగాలి = South wind. క. ఎరల్, ఎరళ్, ఎలర్ = wind, air.

లేమావి :—ఎల + మావి, త. క. ఎళ్, ఎళ (= tenderness, youth, tender). త. క. మా, మాం, మావు = mango tree.

తెలిగన్ను :—తెలి + కన్ను. క. తెళ్, తెలుపు = fine, fineness, thinnes, delicate, transparent. త. క. కణ్, కణ్ణు = eye.

క్రొన్నన :—క్రొత్త + నన. క. కొర = profit, use, good, advantage. తె. క్రొ, క్రొం; క. ననె; త. ననై = a flower-bud, a sprout, shoot.

వలరాజు :—వల + రాజు. ఇందు రెండవ శబ్దము దేశ్యము కాదు. వల - (వలపు) అనునది "ఒల్ - ఒల్లు" ధాతువునకు సంబంధించినది. త. క. ఒల్, వల్ = to be pleased, to desire, to love. ఒలవు=pleasure.

రేఱేఁడు :—రే + ఱేఁడు. ఇదియు సమస్తపదమే. రాత్రికి ఱేఁడు. రే - రేయి అనునవి దేశ్య శబ్దములేయైనను, పదాదిని రేఫముండుట ద్రావిడ సంప్రదాయసిద్ధము కాదు. తెనుగునను ఇరులు = చీకటి అను శబ్దము కలదు. ఇది బహువచన శబ్దముకాదు. 'ఎరల్' వలె లకారమంతమందుఁగలది cf. క. ఇరళు, ఇరుళ్. త. ఇఱా = ఱేఁడు. దీని ప్రాచీనరూపము "ఱే" అనియే ప్రాచీన తెలుఁగు శాసనములలోఁ గనబడు చున్నది. (cf. పొలఱేగారికి) బహు. ఱేలు. కాల క్రమమున "డు" ప్రత్యయము చేర్పఁబడినది. పదాదియందు "ఱ" కార ముండుట ద్రావిడ సంప్రదాయము కాదు. రాజశబ్ద భవమే యనుటకు నిది శకటరేఫ యుక్తము.

వాలుగంటి :—వాలు + కన్ను, వాలు - ఇందలి వకారము కూడ ఓకారమునుండి యేర్పడినదే. క. ఓలు = to bend, slope, slant- ఓరె - ఒరగు = leaning, slant, going sideways. cf. ఓర – వార.

అలరులపిండు :—అలర్ = to bloom, blossom, a flower.

తెక్కలికాడు :—తెక్కల్. cf. క. తెగె = to take away, to steal.

క్రొమ్మించు :—క్రొ - కొర్ + మించు, మిన్ - మించు = to glitter, lightning.

26297

కెమ్మోవి :—కెం + మోవి. క. కెం, చెం, చెన్ను = red.
మోవి - మో (ముఖ?) + వాయ్, త. మ. వాయ్
= mouth. క. బాయ్ = mouth.

కెంజాయ :—కెం + చాయ - చాయ - ఛాయా శబ్దభవము.

కమ్మతావి :—కం - కమ్మని - కంపు - సువాసన, దుర్వా
సన. క. కమ్ము = fragrance. తావి.

కడలి :—త. క. కడల్ - సముద్రము, కడ = అల.

వెడవిల్తుడు :—వెడ, విల్. త. క. విల్, బిల్ = bow.

నలువ :—నలు + వ = నాలుగు - వాయి = నలువ. నలు—
క. త. మ. నాల్ = four, క. నాల్కు, త. నాన్గు,
తె. నాలుగు.

నాన :—సిగ్గు. త. క. మ. నాణ్, నాణ = bashfulness,
shame, modesty.

ఎడకాడు :—తార్పుకాడు, దూత. ఎడ = సంధానము
త. క. ఎణె - (ఎడె) = to unite, match, pair. cf.
ఎనయు.

ఎలనాఁగ :—ఎల + నాఁగ; ఎల - లే - లేఁత. నాఁగ -
నాణ్గ = నాణ్చి - నాచ్చి = సిగ్గుగలది, స్త్రీ.

చెలువ:—చెలువము, చెలువు, చెల్వు=అందము. క. చెలు,
చెలువు, చెలువికె, చెలువత = beauty. క. చెలువి,
చెలువతి = handsome woman. భాశేంద్రు—చెంగీ

కెం, చెన్ను. రూపాం. "చెల్" - చెలువు-చెన్ను.

చిగురు-బోడి :—క. చిగుర్=పల్లవోత్పత్తి=to sprout, to shoot. cf. త. కిళై.

తెఱవ :—క. తెఱవు=the price paid for a wife. తెఱ =tax (cf. దండు తెఱ సిద్ధాయంబు etc.)

తలిరుబోఁడి - మెఱుఁగుబోఁడి :—తలిరు, తలిర్చు=చిగుర్చు. క. త. తళిర్=to sprout. క. త. మెఱె=to shine. మెఱయు.

పదరు :—త్వరపడు, ఆక్షేపించు. త.క. పదఱు (తె.వదఱు) =to be over-hasty, to talk nonsense.

పరి :—పర్యాయము, సేన. క. పరి=to flow, advance a course, way, manner, flowing, stream. రీతి, భంగి.

గమి :—సమూహము. cf. క్రమ్ము, కవియు, "మేఘుంబులెల్ల మొదలం గ్రమ్మి"

పసి :—సారము, చాతుర్యము. పసి, పసిమి=greenness, freshness, కాంతి, శక్తి. క. పొస=newness, freshness, beauty.

పొద్దు :—ప్రొద్దు. త. మ. పొఴుదు. క. పొత్తు=the sun. సూర్యుడు.

పోటు :—యుద్ధము. cf. పొడు, పొడుచు, పోటు. త. క. పుడై, పొడె=to strike, beat, to smite.

ముట్టు :—తాకు. త. మ. ముట్టు=to dash against, strike. ముట్టు=to touch, come in contact with.

తనివి :—తనివు. క. తణిపు = Satisfaction. తణిపు =to satisfy, refresh. cf. తణి - cool.

చెంత :—cf. కట్టు, సమీపించు. క. త. కిట్టు = to be reached, to come to hand, to touch. మ. కిడె, "కిణె"=to approach, come near.

అలము :—ఉపేక్ష. cf. క. అలె=to annoy, disgrace, పరిభవము.

సోలము-సొక్కు :—క. జోలు, సోలు=hanging down, slackness, loosenes. క. సోలు=to fail, to fall of in respect of vigour, to lose oneself.

పోరు :—యుద్ధము. త. క. పోర్=battle, fight, quarrel.

కలను :—కల, కలసు, కలయు=to mix together etc.?

చెలి :—(cf. చెలిమి) త. కెళ్ళి, కెళది = a female companion or friend. కెళ్ళి. గెణె = friendship, Union.

పొలతి :—క. పొలతి = a low-caste woman. పొలది= a lewd, profligate woman. ప్రొత్త = The menstrual flux; impurity due to child birth.

మేను :—త. మ. మెయ్, మేని ; క. మెయ్, మెయి, మై= The body.

కేలు :—క. కెయ్, చెయ్. కేలు - కయి శబ్దమునుండి యేర్పడిన బహువచన రూపమై యుండును. కయి - ఏకవచన రూపముండనే యున్నది.

తునుక :—క. తునుక. తుణుకు=a fragment, a bit, a piece, త. తుణి, తుణిక్కై. త. తుణి=to cut to pieces. తుణి+కళ్=తుణికలు - తునుకలు. తె. తునుగు.

ఇట్లు ప్రాచీనలాక్షణికులు పేర్కొనిన దేశ్యాన్యదేశ్య శబ్దములలో పెక్కింటి కితర దక్షిణదేశ భాషలలో సజాతీయ రూపము లగపడుచునే యున్నవి. వీనిఁబట్టి వీని మూలరూపములను, ధాతువులను, వ్యుత్పత్తులను నిరూపించుట దుర్ఘటము కాదు. ఇట్లే యీ భాషలోని యితర దేశ్యశబ్దములను ధాతువులను ఇతర దక్షిణదేశభాషా రూపములతోఁ బోల్చి వాని మూలస్వరూపమును, పరిణామక్రమమును నిర్ణయింప వలసినదేగాని, యిప్పటి తెనుఁగుభాషలో దేశ్యధాతువులని చెప్పబడినవానిని యథాస్థితములుగానే సంస్కృత ధాతువులతోనో, యేదోవిధమున ముడిపెట్ట యత్నించినంతమాత్రమున నాంధ్రదేశ్యముయొక్క యదార్థస్వరూపమును గనుగొన్న

వారమనికాని, అదియంతయు సంస్కృతభవమని నిరూపింపఁ గలిగిన వారమనిగాని తలంచుట కవకాశము లేదు. అటు ప్రాకృత వైయాకరణులు, ఇటు దక్షిణ దేశ భాషా వైయాకరణులునుగూడ, చాలవరకుఁ బరిశోధించియే సంస్కృతవికార మని చెప్పుటకువీలు లేని శబ్దజాలమును "దేశి"యని, "దేశ్య" మని, వేరుపరచియున్నారు. అచ్చటి "దేశి"లో కొంత శబ్ద జాలము మాత్రమే చేరినది. కాని, యిచ్చటి దేశ్యములో శబ్దజాలమేగాక అచ్ఛమగు తెలుఁగుభాషయంతయు (భాషా రూపములు-వ్యాకరణ రూపములుగూడ) చేరినది. కావున నీ దేశ్యమునకు-నీ యచ్చ తెనుఁగు భాషకు-నే పాకృతముతో సంబంధము గలదని పరిశోధనలు సలువవలెననియు, దేని తోడను సంబంధము చూపుటకు సాధ్యముకాదని తోచి నపుడు దీనికి సంబంధించిన ప్రాకృతమేదో అంతరించియుం డునుగావున నది బయలుపడువరకు, ప్రాకృతములనుగూర్చి పరిశోధనలు జరుగుచుండవలెనేగాని, ఆంధ్రభాషా స్వరూప లక్షణములనుగూర్చి మాత్రము నిర్ణయింప వీలులేదనియు, ద్రావిడభాషల తత్వమును గూర్చియే నిర్ధారణ చేయలే మనియు చెప్పుట, స్వీయవాదాభినివేశమును సూచించునేమో గాని, సత్యాన్వేషణపర్వతమును సూచింపదు. వైయాకర ణులే సంస్కృతభవము ప్రాకృతభవము అని శబ్దములను విడ దీసిచెప్పి, దేశ్యమును వేరుపరచి చెప్పినపుడు, ఈ దేశ్యమునకు సన్నిహితములగు దేశీయభాషలలోని రూపములతోఁ గల సంబంధ మెట్టిదో పరిశోధించి ఆయా భాషల పూర్వచరిత్ర నన్వేషించి-ఆయా రూపముల పరిణామ క్రమమును దెలిసి

కాన యత్నింపవలయునేగాని, భాషా లక్షణములలోను, వ్యాకరణ రూపముల విషయమునను సంబంధమే లేదని నిర్ణయింపఁబడిన ప్రాచీన ప్రాకృతములలో దేనితోనో ముడి పెట్టుటకై చేయు దీర్ఘవిచారణమువలన ప్రయోజనమేమి! ఎట్టి ప్రయోజనము లేదని తెలియవచ్చుటచేతనే వారాధుని కార్యభాషలలోనియనార్య ద్రావిడభాషా లక్షణముల నూతగాఁ గొని యందనార్యములని చెప్పఁబడుచున్న లక్షణములు వానికి సహజములేయైనట్లును, వానిలోవలెనే ద్రావిడ భాషలలోఁగూడ నవి యేర్పడినట్లును నిర్ణయించుచు, నట్లవి యేర్పడుటకు వీలుగా, నీ ద్రావిడభాష లనునవి ఆధునికార్య భాషలవలెనే, క్రీ. శ, 7, 8 శతాబ్దములనాడు బయలుదేరినవేగాని, అంతకుఁబూర్వము లేనే లేవని చెప్పి – వాని యస్తిత్వమును గూర్చియే శంకింపవలసిన వారైనారు. "అహో మూలచ్ఛేదీ తవ పాండిత్య ప్రకర్షః" అనునట్లైనది.

కావున స్టైన్‌కోనో పండితుఁడు చెప్పినరీతిగా ద్రావిడ భాషల కితరభాషాకుటుంబములతోఁగల సంబంధమును గూర్చిన విచారణమును వదలిపెట్టి, వానినొక ప్రత్యేక కుటుంబముగానే గ్రహించి తత్పరిణామక్రమాన్వేషణము నకుఁ గడంగుటయె యుక్తము.

పైని జూపిన విశేష లక్షణములనుబట్టి దక్షిణ హిందూదేశభాష లొక ప్రత్యేక కుటుంబమునకుఁ జెందిన భాషలని నిశ్చయింపవలసియున్నది.

III

దక్షిణదేశ భాషా సారస్వత లక్షణములు

ఒక్క కుటుంబలోనివై — యొక మూలభాష నుండియే వచ్చిన వని చెప్పఁబడుచుండిన యీ దక్షిణదేశ భాషలే కాలమున ప్రత్యేక భాషలుగా నేర్పడినవో చెప్పుట కవకాశము లేదుగాని క్రీస్తుశకమునకు చిరపూర్వమే యివి యొక దానినుండి యొకటి విడివడి, ప్రస్తుతమవి వ్యాప్తిగాంచియున్న దేశభాగములందు నెలకొని యుండిన వని మాత్రము చెప్పవచ్చును. ఈ దేశమున ప్రస్తుతము ప్రాధాన్యము వహించియున్న తమిళ, కన్నడ, మళయాళ, తెలుఁగు భాషలలో — తెలుఁగు తక్కినవానికంటె కొంత పూర్వమే మూలభాషనుండి విడివడి యుండుననుటకును కొన్ని నిదర్శనము లగపడుచున్నవి. (1) ఉత్తమపురుష సర్వనామ ప్రథమేతర విభక్త్యంగము — తక్కిన భాషలలో హ్రస్వాచ్చమైయుండ తెలుఁగున నొక్క ద్వితీయయందు దక్క తక్కినవానిలో ప్రథమలోవలె దీర్ఘాచ్చుతోఁగూడి యుండుట. (నా-నే-నన్ను-నాచేతను; త. ఎన్-ఎన్నాల్-ఎనక్కు, క. నన్న-ననగె). (2) ప్రథమపురుషలో స్త్రీ వాచక రూపము తమిళ కన్నడములలోవలె, "అవళ్" అనునది లేకుండుట; అమహత్ప్రత్యయమగు-ది-అది అనునదే స్త్రీ వాచక శబ్దములకు సూచకమగుట మొదలగునవి. తమిళ కన్నడములకంటె హెచ్చు మార్పులకు లోనై, ఇందలి రూపములు సులభముగ సజాతీయ శబ్దములతోఁ

పోల్చుకొనుటకు వీలులేనంతగా మిగుల వికారముల పొందుటకుగూడ నిదియే కారణము గావచ్చును. స్వర సామ్యము, వర్ణసమీకరణము, వర్ణప్లుతి మొదలగునవి తక్కిన భాషలలో వానికంటె నీ భాషా రూపములపై విశేషముగా పనిచేసినవి. తమిళ కన్నడములు — తెలుగు తమిళములకంటె కొంత సన్నిహితములుగాఁ గన్పట్టకపోవు. తమిళమలయాళము లత్యంత సన్నిహితములనియే చెప్ప వచ్చును. అట్లే తుళు కన్నడములకును దగ్గర సంబంధము కలదు.

ఇక నీ భాషలకు సంస్కృతభాషతోఁ గలిగిన సంబంధ స్వభావమును బట్టికూడ నీ భాషలస్వరూపము మారియున్నది. తెలుఁగు కన్నడములపై వలె తమిళ మళయాలములపై సంస్కృతభాషాప్రభావమంత ప్రాచీన మును బలవత్తరమునుగా గనబడదు. క్రీస్తునకు పూర్వమే తమిళదేశమున వైదిక మతవ్యాప్తికై అగస్త్యాదులవంటి యార్య మహర్షులు, బౌద్ధమత వ్యాప్తికై బౌద్ధ సన్యాసులు వచ్చి చేరి తత్తన్మతవ్యాప్తి గావించిన సందర్భమున నా భాషకు సంస్కృత ప్రాకృత భాషల సంపర్కము బాగుగనే గలిగియుండవచ్చును. కాని వింధ్య దక్షిణభాగమునందలి తెలుగు కన్నడ దేశమువలె నా దేశ మార్యజనాక్రాంతమే యగుటగాని యుత్తర దేశీయులగు రాజుల పరిపాలన ప్రాభవములకు లోనగుటగాని తటస్థింప లేదు. కావుననే క్రీస్తు శకారంభమునాటికే యా భాషలో దేశీయ ప్రభువుల

యూకరణమున దేశి కవిత పెంపొందుటయు, న చిరకాలము ననే దేశీయ చ్ఛందోబద్ధములగు రచనలు—విజయ గీతములు—ప్రేమ గీతములు మొదలగునవి ప్రోవు చేయఁబడి గ్రంథరూపమును దాల్చుటయుఁగూడఁ దటస్థించినది. ఇంతేగాక తమిళ భాషాలక్షణమును అందలి ఛందస్సాహిత్య లక్షణమును గూర్చిన యుద్గ్రంథ మొకటి తొల్కాప్పియ మనునది యానాటికే యా భాషలో బయలుదేరుట చే, నీ భాషా సాహిత్యములంతకుప్రార్వము చిరకాలమునుండి దేశమున స్థిరపడి యుండెననుటకు సందేహింపవలసిన పని లేదు. తొల్కాప్పియ మను లక్షణగ్రంథము సంస్కృత భాషా వ్యాకరణ సంప్రదాయముల ననుసరించి రచింపఁబడినదేయైనను ద్రావిడభాషా సాహిత్యముల విశిష్ట లక్షణములను చక్కగా వ్యక్తీకరించునదై యున్నది.

అందు ఎళుత్తు, శొల్, పొరుళ్—అను పేరఁబరగు మూఁడధికారములు గలవు. మొదటిదానిలో సంజ్ఞా వర్ణ సంధి ప్రకరణములు గలవు. రెండవది పదాధికారము. పద లక్షణము—విభాగము, నామవిభక్తి—క్రియా విభక్తి ఆగమములు—నిపాతలు మొదలగువానినిగూర్చి తెలుపును.

ఈ రెండును భాషాలక్షణమునకు సంబంధించినవి. ఇక మూఁడవది పొరుళధికారము కావ్య వస్తువునుగూర్చినది. శృంగారవీరరసములు-బాహ్యాభ్యంతర వస్తువులు-నాయికా నాయకులు— దేశ కాలపరిస్థితుల కనువైన వస్తు చిహ్న రూపములగు కవి సమయములు, ఛందోలంకారములు, వీని—

గూర్చి వివరించునది పొరుళధికారము. దీనినిబట్టి ద్రావిడ భాషా వ్యాకరణములన్నిటిలోను నతి ప్రాచీనమని చెప్పఁదగిన యీ తొల్కాప్పియమను తమిళ లక్షణ గ్రంథము భాషా వ్యాకరణ చ్ఛందోలంకారములనుగూర్చి తెలుపు గ్రంథమని తెలియుచున్నది. తమిళమున బయలుదేరిన యీ లక్షణ గ్రంథరచనా సంప్రదాయమే తరువాత తెలుఁగు లక్షణ గ్రంథములలోఁగూడఁ గానవచ్చుచుండుటయే విశేషము. వీనిని సరిపోల్చి చూచినచో వీనికి మూలములగు సమాన సంప్రదాయములను గనిపెట్టుట కవకాశము కలుగవచ్చును. భాషావిషయమున వలెనే ఛంద స్సాహిత్య రీతుల విషయమునను సంస్కృత సంప్రదాయములు తెలుగు కన్నడము లలోవలె తమిళమునఁ బ్రవేశించినట్లులేదు. అక్షరగణబద్ధము లగు సంస్కృత వృత్తములుగాని, సంస్కృత కావ్యపద్ధతి నష్టాదశవర్ణనలు, గర్భబంధ కవిత్వరీతులు మొదలగున వంద వలంబింపఁబడలేదు. ప్రాచీన కవిత్వమంతయు మూఁడేసి నాలుగేసి దేశీయ చ్ఛందోగణములు గల మూడేసి—నాలు గేసి పాదములతోఁగూడిన పద్యములుగలది. "కురళ్" గ్రంథము మూడేసి పాదముల పద్యములతోఁ గూడినదే. షట్పదులు, అష్టపదలు మొదలయినవానివలె మరికొన్ని 6, 8, 10, 12 పాదములతోఁ గూడినవియుఁ గలవు. పురనానూరు, అగనానూరు కావ్యములు—వీరగీతములు—ప్రేమ గీతములు ప్రధానముగాఁ గలవి. "కురళ్" కావ్యము నీతిగీత ములతోఁ గూడినది. తరువాత ఆళ్వారుల కాలములో భక్తి గీతములు ప్రబలినవి. క్రీ. శ. 7, 8 శతాబ్దుల కాలమున

పెరుందేవనార్ అను కవిచే భారతము దేశీయంబగు "వెంబా" పద్యములలో రచింపఁబడినది. క్రీ. శ. 10, 11 శతాబ్దుల కాలములోఁగాని "జీవక చింతామణి" వంటి కావ్యముల రచన వాడుకలోనికి రాలేదు.

సుమారు ఈ ప్రాంతముననే కన్నడమునను తెలుఁగు ననుకూడ కావ్యరచన ప్రారంభమైనది. కాని తమిళము నందలి రచనలకును తెలుఁగు కన్నడలములందలి రచనలకును ముఖ్యభేదమొకటి కలదు. ఈ భాషలలో కావ్యరచన ప్రారంభమగునప్పటికే సంస్కృత సాహిత్యానుకరణము ప్రబలిన సూచనలు కనఁబడుచున్నవి. క్రీ. శ. 7, 8, శతాబ్దములనాటికే సంస్కృత వృత్తములు—సంస్కృత సాహిత్యాలంకారిక రీతులు కన్నడ కవితయందు ప్రవేశించినవి. క్రీ. శ. 8–వ శతాబ్దినాటి శ్రావణ బెళగోళ శాసనములోనే "స్రగ్ధరా" వృత్తములో రచింపఁబడిన కన్నడ పద్యము గ పడుచున్నది. 9–వ శతాబ్దిలో దండిభామహాదుల యాలంకారిక లక్షణము ననుసరించి రచింపఁబడి, రాష్ట్రకూట ప్రభువగు నృపతుంగుని మూలముగ ప్రచారములోనికిఁ దేఁబడిన "కవిరాజ మార్గ" పద్ధతియే కన్నడ శిష్ట కవితా పద్ధతియై వెలసినది. 10–వ శతాబ్దిలో నాగవర్మ రచించిన ఛందోంబుధిలో సంస్కృత వృత్తముల ప్రశంసయే ప్రాధాన్యమును వహించినది. కాని దేశీయ చ్ఛందముల కట్టి ప్రాధాన్యము లేదు. వీని ననుసరించియే యీ శతాబ్దియందు పంపాదులు భారత కథను చంపు పద్ధతిని ప్రబంధములుగా

రచించినారు. వీరి జైన పురాణముల రచనయంతయు మార్గ పద్ధతిని అనఁగా, సంస్కృత వృత్తములు, తత్సమ బహుళం బగు భాష ప్రాధాన్యము వహించిన గద్యపద్యాత్మకమగు చంపూ కావ్య పద్ధతి ననుసరించి రచింపఁబడినదే.

12–వ శతాబ్ది మొదలు బసవాదులు తమ మతమును సంకీర్తలోకమునఁ బ్రబలిన జైన బ్రాహ్మణమతములకు పోటీగా జనసామాన్యమున వ్యాపింపఁజేయవలసినవారగుట చేత, వారికి సుబోధంబగు రచనారీతి నవలంబింపవలసినవారైనారు. కావుననే లింగాయతవాఙ్మయ మంతయు – వచనములు, రగడలు, షట్పదులు, సాంగత్యము మొదలగు – దేశీయ రచనా ఫక్కి ననుసరించినది. వచన రచన బసవనితోడనే ప్రారంభించినట్లున్నది. షట్స్థలవచనము, కాలజ్ఞాన వచనము, మొదలగునవి తద్రచనలేయని చెప్పుదురు. ద్వారసముద్రము రాజధానిగా నేలిన బళ్ళాలరాజుల కాలములో హరీశ్వర కవి శివగణద రగడయును, కెరెయ పద్మరస—"దీక్షాబోధె" యను రగడయును రాఘవాంక కవి సిద్ధరామపురాణ, హరిహర మహత్వములను షట్పదీ కావ్యములను రచించియున్నారు. షట్పదీ కావ్యరచనకీ రాఘవాంక కవియె మొదటివాఁడు. ఈ షట్పదీ రగడలను క్రీ. శ. 10–వ శతాబ్దిలోనే నాగవర్మ తన ఛందోంబుధిలో కన్నడ దేశిచ్ఛందములక్రింద చెప్పి వాని లక్షణమును దెలిపినాఁడుగాని, ఆ రచన లెచ్చుటను ఆ కాలమున గానరాలేదు. నృపతుంగుని కాలమున వేయఁబడినట్టియు—పంపాదు లనుగమించినట్టియుఁ కన్నడ కవిరాజమార్గమగు "మార్గకవితాఫక్కి" యా దేశ

మున ప్రాశస్త్యమును జెందుటచే నీ దేశి కవితామార్గములు మాసిపోయినవి. రైలుమార్గములు వచ్చిన వెనుక నాటు మార్గములు మాసిపోయి పూడిపోవుచుండునుగదా.

ఇట్లు మార్గ కవిత కవిరాజమార్గమై కన్నడదేశమున వెలసినపిదప, నా దేశమున దేశి కవితామార్గము మాసిపోవుటచేతనే, చాళుక్యరాజాదులు పలువురీ యంధ్ర విషయమున తెలుఁగు భాషలో దేశి కవితను పుట్టించి పెంపొందించి తెలుఁగు రచనలని యంధ్ర విషయమున నిలుపబెట్టినారు. తెలుఁగుదేశమున నన్నయకుఁ బూర్వము దేశీయ చ్ఛందో రీతులలో రచింపఁబడిన పద్యములు—తరువోజ, అక్కరలు, సీసములు, గీతములు, శాసనములలోనైనను కనఁబడుటకును, కన్నడదేశ శాసనములలో నేడవ శతాబ్దినుండియు స్రగ్ధరాది సంస్కృత వృత్తములేగాని దేశీయవృత్తములు గానరాకుండుటకు నదియే ముఖ్యకారణము. ఈ దేశీయ చ్ఛందో రీతులు కన్నడమునను వ్యవహారములోనే లేవనుటకు వీలులేదు గదా. ఏమనఁగా ఛందోంబుధిలో నాగవర్మ వీనికి లక్షణము చెప్పియేయున్నాఁడు. అంతకుమున్నే కవిరాజ మార్గమున అప్పటికే ప్రాచీన కావ్య భేదములని పేర్కొనఁబడిన చత్తాణె, బెందడె అనువానిలో రెండవది కందముతోపాటు అక్కర, గీతికె, తివది మొదలగు దేశీయ రచనలతోఁ గూడినదిగాఁ జెప్పఁబడియే యున్నది. కావున దండిభామహాదుల ననుసరించి వేయఁబడిన కన్నడ మార్గపద్ధతి రాజమార్గమగుటచేతనే దేశి పద్ధతి యంతరించినదని తలంపక తప్పదు. తెలుఁగులో నన్నిచోడునివలెనే పంపాదులు

దేశినికూడ స్మరించి కొంత దేశి సంప్రదాయమును మార్గ పద్ధతిలోఁ జేర్చినను, కేవల దేశి రచనాపద్ధతి మరుగువడియే పోయినది. లింగాయతము వీరశైవముప్రబలిన వెనుకగాని మరల కన్నడాంధ్రములందీ యచ్చదేశి రచనలు బయలు వడుట తటస్థించినదికాదు. కన్నడ దేశమున బయలుదేరిన యీ వీరశైవము తెలుఁగు దేశమున గూడ వ్యాపించిన తోడనే పాల్కురికి సోమనాథుఁ డిక్కడ దీనికి పట్టుగొమ్మ యయినాఁడు. కన్నడమందువలెనే తెలుఁగునను దేశీయ చ్ఛందోభేదమై ప్రచారములోనున్న రగడ రచన నతఁడును కన్నడ కవులవలెనే చేపట్టి-బసవరగళె, సద్గురురగళె, చెన్నబసవస్తోత్రద రగళె, అనువానిని కన్నడ భాషలోనే రచించినాఁడు. కన్నడమునందలి వచనములను బోలిన గద్యలను, అక్షరాంక గద్య, నమస్కార గద్య, పంచ ప్రకార గద్య అను వానిని గూడ తెలుఁగున రచించి నాఁడు. ఇంతేగాక కన్నడదేశమునఁ బ్రచారములోఁ గానరాక తెలుఁగు దేశమున మాత్రమే నిలిచియున్న వనఁ దగిన దేశీయ చ్ఛందములోని ద్విపదోదాహరణ సీస రచనా రీతులనుగూడ నతఁడు గ్రహించి, బసవపురాణ పండితా రాధ్య చరిత్రలను ద్విపద కావ్యములను, చెన్నమల్లుసీసము లను సీసపద్య రచనను తెలుగుభాషలోను, బసవోదా హరణమును తెలుఁగు సంస్కృతములలోను రచించి నాఁడు. ఈ ఉదాహరణ మనునది రగడభేదములగు కళికో త్కళికలతోడను, విభక్త్యంతములు, సార్వవిభక్తికములు నగు శార్దూలచంపకాది వృత్తములతోడను గూర్పఁబడిన

కన్నడ బెదెండె వంటి, కలగాపులగపు రచనయే యైనను దీనిని తెలుఁగులోనేగాక, సంస్కృతభాషలోఁగూడ సోమనాథుఁడు రచించుట మిగుల విచిత్రమైన విషయము. సంస్కృత పండితులకు గూడఁ దన దేశిరచనా పాండిత్యమును చవిజూపఁ దలఁచినాడేమో! దీనివలన జనసామాన్యమున మతోద్బోధము కలిగింప నెంచిన వీరశైవ మతము కారణముగా, కన్నడాంధ్ర దేశములలో నంతకుపూర్వము జైనబ్రాహ్మణ మత వాఙ్మయముల మార్గపద్ధతి మూలముగా రూపుమాసి యున్న దేశిరచనారీతు లొక్కమారుగా మరల బయలు వడినట్లు తెలియవచ్చుచున్నది. ఈ దేశిరచనా సంప్రదాయము తెలుఁగు దేశమునకు సహజమే యైనను, తొలుత మార్గపద్ధతికి కన్నడదేశ సంప్రదాయమే మూలమైనట్లు, పిదప 12-వ శతాబ్దిని తెలుగున దేశికి పునరుద్బోధకారణము కన్నడదేశమున బయలుదేరిన లింగాయతమత ప్రచారమే యైన దనక తీరదు.

కన్నడమున హరీశ్వర కవి "పంపాశతకమును" వ్రాసినట్లే తెలుఁగున సోమనాథుఁడు "వృషాధిప శతకమును" వ్రాసి యీ భాషలో శతక కవిత్వమునకుగూడ దారితీసినవాఁడై నాఁడు.

13-వ శతాబ్దిలో జైనులుకూడ నీ దేశి రచనా శక్తి నవలంబింప మొదలుపెట్టినారు. కావుననే శిశుమాయణ కవి సాంగత్యములు, కుముదేందురచిత షట్పదీరామాయణము బయలుదేరినవి. తెలుఁగులో రంగనాథరామాయణమో

ద్విపదరచనయు నప్పుడే బయలుదేరినది. తెలుఁగు ద్విపద రామాయణములో కొన్ని దేశీయములగు నాచారములు కథలు (సులోచనా వృత్తాంతము - లక్ష్మణ దేవర నవ్వు వంటివి) చేరినవేగాని కన్నడ జైన రామాయణమున కథా స్వరూపమే జైన సంప్రదాయానుసారము విశేషముగా మారిపోయినది.

పాల్కురికి సోమనాథుఁడు తెలుఁగులో రచించిన ద్విపద బసవపురాణము ననుసరించియే పదునాలవ శతాబ్దిని (1369) కన్నడ బసవపురాణము షట్పదీ కావ్యముగా భీమకవియను నారాధ్య బ్రాహ్మణునిచే రచింపఁబడినది. ఇదివరకు పెక్కువిధముల కన్నడ కవితారీతులు తెలుఁగు కవితకు మార్గదర్శకము లైనను, ఈ విషయమున తెలుఁగు కవిత కన్నడ రచనకు మూలమే యైనది. విజయనగర రాజగు ప్రౌఢదేవరాయల కాలమున అనఁగా 15-వ శతాబ్ది ప్రారంభమున చామరస కవి అల్లమప్రభు చరితమును "ప్రభు లింగలీల"లను పేర రచించి ప్రౌఢదేవరాయల గౌరవమునకుఁ బాత్రుఁడైనాఁడు. ఈ కన్నడ గ్రంథమే రాయల ప్రోత్సాహముచే తెలుఁగు తమిళములలో ననువదింపఁబడినది. వీరశైవుఁడగు నీచామరసుని బావమరిదియే కన్నడమున షట్పద భారతమును రచించిన కుమారవ్యాస కవి. గురు బసవకవి యను శైవగురువు గురుశిష్యసంవాద రూపమున శైవమత సూత్రములగు "సప్తకావ్య"ములను షట్పదీచ్ఛందమునను, "అవధూతగీతె" యను దానిని గీతములుగను రచించినాఁడు.

విరూపాక్ష రాయని కాలమున వీరశైవమత ప్రచారము విరివిగాఁజేసిన సిద్ధలింగయతి "షట్స్థల జ్ఞానామృత"మను వచన గ్రంథమును రచించెను. కృష్ణరాయల కాలమున మల్లనార్యుఁడు జ్ఞాన సంబంధరు వ్రాసిన తమిళ కావ్యమును "భావ చింతారత్న"మను పేర కన్నడ షట్పదీకావ్యముగ ననువదించినాఁడు. "వీర శైవామృత" మనునది యీ కవి రచించిన మరియొక షట్పదీకావ్యము. ఇది శివుని 25 లీలలను వర్ణించుచు లింగాయత మతాచారములను వ్యక్తీకరించునది. క్రీ. శ. 16-వ శతాబ్ద్యంతిమ భాగమున సర్వజ్ఞమూర్తియని ప్రసిద్ధిగాంచిన పుష్పదత్తుఁడను కవి రచించిన "సర్వజ్ఞపదము" లనునవి దేశీయంబగు త్రిపదీచ్ఛందస్సులో రచింపఁబడియున్నవి.

ఇట్లు దేశీయంబగు పదకవిత్వములో తెనుఁగున ద్విపద రచన వాడుకలోనికివచ్చి నిలిచినట్లే కన్నడమున త్రిపద, షట్పద కవిత్వము ప్రాముఖ్యము వహించినది. తెనుఁగులో త్రిపద వాడుకలోనికే వచ్చినట్లగపడదు. షట్పద రచన కొంత లేకపోలేదుగాని, కన్నడమునవలె షట్పదీకావ్యము లీ భాషలో లేవు. కన్నడ కవు లే కారణముననో ద్విపద రచన నవలంబింపనేలేదు. గీతము విషయమునగూడ కన్నడ "గీతికె"కును తెలుగు "గీతము" నకును లక్షణమునఁ గొంత భేద మగపడుచున్నది. అక్కరల విషయమునగూడ కన్నడాంధ్రముల లోనివానికిఁ గొంత సామ్యము కొంత భేదమును కలదు. ఇవి దేశీయ చ్ఛందమునకు సంబంధించినవే యైనను, ఈ రెండు భాషలలోనుగూడ

తొలి యుగముననే యంతరించినవి. యతిప్రాసల విషయ మునగూడ కన్నడాంధ్రముల కించుక భేదమే కలదు. కన్నడ కవులు సంస్కృత సంప్రదాయమునఁ గలిగిన విచ్ఛేద రూప యతి నవలంబించి దేశీయంబగు నక్షర సామ్యరూపం బగు వడిని విడనాడియు, తెలుఁగు కవులవలెనే దేశీయంబగు ద్వితీయవర్ణ సామ్యరూప ప్రాసమును దప్పక పాటించిరి. ఈ ప్రావళ్లు సహజముగ దేశీయములే యనుటకు తమిళము నందపి మోనై, యదుగై అనురూపమునఁ గానవచ్చుటయే నిదర్శనము. ఇట్లీ దేశీయ రచనారీతులు కొన్ని భాషలలో గొన్నికొన్నియే నిలిచియుండినట్లు తెలియవచ్చుచున్నది.

తొలుదొలుత లింగాయతమతమే దేశి రచనలకు ప్రోద్బలకమైనను, తరువాతికాలమున వైష్ణవాది గ్రంథములును దేశీయచ్ఛందమున రచింపఁబడుచు వచ్చినవి. అట్టి వానిలో కుమారవ్యాస విరచిత షట్పదీభారతము ముఖ్యమైనది. ఇతఁడు దీనిని శాంతిపర్వమువరకు మాత్రమే రచించి యుండుటచే మిగిలిన భాగము క్రిష్ణరాయల కాలమున "క్రిష్ణరాయ భారత"మను పేర తిమ్మణ్ణకవిచే పూర్తి చేయఁబడినది. కుమారవ్యాస భారతమువలె కుమారవర్మ విరచితమగు రామాయణముకూడ నిట్లే కన్నడ భాషలోనికి వచ్చినది. చాటు విట్టలనాథకవి భాగవత పురాణమును రచించెను. ఇట్లీ కృష్ణరాయల కాలమున విజయనగరాస్థానమున వెలువడిన కన్నడ కావ్యములు దేశీయ చ్ఛందోబద్ధములగు షట్పదీరచనలై వెలయఁగా తెలుఁగున ప్రబంధ రచనలు చంపూఫక్కినే వెలయుచుండుట విశేషము.

ఈ విజయనగర రాజుల కాలముననే కన్నడభాషలో ననేకములగు భక్తిగీతములు వైష్ణవ దాసులచే రగడలుగా దేశీయ చ్ఛందముననే రచింపఁబడినవి. ఇవి సామాన్యముగా "దాసర పదగళు" అనుపేరఁ బరగుచున్నవి. ఈ భక్తి గీతముల రచనలో ప్రముఖుఁడు, మిక్కిలి ప్రసిద్ధిగాంచిన వాఁడు పురందర దాసు, పండరపుర నివాసి. ఈతని సమ కాలికుఁడే యగు కనకదాసు "మోహనతరంగిణి" యను సాంగత్యమును, నలచరిత్ర, హరిభక్తిసారము లను షట్పదీ కావ్యములను రచించినాఁడు. తరువాత నీ దాసర పదములను రచించిన వారిలో ప్రముఖులు - విట్టలదాస, వెంకటదాస, వరాహ తిమ్మప్పదాస యనువారలు కలరు.

17-వ శతాబ్ది తుదిభాగమున లక్ష్మీశుఁ డను వైష్ణవ బ్రాహ్మణుఁడు జైమినిభారతమును షట్పదీ కావ్యముగా రచించినాఁడు. ఈ షట్పది రచన కన్నడ వాఙ్మయమునందలి యుత్తమ గ్రంథములలో నొకటిగాఁ బరిగణింపఁబడు చున్నది. పండరిపుర నివాసియగు నాగరస అను నాతఁడు "భగవద్గీత"ను శ్లోకమున కొకషట్పది చొప్పున కన్నడము లోనికనువదించినాఁడు.

అద్వైత మతమును పురస్కరించికొని రచించిన గ్రంథములలో రంగావధూత రచించిన "అనుభవామృత" మను షట్పదీకావ్యము కన్నడభాషలోని ముఖ్య వేదాంత గ్రంథముగా దలంపబడుచున్నది. ఇట్లే షట్పద రచనలు, రగడలు తొలుత లింగాయత మతముతో బయలు దేరినను కాలక్రమమున నన్నిమతముల వారిచే నాదరింపబడి చంపూ

కావ్యముతో సమానమగు-అంతకంటె నెక్కువేయగు నాదర మును ఈ భాషలో గాంచినట్లు తెలియవచ్చుచున్నవి. ఇవియే తరువాత కన్నడ వాఙ్మయమున నొక ముఖ్య శాఖయై ప్రాధాన్యమును బడసినవి.

ఇంక కన్నడాంధ్రములకు సమానమై రెండు భాషల యందును ఇటీవలికాలముననే పొడసూపి వ్యాప్తిగాంచిన దేశి రచనా భేదములలోనిది—యక్షగాన మొకటి.

ఇక్కడ ముఖ్యముగా గమనింపదగిన విషయమొకటి కలదు. ఈ పైని దెలుపఁబడిన దేశి రచనా రీతులన్నియు - సాంగత్యము, రగడ, షట్పది మొదలగునవన్నియు - తాళ లయానుగుణములగు మాత్రాగణబద్ధములగుటచేత, పాట లుగా పాడుకొనుట కనువగు రచనా ఫక్కి గలవై యున్నవి. అక్షరగణ బద్ధములగు సంస్కృత వృత్తములిందుకు పనికి రావు. అవి పాండిత్య ప్రదర్శనమునకు చదువుకొనుటకు మాత్రమే పనికివచ్చును. కావుననే గద్యపద్యాది రచన సర్వజన సామాన్యము గాదని చెప్పి సోమనాథుఁడు జన సామాన్యమున మతవ్యాప్తి కనువగు ద్విపద రచనను సాగించినాడు. శిష్టులు సంస్కృత పండితులు జనసామాన్యము పాడుకొన వీలగు నీ దేశి రచనలను వదలివేసి, సంస్కృత భూయిష్ఠ రచనను సంస్కృత వృత్తములలో రచింప దొడంగుటచేతనే, దేశిరచనా ఫక్కి దేశమున నడుగంటినది. వీనిని గ్రంథరూపమున వ్రాసి నిలువబెట్టువారు లేకపోయిరి. సామాన్య జన ముఖస్థములై యీ పాటలు తరతరములుగా వచ్చినన్ని వచ్చినవి. అంతరించి నన్ని అంతరించినవి. వీనిని

గ్రంథస్థము చేసినవారు లేరు. మార్గపద్ధతిని వీనిని సమన్వయ పరచి శిష్టకవితలో జేర్పగలిగిన కొన్ని రచనలకుమాత్రమే లాక్షణికులు లక్షణము చెప్పిరిగాని దేశీయ వ్యవహారమునఁగల యనేక విధములగు పాటలను కొంత కాలమువరకు వీరు స్మరింపనైన లేదు. కవిజనాశ్రయకారుఁడు కన్నడ చ్ఛందోంబుధిలోవలెనే, పెద్ద వృత్తాధికారమును సంస్కృత వృత్తములనుగూర్చి చెప్పి జాత్యధికారములో తెలుఁగు జాతులనుగూర్చి యల్పముగనే తెలిపినాఁడు. అందు సీస, గీత, తరువోజా క్కరలను, ద్విపద, త్రిపద, చౌపద, షట్పదములను జెప్పినాడు. వీని కుదాహరణములు లేవు. లక్షణపద్యమె లక్ష్యము. చౌపదివలెనే షట్పదికూడ నాలుగు పాదములు గల వృత్తముగనే చూపఁబడినది. రగడ భేదములనుగూర్చి యీతఁడెత్తుకొననే లేదు.

విన్నకోట పెద్దనయు మాత్రాగణ రచనలకుఁ బాత్రములైన జాతులనుగూర్చి చెప్పుచు, సీస, గీత, అక్కర, తరువోజ భేదములను, షట్పది, చౌపది, త్రిపది, ద్విపది, మంజరులను మాత్రమే చెప్పినాఁడు. కాని కావ్యభేదములను జెప్పుటలో మాత్రము ముక్తకాదిచాటు ప్రబంధములను బేర్కొనుచు ఉదాహరణముతోపాటు రగడ నొక కావ్యభేదముగాఁ జెప్పినాఁడు.

"ధరచాటు కృతులలోనం
బరగు నుదాహరణమను ప్రబంధము తద్వి
స్తర లక్షణంబు బరువడి,
బరికింపగఁదగు నశేషభాషా కవులున్"

అని ఉదాహరణమును జేర్కొనినాఁడు. దీనికి తెలుఁగు దేశి రచనలలోఁ గొంత ప్రాధాన్యము కలదు.

చతురశ్రత్ర్యశ్రాది
వితతయతి తాళములుగల దళముల నెల్లన్
గృతగుచ్ఛాను ప్రాసం
బతులితరతి నిలుపఁదగు నుదాహరణలకున్''

అనుటచే నిందలి దళములు తాళగతులపై నేర్పడిన వనియు నవి ప్రధానముగాఁ బాడుకొనుట కుద్దేశింపబడిన వనియు సుస్పష్ట మగుచున్నది. అయితే యీ యుదాహరణ మను చాటు ప్రబంధము కేవలము పాటయూగాక పద్య మునుగాక, కన్నడ బెదండె కావ్యమువలె వృత్తముల తోను. జాతులతోనుకూడ సంఘటింపఁబడిన రచన మైయున్నది. ఏల యనఁగా,

మును శుభగణవర్ణిత బ
గ్వినమాలిని యొండె జండ వృత్తమునొండెం
దనరింపవలయుఁ బ్రథమకు
ఘనకలికాష్టక తదర్ధకలికాయుక్తిన్.

ఈ ప్రబంధానికి ముందుగా ప్రథమా విభక్త్యంత శబ్దములతోఁగూడిన యొక మాలినీ వృత్తమునో, చండ వృత్తమునో - అనఁగా శార్దూలాదులనో రచింపవలెనట. ఆపైని కళికలు - అర్ధ కళికలు రావలెను. ఇట్లే ప్రథమాది విభక్త్యాలంబన పద్యముల నిడగవలయును. మరియు ''కళిక యే తాళమునఁ బరిఘటితయయ్యె నుత్కళికయు దానన

యునుపవలయు'' అని యీ కళికోత్కళికలు తాళగతి ననుసరించినవని చెప్పెనేగాని వీని లక్షణము మాత్రమీతడు చెప్పలేదు. కేవల కళికా సంగతిని గావించిన కృతికిఁ బేరు కల్యాణియగుననియు నుత్కళికలతో మాత్రమే చెప్పిన నుత్ఫుల్లకమగునని, యుదాహరణములలోఁ గల భేదమును దెల్పుచు—

> ''గ్రంథ బాహుళ్యభీరుత్వ కథనమిదియు
> ధరనుదాహరణాది భేదములు పెక్క
> తెలియు బొందెడ.

అని వీనిలో భేదము లనేకములింక గలవని సూచించి వదలివేసినాడు. ఈతడు చెప్పిన సద్గళి, పద్గళి, విద్గళి, కల్యాణి, ఉత్ఫుల్లకముల కే మనకుదాహరణములు దొరకలేదు. పాల్కురికి సోమనాథుడు చెప్పిన ''బసవోదాహరణ'' మొక్కటే యీ కాలపు టుదాహరణ ప్రబంధముల కుదాహరణమగుచున్నది. ఈ దేశీయ రచనలు తాళలయ బద్ధములై పాటల రూపమున నుండుటచేతను, శిష్ట కవులచే నా రూపమున నాదరింపబడక పోవుటచేతను, వారు నలనామగణ బద్ధములుగను నాలుగంఘ్రులు గలవానిగను జేసి మార్గపద్ధతిలోఁ జేర్చుకొని యాదరించిన తరువోజ, సీస, అక్కర, [illegible] తక్కినవాని యునికి మనకు స్ఫుటముగాఁ గనఁబడదు గాని, నన్నయ కాలముననే కోరుమిల్లి శాసనములోని కెక్కిన సంస్కృతభాషారచిత ''రగడ'' భాగమునుబట్టి యా కాలమునకే రగడరచన యీ దేశమున విశేష వ్యాప్తిలో నున్న

జని మనము నిశ్చయింపవచ్చును. కన్నడమున రగడ రచన సాగుచుండెననుటకు నాగవర్మ పేర్కొనుటేగాక, పంపాదులుగూడ వాడియుండుటయే నిదర్శనము. కావున నివి నన్నయకు పూర్వమునుండియు తెలుఁగు కన్నడ దేశముల వాడుకలో నుండెననవచ్చును. రామనాథాదు లుదాహరణ కావ్యమునఁ బ్రయోగించిన కళికలును రగడభేదములే. చతురశ్రత్ర్యశ్రాది తాళములు గల దళములతోఁ గృత గుచ్ఛానుప్రాసంబు గలవనియు, కళిక యే తాళమునఁ బరిఘటితమయ్యె, నుత్కళికయు దానన యునుపవలయు నని యీ కళికల లక్షణమున తాళప్రాధాన్యమును మాత్రము పెద్దన సూచించినాడేగాని, అప్పకవి యేరగడకే తాళమో వ్యక్తము చేసినాఁడు. వృషభగతికి త్రిపుట తాళము. తురగవల్గనమునకు రూపకము,

---

తుద నెడు లఘువులు తొలఁగించి చదివిన
  త్రిపుటకు వృషభగతి పదయుగము
లిలఁగడపల నొక్క లఘువుమానిన జంపె
  మను ద్విరదగతి సమపదయుగము
గురుతు రూపకమునకుఁ దురగవల్గనా
  హ్వయమేకతాళి యా మధురగతికి
హరికినిర్వదినాలు గటతాళమునమాత్ర
  లోలి విశ్రాంతి పద్నాలుగింట
దెలియ నర్ధంబు నర్ధ చంద్రికలు వీట
యక్షగాన ప్రబంధంబు నతుకవచ్చు
రగడ భేదంబులివి యండ్రు రసఁ గవీంద్రు
లవితనిజసేవకస్తోమ యబ్ధిధామ. అప్పకవీయము. 4 ఆ॥

ద్విరదగతికి జంపె, మధురగతికి ఏకతాళి, హరికి అటతాళము. ఈ విధముగ తాళగతులుగలవై మాత్రాగణ బద్ధములైన అర్ధచంద్రికలనే రగడభేదంబులనియందురట. ఈ రగడ భేదంబులనే యక్షగాన ప్రబంధంబులో నతుకవచ్చునట. దీనివలన నుదాహరణములలోని చంద్రికలు అర్ధ చంద్రికలే గాక యక్షగానములలోని పాటలుగూడ రగడభేదంబులే యనియు, నివి యన్నియు తాళప్రధానములగు గేయ రచనలేయనియు నప్పకవి యభిప్రాయమైనట్లు స్పష్టమగు చున్నది. పెద్దన రగడ యనుదానినొక చాటు ప్రబంధ భేదంబుగా మాత్రమే తలచెనుగాని, "దేశి" కవిత్వములో వెలసియున్న యనేక విధములగు పాటలు తాళబద్ధములగు రగడలే యని గుర్తించినట్లగపడదు. గుర్తించినను మార్గ కవితాభిమాన మాతని నీ పాటలు కూడ లక్షణయుక్తములే యని చెప్పుట కాతనిని ప్రోత్సహించియుండదు. ఐనను మాత్రాగణ బద్ధంబేయైన ద్విపద రెండుపాదముల నొక పాదముగాఁ జేసి కల్పింపఁబడిన "తరువోజ" దంపుళ్ళ పాటగా నుపయోగపడుచున్నదే యని యాతఁడు సూచింపకపోలేదు. రగడను ప్రత్యేకచాటు ప్రబంధముగాఁ జెప్పిన చిన్నకోట పెద్దనయు యక్షగానప్రబంధము నెత్తుకొననేలేదు. కాని ఆనాటి కివి లేవనియు దలంపరాదు. మార్గపద్ధతి ప్రబలిన కాలమున వీని నాదరించు ప్రభువులు లేక యివి సామాన్య పామరజన వినోదములుగ నిలిచిపోయినవి. 17-వ శతాబ్దిని నాయకరాజుల యాదరణమును బడయుటచే నవి యాస్థాన రంగస్థలమునకెక్కి గ్రంథస్థములై నిలిచినవి. శ్రీ

శైలమున నేకాదశినాటి రాత్రి జాగరణోత్సవ సందర్భమున పాల్కురికి సోమనచే వర్ణింపఁబడిన బహువిధ నాటకములలో నీ యక్షగానములుకూడ నుండియుండును. తొలి లాక్షణికు లలో విన్నకోట పెద్దనాదులు వీనిని స్మరింపకున్నను చిత్రకవి పెద్దన వివరించిన మధురకవితా రీతులన్నియు నంతకు పూర్వము—నన్నయకు పూర్వముననుకూడ - లేవనిగాని, యాతని కాలముననే యొక్కసారిగా బయలుదేరినవనిగాని తలంపకూడదు. ఆతనికి పూర్వమునగల లాక్షణికులకు, నన్నిచోడ పాల్కురికిసోమనాథుల కవిత్వమందువలెనే, యీ దేశిరచనలయం దాదరము లేకపోయినది. కావున వారు వీనిని గ్రహింపలేదు. లక్షణదీపికాకారునికి దేశికవిత యగు మధురకవితయం దాదరము కలిగినది. అతఁడు దాని భేదములను వర్ణించుటచే నా కాలముననైనను అవి కలవని మనము తలంచుట కవకాశము కలిగినది. కాని యీ మధురకవిత యంతయు తాళలయబద్ధమై జనసామాన్య మున వ్యాప్తిలో నున్న యనేకవిధములగు పాటల రూపము గలదై, కన్నడాంధ్ర దక్షిణదేశీయ సామాన్య సాహిత్య మునకుఁ జేరినదై యున్నది. వీనిలో కొన్ని రచనలు కొన్ని దేశ భాగములందే నిలిచియుండవచ్చును. కాని రగడలు, అక్కరలు, ఏలలు, గీతికలు, త్రిపదషట్పదాష్టపదులు మొదలగునవి కన్నడాంధ్ర సామాన్యములే. మధురకవిత లోని యుదాహరణాది ప్రబంధములలో కళికోత్కళికలు మాత్రమే—అవియు వృత్తములతో గూడి—వచ్చుచుండును. గాని యక్షగానములలో నింక ననేక విధములగు దేశి

రచనలు నిలిచియుండుటయే వీనిలో గల పెద్ద విశేషము. దేశి రచనారీతులెన్నియో వీనియందు చేర్పఁబడియున్నవి. అప్పకవియైనను తాళానుబద్ధములగు కొన్ని రగడ భేదంబులను మాత్రమే తెలిపి వానిని యక్షగానములలో నతుకుదురని చెప్పి యూరకున్నాఁడుగాని యక్షగాన లక్షణమునుగాని స్వరూపమునుగాని వివరింపలేదు. చిత్రకవి పెద్దన తెలుఁగు కవితాభేదములగు ఆశు, మధుర, చిత్ర, విస్తరములను జేర్కొని అందు మధుర కవిత్వంబన్న దానిని వివరించుచు నందు యక్షగానమున వచ్చు దేశిరచనలను చెప్పినాఁడు. దేశీయ కవిత్వము నిట్లు నాల్గు విధములుగలదానిగా విభజించి చెప్పుట 12-వ శతాబ్దిని "పాట్టియల్" అను తమిళ లక్షణ గ్రంథమునందుగూడ గానవచ్చుచున్నది.

మధుర కవిత్వములో పెద్దన—నాటకాలంకారములను జేర్చినాఁడు. నాటకములనేగాక, మరల యక్షగానంబులను వానిని బేర్కొని యుండుటచే, నివి భిన్నజాతులేమో యని యనిపించును గాని, మధుర కవిత్వములో యక్షగానంబున వెలయు పదంబులు దరువులు, ఏలలు, ధవళంబులు, మంగళహారతులు, శోభనంబులు, ఉయ్యాలలు, జోలలు, జక్కులరేకు పదంబులు, చందమామ సుద్దులు, మొదలగు వానిని బేర్కొనుటచే, యక్షగానంబుల వచ్చు నీ పదముల నన్నిటిని దేశి రచనా భేదములుగాఁ జెప్పదలచెనేమో యనియు తలంపవచ్చును. లేదా నీ ప్రదర్శనములలోనే కొన్నిటికి నాటకములని, కొన్నిటికి యక్షగానములని పేళ్లుండి యుండవచ్చును. రుద్రకవి సుగ్రీవ విజయమును

యక్షగానమని, రంగాజమ్మ రచనను మన్నారుదాసవిలాస నాటకమని అన్నారుగదా. కొన్నిటిని ప్రబంధములనుటయు గలదు. పల్లకీసేవా ప్రబంధము, త్యాగరాజ వినోద ప్రబంధము అనునవి, శాహాజీవిరచిత యక్షగానములు తంజావూరు గ్రంథాలయమున గలవు. ఏ పేరనున్నను ఇవన్నియు ప్రదర్శనీయములుగా రచింపబడినవే. అన్నియు చాలవరకు దేశీయములగు ననేకవిధ గేయ రచనలతో కూడినవే. వినిమూలముగనే యనేకవిధములగు దేశి రచనలు సంరక్షింపఁబడియున్నవి. వానిలో ఏలలు, జోలలు, సువ్వాలలు, ఆరతులు, ధవళములు, వెన్నెల పదములు, నివాళి పదములు, తుమ్మెద పదములు, గొబ్బి పదములు, అల్లో నేరేళ్ళు, త్రిభంగులు, ద్విపద, త్రిపద, చౌపద, షట్పదాష్ట పదులు, మంజరులు, జక్కుల రేకులు మొదలగునవి గలవు.

ఇవియన్నియు పాటలుగనే తాళబద్ధములై యేర్పడి జనసామాన్యముచే నిత్య జీవితమునఁ బాడుకొనబడునవి. పాట కనుకూలముగా హ్రస్వ దీర్ఘములు తారుమారగు చుండుటయు సంభవించుచుండుటచే గాబోలు వీనిలో పెక్కింటికి లక్షణమేర్పడ లేదు.

మనకిప్పుడు లభించి ప్రకటింపఁబడియున్న యక్షగానములలో 16-వ శతాబ్దివాఁడగు రుద్రకవి యక్షగానమే మొదటిదిగాఁ గానఁబడుచున్నది. 17-వ శతాబ్దిని నాయక రాజుల కాలములో ననేకములు బయలుదేరినవి. పెక్కు తంజావూరు పుస్తక భాండారములోను, మద్రాసు

ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారములోను గలవు. ఇంకను వీథినాటకములు కురవంజిలు అను పేరుతో నచ్చుపడి నవియుఁ గొన్ని గలవు.

దక్షిణదేశమునందలి యక్షగాన కర్తలలో ఉత్తర రామాయణ కర్తయగు కంకంటిపాపరాజు, గిరిరాజకవి, శివాజియను వారు కలరు. పాపరాజు విష్ణు మాయావిలాస మును, గిరిరాజకవి శాహేంద్ర చరిత్రమును, శివాజి అన్నపూర్ణా పరిణయము—అను యక్షగానములను రచించిరి. వెంకట్రాది వాసంతికా పరిణయమను యక్షగానమును, చంగల్వారాయకవి పారిజాతము, ఎరుకల కథ, సత్యభామ కథ, అనువానిని రచించెను. కామపీడితయగు సత్యయొద్దకు బ్రహ్మ నిజాంగనను కొరవంజివేషంబున బంపుటయు నామె యెఱుక చెప్పి సత్యభామను హర్షమొందించుటయు, రెండవ దానిలోని కథ. మూడవదానిలో రుక్మిణీ సత్యభామల సవతులకయ్య మీా విధముగాఁ గలదు.

"మంచిదీ కానీవె రుక్మిణీ, వేలు, వంచాలేవే సత్య భామినీ,
నాసరీ దానవా రుక్మిణీ, భామ, నీసారివారిలో దెల్పుకో
గద్దారితనములు విడువనే, భామ, సుద్దూలకేమాయె, వేగదే
కొంచాపు గుణములు మానవే,నీ,కొంచాపు వగలెల్లవిడువవే,
కయ్యానికొచ్చిన విధ మేమిాా,నీ గయ్యాళి సుద్దుల భయ మేమిాా
జాతికొద్ది మాటలాడవే, అక్క, నీతిగాదు నోరు ముయ్యవే
మందులమారివే రుక్మిణీ, నీ విందారిలో నిజము చేసుమిాా
చేతులుతిప్పాకె రుక్మిణీ,—మూతులూ తిప్పాకే భామినీ."

ఇక నాటకములని కొరవంజులనియు మఱికొన్ని గలవు. యక్షగానములకు వీనికిని రచనలో విశేష భేదమున్నట్లగపడదు. నాటకములను రచించినవారిలో, విజయరాఘవ నాయకుఁడు (1633–1673), సాజీ, శివాజీ, మన్నారుదేవుఁడు మొదలగు తంజావూరిరాజులే కలరు. విజయరాఘవ నాయకుఁడు కాళీయమర్దనము, పూతనాహరణము, రఘునాథాభ్యుదయము, ప్రహ్లాద చరిత్రము మొదలగు నాటకములనే గాక యింక ననేక దేశి రచనలనుగూడ రచించినట్లే ప్రహ్లాద చరిత్రవలనఁ దెలియవచ్చుచున్నది. ఇరువది ముప్పది నాటకములనేగాక ఫాల్గుణోత్సవరగడ, రాజగోపాల దండకము, వీర శృంగార సాంగత్యము, సంపంగిమన్నారు సాంగత్యము, విన్నపములు, దరువులు, ఏలలు, పదాలు, సంకీర్తనలు, కురవంజి, చౌపదము, జక్కిణి, దురుపదము, చిందు, సవతిమత్సరంబు, మొదలగువానినిగూడ నీతఁడు రచించినట్లు—ప్రహ్లాద కథానాటక చాటు కావ్యంబునఁ జెప్పికొన్నాడు. ప్రహ్లాద చరితమునే త్యాగరాజస్వామికూడ యక్షగానముగా రచించినాడు. "నౌకా చరిత్ర" మను యక్షగానమునుగూడ రచించినాడు. ఇది మద్రాసు యూనివర్సిటీ సంగీతశాఖవారిచే చక్కఁగ ముద్రింపఁబడినది. మన్నారుదేవుఁడు హేమాబ్జనాయికా స్వయంవరమును, మహారాష్ట్ర రాజగు ఏకోజి విఘ్నేశ్వర కల్యాణము, తులజ రాజు శివకామసుందరీ విలాసము, వెంకటపతి సోమయాజి విజయరాఘవ చంద్రికా విలాసము, శాహరాజు – రతీ కల్యాణము, పార్వతీ పరిణయము, వల్లీ కల్యాణము మొద

లగు వానిని రచించిరి. గిరిరాజకవి రచించిన "రాజమోహన కొరవంజి" అనునది శాహమహారాజున కంకితము. ఈ "కొరవంజి" నాటకమున ముఖ్య విషయము, విరహ పీడితులగు నాయికానాయకులకు ఒక యెరుకత వచ్చి ఎరుక చెప్పుట యనునదిగాఁ గనఁబడుచున్నది.

భోసలకుల శాహ భూపాలుమీద
చెన్నుగా మోహిత చిత్తయై రాజ
కన్యకామణి సరి కాంతలు గొలువ
గరిమెతోడుతమున్న కదలివచ్చుటయు
విరహాభరంబుచే వెతలఁజెందుటయు
నెరుకత వచ్చి తా నెరుకజెప్పుటయు
గురుతుగా శాహేంద్రు గూడియుండుటయు
అనియెడి రాజమోహన కురవంజి"

అని యందలి కథాసూత్రము నెరుకపరచినాఁడు కవి. ఈ కొరవంజి యనునది తొలుత కొండలజాతివాళ్లగు ఎరుకలు నివసించు కొండప్రదేశములకుఁ జెందిన నాట్యకథా రూపమై యుండెనేమో. ఈ కురవంజి కన్నడాంధ్రములందే గాక తమిళదేశమునగూడ నిటీవల వ్యాప్తిగాంచియున్న రచనా విశేషము.

తొల్కాప్పియం పొరుళధికారమున తమిళ కావ్య వస్తువు, తద్వర్ణనారీతులును చెప్పఁబడు సందర్భమున— కావ్యములోని శృంగారముగాని వీరరసముగాని యా యా దేశ కాల విభాగమున కనుగుణముగనే వర్ణింపఁబడవలయు ననునదొక కవి సమయముగా నేర్పడుటయేగాక దీని కను

గుణముగాఁ జేయబడిన దేశ విభాగము లయిదింటిలో కొండ
ప్రదేశము "కురంజి" యని పేర్కొనబడినది. ప్రాచీన
తమిళకవి సంప్రదాయప్రకారము దేశ విభాగము కురుంజి,
(పర్వతప్రాంతము), పాలై (మరుప్రదేశము), ముల్లై (అడవి
ప్రదేశము), మరుదం (మాగాణి ప్రదేశము), నెయ్ దల్
(సముద్రప్రాంతము) అని యైదు విధములుగలవై యున్నవి.

ఈ ప్రదేశములందు శృంగార వీర సంప్రదాయము
లగు కథలను వర్ణించునప్పుడు, కొన్ని ప్రత్యేక కవి సమయ
ముల ననుసరించి చేయవలయునను నియమముకూడ కలదు.
ఒక్కొక్క ప్రాంతమునకు చిహ్నములగు రంగు పుష్పములు,
మొదలగునవికూడ తెలుపఁబడినవి. శృంగారము రసమై
నప్పుడు నాయికానాయకుల సమాగమము (పుణర్తల్)
కురంజి అనఁగా పర్వత ప్రదేశములందే జరిగినట్లు, రాత్రి
మొదటిజామున సంఘటిల్లినట్లును వర్ణింపఁబడవలయును.
యుద్ధాదివర్ణనము మొదట గోగ్రహణముతోఁ బ్రారంభింప
బడవలయును. అది కురింజి – పర్వతప్రదేశమందే జరిగినట్లు
సూచింపబడవలె. దాడి వెడలుటకు సంబంధించినది ముల్లై
ప్రదేశము. ముట్టడి (మరుదం) మాగాణి ప్రదేశమున జరిగి
నట్లును, యుద్ధము (నెయ్ దల్) సముద్ర ప్రాంతమున జరిగి
నట్లును, సూచింపవలె. విజయమునకు సంబంధించినది పాలై
(ఎడారిప్రదేశము). ఇక పుష్పములలో ఎర్రని రంగుగల
"వెచ్చి" పూవులు రుధిరస్రావముగల యుద్ధమునకు సూచక
ములుగా వర్ణింపవలె. పసుపుపచ్చని "వంచి" పువ్వులు
అప్రతిహత శక్తి చిహ్నములు. తుంబె–ద్రోణపుష్పములు

కోటను ముట్టడించువారిచే ధరింపబడును. వాహై యను తెల్లని పుష్పములు విజయచిహ్నములు. ఈ కవి సమయము లన్నియు దేశీయములేగాని సంస్కృతాలంకారిక పద్ధతుల కేమాత్రము సంబంధించినవి కావు. కాని యివి యితర భాషలలోనికి రాలేదు. "కురుంజి" — "కురవంజు" లకు సంబంధమేమైన నుండునా?

ఈ విధముగా యక్షగానము, కురవంజి, నాటకము అను నాట్య ప్రదర్శనార్హములగు రచనలుగూడ షట్పదీ ద్విపద కావ్యాది రచనలవలెనే, దక్షిణదేశమున కంతకును సమానమగు "దేశి" సాహిత్య సంప్రదాయ రీతులలోఁ జేరినవే యని మనము నిశ్చయింపవలసి యున్నది.

వీరశైవ మతోద్బోధము కలిగినపిదపనే దేశీయ చ్ఛందో ఫక్కి ననుసరించి రచింపబడిన షట్పదీ సాంగ త్యాది కావ్యములవలెనే కన్నడ భాషలో మరికొంతకాల మునకు యక్షగాన వాఙ్మయశాఖయు బయలుదేరినది. తెలుగున నిట్లే జరిగినది. అంతకు పూర్వమే కన్నడములో పంపాదులు "కవిరాజమార్గ" ఫక్కి ననుసరించి పురాణ ప్రబంధ కవితను కన్నడ భాషలోనికి దింపినట్లే, వారిని జూచియే నన్నయయు సంస్కృత వృత్తాదులను వర్ణనా రీతులను ఆలంకారిక పద్ధతులను తెలుఁగు కవితలోనికి దింపి, భారత రచనను సాగించినతోడనే యిది శిష్ట లోకము నాకర్షించుటచే, దేశీయ రచనలకు తగిన యవలంబనము లేకపోయినది. అవి సామాన్య జనుల

లోనే వ్యాప్తిగాంచియుండినవి. ఈ దేశమునగూడ బ్రాహ్మణ మతమునకు పోటీగా వీరశైవ మతము ప్రబలినపిదప, జన సామాన్యమున నా మతమును వ్యాప్తిగావించుటకై — పాల్కురికి సోమనాథుడు ప్రసన్నమైన జానుదెనుఁగులో ద్విపద రచనను సాగించినాఁడు. దీనినిబట్టి సామాన్య జనా దరణము బడసిన ద్విపద రచనలో-రామాయణాది గ్రంథ ములును బయలు దేరినవి. కన్నడమున షట్పదీ రచన ప్రాధాన్యమును వహించి యొక ప్రత్యేక వాఙ్మయ శాఖ యయినట్లే, తెలుఁగులో ద్విపద రచన ప్రాధాన్యము వహించి-ప్రబంధ శాఖకు భిన్నముగా - నొక ప్రత్యేక వాఙ్మయశాఖగా నేర్పడినది. మార్గపద్ధతి నవలంబించిన కన్నడభాషలోని శిష్ట వాఙ్మయము పంపాదులు తీర్చిన ప్రబంధరచనతోడనే ప్రారంభమైనను, తెలుఁగులో నిచ్చటి దేశ కాలపరిస్థితులనుబట్టి నన్నయకు భారతమందు సంహితా దృష్టియే ప్రాధాన్యమును వహించుటచేత, నామార్గ ఫక్కి-ప్రబంధ రచనారూపము నొందక, పురాణ రచనారూప మునే పొందుట తటస్థించినది. నన్నయకు తరువాత వచ్చిన నన్నిచోడుఁ డా కన్నడ కవుల ప్రబంధఫక్కినే యనుసరించి తెలుగుభాషలోఁ గూడ ప్రబంధశాఖ కంకురార్పణము చేయనే చేసినాఁడు. కాని యందాతఁడు జోడించిన "దేశి" ఫక్కి, యా కాలపు శిష్ట లోకమునకు రుచింపక పోవు టచేఁగాఁబోలు, నీ ప్రబంధ రచనారీతిని వెనుకకు నెట్టివేసి, నన్నయ పురాణ రచనాపద్ధతియే ముందుకు సాగి, తొలి యుగమునంతను పురాణయుగ మను పేరనే బరగుదానినిగాఁ

జేసినది. కాని అంతర్వాహినిగా "ప్రబంధ" దృష్టి ప్రవహింపక పోవుటయు లేదు. తిక్కన భారత సంహితనే ప్రబంధ మండలిగాఁ జేయఁజూచినాడుగదా. ఎఱ్ఱన భారతారణ్యపర్వశేష రచనమూలముననే ప్రబంధపరమేశ్వరుఁ [illegible]కూడఁ జెప్పుకొన్నాఁడు. ఈ రీతిగా ప్రబంధఫక్కి పురాణయుగమున ప్రసిద్ధకవులని చెప్పఁదగిన వీ రిద్దఱిని వెంటాడించుచునే యున్నది. అయినను ఆంధ్రభాషలో "ప్రబంధ" మనునది వెలువడుట కింకను గొంతకాలము పట్టినది. 16-వ శతాబ్దికిగాని ఆంధ్రప్రబంధ స్వరూపము తేటపడలేదు. ఈ నడుమ దేశి ద్విపదశాఖయు చిలువలు పలువలు వేయుచునే వచ్చినది. గౌరన హరిశ్చంద్ర నవనాధచరిత్ర ద్విపదలు శ్రీనాథుని పల్నాటి వీరచరిత్ర మొదలగునవి కొన్ని బయలుదేరి యీ శాఖను పెంపొందించినవి.

17-వ శతాబ్ది ప్రాంతమున దేశ కాలపరిస్థితులకు గలిగిన మార్పు సహాయకారిగా నేర్పడినపిదపగాని దేశి కవిత రాజాదరణమును బడయుట-ద్విపద యక్షగానాది రూపముల మరల విజృంభించుట తటస్థింపలేదు. అనగా 11-వ శతాబ్దిలో నన్నయ పెంపొందించిన మార్గ కవితా మూలముగా వెనుకబడిపోయిన దేశి కవిత 12, 13 శతాబ్దులలో మతవ్యాప్తి మూలమునను, 17-వ శతాబ్దిలో-రాజకీయ పరిస్థితులవలనను-అనగా తెలుఁగువారు విదేశంబగు తమిళ దేశమున నెలకొనిన వారగుటచేతను - అనుకూల వాతావరణము కలుగువరకు మరల తలయెత్తుట కవకాశము కలుగ

లేదన్నమాట. ఈ విధముగా కన్నడాంధ్రములలో మార్గ ఫక్కి ననుసరించిన పురాణ ప్రబంధ వాఙ్మయశాఖలేగాక, "దేశి" పద్ధతి ననుసరించిన - షట్పదీ ద్విపదోదాహరణ యక్షగానాది శాఖలును ఆయా కాలములందు గలిగిన యనుకూల వాతావరణమునుబట్టి యీ భాషలలో వృద్ధినొందుచు వచ్చినవి. కాని తెలుఁగున పురాణ ప్రబంధశాఖలతోడి సమానగౌరవ మితర శాఖలకింకను రాలేదు. వానినిగూర్చి తగినంత పరిశ్రమయు జరుగలేదు. ఇటీవల కొంత ప్రారంభమయినది.

అయితే క్రీస్తు శకారంభముననే తమిళ భాషలో తగినంత వాఙ్మయము, భాషా సాహిత్య లక్షణము నేర్పడి యుండగా, సోదరభాషలేయగు తెలుగు కన్నడములలో నాకాలమునుండియు దేశి వాఙ్మయము లేకపోయెనా? ఏ వాఙ్మయమును లేకపోవుటకుఁ గారణమేమి. ఈ దేశీయులంత వెనుకపడి యుండిరా. ఇప్పటికిని తోడ, కుయి, గాండ్ మొదలగు భాషలవలెనే యివియు నంత యనాగరక భాషలై యుండెనా. లేక యే దేశారిష్టములవలననైన, మత రాజకీయ కారణములచేనైన, బయలుదేరిన వాఙ్మయము నశించినదా? అంతకుపూర్వము వాని స్థితిగతులెట్టివి. వీనినిగూర్చిన ప్రశంస యెంతవరకు గలదు. మన భాషకు ఆంధ్రము, తెలుఁగు అను రెండు పేళ్లు గలుగుటకు గారణమేమి? ఈ మొదలగు విషయములను దెలిసికొనవలెనన్నచో నీ భాషలకు నెలవగు మధ్యదేశీయ పరిస్థితులను కొంత పరిశీలింపవలసి యుండును.

IV

ఆంధ్రము - తెలుఁగు

ఆంధ్రము, తెలుఁగు అను నీ రెండును సహజ సంబంధము లేని శబ్దములే యైనను, ఏకార్థబోధకములే యై మన మీ దేశమున వ్యవహరించు భాషను సూచించునవై యున్నవి. లోకములో నొక మనుజునకుగాని, అతని భాషకు గాని, దేశమునకుగాని తత్సంకేత రూపమగు నొక్క పేరుండుటయే స్వాభావికము. కాని మనకు, మన భాషకు, మన దేశమునకు రెండు పేళ్లుగలుగుట కొంత విపరీతముగాఁ గనఁబడక మానదు. ఇట్టి స్థితియే అఱవము (తమిళము, ద్రావిడము) మొదలగు మఱికొన్నిటి విషయమునఁగూడఁ గనఁబడవచ్చునుగాని, లోక వ్యవహారమున కది సౌకర్యమనికాని, స్వాభావికమనికాని చెప్ప వలనుపడదు. ఇట్లు గలుగుటకుఁ గల కారణముల నించుక పరిశీలించితిమేని మన భాషా సాహిత్యముల యొక్కయు, సంఘముయొక్కయు ప్రాచీనస్థితియుఁ బరిణామక్రమమును కూడ కొంతవరకు బయలుపడక పోవని తోఁచుచున్నది.

భాష యనునది మానవులు తమ హృద్గతాభిప్రాయములను దమ సంఘములోని యితరులకు వ్యక్తపరచుటకై యేర్పరచుకొనిన సంకేతరూపమగు నొక సాధనము. కావున నాయా మానవ సంఘములు, లేదా జాతుల పేళ్లనుబట్టియే వారు నివసించెడి దేశమునకును, వ్యవహరించెడు భాషకును పేళ్లేర్పడుచుండుట స్వాభావికము. ఆంగిలుల దేశ మాంగ్ల

లాండు. అదియే ఇంగ్లాండైనది. వారి భాష ఇంగ్లీషు. పారసీకుల భాష పరిషియన్; దేశము పరిషియా. ఓఢ్రుల భాష ఓఢ్రము. తుళువల భాష తుళు, కోదుల భాష కోదు. ఎరుకలవారిది ఎరుకల భాష. ఒక్కొక్కప్పుడు దేశ నామమును బట్టికూడ నందలి జనులకును, భాషకును పేర్లేర్పడు చుండుటయుఁ గలదు. "సింధు" నదినిబట్టి, లేదా దానికి రూపాంతరమగు "హిందు" శబ్దమునుబట్టి యీ దేశము హిందూదేశమైనది. అందలి భాష హిందీ. మహారాష్ట్రము, శౌరసేనము, మగధ, కర్ణాటము (కఱు+నాడు), మలయాళము (మలై+ఆళం) అను దేశనామములనుబట్టి యేర్పడినవే మహారాష్ట్రి, శౌరసేని, మాగధి, కన్నడము, మలయాళము మొదలగు భాషలు. దక్షిణదేశభాషలలో తమిళము "తమిళ్" అను ద్రవిడజాతివారినిబట్టి యేర్పడినదే. దీనికి "అఱవము" అను నామాంతరముకూడ "అఱువాళర్" అను నొక తెగవారినిబట్టి యేర్పడినది. కాని తమిళ దేశమున గాని, తద్వాఙ్మయమునగాని యీ పేరు వాడుకలో లేదు. ఇది ఉత్తరమున వీరికి సమీపస్థులైయున్న యాంధ్రులచే పెట్టఁబడిన పేరుగాఁ గనఁబడుచున్నది. కాని భాషమాత్ర మొక్కటే. తమిళము, అఱవమువలెనే ఆంధ్రము, తెనుఁగు అను పేళ్లుగూడ నాయా జాతుల నామములనుబట్టి యేర్పడినవే. చిరకాలమునుండి యీ పేళ్లు రెండును దేశపరముగను, భాషాపరముగను నా దేశ జనులచే నభిన్నముగనే వ్యవహరింపఁబడుచున్నవి. కాని యా రెండు తెగలవారు నాదికాలమునుండియు తమిళమువలెనే యొక భాషనే వ్యవహ-

రించిరా, లేక వేర్వేఱు భాషలుగల భిన్నజాతులవారై యుండి, యీ దక్షిణాపథమున నెలకొనినవెనుక నేకజాతివారై యేక భాష నవలంబించిరా యను విషయము విమర్శనీయమై యున్నది. ఐతరేయ బ్రాహ్మణమునందలి కథనుబట్టి యార్యాంధ్రు లార్య సంఘమునుండి బహిష్కరింపఁబడి పుండ్ర పుళింద మూతిబాది తెగలతోపాటు వింధ్య దక్షిణ భాగమున నెలకొనినట్లు తెలియవచ్చుచున్నది. వీరు కాల క్రమమున దక్షిణాపథమును జేరి యందు కృష్ణా గోదావరీ ప్రాంతములందలి యాదిమనివాసులగు తెలుఁగులతో గలిసి, కొంతకాలమునకు కృష్ణానది యొడ్డున నాంధ్రరాజ్యమును స్థాపించిరి. మెజస్తనీస్ కాలమునకే, అనఁగా క్రీస్తుకు పూర్వము మూఁడవశతాబ్దినాటికే యిది అప్పటి మగధ రాజ్యము తరువాతఁ జెప్పఁదగిన ప్రబలరాజ్యముగ నాతనిచే నెన్నబడినది. అశోకుని కాలమున కించుక తరువాతివని తలంపబడుచున్న భట్టిప్రోలు శాసనములలో గృష్ణానదీ ప్రాంతమున "కుబీరకు" డను ఆంధ్రరాజొకఁడు పేర్కొనఁబడియున్నాఁడు. క్రమముగా నాంధ్రులు పశ్చిమ దిగ్భాగమునగూడ వ్యాపించి మగధరాజ్యము నాక్రమించి హైందవ సామ్రాజ్యధురంధరులైరి.

ఇట్లుత్తరదేశీయులగు నార్యాంధ్రులు కృష్ణా గోదావరీప్రాంతమును దమ నివాసముగాఁ జేసికొని యచ్చటి జనులతో గలిసి సామ్రాజ్యపాలకులగుటచేతనే యీ దేశ మాంధ్రదేశమైనది. ఇందలి జను లాంధ్రులైనారు. అప్పటి

యాంధ్రుల ప్రాభవాతిశయముచే నిచ్చటి యాదిమనివాసుల యూరుపేరులు కొంతకాల మంతరించినను ఆర్యాంధ్రులు వచ్చునప్పటి కిది నిర్జనారణ్యముగా నుండెననిమాత్రము తలంపరాదు. బౌద్ధయుగమున నుత్తర దేశమునందలి తామ్రలిప్తి ప్రాంతమునుండి సముద్రమార్గమున దక్షిణ దేశమునకుఁ బోవుచుండిన బౌద్ధయాత్రికులకుఁ గృష్ణానదీ ముఖద్వారమున నాగరాజు లాతిథ్యమిచ్చినట్లు సూచించెడి యమరావతీస్తూప శిల్పమున జిత్రితములగు గాథలనుబట్టి యీ దేశమున నాగ జాతివారుకూడ నున్నట్లు తెలియుచున్నది. ఆ కాలమున భూమిమీదకంటెను సముద్రముమీద ప్రయాణ మెక్కుడు సుకరమై యుండియుండును. ఇక్ష్వాకులనాటి నాగార్జునకొండ శాసనములలో నొకదానియందు వీరపురిసదత్తుని రాజ్య కాలమున 'బుధిణ్ణకు'' ని భార్యయగు ''బోధిసిరి'' యను నామె శ్రీపర్వతమునకు సమీపమున నున్న విజయపురి యందలి ''చులదమ్మగిరి విహారము'' లో నొక 'చెతియఘర' (చైత్యగృహము) నిర్మించినట్లున్నది. అది ''తంబపణ్ణ''— అనగా తామ్రపర్ణి యనఁబడు సింహళమునుండి వచ్చు బౌద్ధ సన్యాసినులకును (థెరీస్), ఇంకను కాశ్మీర, గాంధార, చీన, చిలాత, తోసలి, అపరాంత, వంగ, వనవాసి, యవన, దమిల, పాలూర దేశములనుండి వచ్చు సన్యాసినులకును నివాసముగా నుపయోగపడున ట్లామె యుద్దేశించినదని చెప్పఁబడుటచే నా కాలమున నాయా దేశములనుండి బౌద్ధ సన్యాసినులు ఆంధ్రదేశమునకు వచ్చుచుండెడివారనుట

నిశ్చయము. అప్పటికి జిరకాలమునుండి కృష్ణా నదియొడ్డున నున్న "కంటకొస్సల" (ఘంటసాల) గొప్ప రేవుపట్టణ మైనట్లు తెలియుచున్నది. కావున కృష్ణా గోదావరీనదుల మధ్యప్రాంత మా కాలమున నిర్జనారణ్యమై యుండెననుట కవకాశము లేదు. కాని యప్పటి తెలుఁగువారినిగూర్చిన ప్రశంసమాత్ర మెచ్చటను గానరాదు. బహుశః చిరకాలము క్రిందటనే బర్మాదేశమునకు వలసపోయిన యచ్చటి తైలంగు లనువారును, ఈ దేశమున నిప్పటికి నిలిచియున్న తెలగాణ్య బ్రాహ్మణులు, తెలగాలు అనువారును మాత్రమే యిందా దిమనివాసులగు "తెలుఁగు" జాతివారిని స్మరింపఁజేయుచున్న ట్లెంచవలసియున్నది. ఆంధ్రుల మూలమున నీ తెలుఁగుదేశ మాంధ్రదేశమైన తరువాత పెక్కు శతాబ్దములవరకును దాని ప్రశంస గానరాలేదు. కాని క్రీస్తు శకారంభకాలమున నీ దేశమున కీ నామము కేవల మంతరించిపోయిన ట్లగపడదు. యవన యాత్రికుఁడగు టాలమీ యనునాతడు "త్రిలిం గాన్", "త్రిగ్లిఫాన్" అను పదములచేఁ బేర్కొనిన దేశ మిదియే యనఁదగి యుండుటచే, నాతని కాలమున, కనఁగా క్రీ. శ. ౨-వ శతాబ్దినాటి కీ దేశమున కీ పేరు కొంచెము మార్పుతోనైన నింకను సుప్రసిద్ధమైయున్న ట్లే తలంపనగును. త్రిలింగములనుగూర్చిన కథ పౌరాణికము. తరువాతి కాల మునఁ గల్పింపబడినదే యైయుండును. అట్లే యైనచో టాలమీ ప్రయోగించిన శబ్దములోని తొలి వర్ణము రేఫ యుక్తమగుట యెట్లు సంభవించునను సందేహము కలుగ వచ్చును. తైలంగులు, తెలగాలు, తెలింగానా, తెలుగు

మొదలగు శబ్దములనుబట్టి ''తెలుఁగు'' అనుపదే తొలి రూపమై యుండినను, ఆ కాలమునందలి సంస్కృత పండితులు దీనిని సంస్కృతీకరించి యీ దేశీయ శబ్దమునకు స్వభాషానురూపమగు రూపమును, వ్యుత్పత్తిని గల్పించియుందురనుటకు సందేహము లేదు. అట్టి రూపమే వారిమూలముగా ''టాలమీ''కి జేరియుండవచ్చును. కృష్ణానదికి ప్రాచీననామము ''మైసోలాస్'' అని యున్నట్లగపడుచున్నది. తత్ప్రాంత దేశము ''మైసోలియా.'' అదియే ''మచిలీపట్టణ''మైనది. ''మై'' శబ్దమునకు ద్రావిడభాషలలో నలుపర్థము. దీని సంస్కృతీకరణము మూలముననే యీ నది ''కృష్ణ''యై యుండును. ప్రాచీన కాలములలో నిది ''కృష్ణబేణ్ణా'' అని పేర్కొనఁబడియుండగా తరువాత ''కృష్ణవేణి'' యైనదిగదా. ''గోదావరి'' అను శబ్దములోని రెండవభాగము కావేరి, పొన్నేరి, పెన్నేరి (పెన్నార్), పాలార్, అడైయార్ మొదలగు నదీ నామములలోని రెండవ భాగమువలెనే, ''ఆర్''అను ద్రావిడ (తె. ఏరు) శబ్దమే. కాని యది సంస్కృతీకరణము మూలముగా ''వరి'' అని మారినది. ఇట్లు ప్రాచీనకాలమున సంస్కృతపండితులు మ్లేచ్ఛభాషా శబ్దములనుగూడ సంస్కృతీకరించి సంస్కృత శబ్దానురూపములగు వ్యుత్పత్తులను గల్పించి వాని యర్థము నెట్లు సాధింప యత్నించుచుండిరో కుమారిల భట్టు తంత్ర వార్తికమున ద్రావిడభాషా శబ్దముల నుదాహరణముగా

గ్రహించి వివరించియేయున్నాడు.† త్రిలింగశబ్దము నట్టి సంస్కృతీకరణము మూలముగా నేర్పడిన శబ్దమనియే తలంపనగును.

మొత్తముమీద టాలమీ తరువాత చిరకాలమువరకు నీ దేశమునకును, నిందలి జనులకును, వారి భాషకునుగూడ నాంధ్రశబ్ద వ్యవహారమే ప్రబలుటచేత తెలుఁగుశబ్ద వ్యవహార మంతరించినదనియే చెప్పవచ్చును. క్రీ. శ. ౪-వ శతాబ్ది ప్రాంతమందలి యువమహారాజ శివస్కందవర్మ మైదవోలు శాసనములో నీ దేశ ''మంధపథ'' మనియే పేర్కొనబడినది. (అంధాపథీయగామో విరిపరదత్తం). భరతుఁడునాట్యప్రయోగమున కిరాతాంధ్రద్రవిడాది జాతుల విషయమున వారివారి భాష ప్రయోగింపగూడదనియు, శౌరసేని ప్రాకృతమే సమాశ్రయింపఁదగినదనియుఁ జెప్పినాడు. కాని ఒకప్పుడిచ్చవచ్చినచో ద్రావిడాదిజాతులకు ద్రావిడియుఁ బ్రయోగింపవచ్చునన్నాడు. దీనినిబట్టి ఆంధ్రము, ద్రావిడము ననునవి శౌర

† ''తద్యథా ద్రావిడాదిభాషాయామేవ తావత్ వ్యంజనాంతభాషాపదేషు స్వరాంత విభక్తి స్త్రీ ప్రత్యయాది కల్పనాభిః స్వభాషానురూపానర్థాన్ ప్రతిపాద్యమానా దృశ్యంతే. తద్యథా-ఓదనం ''చోర్'' ఇత్యుక్తే చోరపదవాచ్యం కల్పయంతి. పన్థానం ''అతర్'' ఇత్యుక్తే ''అతర్'' ఇతికల్పయిత్వాహుః. సత్యం దుస్తరత్వా దతర ఏవ పన్థా ఇతి. తథా ''పామ్'' శబ్దం పకారాంతం సర్పవచనం అకారాంతం కల్పయిత్వా సత్యం పాపఏ వాసా వితి వందతి......తద్యథా ద్రావిడాదిభాషాసు ఈ దృశీ స్వచ్ఛందకల్పనా తదా పారసీక బర్బర యవన ,రౌమకాది భాషాను కిం వికల్ప్య కిం ప్రతిపత్స్యంత ఇతి నవిద్మః''.

పైన్యాదులకంటె భిన్నములైన ప్రత్యేక భాషలని వ్యక్త మగుచున్నది. కుమారిలభట్టు దేశభాష నాంధ్రమనియే పేర్కొనినను, నిది ద్రావిడభాషకంటె భిన్నమనియు, నీ రెండునుగూడ నార్యభాషలలోనివికాక మ్లేచ్ఛభాషల లోనివనియుఁ దెలిపియున్నాడు. ఇట్లుత్తరదేశమునుండి యార్యాంధ్రులు దక్షిణాపథమునకు వచ్చి తెలుంగుదేశమున [illegible] తెలుఁగు లాంధ్రులలోఁగలిసి యాంధ్రు లైనట్లే తెలుఁగుదేశ మాంధ్రదేశమైనది. ఆంధ్రరాజులు వారి శాసనములలోమాత్రమే ప్రాకృతము నవలంబించినను, నిత్యవ్యవహారమున నీ దేశీయభాషనే యవలంబించిరన్నచో భాషావిషయమునగూడ నీ యభిన్నత్వ మా కాలముననే యేర్పడిన దనవచ్చును. కాని కొందఱిటీవల తలంచినట్లుగా నాంధ్రరాజుల శాసనములలోని భాషయే యాంధ్రమనియు, దాని పరిణతరూపమే యిప్పటి మన తెనుఁగనియు నెంచి నచో నీ విషయ మింకను బరిశీలింపదగియుండును. అంతకుఁ బూర్వము మాట యెటులున్నను నన్నయభట్టు కాలమునకు మాత్ర మీ రెంటికి నభిన్నత్వమేర్పడినదనుట స్పష్టముగదా. నందంపూడి శాసనమున నీతఁడు నారాయణభట్టు నాంధ్ర భాషా కవీశ్వరుడని చెప్పుటయు, నీతనిని రాజరాజనరేంద్రుడు భారతమును ''దెనుఁగున రచియింపు''మనగా నీ నన్నయ భట్టు తెనుంగునన్ మహాభారతసంహితా రచనబంధురుఁ డగుటయు నిందుకు నిదర్శనములు. తిక్కనయు నాంధ్రావళి మోదముం బొరయునట్లు ''పదునేనింటి దెనుఁగుభాషనే'' రచియించెను. నన్నయకు బూర్వ మీ భాషను ''తెనుఁగ''ను

పేరుతో స్మరించినవా రెవరు నున్న ట్లగపడదు. నన్నయయు నంతకుఁబూర్వ మీ భాషస్థితి గతులను గూర్చి యేమియు తెలుప లేదు.

క్రీస్తు శకారంభమునుండియు నాంధ్రరాజుల కాలములో నీ మధ్య దేశమున ప్రాకృతభాష కే ప్రాధాన్యము కలుగుటచే దేశభాషలు వెనుకబడిపోయినవి. క్రీ. శ. ౪-వ శతాబ్దివఱకును ప్రాకృతభాష, బౌద్ధమతము నీ దేశమున విశేషవ్యాప్తి గాంచియున్నవి. అటుపిమ్మట వైదిక మతమునకును, సంస్కృత భాషకును ప్రభావము హెచ్చినది. కావుననే యీ దేశమున నైదవ శతాబ్దినుండి బయలుదేరిన పల్లవ, శాలంకాయన, విష్ణుకుండిన రాజుల శాసనములన్నియు సంస్కృతభాషారచితములే యై కనఁబడుచున్నవి. రాజాదరణయు సంస్కృత కవిత కే. దేశభాష, దేశి రచనలు సామాన్యజనుల నోళ్ళలో నిలిచినవేగాని, వానికి స్థిరరూపమును దాల్చుట కవకాశము కలుగ లేదు.

ఈ స్థితి సుమా రేడవశతాబ్దివఱకు సాగినది. కాని రాష్ట్రకూటులు చాళుక్యరాజులు దక్షిణాపథమున ప్రభుత్వము వహించినప్పటినుండియు సంస్కృత భాష నాదరించినను దీని ప్రాబల్యము మూలమున దేశమున వెనుకఁబడియుండిన దేశి కవితను లేవనెత్తి, దేశభాషలలోఁగూడ తమ శాసనములను రచింప మొదలు పెట్టినారు. కన్నడదేశమున సంస్కృత భాషాలంకారచ్ఛందస్సంప్రదాయముల ననుసరించిన మార్గ కవిత 8-వ శతాబ్దికే పొడసూపినది. 9-వ శతాబ్దిలో రాష్ట్ర

కూటరాజుల ప్రోత్సాహమున కవిరాజ "మార్గమే" యేర్పడినది. కాని యాంధ్రదేశమందు మాత్రము తూర్పు చాళుక్యరాజులు పలువురు "దేశి" కవితకే ప్రోత్సాహమిచ్చి దానిని తెనుఁగున నిలిపినారు.

ఇట్లిటీవల బయలువడిన చాళుక్యరాజుల తెలుఁగు శాసనముల మూలముగా, రాజనరేంద్రుని ప్రోత్సాహముచే నన్నయచేతనే సృష్టింపబడెనని కొందరచేఁ దలపబడుచుండిన తెలుఁగుభాషయొక్క ప్రాచీనత క్రీ. శ. ఏడవ శతాబ్ది ఆరంభమువఱకు బోవుచున్నది. అంతకుఁబూర్వము రెండుమూఁడు శతాబ్దముల వఱకు గల శాసనము లన్నియు సంస్కృతభాషలోను ఇంకను వెనుకటి శాసనములు ప్రాకృతభాషలోను రచియింపబడి యుండుటచే నేడవ శతాబ్దికి బూర్వము తెనుఁగుభాషయొక్క స్థితిగతులను గూర్చి తెలిసికొనుట కాధారమేమియు గనబడుట లేదు. దాని యూరుపేరుల నెచ్చటను గానము. అవి రెండు నాంధ్రములోనే లీనమైపోయిన ట్లున్నవి. ఈ కాలమున శ్రీకాకుళమందలి తెల్గువల్లభుఁడుకూడ నాంధ్రవల్లభుఁడుగనే యణిఁగి మణిఁగి యుండెనే కాని, ౧౬-వ శతాబ్దమున విజయనగర సామ్రాజ్యాధీశ్వరుఁడగు తెనుఁగురాయలు తనను దర్శించువరకు "దేశంబు తెలుఁగేను, తెలుఁగువల్లభుండ" నని తన నిజస్వరూపమును బ్రకటించుకొని "దేశభాషలందు దెలుఁగు లెస్స" యని చాటలేకపోయినాడు. కాని ఏడవ శతాబ్దికి బూర్వము తెలుఁగుదేశ మాంధ్రదేశమున లీనమైనదని చెప్పగలిగినట్లుగనే తెలుఁగుభాష ఆంధ్రమున

లీనమైనదని చెప్పఁగలుగుటకు పూర్వము అప్పటి ఆంధ్రభాష యొక్క స్వరూపమేదో మనము నిర్ణయింపవలసి యుండును. ఆంధ్రరాజుల శాసనములలోని ప్రాకృతభాషయే యా కాలపుటాంధ్ర మని తలంచినచో, నేడవ శతాబ్దమునాటి చాళుక్యరాజుల శాసనములలోని తెలుఁగు, ఆంధ్రరాజుల శాసనభాషయగు నా యాంధ్రమున లీనమైనదనికాని, యీ రెంటికి నభిన్నత్వ మేర్పడినదనికాని చెప్పుటకు వలనుపడదు. కాని యాంధ్రరాజు లాకాలమున దేశమందలి బౌద్ధమత ప్రాబల్యమువలన ప్రాకృతభాషకుఁ గలిగిన విశేష వ్యాప్తిని బట్టి దాని నీ కాలపు టింగ్లీషువలె రాజభాషగా గ్రహించి, వారికి దానియందుగల యభిమానముచే శాసనములను మాత్ర మా భాషలో రచించియుండిరేకాని ఆ కాలమున నాంధ్రదేశీయులగు జనులతోపాటు నిత్యవ్యవహార మంతయు దేశీయమగు తెనుఁగుబాసనే నడపుచుండిరని తలంచినచో, తెలుఁగున కాంధ్రముతో నభిన్నత్వ మప్పటినుండియే కలిగెనని చెప్పవచ్చును. అనఁగా ఆంధ్రు లీ దేశమునకువచ్చి యందలి జనులతోఁగలిసి, వారి కాంధ్రత్వమును గలిగించి నట్లే యీ దేశభాషను దాము చేబట్టి దాని కాంధ్రత్వము కలిగించినవారని చెప్పుట కవకాశము గలుగును. భరతుడు, కుమారిలభట్టు, హ్యూయెన్‌త్సాంగ్ మొదలగు వారీయాంధ్ర మునుగూర్చి వారివారి కాలములఁ జెప్పినదానిని బట్టి చూడగా వారీ యాంధ్రమును ప్రాకృత భాషలకంటె భిన్నమైనట్లును, మ్లేచ్ఛభాషగాఁ గూడఁ బరిగణించినట్లును తెలియ వచ్చుచునేయున్నది. కావున తెలుఁగున కాంధ్ర

ముతో నభిన్నత్వము గ్రహించినపుడు ఆంధ్రము ప్రాకృత మునకంటె భిన్నమనియే గ్రహింపవలయును. కావున తెలుఁగుభాషయొక్క ప్రాక్తన స్వరూపమును దెలిసికొని దాని చరిత్ర నింకను వెనుక కన్వేషింపవలెనన్నచో నాంధ్ర రాజుల ప్రాకృత శాసనములలోని భాష యీ విషయమున నిరుపయోగము కాకమానదు.

ఇక ప్రాచీనాంధ్రరాజులు తమ శాసనముల నుపయోగించిన ప్రాకృత భాషయే యీ దేశమున నా కాలమున నిత్యవ్యవహారములో నుండిన యాంధ్రభాష యని చెప్పువారు ఏడవశతాబ్దికి బూర్వమాంధ్రమున శాసనములేమియు గనఁబడకుండుటచే నా కాలమునందలి చాళుక్య శాసనముల లోని తెలుగుభాష యా ప్రాకృతాంధ్రముయొక్క పరిణత రూపమే యనియు, తక్కిన ప్రాకృతములతోపాటు ఈ యాంధ్రము నార్యభాషాజన్యమగుటచే దెనుఁగుభాషకూడ నార్యభాషాజన్యమే యనఁదగుననియు వాదింతురు. కాని చాళుక్య శాసనములలోని తెలుఁగు ఆంధ్రరాజుల శాసనములలోని ప్రాకృతభాషతో నభిన్నమనికాని, తత్పరిణత రూపమనికాని, చెప్పుట యెంత యసమంజసముగాఁ గనబడునో వాని నించుక సరిపోల్చిచూచిన వారికి వ్యక్తము కాకపోదు.

ఆంధ్రరాజులనాటి యమరావతీస్తూప శాసనము:—

"సిధం రనో వాసిఠీపుతస సామిసిరిపులుమావిస సవచ్ఛరె......పిండసుతరియాణం కహుటతర గహపతిస పురిగహపతిసచపుతస ఇసిలస సభాతుకస సభగినికస నాకాని

యస ప్రతకస భగవతొ మహాచెతియె చెతికియానం నాకా (య)స పరిగహె అపరదారె ధమచకం దెధమ్మం ఠాపిత.''

ఇందలి శబ్దములేకాక విభక్తి ప్రత్యయములు, క్రియా రూపములు, వాక్య నిర్మాణపద్ధతి యంతయు సంస్కృత భాషకు ఛాయయే యనుట యీ క్రింది ఛాయవలన బోధ పడగలదు.

''రాజ్ఞోవాశిష్ఠీ పుత్రస్య స్వామి (శ్రీ)పులమావి(స్య) సంవత్సరే...ఇసిలస్య (ఋషిలకస్య) సపుత్రకస్య, సభ్రాతృకస్య...దేయధర్మచక్రం అపరద్వారేస్థాపితం.''

క్రీ. శ. నాల్గవశతాబ్ది మధ్యభాగమునను పల్లవరాజు శివస్కందవర్మ కాంచీపురమునుండి చేసిన యాజ్ఞప్తి శాసనము ప్రాకృతముననే కలదు :—

''కాంచీపురతొ యువమహారాజొ భారదాయస గొత్తొ పలవానం సివఖందవమ్మొ ధమ్మఖడెవాపతం ఆనపయతి. అంధాపతీయగామొ......విరిపరం అంహేహి ఉదకాదిం సంపదతొ. ఏతస గామస విరిపరస సవబంహదేయ పరిహారే వితరామ.''

తరువాత నేడవశతాబ్దివరకు నాంధ్రదేశమును పాలించిన శాలంకాయనులు, విష్ణుకుండినులు మొదలగువారి శాసనము లన్నియు సంస్కృతభాషలోనే యున్నవి. 7-వ శతాబ్ది ప్రారంభమున చాళుక్యరాజగు జయసింహవల్లభుని శాసనము పై ప్రాకృతమునకు భిన్నమనియే చెప్పదగిన తెలుగులో నున్నది.

''జయసింఘవల్లభ మహారాజులాకున్ ప్రవర్ధమాన విజయరాజ్య సంవత్సరంబుళ్ ఎణుంబోది అన్నెట్టే అమ్మాఙ్ పూర్ణ్ణమనాణ్డుం మ్లావిండిరాజులముట్లు కలిముడిరాజుల్ మ్లావిండిసముద్రరక్షై నాకు బణిసేసిన కల్చివీఱు రుఙ్ల మద్దికము మూటికి విత్పత్తి ఉత్తరంబున పులోంబున చెఱువు పడు మాఱికోటఙ్ ఎణుంబోదిపుట్లు అఙ్లపట్టుసేను తాఱితోంట శాయుపడువారంబు ఇచ్చిరి.''

ఇందలిభాష పై యాంధ్రరాజుల శాసనములోని భాషకంటె నెంతయు భిన్నమై ప్రాత తెనుఁగులక్షణముకలదై యున్నదనుటకు సందేహము లేదుగదా. కొన్ని తత్సమ శబ్దములు, సుబోధ్యముగాని ప్రాచీనరూపములు నున్నను, విభక్తి ప్రత్యయములు, శబ్దస్వరూపము వర్ణక్రమము మొదలగునవన్నియు సంస్కృత ప్రాకృత భాషాపద్ధతినిగాక, యితర దక్షిణదేశ భాషాపద్ధతిని బోలినవై కనఁబడుచున్నవి. ప్రాకృతభాషల యపభ్రంశ రూపములనుండి క్రీ. శ. ౧౦, ౧౧-వ శతాబ్దప్రాంతముల బయలుదేరినవని చెప్పఁబడుచున్న ఉత్తరహిందూస్థాన భాషలలో నయితము సంస్కృతభాషా వ్యాకరణ పద్ధతులే నిలిచియుండుటనుబట్టి, యంతకు పెక్కు శతాబ్దములకుఁ బూర్వమే తద్భిన్నపద్ధతుల ననుసరించి వృద్ధినొందియున్న యీ దక్షిణదేశభాషలు తజ్జన్యములే యనుట యసంభవమనక తప్పదు. కావున నాంధ్రరాజుల కాలముననే యీ దేశమునందలి యాంధ్రులు ఆ కాలపు ప్రాకృత శాసనములలోని భాషకంటె భిన్నమైన మఱియొక

తెలుఁగుభాషనే వ్యవహరించియుండిరని తలంచినగాని, తరువాతి చాళుక్యరాజుల శాసనములలోని తెలుఁగుభాష దాని పరిణతరూపమని చెప్పుట కవకాశమేర్పడదు.

దీనినిబట్టి 7-వ శతాబ్దమునాటి శాసనములలోని తెలుఁగుభాషయొక్క పూర్వచరిత్ర నన్వేషించి తెలిసికొనుట కంతకుపూర్వమున గల యాంధ్రరాజుల ప్రాకృత శాసనములేమాత్రమును తోడ్పడఁజాలవని విశదమగుచున్నది. కావున దీని పూర్వచరిత్రమును, ప్రాచీనస్వరూపమును దెలిసికొనవలెనన్నచోఁ బరిసరములందున్న యితర దక్షిణదేశ భాషల లక్షణములతో సరిపోల్చియే చూడవలసియుండును.

క్రీ. శ. 7-వ శతాబ్దికి బూర్వము తెలుఁగుశాసనములు లేకున్నను, తెలుఁగుదేశమున బయలుదేరిన యా సంస్కృత ప్రాకృతశాసనములలోని నదులు, ఊళ్లు మొదలగువాని పేళ్లను కొన్ని బిరుదనామములు నా కాలపు దేశభాషాస్వరూపచిహ్నములను వ్యక్తపఱచుటకుఁ దోడ్పడుచునే యున్నవి. నాగర లిపిలో వ్రాయబడిన కొన్ని సంస్కృత శాసనములలో తద్భాషావర్ణ సమామ్నాయమున లేని నూతన వర్ణములతోఁగూడిన దేశీయశబ్దములను వ్రాయవలసి వచ్చినపుడు ఆ శాసనములను జెక్కినవారు ఈ దేశీయ వర్ణములనే యా నాగర లిపి నడుమఁ జొనుపవలసినవారగుటచే నాకాలమున సంస్కృత ప్రాకృతభాషా సంప్రదాయములకు భిన్నములగు సంప్రదాయములతోఁగూడిన భాషలు దేశమున వ్యాప్తిజెందియున్నవనియే వ్యక్తమగుచున్నది. అట్టి శబ్దములే యీ దేశభాషల ప్రాచీనచరిత్రను సూచించు

నవై తదన్వేషణమున మనకు మిగులఁ దోడ్పడఁగలవు. ఇట్టి వానిలోఁ గొన్నిటి నిచ్చట పరిశీలింతము.

పై ఆంధ్రరాజుల ప్రాకృత శాసనములలోఁ గాన వచ్చు "నాగనిక" మొదలగు పేళ్లు ఆర్యులగు నాంధ్ర జాతివారివిగాక, దేశీయులగు నాగజాతివారివేయై యుండు ననుటకు సందేహము లేదు. అమరావతీ శాసనములలో నొక రాతిపై గానంబడు "నాగబు" శబ్దముకూడ ద్రావిడ భాషా సహజమగు "బు" వర్ణకముతోఁగూడిన దేశ్య శబ్దమే యై యుండును. cf. త. పామ్బు, వేమ్బు, ఇరుంబు; తె. మరబు.

ఆంధ్ర శాతవాహనుల తరువాత ఆంధ్రదేశములోని కృష్ణా గుంటూరుప్రాంత దేశమును ఇక్ష్వాకు వంశీయులు పాలించిరి. వారిలో వాశిష్ఠీపుత్ర శాంతమూల అను నాతఁడు మొదటివాఁడు. ఈ శాంతమూలుని కుమారుఁడు వీరపురిస దత్తుఁడు. ఈతని రాజ్యకాలమున బయలుదేరిన నాగార్జున కొండ శాసనములలో నొకదానిలో శాంతమూలుని చెల్లెలు చాంతిసిరి మహాసేనాపతి, మహాతలవరుఁడగు ఖందసిరి భార్య యైనట్లు తెలుపఁబడినది. ఈ "మహాతలవర" శబ్దము "సేనాపతి" వలెనే యొక బిరుదచిహ్నముగా గనఁబడు చున్నది. జైన గ్రంథములలో ౧౮ గణరాజులలో నీ మహాతలవరులుగూడ గ్రహింపఁబడుటచే నిది జైన సంప్ర దాయ సిద్ధమైయుండునని తోఁచుచున్నది. జైనకల్ప సూత్ర ములో దీని నిట్లు నిర్వచించియున్నారు. "తలవరాః తుష్ట భూపాల ప్రదత్త పట్టబంధ విభూషిత రాజస్థానీయాః"

అని. కాని యీ శబ్దము స్వతస్సిద్ధముగ ద్రావిడభాషల లోనిదై జైనులలోనికి సంక్రమించియుండునని తలంపఁదగి యున్నది. తెలుఁగున "తలారి" శబ్దమొకటి గ్రామ నాయకుఁడు, గ్రామమునందలి కాపలావాడు అను నర్థమున గలదు. ఇదే త. తలైయారి, కన్న. తళవర, తళవార అను రూపముల పై యర్థములనే కలదు. తమిళమున "తలైవన్" అనునది అధ్యక్షుడు, శాసకుడు, రాజు అను నర్థమునఁగూడ గలదు. దీని బహువచనరూపము "తలైవర్." ఐకారాంత శబ్దములు తెలుగున అకారాంతములగుట సహజము (తలై - తల, వలై - వల, మలై - మల). కావున "తలైవర్" అనునది తెలుఁగున 'తలవర' అగును. కావున పై తెలుగు దేశమునందలి ప్రాకృత శాసనములోని "తలవర" అనునది తెలుఁగు శబ్దమే కావచ్చును, అది యీ నాఁడొక బిరుద చిహ్నముగా ప్రాకృతభాషలో గ్రహింపఁబడి కాలక్రమమున గ్రామ రక్షకుఁడను నర్థమున వ్యవహరింపబడియుండును. ఇక్ష్వాకులకు తరువాత వచ్చిన బృహత్పలాయన రాజగు జయవర్మ కొండముడి తామ్రశాసనములోఁగూడ నీ "మహాతలవర" శబ్దము గానవచ్చుచున్నది. "మహాతలవరేన మహాదండనాయకేన భాపహానవమ్మేన కటతి" అని శాసనమును జెక్కించినవాని బిరుదముగా నున్నది. ఇందు "కూడూరహారే గామం పాంటూరం బమ్హదేయం దదామ"—కూడూరాహారమందలి పాంటూరను గ్రామమును బ్రహ్మదేయముగా నిచ్చినట్లున్నది. కూడూరు, పాంటూరు తెలుఁగుదేశములోని పేళ్లగుటయే కాక, యిందలి

"కూడూర" రనునది యిప్పటి మచిలీపట్టణ సమీపము నందలి "గూడూరే" యని తలంపఁబడుచున్నది. ప్రాచీన శబ్దములోని పదాదికకారము తెనుఁగున తరువాతి కాలమున గకారముగా మారుచుండుటను బట్టి యీ దేశభాషా సంప్రదాయమున కీ శబ్దములు నిదర్శనమగుచున్న వనవచ్చును (cf. కడప—గడప. త. కాల్, కాత్తు— తె. గాలి; త. కిళి—క. గిళి; త. కిణ్ణి— తె. గిన్నె).

బృహత్పలాయనుల తరువాత వేంగిపురమునుండి యాంధ్రదేశము నేలిన శాలంకాయన రాజులలో మొదటివాడగు దేవవర్మ ఏళూర శాసనముకూడ ప్రాకృతభాషలోనే యున్నది. ఈతడు క్రీ. శ. నాల్గవశతాబ్ది పూర్వభాగమున నున్నవాడని చారిత్రకుల యభిప్రాయము. ఈ శాసనమునందు ప్రాచీన వేంగిపురమునకు సమీపముననున్న "ఏలూరు" అను గ్రామము "ఏళూరు" అను పేరుతోఁ గనఁబడుచున్నది. ఈ శబ్దములోని "ళ" కారము తరువాత "ల" కారముగా మాఱియుండును. ఇది ప్రాచీన ద్రావిడ శబ్దమగు "ఆళ్" అనునది (=govern, rule) ఏళు-ఏలు అని తెలుఁగులో మాఱినది. ఈ శాసనమునందలి రూపములో నీ తెలుఁగు శబ్దముయొక్క ప్రాచీనరూపము పొడసూపుచున్న దనవచ్చును.

ఇంక నీ శాసనములలోఁ గానవచ్చు నడతూరు, కాండురూరు, విరిపర మొదలగు నూళ్ల పేళ్లు తెలుగుదేశమునందలి వానివే. "ఊరు" అనునది సంస్కృత "పుర" శబ్దభవమని చెప్పుదురుగాని, అది దేశ్యమనుటయే సమం

జనము. దక్షిణదేశభాషలన్నిటిలో నిది "ఊరు, ఊర్" అను రూపములతోఁ గనఁబడుచున్నది. హేమచంద్రుఁడు దీనిని దేశి శబ్దముగానే పఠించినాడుగదా. శివస్కందవర్మ శాసనములోని ఆంధ్రపథీయగ్రామమగు "విరిపరు" అనునదే తరువాతికాలమున "విప్పఱ్ఱు" అను గ్రామము. ఇందలి "పఱ్ఱు" అనునది ఆంధ్రదేశమునందలి యనేక గ్రామనామముల తుదిని గనఁబడుచున్నది. ౬-వ శతాబ్దము నాటి సింహవర్మ "ఒంగోడు" శాసనమున "పెణుకంబఱ్ఱు" అను గ్రామమును, రెండవ అమ్మరాజు మయిలపూండి శాసనమున "మల్కపఱ్ఱు" గ్రామమును పేర్కొనఁబడినవి. ఇట్లే యనేకములు గలవు. ఇందొక్క విశేషము. ప్రాచీనములగు ప్రాకృత శాసనములలో నీ "పఱు" శబ్దము రేఫముతోడనే వ్రాయఁబడియున్నది. కాని తరువాతికాలపు సంస్కృత శాసనములలో నీ గ్రామనామము వ్రాయవలసి వచ్చినపుడు ఇప్పటి తెలుఁగు లిపిలోని శకటరేఫమును బోలిన వర్ణమే నడుమఁ జొనుపఁబడుచువచ్చినది. ఇందుకు నిదర్శనము పై శివస్కందవర్మ ప్రాకృత శాసనములోని 'విరిపర' అను దానిలో రేఫమే [illegible]గా, ఈ గ్రామనామమే క్రీ. శ. ౭-వ శతాబ్దమునాటి రెండవ పులికేశి కొప్పరపు తామ్ర శాసనములో "విపఱు" అని శకటరేఫముతో వ్రాయబడియుండుటయే. ఈ రెండు శాసనములలో గ్రహింపబడిన యీ గ్రామ మొక్కటియే. విరిపరు—విపఱు అయి తరువాతి కాలమున "విప్పఱ్ఱు"

అయినట్లున్నది. ప్రాకృత శాసనములలో శకట రేఫము వ్రాయు నాచారము లేదు.

కొన్ని గ్రామములలో నీ "పఱ్ఱు"-"వఱ్ఱు, మఱ్ఱు" రూపములను బొందుటయుఁగలదు. (గొడవఱ్ఱు, పెనుమఱ్ఱు, పామఱ్ఱు, పోతుమఱ్ఱు మొ.) దీని యొప్పవిభక్తిక రూపము పఱ్ఱి, మఱ్ఱి యగును. ఈ గ్రామనామములే కొందఱి గృహనామము లైనప్పుడు గొడవఱ్ఱి, పెనుమఱ్ఱి, పామఱ్ఱి అను వాని యొప్పవిభక్తి రూపములే వాడుకలోనికి వచ్చినవి. ఈ "పఱ్ఱు" అనునదే "పట్టు" అను రూపమునుగూడ బొందినది. (చెంగల్పట్టు మొదలగువానిలో గాననగును.) ఈ శకట రేఫము సంస్కృత ప్రాకృతాద్యార్యభాషలలో లేక దక్షిణ దేశభాషా సహజమగు నొక ప్రత్యేకవర్ణము. ద్విత్వమును బొందినపుడు, ట్ర-వలె రేఫసహిత టకారమువలె నుచ్చరింపఁబడును. ప్రాచీన ద్రావిడభాషలోని యీ యుచ్చారణ పద్ధతి యిప్పటికిని తమిళభాషలో నిలిచియున్నది. తెలుఁగున నీ సంప్రదాయము కొన్ని ప్రాచీన రూపములలోఁ గనఁబడుచున్నను, ప్రస్తుత మది ద్విర్భావమునొందిన రేఫముగానే యుచ్చరింపఁ బడుచున్నది. పఱ్ఱు-పట్ఱు-పట్టు అయినట్లే, చిఱు-చిఱ్ఱు-చిట్ఱు-చిట్టి; వఱు-వట్ఱు-వట్టి [illegible]-వఱు వట్లు; మిఱు, మిట్టిచూచు-మిఱుమిట్లు; మాఱు-మాట్ఱు-మాట ఈ మొదలగు రూపము లేర్పడినవి. ఇట్లనేకములగు తెలుఁగు శబ్దములలోని "ట" కారము ప్రాచీన రూపములలోని "ఱ" కారమునుండి యేర్పడిన దేయై యుండును. ఇంక ననేకములగు

ప్రాచీన శాసనములలో నీ శకటరేఫము కనఁబడుచునే యున్నది.

ఈ శకటరేఫమువలెనే ద్రావిడభాషా సహజమై సంస్కృత ప్రాకృతములలో లేని మఱియొక వింత యక్షరము "ఴ" అనునది. ఇది ప్రాచీన సంస్కృత శాసనములలోని దేశ్యపదములలోఁ గనబడుచున్నది. ఇదియొక విలక్షణమైన యుచ్చారణము కలదగుటచే ద్రావిడభాషలలోనే యొక వింత యక్షరముగాఁ బరిగణింపబడుటయేకాక ఆయా భాషలలో భిన్నరూపములను బొందియున్నది. ప్రస్తుతకాలమున నిది తమిళ మళయాళములందు మాత్రమే వ్యవహారమందున్నను కన్నడభాషలో ౧౩-వ శతాబ్దివరకును, తెనుఁగున ౧౦-వ శతాబ్దివరకును వ్యవహారమున నుండెను. ఇటీవలి కాలమున నీవర్ణ మీభాషలలో ళకారముగానో, డకారము గానో, రేఫముగానో మాఱుచువచ్చినది. క్రీ. శ. ౮-వ శతాబ్ది ప్రాంతమునందలి ఆనందమహర్షి వంశ సంభూతుడగు అత్తివర్మ గోరంట్ల తామ్రశాసనమున కృష్ణబేణ్ణా దక్షిణ కూలమునందలి "తాన్ఱికొన్ఱ" గ్రామములోని అష్టశత పట్టికా క్షేత్రము కోటిశర్మ యను బ్రాహ్మణునకు దానము చేసినట్లుకలదు. ఇందలి "తాన్ఱికొన్ఱ" అను గ్రామము తరువాత "తాడికొండ యయినట్లగపడుచున్నది. ఇందలి "తాన్ఱి" తెలుఁగునందలి "తాడిచెట్టు" అను శబ్దములోని తాడి శబ్దముయొక్క ప్రాచీనరూపము. ఇది సంస్కృత "తాళ" శబ్దభవమని చెప్పుదురుగాని, తమిళమున నతి ప్రాచీన కాలమునుండి యిప్పటివఱకు "ఴ"కారమను వింత

ఱకారముతోఁ గూడిన ''తాఱి'' శబ్దమే కనబడుచుండుట చేతను, తెలుఁగు దేశమునందలి ప్రాచీన సంస్కృతశాసనములలోఁగూడ గ్రామనామములలో వచ్చిన యీ శబ్దము ''తాన్ఱి'' అని ''ఱ''కార సహితముగా దేశీయమగు లిపిలోనే వ్రాయబడి యుండుటనుబట్టియు నిది దక్షిణదేశభాషా సహజమగు శబ్దమే యనియుఁ దలంపఁగును. ప్రాచీన ద్రావిడ భాషలోని యీ ''ఱ''కారమే తెలుఁగు కన్నడములలో వరుసగా డకార ళకారములుగా మాఱినదనుట కనేక నిదర్శనములు గలవు. cf. త. కోఱి–తె. కోడి, కన్న. కోళి; త. చోఱ–తె. చోడ, కన్న. చోళ; త. పఱం–తె. పండు, కన్న. పళం; త. ఏఱు–తె. ఏడు, క. ఏళ్; త. నెఱిల్–తె. నీడ, క. నీళల్; త. చుఱి–తె. సుడి, క. సుళి మొ.

''తాఱి'' శబ్ద మాప్రాచీనరూపముననే 7–వ శతాబ్దమునాటి పై జయసింహవల్లభుని తెలుఁగు శాసనమునను ''తాఱితోంట'' అను శబ్దమున గానవచ్చుచున్నది. ఆ ''తాఱితోంట''యే యిటీవల ''తాడితోఁట'' యయినది. క్రీ. శ. ౬౬౦ నాటి మొదటి విక్రమాదిత్యుని తలమంచి శాసనమున ''कोఱ चुंकोन्ఱ ग्रामस्योत्तरपार्श्वे'' అని ''కొఱ్చుం కొన్ఱ'' అను గ్రామము పేర్కొనఁబడినది. ''కొన్ఱ'' శబ్దము ప్రాచీన ద్రావిడభాషలోని ''కున్ఱు'' శబ్దభవము. త. కున్ఱు, తెలుఁగు కన్నడములలో (కొన్ఱ) ''కొండ'' అను రూపమును బొందినది. కాని ''కొఱ్చుఁకొండ'' ఇప్పు డే గ్రామముగా మాఱినదో తెలియదు. మొదటి విష్ణువర్ధనుని తిమ్మాపురము శాసనములో ''पఱ कि विषये कुमुळ्र नामग्रामे'' అని ''పఱకి''

విషయ మొకటి పేర్కొనబడినది. విష్ణుకుండిన వంశీయుఁడగు రెండవ విక్రమేంద్రవర్మ చిక్కుళ్ల శాసనములో (క్రీ. శ. ౭౦౦) "విజయకెందులూర వాసకాత్ ... రేగోన్రమ్ నామ గ్రామం దత్తం" అని 'కెందులూరు', "రేగోన్రం" అను ఊళ్లు పేర్కొనఁబడినవి. ఈ 'కెందులూరు' ఇప్పటి యేలూరు ప్రాంతమండలి దెందులూరే కావచ్చును. దీనికి "డెందులూరు" పూర్వరూపము. పల్లవ విష్ణుగోపవర్మ చూరశాసనములో ఱగుబంఱు (=ఱగుంబఱ్ఱు?) మేటితాప, అను గ్రామముల పేళ్లునుగలవు.

ద్రావిడ భాషలకు విలక్షణములగు నీ వింత యక్షరము లేగాక, విష్ణుకుండిన వంశీయుడగు విక్రమేంద్రవర్మ చిక్కుళ్ల శాసనములో "విజయరాజ్య సంవత్సరంబుళ్" అను "బు" వర్ణాంత శబ్దముపై "ళ్" అను బహువచన ప్రత్యయము చేర్పఁబడిన రూపమొకటి కనఁబడుచున్నది. ఇది తమిళ కన్నడాది భాషలలోని 'గళ్' ప్రత్యయమునకు సంబంధించినది గాని సంస్కృత భాషారూపములనుండి యేర్పడినది కాదు. ఆ కాలమునకు ప్రాకృతములలో బహుత్వసూచకముగ 'లోగ్' వాడుకలోనికైనను రాలేదు. దీనినిబట్టి తమిళము కన్నడము తెలుఁగు నాయా దేశములందింతకు పూర్వము చిరకాలము నుండియు నెలకొనియే యున్నవని తెలియుచున్నది. తమిళమున క్రీ. శ. ప్రారంభమునాటికే వాఙ్మయము—భాషాలక్షణము, ఛందస్సాహిత్య లక్షణము బయలుదేరుటకు బాహ్యావరోధము లేమియు గలుగలేదు. కాని మధ్యభాగముననున్న తెలుఁగు కన్నడ దేశములు (అనగా దక్షిణాపథము, నాంధ్రపథమును)

ఆర్యజన సంఘమునుండి విడిపోయి వచ్చిన యాంధ్రుల ప్రజాపత్యమునకును, ఆధిపత్యమునకును లోనగుటయేగాక, ఆ యార్యాంధ్రు లీ దేశమున ననగా కృష్ణాగోదావరీ మధ్య దేశమగు తెలుగు దేశమున స్థిర నివాస మేర్పరచుకొని యచ్చటి తెలుఁగు జనులతోఁ గలిసిపోయి, వారితో నేకీభావమునొందిన యచిరకాలముననే సామ్రాజ్య స్థాపకులు నగుటచే, నిచ్చటి తెలుఁగువారు నాంధ్రులై ప్రఖ్యాతిగాంచినను వారి దేశభాషా సాహిత్యములు మాత్రము వెనుకఁబడిపోవుట తటస్థించినది.

ఇట్లు దేశీయంబగు తెలుఁగుభాషయొక్కయు నందలి జనులగు తెలుఁగువారియొక్కయు నామరూపములే అడుగంటి ఆర్యాంధ్రుల సామ్రాజ్య భానూదయముతోపాటు, ప్రాకృత భాషా సాహిత్య దీధితులే యీ దేశమున వ్యాప్తి గాంచ దొడంగినవి. ఆంధ్రభానుని బౌద్ధమత కాషాయ కాంతులు ప్రసరింపదొడంగినంతనే, అంతుకుపూర్వము దేశీయ నభోభాగమున మినుకు మినుకుమనుచున్న దేశభాషా నక్షత్రకాంతు లంతరించి, దేశీయుల కళాచాతుర్యము భాషా సాహిత్యరంగమునఁ బ్రసరింపక, శిల్పకళా వైభవరూపమున వ్యక్తము కాఁజొచ్చినది. క్రీస్తుశకారంభమునాటి మధ్యదేశపుస్థితి యిది. దక్షిణదేశభాగమున విదేశీయ జన, భాషా మతప్రాబల్య మంతగా లేకపోవుటచే-నచ్చట దేశీయభాషా కవితా కళా ప్రాదుర్భావమునకంతరాయము కలుగలేదు. మధ్యదేశమునకు మహాసామ్రాజ్యానుభవ సంపత్తి కలిగినను, స్వీయభాషా

సాహిత్యకళాభివ్యక్తికూడ సంభవించినది. ప్రాకృతము దేశభాష ననగ ద్రొక్కి రాజభాషయై శాసనములలోని కెక్కి, దేశభాషా పరిణామమును క్రొత్తమార్గమును ద్రొక్కించినది. దేశమున నెలకొన్న బౌద్ధమతమునెడల దేశీయుల కాదరాభిమానములు మిక్కుటములే యైయున్నను, వానిని వ్యక్తపరచుటకు స్వీయభాష నుపయోగించి కవితా కళను పెంపొందింపక దానికి రాజాశ్రయము పోషణము లేకుండుటచే శిల్పకళ మూలముగా దమ యాదరాభిమానములను వ్యక్తము చేసినారు. అమరావతీ నాగార్జున కొండ బౌద్ధ శిల్పములే ఆ కాలమునందలి యాంధ్రదేశీయుల కళా వైదగ్ధ్యము నిప్పటికిని [illegible] గూడ చాటుచున్నవి. ఆంధ్ర సామ్రాజ్యము నశించిన వెనుకగూడ భాషా మతప్రాబల్యమునుబట్టి యీ పరిస్థితులే వెలసినను, తరువాత సంస్కృతభాషా సాహిత్యముల ప్రభావముచే, దేశీయ సాహిత్యమున కవలంబనము లేకనే పోయినది. బౌద్ధ యుగమునందలి ప్రాకృత శాసనములలోవలెనే క్రీ. శ. 5-వ శతాబ్దినుండియు గానవచ్చెడి యాంధ్రదేశపు రాజుల సంస్కృత భాషా విరచిత శాసనములలోను, గ్రామ నామములు-దేశీయంబగు తెలుగుభాషకు సంబంధించినవేయై, తక్కిన దక్షిణదేశ భాషాపదములతో సజాతీయములుగనే కనబడుచున్నవి. ఈ శాసనములలో సంస్కృతార్య భాషా సంప్రదాయములకు విలక్షణములగు ధ్వనులు రూపములు కలిగిన యీ శబ్దములనుబట్టియే యీ దేశీయ భాషా వ్యాప్తి వ్యక్తమగుచున్నది. క్రీ. శ. 7-వ శతా

బ్దిని చాళుక్య రాజుల యాదరణమును బడసినపిదప గాని దేశభాష యగు తెలుఁగు శాసనములలోని కెక్కఁగలిగిన గౌరవమును బొందలేదు. కన్నడభాషలో నింతకుఁబూర్వమే, 5-వ శతాబ్దికే హల్మిడి శాసనముల వంటి శాసనములుగలవు. 9-వ శతాబ్దినాటికిగాని చాళుక్యుల శాసనములలోనికిఁ దెలుఁగున పద్యము లెక్కుట తటస్థించి నదికాదు. అంతకుఁబూర్వమునను దేశి కవిత చాలవరకు పాటలరూపమున నుండియుండును. ఇది కొంత సంస్కార మును బొందిననేగాని పద్యరూపమున శాసనములలోని కెక్కు నర్హత దానికి రాలేదు. ఈ శాసనములను రచించి నది సామాన్యముగా చాళుక్యరాజుల యాస్థానమునందలి పండితులే యగుటచే వారే యీ సంస్కారమును జరుపవల సినవారై యుందురు. అట్టివారు మార్గఫక్కి నవలంబించు టలో నాశ్చర్యములేదు. అయినను చాళుక్యరాజులకు దేశి కవితయందుఁగల యాదరమే వీరిని సంస్కృత వృత్తావలంబ నమునుండి మరల్చి, పాటలరూపముననున్న దేశిరచనలను, గొన్నిటిని సంస్కరించి పద్యరూపము నొందింపఁ బ్రోత్స హించియుండును. అట్టి సంస్కార ఫలితమే మనకు క్రీ. శ. తొమ్మిదవ శతాబ్దిని పాండురంగని అద్దంకి శాసనములోఁ గానవచ్చెడి మొదటి శాసనపద్యమగు తరువోజ. ఇది ద్విపద రెండు పాదముల నొకపాదముగాఁ జేసి, యట్టి నాల్గు పాద ములను ప్రాసబద్ధములుగా జేసి కూర్చిన పద్యము. దేశీయం బగు ద్విపదరచన నాలుగుపాదములుగల తరువోజ వృత్త ముగాఁ గూర్పఁబడుటచేతనే దీనికి మార్గకవితా వాసన

కొంత గలిగినదని స్పష్టమగుచున్నది. కాని కన్నడమునవలె సంస్కృత వృత్తములే తెలుఁగు శాసనములలోని కింక నెక్కకుండుట యొక విశేషమే.

తెలుఁగు శాసనములలోమాత్రము నన్నయకుఁ బూర్వమున, దేశీయ చ్ఛందమున రచింపఁబడినవేగాని సంస్కృత చ్ఛందో రీతిని రచింపఁబడిన వృత్తము లింతవరకు గానరాలేదు. 9-వ శతాబ్దిని "ద్విపద" వృత్తరూపమునొంది తరువోజయై శాసనమున కెక్కినదన్నచో నంతకుఁబూర్వము చిరకాలమునుండియు నీ ద్విపద దేశమున ప్రచారమందుండి యుండవలయునుగదా. దీనితోపాటు దేశీయ చ్ఛందో రీతిని మాత్రాగణబద్ధములై జాత్యుపజాతి వర్గములోఁ జేర్పబడిన సీసగీతములు చాళుక్య భీముని శాసనములలోను, మధ్యాక్కరలు యుద్ధమల్లుని బెజవాడ శాసనములోను నన్నయకుఁ బూర్వమునగల శాసనములలోఁ గానవచ్చుచున్నవి. ఇవియు ద్విపదవలెనే దేశమున పాటలరూపమున వ్యాప్తిలో నుండి యుండును. ఇవి సంస్కృత చ్ఛందమునుండి కల్పింపబడిన వైననుకావు. తాళానుకూలములగు మాత్రాగణములతోఁ గూర్పఁబడినవే. ఇవి చిరకాలమునుండి దేశమున వ్యాప్తి గాంచి యుండినగాని, పండితుల దృష్టిలోనికెక్కి శాసనముల లోని కెక్కుట తటస్థింపదు. ఇట్టి గణములతోనే కూడిన అక్కర, గీతికె, ద్విపద, రగళె మొదలగు పాటలు పద్యములు కన్నడభాషలోఁగూడ నుండినట్లు 10-వ శతాబ్ది నాగవర్మ ఛందోంబుధినిబట్టి తెలియుచున్నదిగదా. వీనిని తమిళభాషా

పద్యముల లక్షణముతోఁ బోల్చి చూచినచో వీనికిఁగల సన్నిహిత సంబంధముకూడ బోధపడగలదు.

ద్విపదను తరువోజ వృత్తముగా మార్చుటలో మార్గ పక్షి ననుసరించిన సంస్కృత పండితుల సంస్కారమించుక కనబడుచునే యున్నదని యిదివరకే యూహించినాముగదా. ద్విపద యనునది - మూడింద్రగణములు ఒక సూర్యగణము అను 4 గణములతోఁగూడిన రెండు పాదములుగలది. అనగా నాలుగేసి మాత్రలుగల, నాలుగు గణములను జేర్చి, తుది నొకమాత్ర తగ్గించినచో, ద్విపదకొక పాదమగునన్నమాట. నాలుగు మాత్రల నాలుగు గణములు-అష్ట ఉంటే-మధుర గతి రగడ అగుచున్నది. అనఁగా దేశీయములగు పెక్కు రచనలు 4 గేసి, 3 డేసి గణములతోఁ గూడిన పాదములు గలవిగానే కనఁబడును. పాదమునకు 4 గేసి గణములుగల ద్విపద రెండుపాదములు నొకపాదముగాఁ జేరి తరువోజ వృత్త మేర్పడఁగా ద్విపద - ఒక్కొక్క పాదములోని మూడేసి ఇంద్రగణములను - ఒక సూర్యగణమును - ఒక్కచో జేర్చినచో అనగా 6 ఇంద్రగణముల తరువాత రెండు సూర్య గణములను జేర్చినచో నొక సీసపద్యపాదమగును. ద్విపద పాదములనే యించుక మార్చి యొక్క పాదముగాఁ గూర్చి అట్టి నాలుగు పాదములనొకచోఁ గూర్చినచో సీసపద్యమగు చున్నదన్నమాట. ఇట్లవి నాలుగేసి గణములుగల పాదములతోఁగూడిన దేశీయరచన ననుసరించుటచే గల్గినవి. గీత పాదమునకు రెండు సూర్యగణములు, రెండింద్రగణములు, నొక సూర్యగణముకలసి యైదుగణములు. దీనికి సీసమున

కును ప్రాసనియమము కూడ లేకపోవుటచే నివి యుపజాతు లైనవి.

ఇఁక మధ్యాక్కరకు లాక్షణికులు చెప్పిన లక్షణమును బట్టియేఁ మూఁడు గణములుగల పాదము నినుమడించుటచే నేర్పడినదని స్పష్టమగుచున్నది. ద్విపదలోని మూడింద్రగణములు నొక సూర్యగణమును జేర్చి రెట్టించిన తరువోజ యైనట్లే రెండింద్రగణములను ఒక సూర్య గణమును జేర్చి దాని నినుమడించిన మధ్యాక్కర పాదమగుచున్నది. దీనిని బట్టిచూడగాఁ దొలుత మూఁడేసి నాలుగేసి గణములుగల పాదములతోఁ గూడిన పద్యములే యీ దేశికవిత్వమున నుండెడివని తోఁచుచున్నది. అట్టివాని రెండు పాదముల నొక పాదముగాఁ జేసి, తరువాతివారు దేశి వృత్తముల గూర్చి యుందురు. తమిళమున మూఁడేసి గణములతోఁ గూడిన పాదములుగల పద్యము లుండనే యున్నవి. వానిని "చిందడి" అని ఆభాషలోఁ జెప్పుదురు. "అగవల్" పాదమునకు నాలుగేసి గణము లుండును.

ఇట్లే తెలుగు దేశమందలి "దేశి" రచనలు— సంస్కృత పండితుల సంస్కారమునకుఁ గొంతలోనైనను వాని పూర్వస్వరూపమును గుర్తించుటకుఁ గొంత యవకాశము లభించుచుండుటచేతను, ఇట్టివి తమిళ కన్నడ భాషలయందలి దేశీయ రచనలతోఁ బోల్పదగియుండుట చేతను, ఇవియన్నియు మాత్రాగణ బద్ధములేమై, సంస్కృత వృత్తములవలె నక్షర గణబద్ధములు కాకుండుట చేతను, పరస్పర సన్నిహిత సంబంధము సామ్యము

గలవగుటయేగాక సజాతీయ సహజ సంప్రదాయ బద్ధములు గూడ కాకమానవని తలంపఁదగియున్నది. ఇట్టి దేశి రచనలతోఁగూడిన యీ భాష క్రీస్తు శకారంభముననే యీ దక్షిణాపథమున వ్యాప్తిగాంచియున్నను, ఈ తెలుఁగు దేశ ముత్తరదేశీయులగు నార్యాంధ్రులకు వలసభూమి యగుటచే నీ దేశ మాంధ్రదేశమై భాషయాంధ్రమై, తెలుఁగుభాష పేరు కొంతకాలము మరచిపోబడినట్లే యీ "దేశి" రచనలును దేశమునఁ గొంతకాలమువరకు మరచిపోబడుట తటస్థించినది.

నన్నయకుఁ బూర్వమున నాతని భారతమువంటియు గ్రంథములొకవేళ లేకుండినను, జన బాహుళ్యమున వ్యాప్తి గాంచియుండిన దేశి రచనలు లేకపోవు. నన్నయ భారత రచనముఁగావించినపిదప నట్టివాని నాదరించువారెవ్వరు! అవి గ్రంథస్థములగు టెట్లు? కావున నన్నయయే ఆంధ్రభాషా వాఙ్మయములకు సృష్టికర్తయను భావములుగూడ ప్రబలుట తటస్థించినది. ఇటీవలికాలమున నన్నయకుఁ బూర్వము నందలి చాళుక్య రాజుల శాసనములు ప్రకటింపబడునంత వరకుఁ దెనుఁగున దేశీయచ్ఛందమున రచింపఁబడిన కొన్ని పద్యములైనను గలవనిగాని, దేశి సారస్వత మనునదొకటి యుండియుండుననిగాని, యూహించుటకైన వీలులేకపోయి నది. నన్నయయే యాదికవియైనాఁడు. అతఁడు తెనుఁగున రచించిన ఆంధ్ర భారతమే ఆది గ్రంథముగా బరిగణింపబడఁ జొచ్చినది.

V

ఛందస్సాహితీ రీతులు

ఆంధ్రభాషా సారస్వతము నన్నయభట్టారకుని భారత రచనతోడనే ప్రారంభించినట్లు సామాన్యముగాఁ దలంపఁబడుచున్నదిగదా. అతనికిఁ బూర్వకాలమున రచింపబడిన గ్రంథమేదియు లభింపకపోవుటయే దీనికి ముఖ్యకారణమైనదనుట నిశ్చయమే కాని, యట్టి యుద్గ్రంథ మీ భాషలో రచింపఁబడుటకుఁ బూర్వ మీ దేశములో నెట్టి సాహిత్యసంచలనము కలుగనిది భాష యెట్టి సంస్కారమును బొందనిది, దానిలో నెట్టి కవితాసంప్రదాయములును నిరూఢిగాంచనిది, యట్టి గ్రంథము రచింపబడుట సాధ్యము కాదుగదా. భాషాసంప్రదాయములు సాహిత్యసంప్రదాయములు నొక్కసారిగా నొక్కరిచే సృష్టింపఁబడునవి కావు. దేశకాలస్థితిగతులనుబట్టి యొక ప్రతిభావంతుఁడు భాషా కవితా సంప్రదాయములలోఁ గొన్ని మార్పులను బ్రవేశపెట్టవచ్చును. నూతనమార్గములను దీయవచ్చును. కాని భాషా సారస్వతముల నొక్కసారిగా సృష్టింపలేఁడు. కావున నన్నయభట్టారకుఁ డాంధ్రభాషలో నట్టి యుద్గ్రంథమును రచించునప్పటి కీ దేశమునఁగల భాషా సాహిత్యపరిస్థితు లెట్టివో కొంతవరకిదివరకే పరిశీలించియున్నాము. ఇంకను తద్రచనకుఁ ద్రోవఁజూపిన ఛందసాహిత్య రీతుల పరిణామ మెట్టిదో, వాని నాతఁ డెట్లుగ్రహించి సమన్వయించుకొనెనో మనము పరిశీలించి తెలిసికొనవలసియున్నది.

నన్నయకుఁ బూర్వ మాంధ్రభాషా వాఙ్మయ ప్రపంచ మంధకారబంధురమే కదా. తరువాతి వాఙ్మయ జ్యోతి వెలుగునఁ గొంతవరకు తడవులాడవచ్చునేమో! ఆంధ్రభాషా రచిత శాసన రూపములగు నుషఃకాంతుల జాడలు మఱికొంత దూరమువరకును మనకు మార్గదర్శులు కాఁగలవు. ఇంకను వెనుకకుఁ బోవలయునన్న చిమ్మ చీకటిలో తడవులాటయే. ఇచ్చట నితర సన్నిహిత భాషా వాఙ్మయ పరిణామపద్ధతుల జాడలు తప్ప నితరాధారము లేదు.

బాగుగా పరిశీలించినచో నీ దక్షిణదేశమందు భాషా పరిణామమునకువలెనే, తద్భాషా సాహిత్య పరిణామమునకును మూలబీజము లొక్కటే యనఁదగి ట్లగపడుచున్నది. ఇవి భిన్నప్రదేశముల, భిన్నములగు పరిసర పరిస్థితులలోఁ బెంపొందిన వగుటచే భిన్నజాతి వృక్షములుగఁ గనబడుచుండెనేకాని వాస్తవముగ నట్టివి కావు. ఈ భాష కన్నిటికిని మూలములగు ప్రధాన బీజములును దక్షిణదేశీయమగు నొక్క ప్రాచీన భాషా వృక్షమునుండి యేర్పడినవే యని యెట్లు తలంపబడుచున్నదో, అట్లే యీ భాషాసాహిత్యముల కన్నిటికిని సమానములగు మూల బీజము లా ప్రాచీన భాషా సాహిత్యమునకు జెందినవే యని తలఁపనగును. నారుగాఁ బోసిన బీజము లొక జాతివేయైనను, అవి నాటబడిన ప్రదేశముల సారమునుబట్టియు నచ్చటి శీతోష్ణస్థితులు, చేయబడిన దోహదము, నీటి సౌకర్యములు, సంరక్షణ మొదలగువానిలోఁ గల భేదమునుబట్టియు భిన్న రీతుల

వృద్ధి నొందినవై వేరువేరు రుచులు గల ఫలముల నిచ్చుచుండుననుట మన కనుభవసిద్ధమేకదా. ఒకటి ముందుగా ఫలించుట, మఱియొకటి యాలస్యముగాఁ గాపునకు వచ్చుట సంభవించుచుండును. ఫలములు రుచిలోనే కాక యాకారమునగూడ భిన్నములై యుండును. ఒక చెట్టును మఱియొకదానితో నంట (టు) గట్టుట తటస్థించినచో నాయంటు విజాతీయములు, రుచ్యతరములు నగు ఫలముల నిచ్చుచుండును. ఈ సామ్యము దక్షిణదేశభాషా సాహిత్యములపట్ల నన్వయించినచో వాని సామ్య భేదములకుఁ గల కారణములు వ్యక్తము కాకపోవు.

ఆంధ్రభాషా సాహితీ వృక్షమువలన మనము పడయఁ గలిగిన తొలిఫలము క్రీ. శ. ౧౧-వ శతాబ్ది దగుటచే తమిళ కన్నడ భాషావృక్షములకంటె నిది మిగుల నాలస్యముగా ఫలించినదని చెప్పవలసియుండును. కాని ఈ యాలస్యమునకుఁ గారణము లేకపోలేదు. ఇది సంస్కృతభాషా సాహిత్య శాఖతో నంటగట్టఁబడినపిదప నది మన కొసంగిన మహాస్వాదు ఫలము. అంతకుబూర్వ మీ వృక్ష మెట్లు పెరిగి యెట్టి ఫలముల నిచ్చుచువచ్చినదో మన కిప్పుడు తెలియుటలేదు. బహుశః సంస్కృత సాహితీశాఖతో నంటగట్టబడినపిదప నీ వృక్షపు టితరశాఖల యేపు తగ్గిపోయి యవి నశించియుండును. లేదా రుచ్యతరములగు నీ నూతనశాఖాఫలముల పంట యధికమగుటకుగా తొలిమ్రాని శాఖ లొకప్పుడు ఖండింపబడుటయుఁ దటస్థింపవచ్చును. కాని యొకప్పుడీప్రాతమాను కొమ్మలను దొడిగి చిగిర్చి

పూచి కాచి ఫలించినను ఫలింపవచ్చును. ఇందు నూతనశాఖాసారము కొంత చేరుటయు గలదు. ఎట్లైనను వాని స్వరూపలక్షణము లితర సన్నిహిత భాషా సాహితీ ఫలములతోఁ బోల్చి చూచిననే కాని సుబోధములు కావు. వాని పరిణామక్రమమును దెలిసికొనలేము.

నన్నయకుఁ బూర్వమునగల యాంధ్రసారస్వత స్వరూపలక్షణములనుగూర్చి సూచింపఁగల సాధనములలో నన్నయాదికవుల గ్రంథములే యొక విధమగు సాధనము కావచ్చును. ఏలయనగా, కన్నడమున తొలి గ్రంథముగా గ్రహింపఁబడిన కవి రాజమార్గ మా భాషలోని గద్యపద్య కావ్య రచయితల నామములను గూర్చియు, పద్యకావ్యముల లోని భేదములు, వాని లక్షణములనుగూర్చియు బ్రశంసించుటచే నంతకుఁ జిరపూర్వమే భిన్నరీతులు గల కవితాశాఖలు కన్నడభాషలో వెలసియుండెనని తెల్లమగుచున్నది. తెనుఁగులో నన్నపార్యుని గ్రంథమున నట్టి విషయము లేమియు గానవచ్చుటలేదు. పైగా తరువాతి తెలుఁగు కవులలోఁ బెక్కండ్రు అతనిని ఆంధ్రభాషావాగనుశాసనుడు, అజ్ఞాసన కల్పుడు అను నిట్టి విశేషణములతోఁ బ్రశంసించియుండుటచే నీతఁడే యాంధ్రభాష ననుశాసించి అందు కవితను సృష్టించినాడను భావము ప్రబలుట కవకాశముగలిగినది. పౌరాణిక బ్రాహ్మణమతాభిమాన ప్రోద్బలకములగు పురాణేతిహాసములను, నన్నపార్యుడు చూపిన మార్గమునే యభిమానించి యనువదించిన తరువాత తెలుఁగు కవుల మూలముగా వ్యాప్తిగాంచిన భావమేకాని యిది మఱియొకటి కాదు. ఏల

యనగా, నన్నయకుఁ దరువాత నొకటిరెండు శతాబ్దములలోఁ గల శైవకవులెవ్వరు నీతని పేరైన నెత్తినవారు కారు. భిన్న మతాభినివేశముచేతనే శివకవులు భవికవుల పేళ్లెత్తకుండి రనియుఁ జెప్పవచ్చును. కాని మతాభినివేశముచేతగాని, మతప్రచారముకొరకుగాని వారవలంబించిన పద్ధతులు, వ్రాసినవ్రాతలు నన్నయకుఁ బూర్వమునుండియు వచ్చుచుండిన ప్రాచీనాంధ్రకవితారీతులను, సంప్రదాయములనే గొంతవరకైన సూచించుచున్నవనక తప్పదు. ఇట్టి రీతులు, సంప్రదాయములును ప్రధానముగా మనకు పాల్కురికి సోమనాథుని రచనలనుబట్టి కొన్ని తెలియవచ్చుచున్నవి. నన్నపార్యునితరువాత సుమారు రెండు శతాబ్దముల కాలములో నున్నవాఁడగుటచేతను, నన్నయాది శిష్టకవులవలంబించిన తత్సమ భూయిష్ఠమగు పురాణ కవితామార్గమును గాక సర్వసామాన్యమగు జాను దెనుఁగున దేశీయమగు ద్విపద కవితారచన ననుసరించినవాడగుటచేతను నాతనిచేఁ బేర్కొనబడిన కవితారీతులు, కావ్యభేదములు మొదలగునవి నన్నయ కవితాపద్ధతికంటె బ్రాచీనములును భిన్నములు నగు పురాతనాంధ్రదేశ కవితారీతులే యని మనము తలంపవచ్చును. మతవిషయమునఁ గలిగిన భేదమును బురస్కరించుకొనియే భాషావిషయముననను, కవితారీతుల విషయమునను గూడ నీతఁడు భిన్నమార్గమును త్రొక్కెననుటకు సందేహము లేదు. శిష్టకవులచే నిరసింపబడినను ప్రాచీనకాలమునుండియు, జనసామాన్యమున కనువైయుండి వారిచే నాదరింపబడుచుండిన కవితామార్గములనే చేపట్టి, తనప్రతిభా

శక్తిచే వానికొక "నూత్నసంగతిదనర జేసి" "సత్కృతు"లనే రచించి యాతఁడు నన్నయాదులను తలదన్న దారి కొనెను. "తేట తెనుఁగున ద్విపదలనే" యాతఁడు రచించినను అవి తొమ్మిది రసములతోఁ దులుకాడునవి, ఇమ్మడి వర్ణనలతో నెసంగునవి, ద్విగుణములగు నలంకారములతో నసలారునవి, ద్విగుణార్థ భావములతో డీకొనునవి. ఇంతకు పూర్వము నన్నయాదులు రచించిన

"అరూఢ గద్యపద్యాది ప్రబంధ
పూరిత సంస్కృత భూయిష్ఠరచన
మానుగా సర్వసామాన్యంబు గామి"

తాను గ్రహించిన "జాను తెనుఁగు విశేషము ప్రసన్నతకు" అని తలంచియే తేట తెనుఁగున ద్విపదలు రచింపఁ బూనుకొనెను. అనాగరక జనసామాన్యము పాటలుగాఁ బాడుకొను ద్విపదలలోనా నీవు "వరకవుల్ గాని యాడ వర్ణనకెక్క" గల కృతిని రచింపఁ దలఁచినదని శిష్ట కవు లీసడింతురేమో యని కాబోలు "ఆది ప్రాసనియతిఁ దప్పకుండగ ద్విపదలు రచింతు"నని ప్రతిజ్ఞ చేసియు, "ఒప్పదు ద్విపద కావ్యోక్తి నావలదు" అని తానే యాక్షేపించుకొని, ద్విపదకు కావ్యప్రౌఢిని తన నేర్పరితనముచేఁ గల్పింపదలఁచినట్లు వ్యక్తము చేసికొన్నాడు.

"అట్టులు కాక కావ్యప్రౌఢి పేర్మి
నెట్టణ రచియింప నేర్చినఁ జాలు
నుపమింప గద్యపద్యోదాత్తకృతులు
ద్విపదయు సమమ భావింప"

''అటుగాన యభివినుతానందితో క్తి
బటుగద్యపద్యప్రబంధసామ్యముగ
గావ్యకళా ప్రౌఢి గల్పింతు ద్విపద
కావ్యంబు భావ్యంబుగాన......
....
జెనకక యింతొప్పఁజెప్పనే యనుచు
సన్నుతిచేయుచు సత్కవు లలర
దిన్నని సూక్తుల ద్విపద రచింతు''

అని చెప్పినాడు. నన్నయాదు లవలంబించిన గద్య పద్యోదాత్తకృతులకు బదులు ద్విపదలు, వారి సంస్కృత భూయిష్ఠ రచనకు బదులు జాను తెనుఁగు నవలంబింపదలచి నట్లు చెప్పుకొనుటకు సోమనాథుఁ డిన్నివిధముల సమర్థించు కొనవలసినవాఁడైనాడు. దీనినిబట్టి నన్నయ గ్రహించిన చంపూకావ్యపద్ధతిని, తత్సమ భాషాబహుళమగు రచననే యీతఁడు [illegible] చెప్పియున్నాఁడనుటకు సందేహము లేదుగదా. కావున ప్రాచీనాంధ్రకవిత్వమున ద్విపదలకు, జాను తెనుఁగునకు విశేష ప్రాముఖ్యముండి యుండవలయును. సంస్కృత భూయిష్ఠము, లేదా తత్సమ బహుళము కాక, యందలి దీర్ఘసమాసములయర్థము జాణ తనంబు మీఱ తేటతెనుఁగు మాటలలోఁ జెప్పఁబడినచో నదియే జాను తెనుఁగు. అది ''తిన్నని సూక్తుల''తోఁగూడి నది; ''ఉరుతర గద్యపద్యోక్తులకంటె సరసమై పరగు''నది; సర్వజనసామాన్యమైనది. నన్నెచోడ మహాకవి చెప్పినట్లు ''సరళములైన భావములు జానుదెనుంగున నింపుబెంపుతోఁ

[illegible]సను." కావుననే దేశిమార్గములను దేశీయములుగఁ జేసి రచించుటయే యిటీవలి "వరకవీశ్వరులు" సాధింపఁబడగిన విషయమన్నట్లుగా నాతఁడు కుమారసంభవమున హెచ్చరించినాఁడు. ఇట్టి జానుదెనుఁగుభాషలో, ద్విపదాది దేశీయచ్ఛందస్సులలో రచింపఁబడిన కృతులే నన్నయకుఁ బూర్వమున సర్వజన సామాన్యములైన దేశి రచనలై యుండునని మన మూహింపవచ్చును. తెలుఁగున నప్పటి కింకను వృత్తరచన ప్రచారములోనికి రాలేదన్నమాట. నన్నపార్యుఁడే వీనిఁ దొలుత తెలుఁగుకవితలోఁ బ్రవేశపెట్టి యుండును. శాసనములే దేశీయ చ్ఛందస్సులలో రచింపఁబడియుండుటనుబట్టి యాకాలపు దేశి కవితా రచనలు నట్లే యుండునని తలంపవచ్చును. అట్టి రచనలనుగూర్చి యింకను దెలిసికొనుటకు సోమనాథుఁడే మన కాధారము.

పాల్కురికి సోమనాథుని మూలముననే మన కెఱుకపడిన ప్రథమ శైవకవి మల్లికార్జున పండితారాధ్యులు. ఈతఁడు సోమనాథునికిఁ బూర్వుఁడు, నన్నయ కొకశతాబ్దము తరువాతివాడు. ఈతఁడు రచించిన శివతత్వసార మనుకృతి మన కిటీవలనే లభించినది. ఇది కేవలము కందపద్యమయము. జాతులలోఁ జేర్పబడిన యీ కందపద్యములు నన్నయాదుల కృతులలో నచ్చటచ్చట గానవచ్చినను, వారి కృతులు కందపద్య బహుళము లనియైనను జెప్పుటకు వీలులేదు. తరువాతికాలమున గందపద్యములలోఁ జెప్పఁబడిన శతకము లనేకము లాంధ్రమున వెలసినవి. వానికిఁ శివతత్వసారము మార్గదర్శియని చెప్పవచ్చును. నన్నయకుఁ

...ర్వమునఁగల శాసనములలో నయితము కందపద్య రచన ...ంతవరకుఁ గానరాలేదు. కాని కన్నడ భాషలో నిప్పటికి ...ించిన తొలి రచనలలో కందపద్య బాహుళ్యమున్నట్లగ ...డుచున్నది. ఆ భాషలో తొలిగ్రంథము, తొలిలక్షణ ...ంథము ననదగిన కవిరాజమార్గము కందపద్య బహుళమై ...న్నది. కొన్ని సంస్కృతవృత్తములును, కొద్ది గీతికలును ...ాడ లేకపోలేదు. అందు పేర్కొనఁబడిన ప్రాచీన కావ్య ...ములగు చెత్తాణ, బెదండె అనునవి కందపద్యములతోఁ ...ాడినవిగానే కనబడుచున్నవి. ఒక కందపద్యము తరువాత ...క వృత్తమును రచించి అచ్చటచ్చట "జాతుల"ను ...డిగిన నది "బెదండె" కావ్యమగునట.[1] చత్తాణ కావ్య ...ును కందపద్య బహుళముగాఁ జేసి అందక్కడక్కడ సుందర ...ృత్తములను, అక్కర, చవుపది, గీతికె, తివది మొదలగు ...ానిని అందముగాఁ జేర్చవలయునట.[2] ఇట్లు ప్రాచీన కాలమున ...న్నడ కావ్యములలో కందపద్యమునకుఁ గల ప్రాధాన్యము

1. "కందముమమళినవృత్తము,
మొందొందెడెగొందు జాతిజాణెనెయ్దెబెడం
గొందివరీళమరె పేళ
ల్సుందరరూపింబెదండెగబ్బమదక్కుం."

2. "కందళ్ళలవాగిరె
సుందరవృత్తంగళక్కరంచవుపదిమ
త్తంగ్గితకె తివదిగ
ళందంబుత్తెసెయె పేళ్తొడదు చత్తాణం."

—కవి రా. ౧-౩౮, ౩౯.

క్రమవాతి కాలమున తగ్గిపోయినట్లున్నది. పంపాది కవుల కావ్యములలో నవి నన్నయాది కవుల కావ్యములలోవలె నచ్చటచ్చట వాడబడినవే కాని, అందు కందపద్యములకు ప్రాధాన్యము లేదు. దక్షిణదేశభాషాచ్ఛందస్సంప్రదాయ ములకు సరివచ్చు మాత్రాగణచ్ఛందములోని ఆర్యాజాతి భేదమే యీ కందపద్యమగుటచేత ప్రాచీన దేశీయకవిత్వ ములో దీనికి ప్రాధాన్యము కలిగియుండవచ్చును. ఆర్యా గీతియే ప్రాకృతమున "ఖంధసీ" యను పేరుగలదై యుండి నట్లును, ఆంధ్ర కన్నడములలోని కందము ప్రాకృతము మూలముగా నీ భాషలలో జేరినట్లును దలంపఁబడుచున్నది. కాని కన్నడాంధ్రములందలి కందపద్యములలో సంస్కృత మున నార్యజాతులలో లేని ద్వితీయాక్షర ప్రాసనియమ మొకటి కలదు. మఱియు నీ కందాదిజాతులలో

"గురులఘువులలో నెయ్యది
మురసంహార ప్రథమపాదముఖమున నిలిచెఁ,
ధర నుపజాలు దక్కఁగ
బరగ నిలుచునవియె నాల్గు పదముల మొదలఁ."

ఇదియేకాక తెలుఁగులో రెండు నాలుగు పాదము లలో యతి నియమముకూడ గలదు. క్రీ. శ. ౧౦-వ శతాబ్ది నాటికే కన్నడకందములు ప్రాకృతఖంధసీ పద్యములకంటె విలక్షణములై కనబడుచున్నవి. ప్రాకృత ఖంధసీల ప్రాచీనత యెట్టిదో తెలియదుగాని దక్షిణదేశభాషా సంప్రదాయసిద్ధ మగు యతిప్రాస విలక్షణత యీకందముల కుండనేయున్నది.

తెలుఁగున శివతత్త్వసారమును రచించిన పండితారాధ్యుఁడే కన్నడమున "బసవగీత" లను గ్రంథమును రచించెను. ఇంక నీతఁడు "పంచగద్దెలు" "శంకరగీత భాస్వత్ప్రదావళి" "ఆనందగీతంబు" లను పదంబుల చేతనేకాక యింకను ప్రాక్తననూతన భవ్యగీత ములచేఁగూడ ఈశ్వరుని బాగడెనని సోమన చెప్పుటచే వీనిలో గొన్ని తద్రచితములే యనియు, నిట్టి గద్యరచన, పదకవిత్వము నాకాలమున సామాన్యజన ప్రచారములో నుండెననియుఁ దలంపవచ్చును. కవిరాజమార్గమున విమలోదయ, నాగార్జున, సునీతి, జయబంధు, దుర్వినీతాదులు కన్నడమున ప్రాచీన గద్య కవితా రచయితలుగఁ జెప్పఁబడిరి. వారి గద్య రచనలకును నీ శైవ గద్యలకును సంబంధముండి యుండును. ఇట్టి దేశీయ గద్యకవిత్వము గేయమై యాంధ్ర కన్నడదేశ ములలో నా కాలమున విశేషప్రచారములో నుండెననుటకు సందేహములేదు. పండితారాధ్యుఁడు వెలనాటిచోడుని బౌద్ధగురువుతో వాదించుటకుగా నా రాజసభకుబోవు సందర్భమున నాతని వెంట వచ్చు శిష్యులు, సద్భక్తసంఘములు నాడుచు బాడిన పదములు మఱికొన్ని కలవు.

"పదములు, తుమ్మెదపదముల్, ప్రభాత
పదములు, శంకరపదముల్, నివాళి
పదములు. వాలేశుపదములు, గొబ్బి
పదములు, వెన్నెలపదములు, సంజ
వర్ణన మఱి గణవర్ణన పదములు
బాడుచు నాడుచు........."

నేగు దేరిరి.

శివరాత్రియందు శ్రీశైలమున మల్లికార్జును సేవించు టకై చేరిన భక్తగణములు రాత్రి జాగరణముచేయు సందర్భ మున చదువు గ్రంథములు—

"శతకంబు శివతత్త్వసారంబు, దీప
కళిక, మహానాటకము, నుదాహరణ
ములు, రుద్రమహిమయు, ముక్తకావళులు
గీతసూక్తములు, భృంగీస్తవంబులు, బు
రాతనమునిముఖ్య రచితాష్టకములు
అరుదొంద జదువుచు నంకించువారు."

మఱియు అరువత్తుమూఁడు చరితంబును వేలలవెట్టుచు జదివిరట. ఇంకను సకల పురాతనచారుగీతములు ప్రకటించి పాడెడువారు కొందరు. దీనినిబట్టి శతకము, దీపకళిక, నాట కము, ఉదాహరణము, ముక్తకము, అష్టకము మొదలగు కావ్యరచనాభేదములు క్రీ. శ. ౧౨-వ శతాబ్దికిఁ బూర్వమే సుప్రసిద్ధములై యుండెనని తెలియవచ్చుచున్నది. కళికోదా హరణ ముక్తకాది రచనాభేదముల లక్షణములను లక్షణ గ్రంథములలో తరువాతి లాక్షణికులు కొందరు చెప్పినను, అట్టి రచనలు తరువాతి గద్యపద్యాది ప్రబంధ సంస్కృతి భూయిష్ఠ రచనల ధాటి కాగలేక తెలుఁగు కవితలో వెనుక బడిపోయినవి. శతక వాఙ్మయము తరువాతి కాలమునగూడ తెలుఁగునాట బాగుగనే వృద్ధి నొందినది. కాని యుదా హరణ గ్రంథములు మొత్తము పది పండ్రెండుకంటె విశేష

ముగా బయలుదేర లేదు. అందు సోమనాథుని బసవోదా హరణము, త్రిపురాంతకోదాహరణము, అప్పకవి కృష్ణోదా హరణము, తాళ్ళపాకవారి వేంకటేశోదాహరణము ప్రసిద్ధ ములు. మహానాటకస్వరూప మెట్టిదో తెలియదు. దీప కళిక అనునది ప్రత్యేకరచనాభేదముగాఁ జెప్పఁబడినది. కాని ఇటీవల నిది "యుదాహరణ" గ్రంథములలో నొక రచన భేదముగా నుండెనే కాని, ప్రత్యేకరచనాభేదముగాఁ గాన వచ్చుట లేదు. అరుదగు దాసయ్య అఱువత్తుమూఁడు చరితం బులను, బసవపురాణంబును ఏలలువెట్టుచు నింపుసొంపారు శైలిలో జదివినారట. ఏలలువెట్టుచుఁ జదువుట యనఁగా రెండేసిపాదములకో, మూడేసిపాదములకో నడుమ నే మహా దేవుని పేరో రాగవరుసతో నుచ్చరించుచు జదువుట కావచ్చును. ఏలపాట లనునవి తరువాతి యక్షగాన గ్రంథ ములలోఁ జేర్పబడి యున్నవి. ప్రత్యేక రచనలుగాఁగూడ కలవు. సుగ్రీవ విజయములోని యేల యొకటి యిట్లున్నది :

"భానువంశ మూన బుట్టి
దానవకా మీని గొట్టి
పూని మఖము నిర్వహింపావా, ఓ రామచంద్ర
మౌనివరులు సమ్మతింపంగా.
రాతి నాతి జేసి పూరా
రాతిచేతి విల్లు విరిచి
భూతలేంద్రులెల్ల మెచ్చాగా, ఓ రామచంద్ర
సీతనూ వివాహమాడావా."

ఇట్లే ఏలలలో నడుమనడుమవచ్చు "ఓరామచంద్ర" అను సంబోధనలను బోలిన సంబోధనలతోఁగూర్చి బసవ పురాణాదులను జదివియుందురు. ఈ యేల లనునవి నాలు గేసి సూర్యగణములతోఁగూడిన నాలుగు పాదములు గలిగి నడుమ సంబోధనలతోఁ గూడినవిగాఁ గనబడుచున్నవి. బసవగీతము లేగాక సకలపురాతన చారుగీతములుగూడ పాడఁబడుచుండెనని చెప్పుటచే నవి పాటలలో భేదము లే కాని గీతపద్యరచనలు కావని తోఁచుచున్నది. ఇట్టి వనేక విధములగు పాటలు, స్తోత్రములు, గీతములు మొదలగు రచనాభేదము లా కాలమున జనసామాన్యమున ప్రచారములో నుండెడి వనుట నిక్కము. ఇక నా శివరాత్రి జాగరమున వేడ్కలు, ప్రదర్శనములు ననేక రీతులుగ నున్నవి[1].

---

1. "ప్రమథపురాతనపటుచరిత్రములు
క్రమమొంద బహునాటకము లాడువారు
భారతాదికథల జీరమరుగుల
నారంగ బొమ్మల నాడించువారు
ఆదట గంధర్వ యక్షవిద్యాధ
రాదులై పాడెడు నాడెడువారు
పురములు గాల్చినపోల్కి యాడుచును
సతికర్ధమిచ్చిన పోల్కియాడుచును
యతులు గొల్వగ నున్నయంద మాడుచును
గంధగజాసురు గడపుటాడుచును
జన్నంబు ద్రుంచినచాళి నాడుచును
వెన్నుండు గన్నిచ్చువేళ నాడుచును
గరళంబు దాల్చినకరణి యాడుచును."

బహునాటకము లాడిరట. తోలుబొమ్మల నాడించుచు భారతాది కథలను బ్రదర్శించుట, వీథిభాగవతములనుబోలు ననేక విధములగు ప్రదర్శనములలో శివుని బహువిధ చరిత్రములను నాటకములుగాఁ జేసి యాడుట మొదలగు వేడ్కలు జరిగినవి. దీనివలన నాటక రచనయు, బ్రదర్శనమునుగూడ నా కాలమున జనసామాన్యమున ప్రబలముగనే యుండెనని తెలియుచున్నది. అది యిటీవలి కాలమున బ్రదర్శింపబడుచుండెడి వీథిభాగవతములను బోలియుండునని సోమనాథుని వర్ణనలనుబట్టి మన మూహింపవచ్చును. ఆ వేషములు, చర్యలు, ఆటలు, పాటలు, గంతులు, చిందులు మొదలగువాని వర్ణనము[1] చూడ సోమనాథుని కాలము

---

1. "భసితంబు ఫాతపై జరుగు బచ్చెనలు
నసలారు చిరుగద్దియలు నందియలును
గరమొప్పు తొంగళ్లు గల చల్లడములు
బొల్చు దంతావళుల్ పుష్పమాలికలు
దాల్చి నృత్యాస్ఫాతోత్సవలీల దనర
జనులు హర్షింప నా స్థానముల్ సొచ్చి
యనుకూల వివిధ వాద్యసమ్మేళనమున
నార్భటంబిచ్చి యొయ్యన జవనికల
గర్భంబు వెడలి యక్కజము వట్రిల్ల
నిక్కుచును ద్రిభంగి నిలుచుచు నట్లు
చొక్కుచు సభ జూచి యొక్కింత నగుచు
అలరి శిరఃకంప మాచరించుచును
తనుపాదఘట్టన దనరు సుఘటన
లనునయించుచు నందియల్ గదల్చుచును

నుండియు, నంతకుఁ జిరపూర్వమునుండియు గూడ, నిప్పటి వరకు నీ వీథినాటక ప్రదర్శనము లోకరీతినే యున్నవాయని యాశ్చర్యము కలుగక మానదు. ఆంధ్రలోకమున నిట్టి నాటక ప్రదర్శనములు పండితపామరజనుల కాకాలము నుండియు నానందమును గూర్చుచున్నవి గనుకనే కాఁబోలును శిష్టకవులు ౧౯-వ శతాబ్దివరకు నాంధ్రమున నాటక రచనాభారమును వహింపలేదు. ప్రాచీనమగు నీ రీతి నాటక రచనకు దక్షిణదేశమున నాయకరాజుల కాలమున రాజావలంబనము కలుగుటచేఁ గొంత సంస్కార మేర్పడి యక్షగానరూపమునఁ బెక్కు గ్రంథములు వెలసి నిలుచుట తటస్థించినది. ఈ యక్షగానములందే యనేక రీతులగు దేశీయచ్ఛందోబద్ధములగు రచనావిశేషములు నిలిచియుండుటచే వాని స్వరూపములనైనను మన మిప్పుడు తెలిసికొనుట కవకాశము కలుగుచున్నది. ఇందలి దేశీయచ్ఛందో రచనాభేదము లనేకము లిప్పటికిని పామరజనులు, ముసలమ్మలును పాడుకొను పాటలలో నిలిచియుండుటచే నివి

జతులు పాడుచు దాళగతుల కొడుచును,
గంతులు వైచుచు......
నొడ్డోరంబుల నొఱసి తిర్గుచును
బురములు గాల్చినపోల్కి యాడుచును
సతి కర్థమిచ్చిన చందమాడుచును
గరళంబు దాల్చినకరణి యాడుచును
వెండియు భవు బహువిధ చరిత్రముల
ఖండితగతి నాటకంబు లాడుచును."

ప్రాఙ్నన్నయార్యయుగము నుండియు మనకు సంక్రమించిన దేశీయాంధ్రకవితా వైభవమే యని గ్రహింపవలసియున్నది. ఈ పదములు, పాటలు, గీతములు మొదలగునవే యాంధ్ర కవితా వైభవమునకు మూలధనము; ఆంధ్ర వాఙ్మయ మహాసౌధమునకు పునాదులు; ఆంధ్రభాషా సారస్వత మహావృక్షమునకు మహత్తర మూలములు, తల్లివేళ్లు.

ఆంధ్రకన్నడ సారస్వత వృక్షములింకను లేతపరువున నుండగనే సంస్కృతసాహితీ మహావృక్షములో నంటగట్టఁబడినవి. కావుననే యాయంట్లు శీఘ్రకాలముననే యతుకుకొని క్రొత్తవృక్షములై యతిరుచ్యములగు నూతన స్వాదుఫలముల నొసంగ మొదలిడినవి. ఈ ప్రయత్నము సుమారు క్రీస్తుశకారంభముననే జరిగియుండును. అప్పటికే తమిళ సారస్వత వృక్షము ముదురుబారి ఫలవంత మగుటచే నాంధ్ర కన్నడము లందువలె సరియైన సమ్మేళనము కుదుర లేదు. అంటుకట్టుటలోను, దోహద క్రియలోనుగూడ కొంత భేదమేర్పడి పోయినది; ఆయా దేశములం దప్పటి సాంఘిక, రాజకీయ పరిస్థితులే దీనికి ముఖ్య కారణము. కావుననే తమిళ సంస్కృతభాషా వృక్షముల యంటుసరిగా నంటుకొనకుండుట, నూతన వృక్ష ఫలముల కొక వింతరుచి కలిగినను మొదటి తమిళభాషా సారస్వత ఫలముల పొంకము వాసన, రుచియు పోకుండుట తటస్థించినది. కన్నడాంధ్రములలో నీ క్రొత్త అంట్లు చక్కగనే యేర్పడినవిగాని, అవి నాటఁబడిన క్షేత్రములందు కలిగిన దోహదభేదముచే గాబోలు నొకదానికంటె మఱియొకటి యతిశీఘ్రకాలముననే

ఫలవంతమగుట తటస్థించినది. క్రీస్తుశకము నాల్గవ శతాబ్దమువరకు సామాన్యముగా హిందూదేశమందంతటను బౌద్ధమత ప్రాబల్యము కలిగినది. అందు దక్షిణాపథమున, ముఖ్యముగా నాంధ్రకన్నడ దేశములందు పాలకులు బౌద్ధమతాభిమానులే యగుటచే నా కాలమున ప్రాకృతమే రాజకీయ భాషగా నేర్పడుటయుఁ దటస్థించినది. ఆ కారణముచే జనసామాన్యవ్యవహారములలో నున్న తెలుఁగు కన్నడభాషల కప్పుడు గలిగిన సన్నిహిత ప్రాకృతభాషా సాహిత్య సంపర్కమువలనఁ దత్పదజాలము, సాహితీరీతులు కొంతవఱకీ భాషలలో సంక్రమించినవి. సంస్కృత ప్రాకృత భాషాపండితులు దేశభాషా సాహితీరీతులను గనిపట్టి వానిని సంస్కృత ప్రాకృతభాషాసాహితీరీతులతో సమన్వయించి దేశభాషలకు లక్షణము నేర్పరుపఁ దొడంగిరి. సంస్కృత భాషాసాహిత్యము లప్పటికే లక్షణ సహితము లై యుండుటచేఁదల్లక్షణ దృష్టితో నేర్పరుపఁబడిన దేశభాషా సాహిత్య లక్షణములు నా దృష్టికి ప్రతిబింబములే యగుటలో నాశ్చర్యములేదు. ఆంధ్ర కన్నడ భాషలలో వెలసియున్న దేశికవిత యప్పటి పండిత కవులకు సంస్కృత సాహిత్యము ముందు విశేషముగా నచ్చకపోవుటచే వారు దీనియెడల ననాదరభావము కలవారైనను, సంస్కృత భాషారూపములను, సాహిత్యరీతులను, ఛందోరీతులను దేశభాషలలోనికి దింపి వీని కొక విధముగ గౌరవమును గలిగింపఁజూచిరి. వీరి యీ యుద్యమము కారణముగా నప్పటినుండియే యీ భాషలలోఁ దత్సమ పదజాలము విశేషముగా జేర మొదలు

పుట్టినది. సంస్కృతపద భూయిష్ఠమగు నీ భాష శిష్ట జనసంఘమునందు మాత్రమే వ్యాప్తిలోనికి వచ్చి జనసామాన్యములోని కంతగా దిగియుండలేదు. కావుననే యంతకుఁ బూర్వము జనసామాన్యమునందు వ్యాప్తిలోనున్న తెలుఁగు కన్నడభాషలకును, శిష్టజనసంఘమునందలి యీ సంస్కృత భూయిష్ఠమగు తెలుఁగు కన్నడభాషలకునుగల యంతరము విశేషము కాఁజొచ్చినది. రాజాస్థానములయందలి సంస్కృత ప్రాకృతాది భాషా పండితులయిన శిష్టకవులు తత్సమ భూయిష్ఠమగు నీ శిష్టభాషలో రచించిన గ్రంథములకే రాజావలంబనము కలుగుటచే నీ శిష్టభాషకే ప్రామాణ్య మేర్పడుస్థితి కలిగినది. ఈ శిష్టకవులకు సామాన్యజనుల భాషయందుగాని, ఆ భాషలో రచింపఁబడిన కవితయందు గాని, యాదరము లేకపోవుటచే నవి వీరి యీసడింపులకు మాత్రమే గురియగుచువచ్చినవి. ఈ స్థితి కన్నడభాషలో ౮, ౯ శతాబ్దములనాటికే కలిగినదని కవిరాజమార్గము వలననే తెలియవచ్చుచున్నది. ఆంధ్రకన్నడ భాషా సాహిత్యములలో నీ కవిరాజమార్గమే మనకు లభించిన మొదటి గ్రంథమగుటచే, తద్భాషాసాహిత్య చరిత్రాన్వేషణ సందర్భమున నిది మిగులఁ దోడ్పడఁగలదనుటకు సందేహము లేదు. కన్నడములోని యప్పటి తత్సమభాషారచనను బ్రోత్సహించుచు నంతకుఁబూర్వము, లేదా అతని కాలము నకుగూడ సామాన్యజన వ్యవహారములో నుండిన పటి గన్నడములోని కావ్యరచనమును గూర్చి యీతఁడేమి చెప్పియున్నాఁడో చూడుడు :

"అరిదాదంకన్నడదొళ్
శిరికొఞ్ఞాంక్షణియె పేళ్వెనెంబుదిదాగ్గఱం
పరమాచార్యరవోల్స
ఝ్ఝరలఱియర్ కన్నడక్కెనాడవరోజర్."

(కన్నడభాషా స్వరూపమును నేను బాగుగా చెప్ప గలుగుదు ననుట మిక్కిలి అసాధ్యము. అది పరమాచార్యు లకే బాగుగా తెలియదు. కన్నడదేశీయులగు జనులే ఆ విషయమున సమర్థులు.)

"దోసమిని తెందుబగెదు
ద్భాసిసితఱిసందు కన్నడంగళొళెందుం
వాసుగియుమఱియలారదె
బేసఱుగుం దేశిబేఱె బేఱప్పుదఱిం."

దేశి వేరువేరు విధముగా నుండుటచేత కన్నడభాష లోని దోష మింత యని విచారించి నిశ్చయముగాఁ జెప్పు టకు వాసుకికిఁగూడ సాధ్యము కాదు. వేసటకూడ కలుగు నట. కావున దానికి, అనఁగా నీ కన్నడ దేశీయభాషకు, లక్షణము చెప్పుట సాధ్యము కాదు అని తేల్చినాఁడు. 7–వ శతాబ్దినాటి తెలుఁగుభాషయు నట్లే యుండెడిదని యప్పటి శాసనములనుబట్టి తెలియుచునేయున్నదిగదా. అయినను అప్పటికి నిలిచియున్న కావ్యములను ఆ కావ్యముల లక్షణ మును సతతముగా–అవశ్యాదరణీయములుగా నెంచి శాస్త్ర మును, లేదా లక్షణమును బాగుగా నెఱుఁగనివారు ఆ

పఱగన్నడమును పాడుచేసి చెప్పెదరు. అది అందము కాదని వారికే తెలియును.[1] ఆ ప్రాతకన్నడము పురాణ కావ్య ప్రయోగమున నా కాలమునందు సొగసుగా నున్నను (ఇప్పటి) వారి దృష్టికి జరద్వధూవిషయ సురతరస రసికతను బోలి విరసం కరమగును[2] అని యిట్లు ప్రాచీన కన్నడభాషలోని కవితారచనాప్రయత్నమును నిరసించి కవిరాజమార్గకర్త సమసంస్కృతమును కన్నడభాషలో మిశ్రముచేసి చెప్పుటనుగూర్చి ప్రశంసింపఁ దొడగినాఁడు. అనఁగా ప్రాచీన కన్నడభాషను త్రోసిపుచ్చి సంస్కృత భూయిష్ఠమగు తత్సమభాష నెట్లు కల్పించుకొనవలెనో, ఎట్లు వాడుకొనవలెనో చెప్పినాఁడన్నమాట. ఈ దేశభాషలలో సంస్కృత శబ్దముల నెట్లు చేర్చుకొనవలెననున దే యీ కాలపు శిష్టకవులను, లక్షణకర్తలనుగూడ బాధించిన ప్రధాన విషయము. కొందరు సంస్కృతా వ్యయములను, విభక్త్యంతములగు శబ్దములనుగూడ దేశభాషా శబ్దములతోఁ జేర్చి ప్రయోగించి వానికి సమన్వయము కల్పించి మణిప్రవాళ శైలిని రచింపఁ దొడఁగి యుందురు. కాని ఇది శిష్టకవులలోఁ

1. నెలసిద కావ్యం కావ్య
క్కెలక్షణం సతతమెంసె పఱగన్నడమం
పాల(గె)డిసి నుడివరాగమ
బలహీనర్ జేసియల్ల దెందరిదిదుఃం ౧-౪౮

2. దొరకొండిరె సొగ యిసుగుం
పురాణకావ్యప్రయోగదోల్ తత్కాలం
విరసంకరమవు దేసిగె
జరద్వధూవిషయ సురత రసరసికతవోల్. (౨౦)

గొందరకు రుచించినట్లు లేదు. కావుననే యిది "యాగమ కోవిదనిగదితమార్గము" కాదని కవిరాజమార్గకర్త దీని నాక్షేపించినాడు.[1] అహరహః, ఉచ్చైః, నీచైః, ముహుర్ముహుః, ఇతస్తతః, అంతః, బహిః మొదలగు సంస్కృతావ్యయములను కన్నడమునఁ బ్రయోగింపఁ గూడదు. అట్లు చేసినచో గరడెయు మద్దెళయు కలిపి వాయించినప్పుడు కలుగు జర్ఝరధ్వనివలె పరుషతరమై యుండునట. "బహిరంతరుపవనంగళొళ్ అహరహ మాపరభృతంగళలివరవంగళ్" అని చెప్పగూడదు. "బహిరుద్యానాంతరదొళ్ సహసోదితమత్త కోకిలోచ్చైర్ధ్వానం" అని సంస్కృత సమాసములుగాఁ జేసియే చెప్పవలయును. అరసకుమారం, ఆయతతరకడెగణ్ణం—ఈ రీతి అరిసమాసములుకూడ పనికి రావు. "నరపతితనయనం, ఆయతతరళాపాంగం" అనియే చెప్పవలయును.

ఇట్టి సంస్కారమే తరువాతికాలమున నన్నపార్యుఁ డాంధ్రభాషకును జేసియాంధ్రభాషావాగనుశాసనుఁడైనాడు. ఇందాతనికిని నృపతుంగాది కన్నడ లాక్షణికులు, కవులునే మార్గదర్శికులై యుందురనుటకు సందేహము లేదు. తరువాతి కేతనాది లాక్షణికులుగూడ తత్సమభాష యెట్లు కల్పింపవలెనో యను విషయమును దెలుపుటలోనే చాల శ్రద్ధ

1. సమసంస్కృతంగళొళ్ త
ళ్తమఱదిరే కన్నడమనఱిదు పే(ర్గెం)బుది దా
గమకోవిదనిగదితమా
ర్గమిదం బెరసల్కెమాఱదీ సక్కదదొళ్.

పఠించినాఁడు. వృక్షేణ, దక్షాయేత్యాది సంస్కృత విభక్తులు, పచతీత్యాది క్రియలు, అపి, చ, తు, హీత్యాది అవ్యయాములు తెలుఁగునఁ జొనిపి చెప్పఁగూడదని కేతన ప్రత్యేకముగా నిషేధించినాఁడు.[1] కావున నా కాలమున సంస్కృతమును తెలుఁగుచేయుట యెటులా యను విషయమే లాక్షణికులకును బాధించినట్లగపడుచున్నది. ఈ లక్షణము సంస్కృత పండితులకొరకే చేసిరా యనునట్లే యాంధ్రకన్నడ భాషాలక్షణములను గొందరు సంస్కృత భాషలోనే రచింపఁదొడంగిరి. ఇట్లే దేశభాషలు తత్సమ భూయిష్ఠములైనకొలది పఱిగన్నడము, దేశితెనుఁగు అనునవి, వానిలో రచింపఁబడిన కవితతోపాటు వెనుకఁబడి పోయినవి. ఇది భాషావిషయము.

ఇక కవితాసామగ్రియగు కథాంశములు గుణదోషాలంకారాదులన్నియు సంస్కృతాలంకారికుల రచనల యను

---

1. "వృక్షేణదక్షాయ పక్షిభిః పుత్రస్య
యను విభక్తులు దెనుంగునకుఁ జొరవు
ఆస్తిప్రయాతిగాయంతిభుంక్తే సంతి
నయతిస్మరతి యను క్రియలు సొరవు
గత్వాహసిత్వాప్రకాశ్య సంత్యజ్య నాఁ
దనరుత్వాంతల్య బంతములు సొరవు
గచ్ఛంప్రక్రీడిప్రహాంసుం శ్రుతంపాతు
మనుతుమున్నంతంబులరయఁ జొరవు
అపిచతుహివైనవా ననుఅనఁగఁ బెక్కు
లవ్యయంబులు చొరవెందు నాంధ్రకవిత
బెఱపదంబులతోడను దొరలినిల్చు
నని తెనుంగులు గావింతు నభిమతముగ" ఆం. భా. భూ.

కరణములే. ఆ కాలమున దండిభామహాదుల ననుసరించి గుణదోషాలంకార ప్రకరణములను రచించిన కవిరాజ మార్గమే దీనికి నిదర్శనము. తెలుఁగున విన్నకోట పెద్ద నాదులు నట్లే చేసిరి. సంస్కృతమున ప్రతాపరుద్రీయము నకు బదులుగాఁ దెలుఁగున సరసభూపాలీయము వెలసినది. అందలి ధ్వనిభేదములకు, రీతి గుణాలంకారాదులకు మూల గ్రంథములనుబట్టి యాయా లక్షణకర్త లుదాహరణములను స్వయముగ కల్పించిరేకాని, తెలుఁగు కవుల రచనలలో నుండి యుదాహరించి వాఙ్మయముతో లక్షణసమన్వయము చేసి చూపుటకు వారు యత్నింపలేదు. సంస్కృత పదము లను, సమాసములను దెనుఁగునఁ జేర్చుట యెట్లో యను విషయమున వైయాకరణులు తాపత్రయము పడినట్లే, సంస్కృతచ్ఛందోలంకార పద్ధతిని తెనుఁగులోనికిఁ దెచ్చు టయే వీరు తమ ధర్మమనితలచి దానిని నెరవేర్చిరి. ఈ లక్షణమునుబట్టి ముందెవ్వఁడైనను వ్రాయనేమో యని కాబోలు. కన్నడమున కవిరాజమార్గకర్త కన్నడ ఛంద స్సునుగూర్చి వ్రాయలేదు. తెలుఁగున కవిత్రయమువలెనే కన్నడమున రత్నత్రయమును, భారతాది సుప్రసిద్ధ గ్రంథ ములను రచించిన తరువాతగాని ఛందోలక్షణమును గూర్చిన గ్రంథము బయలువెడలలేదు. క్రీ. శ. ౧౦-వ శతాబ్ద్యంత మున "ఛందోంబుధి" యను ఛందోలక్షణ గ్రంథమును రచించిన మొదటి నాగవర్మ రత్నత్రయమునకు దరువాతి వాఁడే. మరియు నీకన్నడ కవులందరునుగూడ నన్నయకుఁ బూర్వులే. నాగవర్మ ఛందోంబుధి వ్రాయుటకుఁ జిర

పూర్వమే, అనఁగా మూఁడువందల సంవత్సరములకుఁబూర్వమే కన్నడభాషలో సంస్కృత వృత్తరచన ప్రారంభమైనది. క్రీ. శ. 200 నాటి శ్రావణ బెళగొళ శాసనములలో సంస్కృత వృత్తములలో రచింపఁబడిన చక్కని కన్నడ పద్యములు గలవు. అంతకుఁ బూర్వపు శాసనములు వచనమునందే యున్నట్లగపడుచున్నవి. తెనుఁగునందును ఇప్పటికి లభించిన ౭, ౮ శతాబ్దులనాటి శాసనములన్నియు వచన రచనలతోఁ గూడినవే. శాసనములలో పద్యరచన ౯-వ శతాబ్దినుండియే గానవచ్చుచున్నది. అయితే ౮-వ శతాబ్ది నుండియు కన్నడ శాసనములు సంస్కృతవృత్తబహుళములై యుండఁగా, దెనుఁగు శాసనములలోని పద్యములు-నన్నయ కాలమువరకును, అతని కాలమునగూడ-దేశీయ ఛందో రచనలేమై యుండెనుగాని సంస్కృతవృత్త రచన లింత వరకు గనబడలేదు. ప్రాచీన కన్నడశాసనములలో దేశీయ ఛందోరచన లత్యల్పముగా నున్నవి. దీనినిబట్టి సంస్కృత భాషాచ్ఛందోలంకార లక్షణ ప్రభావ మాకాలమున, అనఁగా (నన్నయకు ౨ శతాబ్దములకు బూర్వము) చాళుక్య ప్రభువుల కాలమున నాంధ్రభాషా కవితలపై — కన్నడ భాషా కవితలపైవలె — నంత ప్రబలమై యుండలేదని తోచుచున్నది. దీనికిఁ దగిన కారణమును లేకపోలేదు. కన్నడ వాఙ్మయమునందలి తొలియుగము జైన యుగము. ఈ యుగమునందలి ప్రసిద్ధకవులు, కవిరాజ మార్గకర్త, పంప, పొన్న మొదలగువారిచే ప్రాచీన కవులుగా నెన్నఁ బడిన సమంతభద్ర, పూజ్యపాద, కవిపరమేష్ఠి, విమలోదయ,

నాగార్జున, జయబంధు, దుర్వినీతాదులు జైనులు, జైన మతాభిమానులునైనను గొప్పసంస్కృత పండితులు. అందు వ్యాకరణాది గ్రంథములనుగూడ రచించినవారును కొందరు గలరు. వీరందరును క్రీ. శ. ౫, ౬, శతాబ్దములవారుగాఁ దలంపఁబడుచున్నారు. కావున నప్పటినుండియుఁ గన్నడ భాషలో బండితకవులు కవితారచనను బ్రారంభించియుండిన యెడల ౭, ౮ శతాబ్దములనాటికి శాసనములలోఁగూడ సంస్కృతవృత్తములలో రచింపఁబడిన కన్నడ పద్యము లగపడుటలో నాశ్చర్యమేమున్నది? క్రీ. శ. ౮-వ శతాబ్ది నాటి శ్రావణ బెళగొళ శాసనపద్యములలో నొకటి (Ep. car, II. 88): మహాస్రగ్ధర—

"సురచాపంబోలె విద్యు
ల్లతెగళ తెఱవోల్ మంజువోల్ తోఱిబేగం
పిరిగుం శ్రీరూపలీలా
ధనవిభవమహారాశిగళ్ నిల్లవార్గఁం
పరమార్థఁం మెచ్చెనా నీ
ధరణియొళ్ ఇరవా నెందు సన్యాసనంగె
య్దురు సత్వన్ నందిసేన
ప్రపరమునివరన్ దేవలోకక్కె సన్దాన్.

ఇందలి "శ్రీరూప...రాశిగళ్", "నంది...... వరన్" ఇత్యాది దీర్ఘసమాసములు కన్నడముపై సంస్కృత భాషా ప్రాభవమును దెలుపుచునేయున్నవిగదా. ఇట్లే మత్తేభము, శార్దూలము, వసంతతిలకాది వృత్తము లనేక ములు శాసనముల లోనికే యెక్కినవి. కాని యీ వృత్త

ములకన్నిటికి నేదో విధముగా నొక దేశీయతాముద్రవేయ నిది వీరు కన్నడముననూ గ్రహింపలేదు. వీని కీ దేశీయత ద్వితీయాక్షర ప్రాస నియమమువలనఁ గలిగింపబడినది. ఇది దేశీయములగు అక్కర, చౌపది, తివది మొదలగు పద్యములందువలెనే సంస్కృతమునుండి గ్రహింపఁబడిన వృత్తములందును బాటింపఁబడినది. ఇంతేకాక సంస్కృత మందలి విశ్రమరూపమగు యతి నియమమిం దుల్లంఘింప బడినది. ఈ యతివిలంఘన మనునది కన్నడ కవితా విశేష లక్షణములలో నొకటిగా కేశిరాజు శబ్దమణి దర్పణమున పుటకొన్నిటితోఁ జేర్చి యిట్లు చెప్పినాఁడు :

"గమక సమాసదిం అళకుళక్షళదిం
శృతిసహ్యాసంధియిం
సముచితమాగి బర్పసతిస ప్తమియిం
సమసంస్కృతో క్తియిం
వమహాపభేదదిం విరహితావ్యయ
సంస్కృత లింగదిం పదో
త్తమ శిథిలత్వదిం యతివిలంఘనదిం
దరిద త్తెకన్నడం."

సంస్కృతమునందలి యార్యాజాతిభేదమగు ఆర్యా గీతి ప్రాకృతమున "ఖందనీ" అనుపేర బరగినదై కన్నడాంధ్రములలో "కంద" పద్యమైనది. ఈ రెండు భాషలలోనుగూడ నీ దక్షిణదేశ భాషాసంప్రదాయసిద్ధ మగు ప్రాసనియమ మీ కందపద్యమునఁగూడఁ బాటింపఁ బడినది. ఇట్లు సంస్కృత ప్రాకృత వృత్తములలోనికిఁ

కూడ నెగ్రాకిన యీ ప్రాసనియమము కన్నడాంధ్ర భాషా సామాన్యములగు అక్కర, చౌపది, రగడ, ఉత్సాహ, షట్పది, తరువోజ మొదలగు దేశీయపద్యము లన్నిటిలోను సహజముగా నున్నదే. కన్నడాంధ్ర లక్షణ కర్తలు పై దేశీయ పద్యములకు జాతులని పేరు పెట్టి యున్నారు. కన్నడమున "గీతికె" అనుదానికిఁగూడ నీ ప్రాసనియమ ముండుటచే నది జాతులలోనే చేరును. తెనుఁగునందలి "గీతము"నకుఁ బ్రాసనియమము లేదుకాని వడినియమము మాత్రము కలదు. ఇంతేకాక పద్యలక్షణ మందే యీ రెంటికిని భేదమేర్పడినది. తెనుఁగున సీసమను నది ప్రాసనియమములేని మఱియొక దేశీయ పద్యభేదము. ఈ గీతమును, సీసమును జేర్చి యుపజాతులను నొక తెగ కల్పించినారు తెలుఁగులాక్షణికులు. వీని భేదము నప్పకవి యిట్లు వివరించినాఁడు :

"జాతులు కందాదిక ముప
జాతులు గీతాదికములు సరసిజనయనా"
"గురులఘువులలో నెయ్యది
మురసంహర ప్రథమపాదముఖమున నిలిచెఁ,
ధర నుపజాతులు దక్కఁగ
బరగ నిలుచు నదియె నాల్గుపదముల మొదలన్.
ధరణిన్ జాతుల కాదివర్ణ మొకడే
తప్పంగరా దెల్లడన్
హరి తజ్జాతిగణంబులైన సరి యి
ట్టట్లైన గావచ్చు మం

దరధారీ యుపజాతులం బ్రథమవ
ర్ణంబుల్ యథేచ్ఛంబుగా
సారిదిం జెప్పగవచ్చుఁ బ్రాసములు ని
ల్చు న్వాళ్లకై యొక్కచోన్."

ఇట్లు తెలుఁగు కవితలోని పద్యరచనలో సంస్కృత మందుగాని, కన్నడమందుగాని లేని వడి నియమమొక ప్రత్యేక విశేషముగాఁ గనఁబడుచున్నది. కన్నడ కవులు సంస్కృత వృత్తములలోని విచ్ఛేదరూపయతినే యుల్లంఘించి యుండఁగా, తెలుఁగు కవులు కన్నడాంధ్రములకు సమానమై దేశీయ సంప్రదాయసిద్ధమగు ప్రాసమునే కాక యతిస్థానమున వర్ణసామ్యరూపమగు వడినిగూడఁ బ్రవేశపెట్టినారు. ఇది కన్నడాంధ్రములకు సమానములేయగు అక్కరాది దేశీయచ్ఛందోరచనలలోగూడ కన్నడమున బాటింపఁబడక తెలుఁగులో బాటింపఁబడు చుండుటనుబట్టి యతిచిరకాలము క్రిందటనే కన్నడాంధ్రములలోని దేశీయకవితారచన భిన్న మార్గములనుబట్టి సాగుచున్నదని తలంపఁదగియున్నది. ఈ వడి, ప్రాసనియమములు రెండునుగూడ సంస్కృత ప్రాకృత కవితా సంప్రదాయసిద్ధములు గావు గనుక, నవి ప్రాచీన దేశీయ సంప్రదాయసిద్ధములని తలంపవలయును. ఈ భాషల లోని ప్రాచీన శాసనయుగమునకుఁ బూర్వస్థితి యంధకార మయమే కావున, వీనికి సన్నిహితమగు తమిళభాషా వాఙ్మయమందలి కవితా సంప్రదాయములనుబట్టి పరిశీలించి నచో నొక మార్గ మేర్పడవచ్చునని తోచుచున్నది. తమిళ భాషా వాఙ్మయము తక్కిన దక్షిణదేశభాషలలోని దానికంటె

సతి ప్రాచీనమైనదని యిదివరకే తెలుపఁబడినది. అందు సంఘ వాఙ్మయ మనునది క్రీస్తుశకారంభముననే మిగుల నుచ్చస్థితిలో నున్నదనుటకు సందేహము లేదు. ఈ వాఙ్మయ మునుబట్టియు, నా కాలపు ప్రధానలక్షణ గ్రంథమగు ''తొల్కాప్పియ''మును బట్టియుఁ దత్కవితా సంప్రదాయ ములను మనము గ్రహింపవచ్చును. వాని మూలమున నాంధ్రకన్నడ కవితా సంప్రదాయములయందలి విశేష లక్షణములు కొంతవరకు సమన్వయము కాకపోవు.

ప్రస్తుతము కన్నడాంధ్రములందు విశేష లక్షణ ములుగాఁ గనఁబడుచున్న యీ ప్రాసవళ్ళనునవి తమిళము నందలి 'తొడై' అనుదానికి సంబంధించియున్నవి. 'తొడై' అనఁగా మైత్రి-అక్షరమైత్రి. ఇది యైదువిధములుగానున్నది. మోనై త్తొడై, ఎదుగైత్తొడై అనునవే ఆంధ్ర కన్నడములందు యతిప్రాసరూపములుగాఁ బరిణమించినవని చెప్పవచ్చును. వీనిలో నొక్కొక్కదానిలో నెనిమిదేసి రీతులు గలవు.[1]

1. అడిమోనై—పాదములోని అన్ని శీర్ల మొదటి అక్షరములు మైత్రి కలిగియుండుట.
2. ఇణైమోనై—ప్రతిపాదములోని మొదటి రెండు శీర్ల మొదటిఅక్షర ములు మైత్రికలిగియుండుట.
3. పొళిప్పుమోనై—1-3, 2-4 శీర్ల మొదటి అక్షరమునకు మైత్రి.
4. ఒరూఉమోనై—1-4 శీర్ల మొదటి అక్షరముల మైత్రి.
5. కూళైమోనై—మొదటిదితప్ప అన్నిశీర్ల మొదటి అక్షరముల మైత్రి.
6. మేల్ కదువాయ్ మోనై—రెండవది తప్ప అన్నిటికి.
7. కీళ్ క్కదువాయ్ మోనై—తుది శర్ వెనుకటిది తప్ప తక్కిన వానికి మైత్రి.
8. మూర్రుమోనై—అన్ని శీర్ల మొదటి అక్షరము మైత్రి.

అందు - పొత్తిప్పుమోన్నై - అనునదొక పద్యములోని యొక్కొక్క పాదములోని మొదటిగణముయొక్క తొలి యక్షరము, మూడవగణముయొక్క మొదటి యక్షరముతో మైత్రిగలదై యుండుట. రెండవగణ నాల్గవగణముల తొలి యక్షరములుకూడ మైత్రికలిగియుండవలెను. ఇది సామాన్యముగా పాదమునకు నాలుగు గణములు గల పద్యములను గూర్చి చెప్పినట్లే కనఁబడుచున్నది. కావున మన దేశీయ పద్యములలోఁ బ్రధానములగు ద్విపద, తరువోజ, సీసము, రగడ మొదలగు వానినుండి మన ముదాహరించుట కవకాశము కలుగవచ్చును.

ద్వి. సురపతి-త్రితయంబు-సూర్యుఁ డొక్కండు
విరమంబు-రెంటిపై-వెలయునొ-క్కటికి.

ద్విరదగతిరగడ-కర మొప్పు పంచలఘు-గణచతుష్టయముచే
విరమంబు రెంటిపై-ద్విరదగతి పేరిచే.

సీ. విజయసా-రథిగాని-వినుతింప-గా నొల్ల
గిరినాయకునిగాని-కీర్తిసేయ...

పై వానిలో మొదటి గణము మూడవ గణముల మొదటి యక్షరముల మైత్రి కలదుగాని, రెండవగణము నాలవగణముల మొదటి యక్షరముల మైత్రి పాటింపబడలేదు. కాని యీ పద్యము లిటీవలి కాలమునాటివి. ప్రాజ్ఞన్నపార్య యుగములో నట్టివే యుండియుండవచ్చును. ఇప్పటికిని దేశీయములగు పాటలలోను, పద్యములలోను రెండవ విధమగు మైత్రి పాటింపబడినవి పరిశీలించిన లభింపవచ్చును.

ఒరూఢమోనై :-ఒక పద్యములోని నాల్గు పాదముల లోను ఒక్కొక్క పాదమునందలి మొదటి గణము యొక్కయు, నాల్గవగణముయొక్కయు మొదటి యక్షరములకు మైత్రియుండవలెను. తెనుఁగునందలి యాటవెలది, తేటగీతి మొదలగు పద్యములలో నిట్టి నియమము పాటింపఁబడుచున్నది.

ఆ-వె. మూఁడు నగణహగణ-ములు నలనామ
కములు హగణపంచ-కంబు గూర్ప
నాటవెలదియడుగు-లంబునిధులపట్ల
వ్రాలువళ్లు జెంది-వఱలెనేని.

గీ. నగణ మొక్కండు మఱి నల-నామకములు
రెండు నగణంబులును దుద-రెండునాలు
గడుగులును దేటగీతికి-నబ్ధివిరతి
వలయు వళ్లైన వ్రాలైన వరుస నిలుప.

"పువ్వు పేరే జాజి-పువ్వు
పురము పేరే అయోధ్య-పురము
దేవి పేరే సీతా-దేవి"

ఈ రెండురీతుల మోనైతప్ప తమళమునందలి తక్కిన ఆరు రీతుల మోనైలును తెలుఁగు శిష్టకవితలోని పద్యములలో గానరావు. వానికి ప్రాచీన దేశీయకవితలో నుదాహరణములు దొరకిన దొరకవచ్చును. తమిళ కవితలోఁగూడ నివి నియతములు గావు. ఐచ్ఛికములే.

కూత్తె మోనై :—తుదిగణమునతప్ప ఒక పద్య పాదములోని అన్ని గణముల మొదటి అక్షరములును మైత్రి గలిగి యుండవలయును.

గుడుగుడు గుంచం గుండే రాగం
పాముల పట్టం పడగా రాగం.
చమ్మచక్క చారెడేసి మొగ్గ
అట్లు పొయ్యంగ ఆరంగించంగ.

మూట్రుమోనై :— అన్నిగణములలోని మొదటి యక్షరములును మైత్రి గలిగియుండవలయును.

ఆంధ్ర కన్నడములలోని ప్రాసమును తమిళమున "ఎదుగై", లేదా "ఎదుగైత్తొడై" అని యందురు. పద్యమునందలి ప్రతిపాదములోని రెండవయక్షరము మైత్రి కలిగియుండుట. ఇదియు నా భాషలో నెనిమిది రీతులు గలిగియున్నది. వీనిలోఁ గొన్నిటికి మాత్రమే తెనుఁగులో నుదాహరణములు దొరకుచున్నవి.

అడియెదుగై :—అనఁగా నొక పద్యము అన్ని పాదములలోని మొదటిగణము రెండవయక్షరములు పరస్పరము మైత్రి కలిగియుండుట. ఇదియే యాంధ్ర కన్నడముల లోని జాతులను పద్యములన్నిటిలోనే కాక సంస్కృత ప్రాకృతములనుండి గ్రహింపఁబడిన పద్యము లన్నిటిలోను గూడఁ బాటింపబడుచుండినది. తెలుఁగున నుపజాతిగణములోఁ జేర్పఁబడిన గీత సీసపద్యములలో మాత్రము లేదు. కాని వీనిలో యతికి బదులుగా దీనిని వాడుట కలదు.

కావున నాలుగు పాదములలోను ప్రాసయతి వేసినయెడఁ నా పద్యముకూడ "అడియెదుర్గై" కలదగును. కన్నడ మున గీతికలలో నీ ప్రాసనియమముకలదు. తెలుఁగునందలి సర్వతఃప్రాససీసమున నీ "అడియెదుర్గై" పాటింపబడినదని చెప్పవచ్చును.

ఇర్గై యెదుర్గై:—అన్ని పాదములలోని మొదటి రెండు గణములలోని రెండవయక్షరములు మైత్రి గలిగి యుండవలయును. వృత్త ప్రాససీసము లేదా అక్కిలి ప్రాస సీసము అనునది దీని కుదాహరణము కావచ్చును.

శిక్షించె నెవ్వాఁడు చేటుకై సభలోనఁ
జెడుమాట లాడిన చేదివిభుని
రక్షించె నెవ్వాఁడు ద్రౌణిబాణముచేతఁ
జిదియకుండఁగఁ బరిక్షిన్నృపాలు
భక్షించె నెవ్వాఁడు పర్వతాకృతిచేత
నాభీరు లర్పించు నారగింపు
వీక్షించె నెవ్వాడు వేడ్కతో సేవకుల్
బ్రతుకునట్లుగఁ గృపాపాంగదృష్టి...

పొటిప్పెదుర్గై:-అన్ని పాదములలోను గణములలో నొకటి విడిచి యొకదాని రెండవ యక్షరములు మైత్రి గలిగి యుండవలయును.

సర్వతఃప్రాససీసము దీని కుదాహరణము కాఁగలదు.

వేదండవరదుండు వేధోండగాంగుండు
కాదేనశయనుండు యాదవేంద్రుఁ

జాదిత్యసంస్తుత్యుండు నౌదాససులభుండు
వేదాంతవేద్యుండు కాదనీలుఁ
జాది తేయుఁడు బిందు నాదకళాతీతుఁ
డాదిత్యకులుఁడు బాధితారి
మేదిని(శ్రీ)శుండు భూధరగాత్రుండు
శ్రీదమిత్రసఖుండు ద్వాదశాత్ముఁడు.

ఒహూడువెదుగ్గై :—అన్ని పాదములలోని ఒకటవ నాల్గవ గణములలోని రెండవ యక్షరములు మైత్రి కలిగి యుండవలయును.

అర్ధచంద్రికలు : అక్షర హారివిక–చాంబురుహాక్షుఁ
యక్షపసఖనుత–యదుకులదక్షుఁ
రక్షకసురవిదు–రద్విపరక్షుఁ
రాక్షసవిదళన–ప్రరుచిరవక్షుఁ.

ముత్రెదుగ్గై :—అన్ని పాదములలోని అన్ని గణముల రెండవ యక్షరములు మైత్రి కలిగియుండవలెను.

మధురగతిరగడ : కరధృతకరుహుని–గరిహితకరణుని
గరుహాసఖరుచిని–గరుడఖగధరుని
ఖరఘనకరవిని–ఖరతరకరగుని
గరళముఖరిపుని–గరధరకరతుని.

(అప్పకవీయము, ౫—౧౮౨)

పొటిప్పిమైప్పు అనునది ఇమ్మైప్పుత్తొడ్డై అనుదాని యెనిమిది భేదములలో నొకటి. ఇందు ఒకటి విడిచియొక

టిగా గణముల తుదినుండు అక్షరములు మైత్రి గలిగియుండ వలెను. దీని కప్పకవి గుచ్ఛబంధమున కుదాహరణముగా నిచ్చిన మాణవక వృత్త ముదాహరణము కాఁగలదు.

గాదిలితో మాలదిగా – గా దిలకించెం బదిగా
గాదిబకృష్ణుండదిగా – గాదిడవా చాలిదిగా.

ఇంకను వీనిలో భేదములు కలవుగాని వాని కుదాహరణములు తెనుఁగు కవితలో లభించుట దుర్లభముగా నున్నది. ఇంతవరకు తెనుఁగు కన్నడములలో నక్షరసామ్యరూపముగ నున్న యతిప్రాస లనునవి యేదో యలంకారము కొరకై మధ్యకవులు కొందరు తెచ్చి పెట్టుకొన్నవి కాక క్రీస్తుశక మునకుమున్నే తమిళ వాఙ్మయమునఁ బరిపాటిగా నిలిచియున్న ప్రాచీనద్రావిడ కవితా సంప్రదాయసిద్ధమైన "తొడై" అను దాని రెండురీతులతో సంబంధించినవే యని తెలుసుకొన గలుగుచున్నాము.

తొడై అనుదానిలో మఱియొక భేదము కలదు. ఇది ఇయైప్పుత్తొడై. ఇది పాదములలోని తుదిగణములయొక్క-గాని, అక్షరములయొక్క-గాని, మైత్రితో సంబంధించినది. దీని కుదాహరణముగా నొక కళిక.

"మఱియు బ్రహ్మమాయ గెల్చి-మసలుమంత్రవాది చేత
నెఱిగి సాంభకునకు వరము-లిచ్చి మెఱయుమోదిచేత"

లాలిపాట–"లాలి శంకరసదా లాలితకుమారా
లాలి పటుతాండవోల్లాస ఘనధీరా"

"భూదేవికూతుర్ని కోయిలారో
జనకునికూతుర్ని కోయిలారో
దశరథుకోడల్ని కోయిలారో
శాంతకు మరదల్ని కోయిలారో"

"వద్దనగూడదమ్మా – వినవమ్మ
ఎఱ్ఱావుపాలుసుమ్మా,
ఎఱ్ఱగా గాచిరమ్మ – మాయమ్మ
జుఱ్ఱవే ముద్దుగుమ్మా
సుదతి భుజియించలేకా – నిజప్రసవ
వేదనకు నిలువలేకా
నొప్పులని చెప్పలేకా – చెప్పకను
చెలుల కనుగప్పలేకా."

దీనిలో ననేక భేదములు కలవు: అడియిమైప్పుతొ్డై —ప్రతిపాదములోని మొదటిగణము తుదియక్షరముల మైత్రి.

"గుమ్మడేడే గోపిదేవీ
గుమ్మడేడే కన్నతల్లి
గుమ్మడిని పొడచూపగదవే
అమ్మ గోపెమ్మా"

"తొడై"లో మఱియొక భేదము అళపెడైతొడై. పద్యములలోని గణములకొరకు కొన్ని అక్షరములను పొడిగించుట. ఒకపదము ఆదియందుగాని, మధ్యనుగాని, అంతమందుగాని ఒక దీర్ఘాచ్చుకు హ్రస్వాచ్చును చేర్చవచ్చును. హ్రస్వాక్షరముల తరువాత పదమధ్యమందుగాని, పదాంత

మందుగాని అనునాసి కాక్షరములను, అంతస్థములకు ద్విత్వము
కల్పించుట. వీనిని కొన్ని పాటలలో గుర్తింప వచ్చునేమో.

"(శ్రీ)రామభూపాలు-డూ (ఉ)-పట్టాభి
షేకుడై యుండగానూ (ఉ)"
"గుడుగుడుగుంచం – గుండేరాగం
పాములపట్టం పడగారాగం
......................."
"నీ(-ఇ)గుజ్జుం నీళ్లకు పోతే
నా(-అ) గుజ్జుం పాలకు పోతే"
"కొండామీదా కొక్కిరాజూ
గుండూ విరిగీ పా(=ప)డే
దానీ(=ని) కేమి మం(మ్)దూ"

ఇ[illegible]నియమ విశేషములవలెనే తెలుఁగు
కవితకు విశేషలక్షణములుగాఁ గనఁబడుచున్న సీసగీతాదు
లును, ఇంక నితరములగు ఛందోరచనలును తమిళమునందలి
నేర్ నిరై శీర్లు అను గణములతోఁ గూడిన ఛందోరచనతోఁ
బోల్చి పరిశీలించిన, నివి యన్నియు ప్రాకృతభవములు గాక
ప్రాచీనద్రావిడ కవితాసంప్రదాయసిద్ధములే యని యేర్పడ
వచ్చునని తోచక మానదు.

ఈ దక్షిణదేశీయ చ్ఛందమును సంస్కృతమున
ప్రాకృతములందలి మాత్రాచ్ఛందములతో సమన్వయించి
లక్షణకర్తలు విశేష ప్రయత్నముచేసి, యక్షరగణము లనే
కాక సూర్యేంద్ర చంద్రగణములని, బ్రహ్మ విష్ణు రుద్ర

గణములని భిన్నరూపముల మాత్రాగణ విభాగమునుగూడ జేసి చూపిరికాని, యివి శిష్టకవితలోని రచనలకు సరిపోయినను ప్రాచీనకవితలోని దేశీయ రచనలకును, తమిళమునందలి ప్రాచీనకవితలో నిలిచియున్న రచనలకును, సరిపోకుండుటచే వాస్తవమగు దక్షిణ దేశీయ చ్ఛందస్సంప్రదాయ మింతకంటె విపులము, భిన్నమునై యుండవలెనని తోఁచుచున్నది. కావున తెలుఁగు కవితయందలి సీస, గీత ద్విపద, రగడాదుల యొక్కయు, శిష్టకవులచే నిరసింపబడి యడుగంటిన పామరజన కవితారచనలయొక్కయు లక్షణ సమన్వయమునకుగాను తమిళ కవితా సంప్రదాయజ్ఞానమావశ్యకమగుచున్నది. మార్గకవితా రచనాభేదములను దేశీయములుగా జేయుటఁ కందలి వృత్త రచనలందును, జాతుల రచనయందును తెలుఁగుకవులు ప్రవేశపెట్టిన వడి ప్రాసలు, దక్షిణదేశమం దంతకు చిరపూర్వమే దేశీయ కవితా సంప్రదాయసిద్ధములై యుండెనని తమిళ కవితయందలి తుడై భేదములగు మోనై, యెదుగై అనునవి ఎట్లు వ్యక్తము చేయుచున్నవో, అట్లే ప్రాచీనకాలమునుండియు దేశమున వ్యాప్తిజెందియుండియు శిష్టకవుల గద్యపద్యాది సంస్కృత భూయిష్ఠ రచనాధాటి కాగలేక వెనుకపడి పోయిన దేశీయరచనలలోని పెక్కురీతులను తమిళచ్ఛందోరీతులతోఁ బోల్చిచూచిన నవియు లక్షణ సమన్వితములే యగునని తోఁచకపోదు. ముందు కన్నడాంధ్రముల గల యిట్టి దేశీయ రచనలను గుర్తించి, పిదప వానికి తమిళ రచనలతోఁ గల సామ్యము నారయుదము.

నన్నయకుఁ బూర్వమునందలి తెలుఁగు శాసనములలో నిప్పటికి లభించినంతవరకు దేశీయములగు అక్కర, సీసము, తరువోజ మొదలగు ఛందోరచనలే కనఁబడుచున్నవిగదా. సోమనాథుని మూలముగా మనకుఁ దెలియవచ్చిన దేశీయ రచనలు—గద్యలు, ఉదాహరణములు, రగడలు, ఏలలు మొదలైనవి. కన్నడసాహిత్యమున పంపాదు లవలంబించిన చంపూమార్గమునే చేపట్టిన తెలుఁగుకవులు నన్నయాదు లిట్టి దేశీయ రచనల పొంతఁబోకుండుటచేఁగాఁబోలు తరువాతి సన్నిహిత లాక్షణికులుగూడ వీనినిగూర్చి తెలుప లేదు. ఉదాహరణమునుగూర్చి విపులముగా దెలిపినవాఁడు అప్పకవి. అతఁడు దీనిని చాటు ప్రబంధములలోఁ జేర్చినాఁడు.

"నాల్గుదెగల యుదాహరణములు ముక్త
కాదిపంచాదశయును సంఖ్యాన్వితములు
గద్యరగడద్విపదదండకములు మంజ
రులును సంఖ్యారహితచాటువులు నృసింహ."

(అప్పకవి. I—౨౯)

మఱియు నీయుదాహరణ మనునది సద్ధళి, బద్ధళి, విద్ధళి, ఉత్ఫుల్లకము నని నాలుగు తెరగులుగా నుండుననియు, నందు

"సంబుద్ధి మొదలించి సప్తవిభక్తులు
పలికిన భక్తి సద్ధళి యనంగ
సంబుద్ధితోఁగూడ సప్తవిభక్తులు
పలుక నొప్పారు బద్ధళి యనంగ

సంబుద్ధితోడ విషమవిభక్తులతోడఁ
బలికిన కృతియు విద్ధళి యనంగ
గళిక లుత్కళికలు గమకింపఁ బలికిన
కావ్యంబు నుత్ఫుల్లకంబు ననఁగ
నవనిఁ జాటు ప్రబంధంబులందు మిగుల
నాటుకొని యొప్పుచుండు నీ నాల్గు దెగలుఁ
గానఁబడు నుదాహరణముల్ గానలోల."

అని చెప్పుటచే, నితరపద్యశూన్యమై కళికోత్కళికలతో మాత్రమే గూడినది యుత్ఫుల్లకరూపమగు నుదాహరణ మైయుండునని తోఁచుచున్నది. ఈతనికిఁ బూర్వుఁడు ౧౫-వ శతాబ్దివాఁడునగు ననంతామాత్యుఁడీయుదాహరణ లక్షణమును దెలిపియున్నాఁడు గాని తరువాతి యప్పకవి చెప్పిన నాలుగు భేదములనుగూర్చి తెలుపలేదు. వీరికిఁ బూర్వులగు విన్నకోట పెద్దనగాని, కవిజనాశ్రయకారుడు గాని వీనినిగూర్చి తెలుపనేలేదు. ఇట్లే దేశీయ రచనా విశేషములలోఁ బ్రధానము లనఁదగిన రగడభేదములను గూర్చి పెద్దన చెప్పియున్నను, అతనికిఁ బూర్వుఁడగు కవి జనాశ్రయకారుఁడు తెలిపియుండలేదు. అప్పకవి వీనిని వైతాళీయములతో ముడివెట్టి, వానిలో ననేకభేదములు గలవనియు, నందు నవవిధ రగడలనుమాత్రమే తెలిపెద ననియుఁ జెప్పగా, పెద్దన తొమ్మిదింటినిమాత్రమే చెప్పి యూరకున్నాఁడు. ఇట్లు వెనుకకుఁబోయినకొలదిని దేశీయ రచనలనుగూర్చిన ప్రస్తావము సన్నగిలుచువచ్చినదనిమాత్రము

తెలియుచున్నది. ఇందుకు నన్నయాది శిష్టకవులు వీనిని గ్రహింపకుండుటయే కారణము కావచ్చును. కవిత్రయము వారును, ఆ తరువాతి ప్రసిద్ధశిష్టకవులునుగూడ రగడ, ద్విపద, కళిక మొదలగువానిని గ్రహింపలేదుగదా. కావుననే సామాన్యజనులలో మతప్రచారమున కనువైయుండునని సోమనాథు డీ దేశీయ రచనలను గ్రహించియుండును.

సోమనాథుఁడు రచించినవి రెండుదాహరణ గ్రంథములు గనబడుచున్నవి. అం దొకటి తెలుఁగున రచింపఁబడిన "బసవోదాహరణము". మరియొకటి సంస్కృతభాషలో రచింప బడినదైనను ఆంధ్రోదాహరణ లక్షణమునే యనుసరించుచున్నదనుట వ్యక్తమే. ఇంతకుఁ బ్రాచీన మనఁదగిన సంస్కృతోదాహరణ గ్రంథమేదియు గానరాదు. దీని లక్షణమునుగూర్చి ప్రాచీనాలంకారిక గ్రంథములలోను దెలుపఁబడినట్లగపడదు. విద్యానాథుఁడుమాత్రము ప్రతాపరుద్రీయమున నుదాహరణ లక్షణమును దెలిపియున్నాఁడు. కాని యిది యతనికిఁ గొంత పూర్వుఁడో, సమకాలికుఁడో యనదగిన సోమనాథుడు రచించిన సంస్కృతోదాహరణమునుబట్టియే కల్పించియుండు ననవచ్చును. లేదా యాతని లక్షణమునకు సరియగు మఱికొన్ని కాలగతి నంతరించిన వనవలె. అతని లక్షణమిది :

"యేన కేనాపి తాళేన గద్య పద్యసమన్వితం
జయేత్యుపక్రమం మాలిన్యాది ప్రాసవిచిత్రితం
త దుదాహరణం నామ విభక్త్యష్టాంగ సంయుతం"

ఈ లక్షణమునకును, సోమనాథుని రచనాభాగమున కును యత్కించిద్భేద మగపడినను అందలి విభక్తియుతము లగు పద్యములనుబట్టియు, కళికోత్కళికాది రచననుబట్టియుఁ జూడగా, నిది దేశభాషలలోని జాతీయకవితా రచనలకు, వీనితో సన్నిహిత సంబంధము లేని సంస్కృతాలంకారికులు లక్షణ మేర్పరచు సందర్భమునఁ గలిగెడి భేదమేకాని విశేషము కాదని తోఁచుచున్నది. ఏలయనగా నేదోయొక తాళమునకు సరిపోవు గద్యములతోడను, పద్యములతోడను గూడినదై, ప్రాసవిచిత్రితమై, అష్ట విభక్తియుతమై యుండ వలయుననుట సమానమే. దేశీయ రచనలగు కళికోత్కళి కలుగద్యలుగా గ్రహింపఁ బడెననుటలో నాశ్చర్యము లేదు. సోమనాథుని పంచప్రకార గద్య వాస్తవముగా నుత్కళికా రూపమేయైనను, వచనమువలె వ్రాయబడుచుండుటనుబట్టి గద్యగానే గ్రహింపబడుచుండి యుండును. కోరుమిల్లి శాసన మునను అట్లే యున్నదిగదా. ఇంతేకాక "గద్యమనుదాని నుత్కళికాప్రాయముగా" గ్రహింపవలయుననియు విద్యా నాథునికిఁ బూర్వుఁడగు వామనుఁడు తన కావ్యాలంకార సూత్రవృత్తిలోఁ దెలిపియున్నాఁడు.

"గద్యం వృత్తగంధి చూర్ణ ముత్కలికాప్రాయంచ"
"పద్యభాగవ ద్వృత్తగంధి"
"అనావిద్ధలలితపదం చూర్ణం"
"విపరీత ముత్కలికాప్రాయం"

(కా. సూ. వృ. ౧-3-౨3)

గద్యము పద్యభాగమువలె వృత్తగంధియై యుండుట యనఁగా నేమో సంస్కృత కవితారచనలనుబట్టి తెలిసికొనుట సాధ్యమగునో కాదో! కాని దేశీయములగు స్త్రీల పాటలు మొదలగువానిలోని "కందార్థము" లనఁబడునవి ఏని క్రిందఁ జేరవచ్చును. ఇవి ముందు కందాదిపద్యముల ధోరణి కలిగి తరువాత పాటగా మారుచుండుట కలదు. ఈ క్రింది పాటలోని పద్య ముత్పలమాలగా నున్నది.

"శ్రీమధురాధరీ వినవె- శేషగిరీశుఁడ నీదు కేళికా
ధామమునందు నింతవడీ-దర్పకలీలల నుండి యంతటన్
వేమరు వేటలాడఁ జని-వేగమె వచ్చితి తల్పుతీయవే
భామా సద్గుణా గుణాధామా లావణ్యాచతురా సీమా!
అలమేలు మంగానామా"

ఇట్టి దేశీయరచనలనుబట్టి యీ విభాగము చేయఁబడినదా యను సందేహము కలుగకమానదు. ఇంతేకాక కన్నడమున గద్యపద్యసమ్మిశ్రితమగుదానిని గద్య యని యందురను ప్రతీతిని కవిరాజమార్గకర్త దెలిపియున్నాఁడు.[1] పైని వృత్తగంధులని చెప్పఁబడిన గద్య లట్టి దేశీయరచనలేయేమో. వామనుని లక్షణమునుబట్టి గద్య మనావిద్ధ లలిత పదమగు చూర్ణము—చూర్ణిక—ఉత్కళికా ప్రాయముకూడ

1. "మిగెకన్నడ కబ్బంగళొ
ళగణితగుణ గద్యపద్య సమ్మిశ్రితమం
నిగదిసువర్గద్యకథా
ప్రగీతియుం తచ్చిరంతనాచార్యర్కళ్".

నగుచున్నది. దేశీయ రచనలలోని యీ యుత్కళికలు గద్యములుగా వ్రాయఁబడియుండుటనుబట్టి దేశీయచ్ఛందో రీతుల నంతగాఁ బాటింపని సంస్కృత లాక్షణికులు వీనిని గద్యలనియే తలంచి యుందురు. ఈ గద్యములు చూర్ణిక లునుగూడ గేయములే.

కన్నడమునందలి బెదెండె కావ్యమువలెనే తెనుఁగున వృత్తములతోపాటు దేశీయ రచనలతోఁగూడిన ప్రాచీన కావ్యము, లేదా చాటు ప్రబంధము "ఉదాహరణ" మను నది కలదనియేకాక, ఇందుఁ జేర్పఁబడిన యుత్కళికలు "రగడ" భేదములే యను విషయముఁగూడ మనము ముఖ్యముగా గుర్తింపవలసియున్నది.

> "పతిపేరు దొరలంగఁ బద్యమొక్కటి చెప్పి
> రగడభేదములు మార్గములుగాఁగ[1]
> కళికలు నెనిమిది దళములు గావించి
> దానిలో సగము నుత్కళికఁజేసి"

అని అప్పకవియే చెప్పియున్నాఁడుగదా. ఈ కళికో త్కళికలు రగడభేదము లగుటచేతను, ఇవి కన్నడాంధ్ర దేశీయ రచనలలోఁ బ్రాచీనములు, ప్రధానములు నగుట చేతను ఈ రగడల స్వరూపలక్షణములను దెలిసికొనుట యావశ్యకమే. ఆంధ్ర లాక్షణికులకంటె కన్నడ లాక్షణికుఁ డగు నాగవర్మ ప్రాచీనుడు, నన్నయకుఁ బూర్వుఁడు

1. "రగడభేదములు మార్గములుగాగనుజేసి" యని చివర మూడక్షరముల జేర్చినచో నీ సీసపద్యముకూడ రగడభేదమే యగుచున్నది.

నగుటచే నాతని మతమును ముందు గ్రహింతము. గణ నియమవిపర్యాస ముండినను, సమములైన మాత్రలు గలిగి తాళబద్ధమై యుండునది రఘటాబంధమగు[1] నని రగడలక్షణముగాఁ జెప్పినాఁడు నాగవర్మ. అనఁగా నొక్కొక పాదములో మూఁడో, నాలుగో, ఐదో మాత్రలు గల గణములే యుండుననుట. ఇవి తాళ ప్రధానము లగుటచే పాటల కనుకూలమై యుండును. కన్నడమున నాగవర్మ మూఁడువిధములగు రగడలనే-మందానిల, లలిత, ఉత్సవ అనువానినే-చెప్పియున్నాఁడు. అనంతామాత్యుఁడు, అప్పకవి నవవిధములను జెప్పినారు. ఈ తొమ్మిదిరగడలు నందుఁజేరు మాత్రాగణముల భేదమును బట్టి యనేకరీతులు గలవైనను అవియన్నియుఁ జాలవరకు ౩, ౪, ౫, ౭ మాత్రలుగల నాలుగేసి గణములతోఁ గూడిన పాదములు గలవని మాత్రము చెప్పవచ్చును. దక్షిణదేశీయ సంప్రదాయసిద్ధమగు గణములలో నా యా మాత్రలు గల వనేక విధములుగలవిగా నుండును గావున నీ రగడభేదములు ననేకవిధము లై యుండుననుటకు సందేహము లేదు. కావున నే యప్పకవి వీనిని వైతాళీయములతో ముడివెట్టి "వైతాళీయంబులగు రగడ లనేకవిధములుగ నుండు నందు నవవిధ రగడలనుమాత్రము వివరించెద" నన్నాఁడు. మరియు నివి

1. "గణనియమ విపర్యాసదొ
ళెణెవడె దొప్పెసెయె మాత్రె సమనాగి గుణా
గ్రణియు మతదింద తాళద
గణనెగొడంబట్టిదదువె రఘటాబంధం."(ఛందోం. ౩—౨౨౨)

ద్విపద దండకములతోపాటు సంఖ్యా నియమరహితములగు చాటువులు కావున నాలుగు పాదములే యుండవలయు నను నియమము వీనికి లేదు. కాని తక్కిన పద్యములందువలెనే ప్రాసనియమము, ఆద్యంత ప్రాస నియమముకూడ గలదు.

"ఆద్యంతప్రాసంబులు
హ్రస్వంబుగ రెంట రెంట నిడి పాదములు
ద్వ్యద్వ్యతులఁ గూర్పఁదగు నన
వద్యంబగు రగడలందు వారిజనాభా". (అనం. ఛం.)

కన్నడమందలి "మందానిలము" నాలుగుమాత్రల గణములతోఁ గూడినదగుటచేఁ దెనుఁగున మధురగతి రగడకు సరిపోవుచున్నది.

మందానిలము :—

"ఆవే కెయొళతి సంభ్రమ మెసెదిరె
పూవలి పురవీ ధిగళొళ్ నెఱెదిరె..."
"శ్రీకర కేశా శ్రుతితతి దేశా
శోకని ఘర్షా శోభిత హర్షా."

మధురగతి :—

"నాలుగు మాత్రలు నాటిన గణములు,
నాలుగు రెంటికి నలి విరమణములు." (అప్పకవి)

కన్నడ లలిత :—

5 మాత్రలుగల గణములు నాలుగేసి గల పాదములతోఁ గూడిన దగుటచే తెలుఁగు దీరదగతికి సరియగును.

ద్విరద :—

"కరమొప్పు పంచలఘు గణచతుష్టయముచే
విరమంబు రెంటిపై ద్విరదగతి పేరిచే."

లలిత :—

"అల్లిమూ మరదల్లి మల్లికాలతెయల్లి
యెళెయసుగె మరదల్లి జళరుహాకరదల్లి ..."

కన్నడ ఉత్సవ :—

ఆరు మాత్రలు గల గణములు నాలుగేసి యొక పాదమున గలది.

"ప్రేమవాస సద్గుణైక ధామసూర్య కోసభాస
కోమలాంగ సంతతాభి రామనిర్మలాంతరంగ

ఇది తురగవల్గనమునకు సరియగును. ఇందు తుది గణమున నొక్కమాత్ర తొలఁగించి యొక్క గురువునే నిల్పినచో నిది యుత్సాహ వృత్తమగుచున్నది.

"ఈహమీఱ సూర్యగణము లేడు గాంతమైన ను
త్సాహవృత్త మనగఁజెల్లు"

అని అప్పకవి లక్షణము. కొద్ది మార్పులతోఁగూడిన యిట్టి రచన లప్పటికే గల వనుటకు నిదర్శనముగా నాగవర్మయే మరియొక "యుత్సాహ"కు లక్షణమును దేశీయ జాతులక్రిందఁ జెప్పియున్నాఁడు.

సోమనాథుని యుదాహరణమందలి కళికాదు లీ రగడ భేదములే యనుట కీ క్రింది యుదాహరణములు చాలును.

కళిక :—

"వెండియుఁ ద్రిభువన వినుతిసమేతుఁడు
మండిత సద్గుణ మహిమోపేతుఁడు"
(నాలుగుమాత్రలు నాటిన గణములతో గూడినది.)
"వెండియును భక్తాభివృద్ధిఁ బెంచినవాని
బంధమాయాచారపథముఁ ద్రుంచిననాని"
(ఐదేసి మాత్రల నాలుగు గణములతోఁ గూడినది)

ఉత్కళిక :—

"భువనోపకారా భవమోదవీరా
భక్తిసంయోగా ముక్తిసంభోగా."

ఛందోంబుధికారుఁడు వృత్తజాతి విభాగమునుగూర్చి చెప్పుచు, సంస్కృత ప్రాకృతపైశాచిక మను మూడున్నర భాషలనుండి పుట్టిన ద్రావిడాంధ్ర కర్ణాటాదిషట్పంచాశత్ సర్వవిషయ భాషాజాతులలో సమ మర్ధసమం విషమమను మూడు తెరగుల వృత్తములున్నవనియు, ఆఽ ఛందములలో బుట్టినవిగాక జాతులనఁబడునవి కొన్నికలవనియుఁ జెప్పినాఁడు. ఈ జాతులలో దేశీయజాతులు మఱికొన్ని కలవు. "అవఱి పొఱగెపుట్టువ మాలావృత్త, దండక రఘట, మాత్రార్య, త్రిపది, చతుష్పది, షట్పది, అష్టపది, శంఖా (సంఖ్యా?) వృత్త, తాళవృత్త ఆదిజాతిగళ్ ఉంటు. అవావు వెందొడె—

మదనవతి, అక్కరం, చౌ
పది, గీతికె, యేళె, తివది, యుత్సాహం, ష

"ట్పది, యక్కరికె, కరంచె
లొప్పావిద ఛందోవతంస మజ్జదళాక్షీ"

ఇట్లు అక్కర, చౌపది, గీతికె, ఏళె, ఉత్సాహ, షట్పది మొదలగునవి దేశీయములగు-అనగా దేశీయములగు బ్రహ్మ విష్ణు రుద్రరూప మాత్రాగణబద్ధములని కాంబోలు నాతని భావము-జాతులలోఁ జేర్పఁబడినవి. వీనిలోఁ బెక్కు తెలుఁగునను గలవు. కావున నివి నన్నయకుఁ బూర్వమే ద్రవిడాంధ్ర కర్ణాటభాషలలోని దేశీయ రచనలలో విశేష ప్రచారమున నుండెననుటకు సందేహము లేదుగదా. నన్నయకుఁ బూర్వ మిట్టి రచనలతోఁగూడిన తెలుఁగు కవిత విశేషముగా నుండి యుండును. మొదటఁ దెలుఁపబడిన జాతులకును, వీనికిని భేదమేమి? రగడలను మాత్రాగణబద్ధములే యని చెప్పుచు, సామాన్యజాతులలోఁ జేర్చి అక్కర, చౌపది, గీతికె, షట్పది మొదలగువానిని దేశీయజాతులలోఁ జేర్పఁ గారణమేమి యను ప్రశ్న బయలుదేరక మానదు. ఇదియే ఆర్యానార్యచ్ఛందో రీతులకుఁ గలిగిన సంఘర్షణములోని ముఖ్యఘట్టమని చెప్పవలసియున్నది. జాతుల విషయములోఁ గన్నడ దేశీయములకును, దెనుఁగు దేశీయములకును గల భేదమునుగూడ నిచ్చటనే మనము గుర్తింపవలసియున్నది. ఏలయనఁగా జాతులు మాత్రా సంఖ్యాబద్ధగణములతోఁ గూడినవి. అవి సంస్కృతమునను గలవు. ప్రాకృతమునను గలవు. ప్రాకృతమునందలి వానిలోఁ దత్తద్దేశీయములు కూడఁ జేరి యుండవచ్చును. కన్నడాంధ్ర భాషలలోని ఛందో

రచనలకు సంస్కృతభాషా పండితులే లక్షణ మేర్పరుపవలసి వచ్చినది. ఆ సందర్భమున వారి దృష్టిలో ప్రధానములు సంస్కృత ప్రాకృతములే గనుకను, తద్రీతులే వారి కెక్కువగాఁ బరిచితములు గావునను వృత్తాదులను గురించి ముందు చెప్పి, మాత్రారచనలను గూర్చి తరువాత చెప్పినారు. ఈ మాత్రారచనలలో సంస్కృత ప్రాకృతములలోనివి కొన్నియు, దేశీయములు కొన్నియుఁ గలవు. దేశీయములలో మాత్రాగణబద్ధములగు కొన్నిటిని మాత్రా సంఖ్యాబద్ధములుగాఁగూడ గ్రహించుట కవకాశము కలదుగదా. సర్వలఘు సీసమునందలి యొక పాదమును ౮ మాత్రల ౭ గణములు, తుదిని ౨ లఘువులు, లేదా ౧ గురువు కల దానినిగాఁ జెప్పవచ్చును. ''ఈహామీఁద సూర్యగణము లేదు గాంతమైన నుత్సాహ వృత్తమనఁగఁ జెల్లు.'' దీనిని మూఁడు మాత్రల గణము లేదు, నొక గురువు కలదని చెప్పవచ్చును గదా. ఇట్లు మాత్రాగణబద్ధములగు దేశీయ పద్యములకు మాత్రాసంఖ్యా నియమము గల యార్యాపదములవలెనే లాక్షణికులు లక్షణము కల్పించుట కవకాశమున్నది కాని, అట్లు వీనికి లక్షణము కల్పింపఁబడినచో వీని దేశీయత మాత్రము రూపుమాయుచున్నదనక తప్పదు. వారి లక్షణమును సంకుచితత్వమును జెందక మానదు. దేశీయత నాశనమగుట యనఁగా నేమో చెప్పవలసియున్నది. ఒక దేశీయ రచనకు దేశీయ మాత్రాగణపద్ధతిని లక్షణ మేర్పడినచో నారింద్రగణములు, రెండు సూర్యగణములు సీస పాదమగునని చెప్పినపుడా యింద్రగణములలో నల, భ లను నాలుగు

మాత్రలుగల గణములైనను రావచ్చును. లేదా నగ, సల, ర, తలను నైదేసి మాత్రలుగల గణములైనను రావచ్చును. మరియు నీ రెండును గలిసియైనను రావచ్చును. కాని నాలుగుమాత్రల గణములే యని చెప్పినచో సీసభేదము లనేకములలో నొకదానిని మాత్రము గ్రహించి లక్షణము చెప్పినట్లగును. ఇట్లే రగడల విషయమునఁగూడను. ఆంధ్ర కన్నడ భాషాలాక్షణికులు గ్రహించిన రగడలన్నియు పాదమునకు నాలుగైదు గణములతోఁగూడినవి. లేదా వీనిని రెట్టించి యొక్కపాదముగాఁ జేసినవి. నాలుగుమాత్రలు నాటినగణములు "నాలుగు" అని అప్పకవి చెప్పగా, దానినే "అనిగగనల, భ, స, లను నాల్గిటిఁగృతి" అని గణపద్ధతిని అనంతుఁ డన్నాఁడు. మధురగతి రగడను రెట్టించి రెండు పాదములను జతచేసిన విజయమంగళ మగునుగదా. క్రౌంచపదముకూడ నాలుగు మాత్రల నాలుగు గణములను రెట్టించుటచే నేర్పడినదే యని చెప్పవచ్చును. ఈ గణముల యమరిక నాలుగు పాదములలో నొక్కరీతినే యున్నచో నది వృత్తముగా భాసించును. ద్విరదగతిని రెట్టించిన విజయభద్రము. ఇట్లు ౫ మాత్రలగణములు నాలుగిటిని రెట్టింపఁగా వచ్చినవానిలోని భేదములే లయవిభాతి, లయగ్రాహిత్యాది మాలా వృత్తములు. వీనిలో పాటలోని సౌకర్యముకొఱకొకమాత్రయో, గణమో తగ్గింపబడి యుండును. మొత్తముమీఁద నివియన్నియు తొలుత నాలుగు గణములతోఁగూడిన పాదములు గలవియే. మాత్రా సంఖ్యా నియమమునకో, అక్షరగణ నియమమునకో లొంగినంతవరకు లొంగఁదీసికొని

లాక్షణికులు వీనికి లక్షణ మేర్పరచినారు. ఇంకను అందని వానిని వదలివేసినారు. కొన్నిటిని తాళబద్ధములని గ్రహించి యున్నారు. అట్టి వనేకములు సామాన్యజనుల పాటలలో నుండును. దేశీయ గణ లక్షణమునుబట్టి చూచినచో నా పాటలకును లక్షణ మేర్పడకపోదు. మచ్చున కొకటి—

"లాలిబం గరుబొమ్మ, లాలి మా యమ్మా
రాలిము ద్దులగుమ్మ లాలిసీ తమ్మా—లా(అ)లీ.
జోజోచి దానంద జోజోము కుందా
జోజోకృ పాపాంగ జోసుంద రాంగా—జో(ఓ)జో"

ఇవి కించిద్భేదముతో ౫ మాత్రల నాలుగు గణములతోఁ గూడినవే. ౭ మాత్రలుగల నాలుగేసి గణముల పాదములు గల వృషభగతిరగడభేదమే గుమ్మడిపాట యగునని యిదివరకే సూచింపఁబడినది. "గుమ్మడేడే గోపిదేవి గుమ్మడేడే కన్నతల్లీ..."

మన సీసపద్యముకూడ వాస్తవముగా నాలుగేసి గణములు గల పాదములను రెట్టించుటచేత నేర్పడినదే. ద్విపదకు మూఁడింద్రగణములు, నొక సూర్యగణము కలిసి నాలుగు గణములేకదా పాదమునకు. కావున ద్విపద రెండు పాదములును గలిసి సీసమున నొక పాదము కావచ్చును. ఆ రింద్రగణముల నొక చోటను, రెండు సూర్యగణములను తుదిని జేర్చినచో సీసపద్యపాదమైనది. అనఁగా ద్విపదనే యించుక మార్పుతోఁ జదివినచో సీసపద్యపాదమే. [illegible]

"ఆరూఢగద్యపద్యాది ప్రబంధ
పూరిత సంస్కృతభూయిష్ఠరచన"

దీనిలో రెండవ పాదమునందలి రెండు మూడు గణములను నలములుగాఁ జేసినచో సీసమగును.

"ఆరూఢగద్యప ద్యాదిప్రబంధపూ
రితసమకృతబహు శ్రేష్ఠరచన."

"నల"ముకూడ నింద్రగణమే కావున నా మార్పు వలని బాధలేదు. అయితే దీనిని "రగడ" లతోఁ బోల్చుట కొక చిక్కు మాత్రము కలిగినది. మొదటి నాలుగు గణములును ఐదేసి మాత్రల గణములైనవి. తరువాతి రెండును నాలుగేసి మాత్రల గణములు, తుదిరెండు మూఁడుమాత్రల గణములైనవి. రగడలలో పాదములన్నియు నొక విధమైన మాత్రాసంఖ్యా నియమముతోఁ గూడియుండ నక్కరలేదన్నచో, నిదియు నొక రగడభేదము కావచ్చును. సంస్కృత లాక్షణికులు గ్రహించిన మాత్రా సంఖ్యానియమమును దెచ్చిపెట్టుకొనుటవలన నీ చిక్కుగలుగుచున్నట్లగపడుచున్నదిగాని, దేశీయగణములు పాదమునకు నాలుగేసి యుండవలయు నన్నచో నా చిక్కు తొలఁగఁగలదుగదా. ౫ మాత్రల గణములైనను, ౪ మాత్రల గణములైనను దేశీయగణసంకేతమునుబట్టి ఒక కోటిలోనే చేరవచ్చును. అవి యింద్రగణములే యగును. మరి రెండింటినికూడ—మగణమును, సగమును – జేర్చుకొనిన కన్నడ విష్ణుగణము లగును. కావున సీసములలోఁగాని, రగడలలోఁగాని,

ద్విపదలలోఁ గాని, గీతములలోఁగాని, మాలికా వృత్త ములలోఁగాని వచ్చు నాలుగైదు మాత్రల గణము లే విధముగా వచ్చినను అవి ఇంద్రగణములలోఁ జేరును గదా. కన్నడ విష్ణుగణములలో ౬ మాత్రల గణములుకూడఁ జేరును. ఈ కారణముచే నీ పద్యములన్నియు నొక్క కూటమునకే చేరినవని చెప్పవచ్చుగదా. అనఁగా ౪, ౫, ౬ మాత్రలు గల నాలుగేసి గణములు పాదమునకుఁ గల పద్యములని కాని, ఆ పాదమును రెట్టించి యొక పాదముగాఁ గల్పించిన పద్యములని కాని చెప్పవచ్చును. అప్పుడివన్నియు నొక విధమగు రగడభేదములే యని చెప్పఁదగి యుండునేమో!

అయితే ఇందు మఱియొక చిక్కున్నది. ద్విపద, సీసము, గీతము మొదలగు కొన్నిటిలో నడుమ సూర్యగణ ములు - అనఁగా మూడుమాత్రల గణములుకూడ వచ్చు చున్నవే-ఇవి ౪,౫,౬ మాత్రలుగల ఇంద్ర, విష్ణుగణములలోఁ జేరవయ్యెను. లక్షణసమన్వయ మెట్లగునని అడుగవచ్చును. వాస్తవమే. ఆ విషయము తెలిసికొనుట కవకాశము లేకయే ప్రాచీన లాక్షణికులు ఇట్టి చిక్కులు వడి ఇన్ని విభాగ ములను చేసినారు. దేశీయగణములని పేరుపెట్టి వానిలో ఇంద్ర-విష్ణు గణములను కూటములో ౪, ౫, ౬ మాత్రలు గల గణముల నెట్లు సమకూర్చుటకు నొప్పుకొనియున్నారో అట్లే మూఁడు మాత్రలు గల గణములనుగూడ మఱియొక పేరుపెట్టిగాని, పెట్టకగాని ౪, ౫, ౬ మాత్రల ఇంద్ర-విష్ణు గణములతో పాటు పద్యపాదములోఁ జేరవచ్చునని, అటు

చేరుట దేశీయరచనల లక్షణమని మన మేర్పాటుచేసికొని నచో నీ చిక్కు వదలి పోవునుగదా. అయితే ఇట్లు చేయుచుం బోయినచో నియమాభావము కలుగునే యను నాక్షేపణ కలుగవచ్చును. కాని మనము క్రొత్తగాఁ జేయఁ దలచిన నాక్షేపణీయమగునేమో కాని, అట్టిదానినే ఒక నియమముగాఁ బాటించిన లాక్షణికపద్ధతి యొకటి సిద్ధమై యున్నచో నీ యాక్షేపణ పాటింపఁదగినది కాకపోవును. ఇట్టి పద్ధతి దక్షిణదేశీయచ్ఛందస్సంప్రదాయ సిద్ధము. అది తమిళచ్ఛందోలక్షణ పద్ధతిలో నిలిచియున్నది. అచ్చట అగవల్పా అను రచనలో ౪, ౫, ౬ మాత్రల గణములతోపాటు 3 మాత్రల గణములుగూడ నీ నాలుగు గణముల పాదములో నిలువవచ్చును. ఇట్లు దక్షిణదేశ భాషా ఛందస్సంప్రదాయములకు సన్నిహిత సంబంధమున్నదను దృష్టితో చూడక, ఆర్యభాషాఛందస్సంప్రదాయ దృష్టితో నీ దేశభాషా రచనలను జూచి, వానికి లక్షణమేర్పఱచుటచే నీ దక్షిణ దేశీయభాషారచన లొకదానితో మఱియొక దానికి సంబంధములేని పద్ధతులతోఁ గూడినవిగాఁ గనఁబడుట తటస్థించినది. ఇంతేకాక కాలగతి నా యా సంప్రదాయములలోఁ గొంత మార్పును గలిగినదనుటకు సందేహము లేదు.

నాగవర్మ ఛందోంబుధిని సంపాదించి ప్రకటించిన కిట్టెల్ పండితుఁడు నాగవర్మ చెప్పిన రఘటాభేదములను దెలిపి, అర్వాచీనుఁడగు కవిజిహ్వాబంధకారు ననుసరించి

కాఁబోలును, నాఁటికొన్నిటిని రఘటాభేదముల క్రిందఁ జేర్చినాఁడు. అందు సీసము ఆటగీతె, చౌపది, త్రిపుడెతాళము, ఏకతాళము, అష్టపది, లయగ్రాహి అనునవి కలవు. ఇవి ఛందోంబుధిలో కానరావు. కాని కర్ణాట విషయజాతులని నాగవర్మ అక్కర, త్రిపది, చౌపది, ఛందోవతంస, ఏళె, గీతికె, ఉత్సాహ, షట్పది అనువాని లక్షణముఁ దెలిపినాఁడు. ఇవి దేశీయములగు బ్రహ్మవిష్ణు రుద్రసంజ్ఞితములగు మాత్రాగణములతోఁ గూడినవి. వీనిలోఁ గొన్ని తెలుఁగు శిష్ట కవితలోఁగాని, సామాన్యజన రచనలలోఁగాని యున్నవే. అక్కరలు కన్నడాంధ్రములకు సామాన్యములు. కాని లక్షణమునను, పేళ్ళలోను కొంత భేదము లేకపోలేదు. ఉత్సాహలక్షణము కన్నడాంధ్రములకు సమానమే. నాగవర్మ యొక శరషట్పదిని మాత్రమే చెప్పిన ట్లగపడును. తరువాతివా రారు తెఁగుల షట్పదులను జెప్పిరి. తెలుఁగులోని శిష్టకవితలోని కివి యెక్కలేదు. కాని పాటలలో నీ రచనలు గానవచ్చును. నాగవర్మ చెప్పిన షట్పది యిది. ఇందు ౬ విష్ణుగణములు, ౧ రుద్రగణము, మూడు పాదములు గల సగము పద్యమగును.

శరషట్పది—"మందర ధరగణ
మొందిర కడయొళ్
కుందదె నెలసుగె మదనహారం
ఇందుని భావనె
ముందణ తెఱనీ
యందమె యాగలె షట్పదికేళ్."

దీనికి ౮ మాత్రల గణము లేదు, ఒక గురువు అనియు లక్షణము చెప్పవచ్చును. ఈ షట్పదులు ఝంపె తాళబద్ధములనికూడఁ జెప్పఁబడినది.

నాలుగుమాత్రలు గల షట్పదులను గొన్నిటిని తెనుఁగున స్త్రీల తలుపులదగ్గర పాటలలో మనము గుర్తింపవచ్చును.

"శ్రీతరు ణిరో నే శ్రీరఘు రాముడ
జేరిక వాటము-దీ-వే
జేరిక వాటము-దీ-వే
ఖ్యాతిగ శ్రీరఘు రాముడవై తే
కోతుల జేరగ దో-యీా ఘన
సేతువు గూర్పగ దో (ఓ) యీా."

తెలుగుషట్పదికి అప్పకవి లక్షణ మిది :

"ప్రాసము ల్మూమ్మారు వాసవు లార్గురు
పైసుధా దీధితి తోనిర్యతీ
భాసిల్ల గాఁబాద మీాసూటి తోనాల్గు
జేసిన కృతులందు షట్పదాఖ్య."

ఇందలి మొదటిపాదము చివరి చంద్రగణమును తగణము గురువుగాఁ జేసినచో నే డింద్రగణములు, ఒక గురువు అని చెప్పవచ్చును. కన్నడ పద్యమునఁగూడ నేడవ రుద్రగణ

మును విష్ణుగణము గురువుగాఁ జేయవచ్చును. ఇట్లు కన్నడాంధ్ర పద్యముల లక్షణము సరిపోవును. కాని కిట్టెల్ చేసినట్లు మాత్రాగణ స్వరూప నిర్ణయించినచో-అనగా ౪ మాత్రల గణములని, ౫ మాత్రల గణములని చెప్పినచోఁ దెలుఁగు పద్యము కుదురదు. ఇందు కొన్ని ౫ మాత్రలవి, కొన్ని ౪ మాత్రలవికూడ నున్నవి. కాని పాటకు సరిపోవునట్లు హ్రస్వ దీర్ఘముల నించుక మార్చి సరిపెట్టుకొనుట కవకాశము లేక పోదు. దేశీయగణ నిర్మాణపద్ధతినిబట్టి యీ చిక్కు రాక మానదు. ౫ మాత్రల గణములు గల షట్పదిని కన్నడమున కుసుమ షట్పది అని యందురు. ఇది తెలుఁగున నప్పకవి చెప్పినదానికి సమానము కావచ్చును.

"కుసుమ షట్పదియ మొద
లెసెవపద యుగ్మక్కె
దశమాత్రె గళుమేల నొందొందఱూ"

ఇట్లు నాలుగైదుమాత్రల గణములను నాలుగేసి చేర్చినచో నివి మధురగతి, ద్విరదగతి రగడల పాదములగుచుండుట లేదా? కావున నీ షట్పదులును రగడభేదము లే యనుటకు సందేహమేల? కాని భేద మెచ్చట నున్నదనఁగా రెండవ నాల్గవ పాదములలోని తుది గణము కొంచెము హ్రస్వమైనది. అనఁగా నాలుగైదు మాత్రల నింద్ర గణమునకు బదులుగా ౨ మాత్రలు గల గురువైనది. ఇది పాటకొరకు చేసిన మార్పే. ఈ మార్పు లేనిచో నివి ఆయా రగడల రెండు పాదములగును. ఇటి పాట ...

గలవు. వినాయకచవితినాడు పిల్లలు పాడుకొను మంగళ హారతి యొకటి.

"శ్రీశంభు తనయునకు
సిద్ధగణ నాధునకు
వాసిగల దేవతా – వందితున–కూ
ఓ బొజ్జ కనకయ్యా
నీబంటు నేనయ్యా
ఉండ్రాళ్ల మీదికీ–దండుబం–పూ.
జయమంగ ళంనిత్య
శుభమంగ ళం—

శుక్రవారము పాట

"ఈశ్వరా పుత్రునకు
గాజావ తారునకు
పార్వతీ తనయునకు–భక్తితో–నూ"

ఇచ్చట నొక విశేషమేమనగా, నిందలి తుది గురువును హ్రస్వముచేసి యించుక మార్చిన నిది యొక సీసపద్య పాదమే యగును.

"శ్రీశంభుతనయునకు సిద్ధగణనాధునకు
వాసిగలదేవతా వందితునకు
ఈశ్వరపుత్రునకు గాజావతారునకు
పార్వతీతనయునకు భక్తితోడ"

12

షట్పదములలోఁ దుదిది చంద్రగణముగా గ్రహింపఁ బడినది. అదియే రెండు సూర్యగణములుగా గ్రహింపఁ బడినపు డా రింద్రగణములు, రెండు సూర్యగణములై సీసపద్యపాదమైనది. షట్పదములలోఁ దుది గణము పూర్తిగా ౪, ౫ మాత్రలు గలిగి యుండినచో నదియే రగడ యగు చున్నది. కావున నీ రగడలనే పాటల కనుకూలముగా తుది పాదము నించుక మార్చినచో నెన్ని విధములుగా మాడనో చెప్పుట కవకాశము లేదుగదా. ఇక బ్రహ్మ విష్ణు (సూర్యేంద్ర) గణముల కలయికతోఁ గూర్చి చెప్పిన నింక నెన్ని విధములగునో విచారింపుఁడు. మచ్చుకొక పాట—

"చెంగావి చీరెలా
కొంగూలు జీరాడ
రంగైన నవమోహనాంగి యెక్కడికే
చంద్రూని శిరమూన
ధరియించు కొన్నట్టి
జగములే లెడుజగ (గా) ధీశుసన్నిధికే
మంగాళం మంగాళం"

మేలుకొలుపు పాటలు అయిదేసి మాత్రల గణములతోఁ గూడినవే.

"కేశవా యనినిన్ను వాసీగ భక్తూలు
వర్ణింపుచున్నారు మేలు-కో
వాసావ వందీత వసుదేవ నందాన
వైకుంఠపురవాస మేలుకో తెల్లవా-రవచ్చే-నూ

తెల్లవా రావచ్చె తెలియాక నాసామి
మల్లీప దున్నావు లే-రా
వేణునా దమువీని వేగప ద్దిడివ స్తి
వేళాయె ళామేల-లే-రా''

ఈ క్రిందివానిలోని తుదిగణమున నొక మాత్ర తక్కువగాఁ గనఁబడినను రాగమున సరిపోవును.

లాలిపాట—

''లాలిబం గరుబొమ్మ లాలిమా యమ్మా
లాలిము ద్దులగుమ్మ లాలిసీ తమ్మా-లా(ఆ)లీ
జోజోచి-దానంద-జోజోము-కుందా
జోజోకృపాపాంగ జోసుందరాంగా-జో(ఓ)జో.''

అప్పగింతపాట—

''ఘనమైనతొడవులను కట్నాలనిచ్చి
వేచెనేజనకుఁడూ వై దేహి నంపా...
నెయికాచనేరదూ నెలమినీా వదినా,
నేర్పుతోపను లెల్లనేరుపా వమ్మా.
బుద్ధు లెరు గదు మంకు బుద్ధులేగాని
బుద్ధులొచ్చినదాక దిద్దుకోవమ్మా
ఆబాలయెరుగదు అదిబాలసుమ్మీ
మీాబాలలలోనొక్క బాలగా జూడూ''

భోగషట్పది—

"భోగషట్ప దంగళోలగె
బేగ మొదలపాదయుగ్మ
కాగళక్కమర్కమాత్రె లెక్కసంఖ్య-యో"

సూర్యగణములు తొలి రెండు పాదములలోను నాలుగేసి. మూఁడవపాదమున నారు గణములు, నొక గురువు. మొదటి రెండు పాదములు హయప్రచారరగడ పాదములతో సమానములే.

"ఋతువిరామ మినులు నల్వు
రతుక నొక్క యంఘ్రిచెల్వు."

రగడలోని మూఁడు నాలుగు పాదములను గలిపి యొక పాదముగాఁ జేసి, అందు నాలవపాదములోని నాలవగణమును లోపింపఁజేసి మూఁడవగణము నేక గురువుగాఁ జేసిన భోగ షట్పది మూఁడవపాద మగుచున్నది. నాలుగేసి గణములు గల హయప్రచారపాదము ద్విగుణీకరించిన తురగవల్గన పాద మగునుగదా. ఈ ఎనిమిది గణముల పాదములోఁ దుది నొక మాత్రను తొలగించి యా గణము నొక్క గురువు కల దానినిగాఁ జేసిన ఏడు సూర్యగణములు, ఒక గురువుగల— ఉత్సాహావృత్తమున కొక పాద మగుచున్నది. అనఁగా హయప్రచార రగడ రెండు పాదములను జేర్చి తుదిగణములో నొక మాత్రను తీసివేసిన ఉత్సాహాపాదము, హయప్రచా రము నాలుగవపాదములో తుదిగణము, దాని వెనుకటి

దానిలో నొక మాత్రను దీసివేసినచో భోగషట్పది అగు నన్నమాట. మన ముసలమ్మలు పాడుకొను తులసిపాట యీ భోగషట్పదియే.

"తులసి యింట నుంచువార్ని
తులసిపూజ చేయువార్ని
తులసియందు భక్తియుంచి మెలగువారి-నీ-
తులసిజూచి మ్రొక్కు వార్ని
తులసియనుభవించువార్ని
తెలిసినీవు వారిదిక్కు-తొంగిచూడ-కూ

సువ్విపాటకూడ నీ షట్పదీరూపమే.

"సువ్వి సువ్వి రామచంద్ర
సువ్వి సువ్వి కీర్తి సాంద్ర
సువ్వి-సీ-తమ్మమాకు, శుభము-లి-మ్మా"

ఇందలి విశేష మేమనఁగా-ఏకాక్షరగణములు కూడ నున్నవి.

"మోదమును పెండ్లిపీట
మీద శ్రీరామ సరస
ఆదిలక్ష్మియైన సీతమ్మ నునిచి-రీ.

వాటమైన కుందనంపు
మేటికుందె యందులిచ్చి
గాటమైనపసిడి రో-కళ్లు బట్టు-కా-

రాజనములు ఇప్పపువ్వు
రాజనములు మంచిపునుగు
మేలుకొండ రాజనములు, మేలు వంకె-లూ—
కుందియందు నాడ నునిచి
కొట్నమూలు దంచి రవుడు
కుంద రదన లెల్ల నవ్వు కొనుచు జెలగు-చూ".

మంగళహారతి—

"రామచంద్రాయ జనక రాజజామ నోహరాయ
మామకాభీష్టదాయ మహిత మంగ-ళం

భామినిషట్పది—

"భామినీయష ట్పదియమొదలొళ
గామహాపా దద్వయంగళు
నేమిసలుమనుమాత్రెమేలణ పాదమొందొం-దో."

మూడునాలుగు, (3 + ౪) మాత్రలు గల రెండు గణములు చేరి ఒక పాదమగును. మూడవపాదములో నట్టివే మూడుగణములు తుది నొక గురువునుండును. ఇది హరిణగతిరగడభేదమే కావచ్చును.

"భాను యుతనల భసగ గంబుల
లోన నిడుదో లునన గంబుల"

ఇది గుమ్మడిపాటకు సరిపోవుగు.

"గుమ్మ డేడే గోపి దేవీ
గుమ్మ డేడే కన్న తల్లీ

గుమ్మడినిపోడ సూపగదవే-అమ్మ గోపి-మ్మా
అమ్మా-గుమ్మ-డేడే.
క్రుచ్చుతనమున వేదములుగొని
తెచ్చి వెరచుచు జలధిలోపల
జొచ్చియున్నా వానివెంబడి జొచ్చిజలనిధిలో
మత్స్యమై సోమకుని ద్రుంచితి
మగుడ చదువులు బ్రహ్మకిచ్చితి
అక్షణంబున గుమ్మడనియెడి మాటనే నెఱుగా
అమ్మా గుమ్మడేడే''

కన్నడమునఁ గర్ణాటజాతులలోఁ జేర్చి నాగవర్మ ఒక 'ఏళె' అనుదానికి లక్షణము చెప్పినాఁడు. దాని కారు ద్రుద్రగణములు, ఒక అజగణము నుండవలెనని యున్నది. కాని దాని నడకకూడ తెలుగు 'ఏల' పాటలతో సరిపోవున ట్లగపడదు. దేశభేదములనుబట్టి పాటలోఁ గలిగిన మార్పు మూలమున లక్షణమునఁగూడ కొంత భేద మేర్పడవచ్చును. కాని ''ఏల'' యనునది నాగవర్మనాటికే దేశీయ రచనా భేదముగాఁ బ్రచారములో నున్నదనుట నిశ్చయముగదా. సోమనాథుఁడు బసవపురాణము నేలలుపెట్టి పాడినట్లు చెప్పి యున్నాఁడు. కావున నిదియు సోమనకుఁ బూర్వముననే కాక, నన్నయకుఁబూర్వము నాగవర్మనాటికే కన్నడదేశము నందువలెనే తెలుఁగుదేశమందును బ్రచారములో నున్న దని యెంచనగును.

ఈ ''యేల'' యనునదికూడ పైని చెప్పిన హాయ ప్రచార రగడకు సంబంధించినదై నాలుగేసి సూర్యగణములు

గల పాదములలోఁ గూడి భోగపట్టుది రకములోఁ జేరఁ గలదని తోఁచుచున్నది. ఇవి యిటీవలి యక్షగానములలో మాత్రమే గావచ్చుచున్నవి.

కంసాలి రుద్రయరచితమగు "సుగ్రీవవిజయ" మను యక్షగానములోనిది. "ఏల"—

"భాను వంశా మూన బుట్టి
దానా వాకా మీని గొట్టి
పూని మఖము నిర్వహింపా-వా-ఓ-రామచంద్ర
మౌనివరులు సన్నుతింపా-గా
రాతినాతి జేసి పూరా
రాతిచేతి విల్లువిఱిచి
భూతలేంద్రు లెల్ల మెచ్చా-గా-ఓ-రామచంద్ర
సీతనూ వివాహమాడా-వా."

ఇంకను నిటీవలి సారంగధర యక్షగానములో నిది-

"పావురంబు ఎగర వేయూ-డీ-ఓ-బాలులారా
పావురంబు ఎగరవేసీ పిలిచి తేను మళ్లి వచ్చు (ను)
ఓడుగెల్పు రెండుచూడ-వలెనుగాక యిపుడుమీరు
పావురంబు నెగరవేయు-డీ-ఓ-బాలులారా."

(సారంగధర-వీథినాటకము.)

పాటలో గొన్ని 3 గురువులు గల గణములుగాఁ గనఁ బడుచున్నవి. కన్నడ గణవిభాగపద్ధతిని బ్రహ్మగణములలో

గగముకూడఁ జేరును గావున నా విభాగమునుబట్టి యది దక్షిణ దేశీయ పద్ధతియే యగుటచే సమర్థనీయమే యగును. తమిళ పద్ధతి యింకను విపులమని ముందు చూడఁగలము.

ముద్రితమైయున్న ఛందోంబుధిలో గానరాకున్నను కిట్టెల్ సంపాదించిన గ్రంథములో రగడభేదములుగా గ్రహించినవానిలో అష్టపది, ఏకతాళ, త్రిపుట అనునవికూడఁ గలవు. నాలుగుమాత్రల చరణములు పాదమునకు రెండేసి చొప్పున నెనిమిది పాదములు కూర్చి, ఎనిమిదవ పాదమున మఱి రెండుగణము లధికముగాఁ జేర్చినచో నష్టపది యగును. ఎనిమిది పాదములకును ప్రాసముకలదు. ఇందలి రెండేసి పాదములు నాలుగు మాత్రల నాలుగు గణములుగల మధురగతిరగడ యగును గావున దీనిని రగడభేదమే యనవచ్చును. ఇదియు నేకతాళ జాతిలోఁ జేరినదే యనియు, వృత్తము కాదనియు, తాళబద్ధములగు జాతులలోనిదనియుఁ దెలియుచున్నది. త్రిపుటతాళమున కిచ్చిన యుదాహరణమును బట్టి (౩+౪+౩+౪+౩+౪+౩+౨) మూఁడేడు మాత్రల గణములు, నొకటి అయిదు మాత్రల గణముతోఁ గూడినదని చెప్పవచ్చును.

“మగనేనిం తళియె సెఱ్ఱియిపె నెంతో పేళెయ్ శంకరా.”

కావున నిది తెలుఁగు నందలి వృషభగతిరగడ కావచ్చును. తుది పాదమునందలి రెండు మాత్రలు పాట కొఱకు లోపించి యుండును.

ఈ త్రిపుట ఏకతాళాదులు రగడభేదములేయని, లేదా కొన్ని మాత్రలను తొలఁగించి చదివినచో నా యా రగడ లీ యీ తాళములకు సరిపోవునని యప్పకవి చెప్పియే యున్నాఁడు. ఇంతేకాక యీ తాళాదులతోఁగూడిన రగడ భేదములగు పాటలు, చంద్రికలు, అర్ధచంద్రికలు మొదలగు నవి యక్షగాన ప్రబంధములలో తరుచు బ్రయోగింపఁబడు ననికూడఁ జెప్పినాఁడు.

"తుద నేడు లఘువులు తొలగించి చదివిన
త్రిపుటకు వృషభగతిపదయుగము.
లలి గడపల నొక్క లఘువునూనిన జంపె
మను ద్విరద గతి సమపదయుగము.
గురుతు రూపకమునకుఁదురగ వల్గనా
హ్వాయ మేకతాళ యామధురగతికి
(హరికి) నిర్వదినాలు గటతాళమున మాత్ర
లోలి విశ్రాంతిపద్నాలుగింట
తెలియ నర్ధంబు నర్ధచంద్రికలు వీన
యక్షగానప్రబంధంబు లతుకవచ్చు
రగడభేదంబు లివి యంద్రు రసగవీంద్రు
లవిత నిజసేవకస్తోమ యబ్ధిధామ."

రగడలను పాట కనుకూలముగాను, ఆయా తాళములకు సరిపోవునట్లుగాను తుదను కొన్ని మాత్రలను తగ్గించి పాడు రీతులు యక్షగానపఙ్క్తిలోఁ బ్రచురమై యుండును. సోమనాథుఁడు తన కాలమున ననేక విధములగు నాటకము

లాడువారినిగూర్చి చెప్పనేకాని యక్షగానముల విషయమున నా యా వేషములు వేసికొని పాడుటకే ప్రాధాన్యమిచ్చినట్లున్నది. అప్పటి కవి యింకను గానరీతులే కాని ప్రదర్శనార్హములు కాలేదేమో!

రంగాజమ్మ రచించిన "మన్నారు దాసవిలాస నాటక రాజం"బను యక్షగానమున రగడలు, తాళములును గలవు.

వృషభగతికి త్రిపుటతాళము-అనగా ౭ అక్షరములు, 3 దెబ్బలు (3+౨+౨). ఇదియే ఛందోంబుధిలోని 'త్రిపుడె తాళ."

"శ్రీమనోహరు నంబుజోదరు
చిత్తజాతగు రుందలంచె"

మధురగతికి ఏకతాళము. ౮ మాత్రలు, ౧ దెబ్బ.

"చందన చరిత్ర నీలక శైబర
పీతవసన వనమాలీ"

కిట్టెల్ చెప్పిన కన్నడ అష్టపదియు నాలుగక్షరముల రెండేసి గణములతోఁగూడిన యేకతాళము గలదగుచున్నది.

జంపెతాళము. ద్విరదగతికి. ౧౦ అక్షరములు లేదా మాత్రలు, ౨ దెబ్బలు.

"నీవాడ నేగాన నిఖిలలో కనిదాన"

"శ్రీయువతి నిజయువతి
జేసియెం తయు మించి" (అనంత. ఛం.)

రూపకతాళము. తురగవల్గనము. ౬ అక్షరములు, ౨ దెబ్బలు.

"వరవీణా మృదుపాణీ వనరుహలోచనరాణి"

"శ్రీ సతీశు బరమపురుషు
జిత్తమున దలంచువారు" (అనం. ఛం.

రంగాజమ్మ రచితమగు మన్నారుదాసవిలాస నాటకమను యక్షగానమున రూపక తాళమున కుదాహరణ మొకటి కలదు.

"చందనాచల కందరోదర మందమారుత బృందసోదర
నంద్యకోవిద నంద్యసద్రస తుందిలోదిత కందళోజ్జ్వల."

ఇక తెలుఁగు కవితలో నన్నయకుఁ బూర్వమునను, తరువాతనుగూడ సమానమైన ప్రాధాన్యమును వహించినవి సీస, గీతములు. ఇవియే యాంధ్రచ్ఛందోరచనలలో ప్రాచీనములు కన్నడముతోఁ బోల్చినపుడు ఆంధ్రకవితకు విలక్షణములునై కనఁబడుచున్నవి. త్రిపది, చౌపది, షట్పది మొదలగువానికి ప్రాచీనకాలమున శిష్టకవితలోఁ బ్రచారమున్నట్లగపడదు. రగడలనుగూర్చి ప్రాచీనులగు తెలుఁగు లాక్షణికులు స్మరింపలేదు. ఇప్పటికి లభించిన తెలుగులక్షణ గ్రంథములలో మొదటిదగు కవిజనాశ్రయము తత్ప్రతికాకారులు చెప్పినట్లుగా కొంతవరకుఁ బ్రాచీన కర్ణాట గ్రంథ మర్యాద ననుసరించి-ఛందోంబుధి యందువలెనే - తొలుత వృత్తాధికారమున సమవిషమ మాలావృత్తాదులను, పిదప జాత్యధికారమున——

"జాతులు మాత్రాసమక
ఖ్యాతగణప్రతతిఁ జెప్ప గందములయ్యెన్
గీతులు మొదలగునవి యుప
జాతులు భూతలవినూత్నజాతయశస్కా."

అని, పిదప ప్రత్యేకముగా తెలుఁగుజాతులనుగూర్చి-

"వెలయంగఁ దెనుఁగుబాసకు
దలమయ్యెడు సీసములను దర్వోజలు గీ
తులు నక్కరలను ద్విపదలు
పొనుపొందగ రేచఁ డిష్టమున నొనరించున్"

అని చెప్పెనేకాని రగడభేదములనుగాని, షట్పది, ఏళె మొదలగువానినిగాని చెప్పలేదు. తరువాత విన్నకోట పెద్దనార్యుఁడు అక్కర సీసభేదములను, షట్పది చౌపది ద్విపద మంజరులనే తెనుఁగుదేశ జాతులలోఁ జేర్చి చెప్పెను. రగడను చాటుప్రబంధ భేదముగా స్మరించినాడు. కాని అనంతామాత్యునివరకు రగడభేదములు, కళికోత్కళికలు, చాటు ప్రబంధములలోని యుదాహరణలును తెలుఁగున ఛందోగ్రంథములలోని కెక్కనే లేదు. అప్పకవి కాలము వరకు యక్షగానముల ప్రశంసగాని, త్రిపుటాది తాళప్రశంస గాని కనఁబడదు. ప్రాచీన లాక్షణికు లంతగా రగడ, షట్పదాదులకు లక్షణము వ్రాయకపోవుటకుఁ గారణము ప్రాచీన శిష్టకవులు వానిని గ్రహింపకుండుటయే. నన్నయాదులగు ప్రాచీన కవులు రగడలను, ద్విపదలను వాడ లేదు. నన్నయ వాడిన అక్కరపద్యములు తిక్కన కక్కర

లేకపోయినవి. ద్విపదలో కావ్యము రచించుటకు సోమనాథుఁడు తన ప్రయత్నము నెంతగానో సమర్థించుకొనవలసి వచ్చినది. కావుననే "ఆయాథ గద్యపద్యాది ప్రబంధ" ముల ముందట తెలుఁగు దేశీయరచనలన్నియు నడుగంటి పోవుట తటస్థించినది. ప్రబంధముల కాలములో రగడలు కొంచె మాదరింపఁబడినవి. తరువాతి నాయక రాజుల పుణ్యమా యని యక్షగాన ప్రబంధములు మరల తలయెత్తుటచే నందలి దేశీయ రచనలనుబట్టి ప్రాచీన దేశీయచ్ఛందో మార్గములను గొన్నిటిని గుర్తింప మన కవకాశ మేర్పడుచున్నది.

ఇక కన్నడ లక్షణ సహాయమునను తెలుఁగు శాసనములనుబట్టియు మనము నన్నయకుఁ బూర్వకాలిక రచనలుగా గుర్తించినవానిలో ద్విపద, గీత, సీసములను గూర్చి పరిశీలింపవలసి యున్నది. ద్విపద గీతముల లక్షణములలో కన్నడాంధ్రములలోనివానికి సామ్యము కుదర లేదు. పాదమునకు నాలుగేసి గణములు గల దేశీయ రచనలలో ద్విపద ప్రధానమైనది. నాలుగు గణములను రెట్టించిన సీసపాద మేర్పడును కావున నిదియు నా జాతిలోనే చేరవచ్చును. మూఁడింద్రగణములు, నొక సూర్యగణము గలిగిన ద్విపద నొక పాదముగనే చేసి చదివిన సీసపాదము కాఁగలదని యిదివరకే తెలిసికొనియున్నాముగదా. ఇక నీ రెంటికిని గల భేద మెక్కడ నున్నదనఁగా, ద్విపద రెండు పాదములకును ప్రాసనియమము కలదు. సీసపాదమున కా నియమము లేదు. ఈ ప్రాస నియమము మూలముననే

ద్విపద తెలుఁగునందలి ఛందో విశేషములలో నొకటగు నుపజాతి గణములలోఁ జేరుట కవకాశము లేకపోయినది. కన్నడఛందోఫక్కికిని, తెలుఁగు ఛందోఫక్కికిని దేశీయ రచనల విషయమునఁగూడఁ గలిగిన భేదమే యిది. కన్నడమున వృత్తములలోఁగాని, జాతులలోఁగాని, జాతీయగణబద్ధములగు దేశీయజాతులలోఁగాని ప్రాసము లేని పద్యమే లేదు. తెలుఁగునందట్టి ప్రాసనియమము లేని పద్యము లొక ప్రత్యేకగణముగా నేర్పడినవి. అవే ఉపజాతులనునవి. "జాతులు కందాదులు నుపజాతులు గీతాదులు." ఈ యుపజాతుల మూలముననే తెలుఁగుఛందస్సు ప్రాచీన దక్షిణదేశీయచ్ఛందస్సంప్రదాయమును కన్నడముకంటెను విశేషముగా నిలుపుకొనియున్నదని చెప్పవలసియున్నది. సీసగీతములకుఁ బ్రాస లేకపోవుట యేల అను ప్రశ్నకుఁ బ్రాచీన దక్షిణదేశీయ సంప్రదాయములలో నొకదానిని నిలుపుకొనుటయే కారణమనియుఁ జెప్పవచ్చునేమో. ఆ సంప్రదాయ మేమనఁగా, వీనిలో దేశీయ గణములగు సూర్యేంద్ర గణములు యథేచ్ఛగాఁ జేరవచ్చుననుటయే. ఏడింద్రగణములు, రెండు సూర్యగణములు ననఁగా, నేడింద్ర గణములలోను లఘ్వాదులైనను సరే, గుర్వాదులైనను సరే ఏవైనను యథేచ్ఛముగా పాదాదిని రావచ్చుననుట. కారణ మేమన, ప్రాసనియమము లేదు గనుక. ద్విపదకును మూఁడింద్రగణములు, నొక సూర్యగణమునేగదా. కాని ద్విపద పాదముతొలిగణము మొదటిపాదములో గుర్వాదియైనచో రెండవ పాదమునను గుర్వాదియే కావలయును.

అనఁగా ప్రథమ పాదాదిని నల, నగ, సలలో నేదియైన నున్నపుడు రెండవ పాదమున మొదట భ, ర, తలు రాఁ గూడదు. కావుననే—

"గురులఘువులలో నెయ్యది
మురసంహార ప్రథమపాద ముఖమున నిలిచెఁ
ధర నుపజాతులు దక్కఁగఁ
బరగ నిలుచు నవియె నాల్గుపదముల మొదలన్"

అను నియమము. గీతికలకుఁగూడ కన్నడమున ప్రాస నియమము కలదు. కన్నడమున ప్రాసనియమము లేని పద్యము లేదు గనుక నీ యుపజాతిభేద మా భాషలో లేక పోయినది. ప్రాచీన ద్రావిడ సంప్రదాయమునుబట్టి అట్టి పద్యములను తమిళముతో పాటు ఆంధ్రము నిలుపుకొనియున్నది. తమిళమునందలి వెన్ బా పద్యములలో ప్రాస (యదుగై) నియమమున్నను, అగవల్పా పద్యములలో నట్టి నియమము లేదు. తెలుఁగునఁ గొన్నిటిలో లేకుండుట కిదియే కారణము కావచ్చును.

ఇంతవరకుఁ బరిశీలింపఁబడిన యాంధ్ర కన్నడ దేశీయ చ్ఛందోరచనలన్నియుఁ జాలవఱకు నాలుగు గణములు గల పాదములతోఁ గూడినవి. లేదా నాలుగేసి గణములు గల రెండు దళములుగాఁ గలిగిన యొక పాదముతోఁ గూడినవై యున్నవి.

ఇవియన్నియు(అక్కరలుతక్క)పాదములకు నాలుగేసి చొప్పున సూర్యేంద్రగణములతోఁ గూడియున్నవి గావున,

నివి తమిళమున పాదమునకు నాలుగేసి శీర్లుగల ''అగవల్పా'' రచనలను బోలినవని చెప్పవచ్చును. ఇట్టిదానిని ''నిలైమండిల ఆశిరియప్పా'' అందురు.

ఇక పాదమున కైదేసిగణములు గల పద్యములు చాల తక్కువగా నున్నవి. తేటగీతము,ఆటవెలఁది యనునవి తెలుఁగునఁ గలవు. అక్కర భేదములలో నొకటగు మధురాక్కరకుఁ గూడ నైదే గణములు. కాని దీనిలో నైదవ గణముగా చంద్రగణము వచ్చును. గీతములో సూర్యగణము, ఆటవెలఁదిలో నింద్రగణముగాని, సూర్యగణముగాని వచ్చును. అక్కరలలో పాదమునకు ఆరు ఏడు గణములు వచ్చునవికూడ కలవు. నాలుగు గణములు గల అంతరాక్కరలో నొక సూర్యగణము, రెండింద్రగణములు, ఒక చంద్రగణము వచ్చును గావున, నీ చంద్రగణము రెండు సూర్యగణములుగా మార్పఁదగినదైనచో – అనగా ''రల'' మో ''నల'' మో యైనచో నా పద్యము ఒక సూర్యగణము, రెండింద్రగణములు గల తేటగీత మగును. ఇవి యెట్లు వచ్చినను మొత్తముపై నీ యైదు గణములు గల పద్యములు వెనుకటివాని వలె తమిళమునందలి ఆశిరియప్పా–లేక అగవల్పా అను దానితో సంబంధించినవి గాక ''కలిప్పా'' రచనలతో సంబంధించి యున్నవనవలసి యున్నది. కలిప్పాభేదమగు ''కట్టళై కలిత్తురై'' అనుదానిలో నైదేసి గణముల నాలుగు పాదము లుండును. దీనిలో మొదటి నాలుగు గణములను ''ఈరశైచ్చీర్లు''–అనగా రెండు దేశీయచ్ఛందోక్షరములను ప్రస్తరింపగా వచ్చిన గణము లుండవలెను. ఈ

ఛందోక్షరములనగా నేర్ నిరై అను సంకేతము గలవి. ఈ నేర్ నిరైలు రెంటిని ప్రస్తరింపఁగా వచ్చిన గణములలోఁ గొన్నిమాత్రమే సూర్యేంద్రగణములు, కన్నడ బ్రహ్మవిష్ణు గణములు నగుచున్నవి. మూఁడు అక్షరములను బ్రస్తరింపఁగా వచ్చినవి "కాయ్ చ్చీర్గళ్." వీనిలో మన ఇంద్రగణముల లోని "న. సల"లు, నవ నలల నగగ నగల మొదలగు చంద్రగణములు చేరినవి. వీనినిగూర్చి తరువాతఁ దెలిసికొందము. ప్రస్తుతము తమిళమునందలి "కట్టళై కలిత్తురై" అను పద్యము లో పాదమునకు ౪ రెండక్షరముల గణములు– అనగా సూర్యేంద్రగణములలోనివి, తుదిగణము 'విళంగాయ్ చ్చీర్'లలో నొకటి–అనఁగా బైని చెప్పిన చంద్రగణములలో నొకటియై యుండవలెను. కావున నొక సూర్యగణము, రెండు ఇంద్రగణములు, తుద నొకటి చంద్రగణమును జేర్చగా నేర్పడు తెలుఁగు మధురాక్కర కలిప్పా భేదమగు తమిళపద్యముతో సమానము గావచ్చును.

ఇఁక తేటగీతకూడ నైదు గణములతోఁగూడినదే. కాని యందు అక్కరలోవలె చంద్రగణములు రావు. కావున నిది "కలిప్పా" భేదములకు సంబంధించినదై యుండదు. పాదమునకు మా, విళ, కాయ్ చ్చీర్గళ్—అనగా సూర్యేంద్ర చంద్రగణములలో నేవైనను నాలుగు చొప్పున వచ్చు వెణ్బా పద్యరచనలలోఁ జేరినదై యుండును. ఇందు పై కలిప్పాలో వలె చంద్రగణము వచ్చితీరవలయునను నిర్బంధము లేదు. కాని ఒక సూర్యగణము, రెండింద్రగణములు, ఒక చంద్ర గణము అను నాలుగు గణములతోఁ గూడిన వెణ్బా పాదము

మొదటి చంద్రగణమును రెండు సూర్యగణములుగా గ్రహించి నచో నొక సూర్యగణము, ౨ ఇంద్రగణములు, ౨ సూర్యగణములును గలిసి యేడు గణములుగల గీతపద్యపాదము కాఁగలదు. ఇట్లు ౫ గణములుఁగల మన గీతపద్యమునకు సరిపెట్టుకొనఁగలిగిన నాలుగు పాదముల వెణ్బాపద్యమును "ఇన్నిశై వెణ్బా" అని యందురు. ఈ వెణ్బాభేదములలోఁ గొన్నిటికి "యదుగై"—అనఁగా ప్రాసకూడ కలదు. ఈ "ఇన్నిశై వెణ్బా" పద్యములో ప్రాసలేకయు నుండవచ్చును. దీనినిబట్టి—అనఁగా ప్రాసవిషయమున తమిళమునఁ గల యైచ్ఛికత్వమునుబట్టి ప్రాసవిషయమున నెక్కుడు పట్టుదలఁ జూపిన కన్నడభాషలోఁ బ్రాసతోఁగూడిన గీతములును, తెలుఁగున ప్రాసలేని గీతరచనమును సంక్రమించి నిలిచి పోయినవా యని యూహించుట కవకాశమేర్పడుచున్నది. వాస్తవముగాఁ బ్రాసవళ్లు రెండును తమిళమున ఎదుగై, మోనై అను రూపముల నిలిచియున్న ప్రాచీన దక్షిణదేశీయ సాహిత్యసంప్రదాయసిద్ధములే కాని సంస్కృతసాహిత్యము నుండి వచ్చినవి కావని నిశ్చయింపవలసియున్నది.

సంస్కృత ప్రాకృతములందును, ఇతర దేశీయ భాషలందును లేకున్నను, ఈ ప్రాసవళ్లునవి తమిళముతోపాటు తెలుఁగు సాహిత్యమునకు ప్రత్యేక లక్షణములైనవనుట యొక గొప్ప విశేషము. ఇట్టి యీ విశేషలక్షణమునుగూర్చి ౧౫-వ శతాబ్ది ప్రాంతమువాఁడగు కొరవి గోపరాజు "సింహాసనద్వాత్రింశిక" యను గ్రంథమునఁ బ్రశంసించి యున్నాఁడు. విక్రమార్కుని దివ్యపీఠం బెక్కఁబోవుచున్న

జునకుఁ బాంచాలిక చెప్పిన కథ. అతని పురోహితుని మారుఁ డవివేకియై తండ్రిచేఁ దిట్లుతిని దేశాంతరమున కేఁగి ద్యల నేర్చివచ్చి రాజుతోఁ బల్కెను—

‘‘...సంస్కృతాదిభాషలు నేర్చి
కవిత నెఱిఁగి యెల్లకడలఁ దిరిగి
తెలిసినాఁడ నిచటఁ గల లక్షణముకంటె
నూతనంబు లేదు భూతలేంద్ర.

వ. అట్టి విధం బయ్యును నంధ్రమండలంబునం గోణశంబునం దెలుంగుఁగవితకు వ్రాలు వళ్లనను నియమంబులు రాచినాఁడ నవి యెయ్యెడం దఱచు గాకుంట నపూర్వం వధరింపుము.

పుణ్యస్త్రీకి గుణంబు మంగళగుణం
బున్నెమ్ములై యొప్పగా
బుణ్యస్త్రీకి సువర్ణమౌక్తికసురూ
పవ్యక్తిభూషాకృతుల్
గణ్యంబాగతి సంస్కృతంబునకు వా
గ్భావంబు శబ్దంబు లా
వణ్యాకారము లాఁ దెనుంగునకుఁ బ్రా
ల్వళ్లుం గడున్వన్నియల్.

పలు దెఱంగు లైన పలుకులు గలిగియుఁ
బ్రాలు వళ్లులేని బేలుగవిత
వన్నెలెల్ల గూర్చి వ్రాయుచోఁ గాటుక
వన్నెలేని ప్రతిమ వ్రాఁతఁబోలు.

తప్పక వళ్లును బ్రాలును
ముప్పిరిగొనఁదగిన శబ్దములు మెఱుఁగెక్కం
జెప్పిన కవితాచాతురి
యొప్పము వెట్టిన పసిండియొఱపున మెఱయున్."

కావుననే యాంధ్రకవిత కట్టి వన్నియ కలిగినదిగాఁ బోలును !

ఇట్లు కన్నడాంధ్ర దేశీయజాత్యుపజాతి రచనా విశేషములకు తమిళచ్ఛందోరచనలతోఁ గల సన్నిహిత సంబంధము సువ్యక్తమగుచునేయున్నది. ఇఁక నీ దక్షిణదేశీయచ్ఛంద స్సంప్రదాయమునకు మూలమగు గణప్రస్తారపద్ధతితమిళమున నిలిచియున్నట్లగపడుటచేఁ నా తమిళగణ ప్రస్తార పద్ధతిని తక్కినవానితోఁబోల్చి బరిశీలించి తెలిసికొనుట మన కావశ్యకమే యగును.

సంస్కృతప్రాకృతచ్ఛందోరచనలలోని యక్షరగణ వృత్తమాత్రావృత్తాదుల లక్షణమును బరిశీలించి, దేశీయ జాతులకు మాత్రాగణప్రస్తారము మూలముగా లక్షణ మేర్పరచిన మన లాక్షణికుల పద్ధతికి దేశీయరచన లన్నియు లొంగకపోవుట, తమిళచ్ఛందోఫక్కి దీనిని బోలియే యున్నను ఇంతకంటె విపులమైనదిగాఁ గనఁబడుచుండుట, ఈ మొదలగువానికిఁ గారణమేమి యని విచారించినచో, నందలి గురులఘు సంకేతములలోనే కొంత భేదమేర్పడి యున్నట్లు గోచరింపకపోదు. కావున తమిళచ్ఛందోఫక్కికి మూలములగు గురులఘు సంకేతములను, వాని ప్రస్తారము

మూలమున దేశీయరచనాశక్తులలోఁ గలిగిన భేదములను తెలిసికొనవలయును.

"హ్రస్వం లఘు, సంయోగే గురు, దీర్ఘంచ" అనునవి గురులఘు విభాగమునుగూర్చి పాణినిసూత్రములు. ఈ సంకేతమే సంస్కృత ప్రాకృతచ్ఛందములలోను, వానినిబట్టి తెలుఁగు కన్నడ ఛందములలోను అనుసరింపఁబడుచున్నది. కాని తమిళమునందలి ఛందోక్షర సంకేతము దీనికి యత్కించిద్భిన్నమై యున్నను దీని నంతర్భూతముచేసి కొనుచునే యున్నది. అచ్చట గురులఘువులకు బదులుగా "నేర్, నిరై" లనునవికలవు. "నేర్" అనునది ఒక లఘువు కావచ్చును; ఒక గురువును కావచ్చును. లఘువుపై నొక హల్లు (అనఁగా నర్ధమాత్ర), గురువుపై నొక హల్లు నిలిచినను, ఇవియు "నేర్" లే యగును. అనఁగా "నేర్" అనునదే నాలుగువిధములు గలదై గురులఘువులను వానిని రెండింటిని దనలో నంతర్భూతము చేసికొన్నదన్నమాట.

ఈ నాలుగువిధములగు నేర్ అనుదానికి బూర్వమున నొక లఘువు నిలిచినచో నది "నిరై" అగును. ఇట్లు "నేర్" అనునది నాలుగువిధములైనదిగను, "నిరై" నాలుగువిధములైనదిగను అగుచున్నవి. ఇఁక రెండేసి మూఁడేసి గురువులను జేర్చి ప్రస్తారము చేసినట్లే, రెండు నేర్లనుగాని, ఒక నేర్, ఒక నిరైనుగాని, రెండు నిరైలనుగాని ఒక నిరై తరువాత నొక నేర్నుగాని చేర్చినచో రెండు శీర్ల (అనగాఅక్షరముల)గణము లేర్పడును. ఒక నేర్ అనునదికూడ ఒక గణముకావచ్చును.

నిరైకూడ అట్లే కావచ్చును. ఇక పైఁ జెప్పినదానినిబట్టి ''నేర్'' అను గణములు—క, కన్, కా, కాన్ అనున వేవైన కావచ్చునుగదా. 'నిరై' గణములో కక, కకన్, కకా, కకాన్ అనునవి యుండవచ్చును. వీనిని ''ఓరశై చ్చీర్'' ఏకాక్షరగణములని అందురు. రెండేసి అక్షరములు గల శీర్లను ''ఉరిచ్చీర్'' అనియు, ''ఆశిరియ ఉరిచ్చీర్'' అనియు అందురు. నేర్ అనునది క, కన్, కా, కాన్ అనువానిలో నేదైనగావచ్చునుగనుక రెండు నేర్లతోఁగూడిన గణములలో కక, కకన్, కకా, కకాన్, కాక, కాకన్, కాకా, కాకాన్, కన్క, కన్కన్, కన్కా, కన్కాన్, కాన్క, కాన్కన్, కాన్కా, కాన్కాన్—ఇన్ని రీతుల గణములేర్పడవచ్చును. కాని సంస్కృతచ్ఛందస్సంకేతము ననుసరించి చూచినప్పుడు ''నేర్''అను దానిలోఁ జేరిన నాలుగింటిలో మొదటిది లఘువు, తక్కిన మూఁడును గురువులే యగును గావున నేర్ అనఁగా గురువుగాని, లఘువు కాని కావచ్చునని మనము సరిపెట్టుకోవలసియున్నది. అప్పుడు రెండు ''నేర్''లతోఁ గూడిన గణములు రెండు గురువులు గాని, రెండు లఘువులుగాని, ఒక గురువు లఘువు గాని, ఒక లఘువు గురువుగాని చేరిన గణము లగును. తమిళమునందలి ౧౬ రీతులైన గణములు సంస్కృత ఫక్కి ననుసరించి నాలుగైనవన్నమాట. వీనిలో రెండు గురువుల గణము ''గగ''ము బ్రహ్మగణముగ కన్నడ ఛందమునను, గలము, లేదా హగణమునునది కన్నడమున బ్రహ్మగణముగను, తెలుఁగున సూర్యగణముగను నీ రెండు భాషలలోను

గూడ గ్రహింపఁబడినవి. లలము, లగము అనునవి యీ భాషలలో గ్రహింపఁబడలేదు. ఈ నాలుఁగింటిని తమిళమున 'తేమా' గణము లందురు. ఇవియు రెండక్షరముల గణముతోఁ గూడిన పద్యము లన్నిటియందును రావచ్చును గదా. రెండు అక్షరముల గణము లింకను మూఁడువిధముల నుండవచ్చును. నిరై + నేర్, నిరై + నిరై, నేర్ + నిరై. నేర్ అనుదానికి ముందొక హ్రస్వము చేర్చిన "నిరై" అగును గదా. కావున నిరై అను నదియు నాలుగు విధము లైనది. ఈ నాలుగు విధములైన నిరైల తరువాత నాలుగువిధము లైన నేర్ లను చేర్చినచో మరల ౧౬ విధములగు గణము లేర్పడును గాని నేర్ అనునది ఒక గురువు కావచ్చును, ఒక లఘువు కావచ్చును. కావున నిరై అనునది లఘువు గురువు గురువులఘువు కావచ్చును. ఈ రెంటిని చేర్పగా—

నిరై + నేర్

I ∪ + ∪	యగణము
I ∪ + I	జగణము
I I + ∪	సగణము
I I + I	నగణము

మూఁడక్షరములు గల య, జ, స, న గణములగు చున్నవి. ఇందు సగణము కన్నడమునందలి బ్రహ్మగణములలోఁ జేరినది. నగణము కన్నడమున బ్రహ్మగణములలోను, తెలుగునందలి సూర్యగణములలోనుగూడఁ జేరినది. ఇట్లు రెండు నేర్లయొక్కయు, నిరై నేర్లయొక్కయు కూడిక

వలన నేర్పడిన గణములలోఁ గొన్ని మాత్రమే కన్నడ బ్రహ్మ గణములును. తెలుఁగు సూర్యగణములు నైనవి. తక్కినవి వీనిలోఁ జేరనేలేదు. రెండు నేర్ల వలనఁ గలిగినవానికి "తేమా" అని, నిరై + నేర్ లవలనఁ గలిగినవానికి "పులిమా" అని తమిళమున వ్యవహారము.

ఇక రెండు నిరైల కూడికవలనను, నేర్ + నిరైల కూడికవలనను ఏర్పడినవానికి "కరువిళమ్", "కూవిళం" అని వరుసగా పేర్లు. నిరై అనఁగా లఘువుముందర లఘువు చేర్చినది, గురువుముందర లఘువు చేర్చినదిగదా.

కావున I II + I = నలము
II + I ∪ = నగము
I ∪ + I I = జలము
I ∪ + ∪ = జగము

నేర్ + నిరై — ∪ + I I = భగణము
∪ + I∪ = రగణము
I + I∪
I + I I

వీనిలో నింద్రగణములుగాఁ దెనుఁగున వ్యవహరింపఁ బడుచున్న నల, నగ, భ, ర అను నాలుగును వచ్చినవి. ఇవే కన్నడబ్రహ్మగణములుకూడను. ఇక తెనుఁగున నింద్రగణములలోఁ జేరిన "సల", "త" అనునవి తెలుఁగు గణవిభాగములో నింద్రగణములలోనే చేర్పఁబడినను, తమిళమున మూఁడేసి అక్షరములను ప్రస్తరింపఁగా వచ్చెడుగణములలోఁ

జేరినవి. మూఁడు నేర్‌లయొక్క-గాని, నిరై, నేర్‌లయొక్క-గాని కూడికచే నేర్పడిన గణములలో వచ్చును. మూఁడు నేర్‌లు-అనఁగా మూఁడు గురువుల మగణము, కన్నడము నందలి విష్ణుగణ మగుచున్నది. నేర్ లఘువుకూడఁగావచ్చును గావున మూఁడు నేర్‌లు-అనఁగా రెండు గురువులు, ఒక లఘువు చేర్చినచో తగణ మగును. ఇది కన్నడ విష్ణు గణము, తెలుఁగు ఇంద్రగణము నగును. ఒక నిరై, రెండు నేర్లను జేర్చినచో-అనఁగా రెండు లఘువులు రెండు గురువులు (। । ∪ ∪), రెండులఘువులు ఒక గురువు ఒక లఘువు (॥ ∪ ।) చేర్చినచో సగము-సలము అగును. మొదటిది కన్నడ విష్ణు గణమును, రెండవది కన్నడ విష్ణుగణము-తెలుఁగు ఇంద్ర గణము నగును. ఇట్లే ఇంకను మూఁడేసి అక్షరములను ప్రస్తరించినచో నిరై+నిరై నేర్ (॥॥ ∪) కన్నడ రుద్రగణ ములు తెలుఁగు చంద్రగణములలోఁ గొన్నియు, నాలుగేసి యక్షరములను బ్రస్తరింపఁగా మఱికొన్ని చంద్రరుద్రగణ ములును వచ్చును. ఈ తెలుఁగు కన్నడ గణములలోఁ జేరని గణము లనేకము లింకను ఈ ప్రస్తారమువలన తమిళమునం దేర్పడుచున్నవి. కన్నడమునందు గ్రహింపఁబడిన బ్రహ్మ, విష్ణు, రుద్రగణములలోఁ గొన్ని దెనుఁగున నినేంద్ర చంద్ర గణములలోఁ జేరనియట్లే తమిళమునందలి ౨, 3, ౪ అక్షర ముల-లేదా నేర్ నిరై ల ప్రస్తారమువలనఁగలిగినగణములలో ననేకములు కన్నడగణవర్గములలోఁగూడ జేరియుండ లేదు. కాని ఒక్క విషయముమాత్రము ప్రధానముగా గమనింపఁదగి యున్నది. గురులఘుస్వరూపమగు ఛందోక్షరముల విషయము

ననేకాక, తత్ప్రస్తారము, గణవర్గీకరణము విషయములఁగూడ సంస్కృతచ్ఛందోరీతికిని, దక్షిణదేశ భాషలలోని ఛందో రీతికిని భేద మగపడుచుండుటచే, నీ రెండును మూలమున భిన్నములనియు, నిటీవలికాలమున వీనికి లక్షణ మేర్పఱచిన సంస్కృత పండితు లా దేశీయచ్ఛందోమార్గములను, సంస్కృతచ్ఛందోరీతుల కనుగుణముగా సంస్కరించి, లక్షణ మేర్పరచుటచే నిట్లేర్పడెననియుఁ దలంపవలసియున్నది. ఈ దేశీయ రచనారీతులే ప్రాకృతములలోఁగూడ గ్రహింపఁబడి నపుడీ దక్షిణ దేశీయఁ మాత్రాగణపద్ధతిని వానికన్వయింప జాలక, కేవల మాత్రా సంఖ్యాపద్ధతినే యవలంబించి, ఇన్ని మాత్రలో, లేక ఇన్ని గురువులో లఘువులో నుండవలెననియు, ఇన్నో అక్షరము గురువో లఘువో కావలయుననియు సామాన్య నియమబద్ధము గాని యేర్పాట్లతో లక్షణము చేసిరి. ఈ ప్రాకృతచ్ఛందస్సులోని మాత్రానియమము గలిగిన "జాతులు" అను వర్గములోఁ జేరిన పద్యములలో ననేకములు దేశీయములే కావచ్చుననుటకు సందేహము లేదు. కాని వైదికచ్ఛందస్సులో మాత్రాసంఖ్యాబద్ధము లగు పద్యములు లేవా యను ప్రశ్న వెంటనే బయలు దేరక మానదు. కాని అవియు మాత్రా సంఖ్యాబద్ధములు కావచ్చును గాని, దక్షిణదేశీయచ్ఛందోరీతులను బోలిన వైన మాత్రాగణబద్ధములు మాత్రము కాఁజాలవు. ఈ దేశీయ గురులఘు సంకేతనమునకును, గణనియమపద్ధతికిని, సంస్కృతప్రాకృతములందలి దానికిని గల యీ భేదమును బట్టియు, సంస్కృత ప్రాకృతములలోను, తెలుఁగు కన్నడ

ములలోను గల కొన్ని ఛందోరచనల నామములందుఁ గల సామ్యమునుబట్టియు మాత్రాగణనియమ బద్ధములగు నీ దేశీయరచనలు కొన్ని అతి ప్రాచీనకాలముననే సంస్కృత ప్రాకృతములలోని కెక్కినవనియు, వానికి లక్షణము నేర్ప రచునపు డీ దక్షిణదేశీయమగు మాత్రాగణ నియమపద్ధతి నవలంబింపని సంస్కృత ప్రాకృతలాక్షణికులు కేవలమాత్రా సంఖ్యా నియమపద్ధతిని లక్షణ మేర్పరచి, యెట్లో తమ కంతకుఁ బూర్వము పరచితమగు గురులఘు పద్ధతితో సమ న్వయము చేయఁ దలపడిరనియు నిశ్చయింపవలసి యున్నది. దీనికి ప్రస్తుతమున నొక యుదాహరణము చాలును. నేర్ నిరైల ప్రస్తారమువలనఁ గలిగిన యీరశైచ్చీర్లతో నేర్పడిన దక్షిణదేశీయ రచనలలో నొకటగు సీసపద్యము భరతుని కాలమునాఁటికే ప్రచారములో నున్నట్లగపడుచున్నది. ఏల యనఁగా శీర్షక మనుపేర నొక రచనా విశేషమును, లేదా గేయవిశేషము నాతఁడు తన నాట్యశాస్త్రమునఁ బేర్కొని యున్నాఁడు. దీనిని గూర్చిన లక్షణమును గేవల మాత్రల సంఖ్యలతోడను, అక్షరముల సంఖ్యతోను చెప్పుటచే నిది సహజముగ దేశీయమే యని తలంపనగును. తాళభేదమగు శీర్షిత మనుదానినిబట్టి యా రచనకు శీర్షకమని యాతఁడే పేరుపెట్టిన ట్లగపడుచుండుటచే, నీ దేశీయ గీతరచనకు భరతుఁడు పెట్టిన పేరునుబట్టియే తరువాతికాలమున సీస మను తెనుఁగుపేరు సిద్ధించినదని తోఁచుచున్నది. "శీర్షిక" మను ఛందోరచనాభేదమునకు మూలము "శీర్షిత" మను నొక తాళభేదమనియు, దీనితోఁ గూడినది గావున దాని

కా పేరు వచ్చినదనియుఁ దెలియుచున్నది. ఇది ఒకవేళ అప్పటి కర్థము తెలియని దేశీయపదముయొక్క సంస్కృతీకరణమైనను గావచ్చును.

భరతుఁడు చెప్పిన శీర్షకలక్షణము—

''శీర్షకం సాతు విజ్ఞేయా శీర్షితేన విభూషితా,
ఏకపాదావసానస్తు యస్యా స్స్యా దర్ధవర్ణతః.
ఏతావసానేన బుధైః సా జ్ఞేయా తు చతుష్పదా,
పూర్వపాదేన తస్య స్యాత్ సర్వత్ర గురులాఘవః.
పాదే పాదావసానే చ సా జ్ఞేయా నియతాక్షరా,
శీర్షకం చ ప్రకర్తవ్యం గురుప్రాయాక్షరాన్వితం.
తతశ్చ శీర్షకం కార్యం ప్రయుక్తం పంచపాణినా,
శీర్షకో నామ నియమో భవే త్పాదవిధానతః,
నామ్నా వృత్తవినిష్పన్నం కుర్యాద్వై శీర్షకం బుధః.
గురు ర్గుర్వాది స్తథాల్పాది ర్యుగ్మః సతు లఘు స్తథా,
చతుర్మాత్రాక్షరో జ్ఞేయో పూర్వచ్ఛందోవికల్పకః,
అర్ధాష్టమగణాః పాదాః శీర్షకస్య భవంతి హి,
త్రింశన్మాత్రాశ్చ విజ్ఞేయా యుగ్మాజాక్షరజైః పదైః.
శీర్షకే హ్యేకవింశత్యాః షడ్వింశతిపర స్తథా,
అక్షరాణాం భవే త్పిండః పాదే హ్యేకత్ర నిర్దిశః.
యుగ్మాజమిశ్రకాః ఖలు పాదే కార్యాస్తు చత్వారఃస్యుః,
శీర్షకే తు నియమేన పశ్చా ల్లఘుసంచయః కార్యః.

త్రయ ఏవ గణాస్తు ముఖే లఘువస్త్రయ ఏవావసానే తు,
మధ్యే చేత్ గురుణీద్వే తచ్చపలా శీర్షకంనామ.
పూర్వే హ్యర్ధంతు గురుహ్రస్వాద్విత్రా గణాస్తు చత్వారః
పాదే భవంతి నియతం పశ్చాల్లఘుసంచయాః శేషాః."

భరతుఁడు నాట్యశాస్త్రమునఁ జెప్పిన పైశీర్షక లక్షణము తెలుఁగు సీసలక్షణమునకు సరిపోవుచున్నట్లే యున్నది. "చతుర్మాత్రాక్షరో జ్ఞేయో పూర్వచ్ఛందో వికల్పకః" అనగా పూర్వచ్ఛందమునకు భిన్నముగా నిందు ర మాత్రలు గల గణములను గ్రహింపవలెనట. భగణము - అక్షరగణములలో ర మాత్రలు గలదే. ఇదియు, "నల" అనునదియు ఇంద్రగణములలో నాలుగు మాత్రల గణములు. ఈ యింద్రగణము లారును, త్రిమాత్రాకములగు సూర్యగణములు రెండును ఒక పాదమునఁ జేరియుండుట తెలుఁగు సీసపద్యమునకు లక్షణము గదా. అనఁగాఁ బాదమున కెనిమిది గణములు. పాదములోని దళములకు నాలుగేసి యుండును. "అష్టావష్టమగణాః పాదాః శీర్షకస్య భవంతి హి" అనుదానికి ఇదే అర్థము కావచ్చును.

ఇఁక అందలి మాత్రలనుగూర్చి. "త్రింశన్మాత్రాశ్చ విజ్ఞేయా శుగ్మాక్షరకైః పదైః" అని పాదమునకు ముప్పది మాత్ర లుండవలయును. తెలుఁగు సీసమునందలి యా రింద్రగణము లను నాలుగుమాత్రలుగల "నల"ములో, "భ"గణములో నైనచో నివి యిరువదినాలుగు మాత్రలును, రెండు సూర్యగణములును ౬ మాత్రలును గలిసి ముప్పది మాత్ర

లగును. ఇట్లు సీసపాదము ముప్పదిమాత్రలు కల దగును. కాని యితరములగు నింద్రగణములుకూడఁ జేరినచో మాత్ర లెక్కువగును. ఇక ౨౧, లేదా ౨౬ అక్షరముల మొత్త ముండుననుట తెలుఁగు సీసపాదములో ౨౨ అక్షరములకు తక్కువ యుండుట కవకాశము లేదుగాని ౨౬ అక్షరము లుండవచ్చును. కాని భరతుని కాలమున నిదియొక విధ మగు దక్షిణ దేశీయగేయముగా నుండియుండుటచే నక్షర సంఖ్యలో భేదము కలిగియుండవచ్చును. దీనినిబట్టి గేయ రూపములుగా నున్న దేశీయ చ్ఛందోరచనలకు భరతాదు లా కాలముననే లక్షణము కల్పించి, నామకరణమునుగూడఁ జేసి, తమ ఛందోగ్రంథములలోఁ జేర్చికొనియుండిరనుటకు సందేహములేదు. శీర్షకమను తాళభేదమునుబట్టి యీ గేయమున కాతఁడు పెట్టిన "శీర్షక" మను పేరువలననే తెలుఁగున నిలిచియున్న యీ రచనా భేదమునకు 'సీస' మను పేరు వచ్చియుండును. ఇట్లే దక్షిణదేశీయ సంప్ర దాయసిద్ధములగు ప్రాచీనగేయ రచన లనేకములు మాత్రాచ్ఛందస్సులుగా సంస్కృత ప్రాకృత లాక్షణికులచే గ్రహింపఁబడిన ట్లగపడుచున్నది.

కావునఁ దెనుఁగునందలి యీ యుపజాతులను దేశీయ రచనలు నన్నయకాలముననో, అంతకు రెండుమూఁడు శతాబ్దులకుఁ బూర్వము శాసనములకాలముననో తెలుఁగున నేర్పడినవి గాక క్రీస్తుశకారంభమునాటి ప్రాచీనతమిళ వాఙ్మయమునందలి వెణ్బా, అగవల్పాలతోడను, భరతుని కాలమునాఁటి శీర్షకాదులతోడను సంబంధించి యున్నవని

తలంపవలసియున్నది. ఇట్లనేక విధములుగా నున్న గేయ రచనలలో చాళుక్య ప్రభువుల యాస్థానములందలి శిష్టకవుల దృష్టి నాకర్షించి, వారి యాదరమును బడసిన యేవో కొన్ని రచనలుమాత్రము వారి కాలమున రచింపఁబడిన కొన్ని శాసనములలోని కెక్కి యా యా శాసనపురాళ్ళమీఁదనో, రాగిరేకులమీఁదనో నిలిచియుండుటచే నన్నయకుఁ బూర్వ కాలమునఁగల తెలుఁగు కవితారచన లిట్టివి యని మన మిప్పుడు తెలిసికొనుట కాధార మేర్పడుచున్నది. అట్టి వానిలో నింతకుఁ బూర్వము దేశీయరచనలుగా మనము పరిశీలించిన సీసములు, గీతములు, ద్విపదములు, తరువోజలు, అక్కరలు మొదలుగాఁగలవి కలవు. ఇవియే మన కిప్పటికి మిగిలిన ప్రాఙ్నన్నపార్యయుగమునందలి యాంధ్రకవితా రచనలు. ఇట్టి దక్షిణదేశభాషా కవితామూలములనుండియే యాంధ్రశిష్టకవితా మహావృక్షమును బెంపొందించి నన్న పార్యుఁ డాంధ్రభాషావాగనుశాసనుఁ డైనాఁడు.

ఇట్టి యల్పమూలమునుండియా మన యాంధ్ర సాహిత్య మహావృక్షము పెంపొందినది? అను సందేహ మెల్లరకును గలుగవచ్చును. వాస్తవముగా నది యల్ప మూలమే కావచ్చునుగాని, దాని యా రూపమంతయుఁ గూడ మన కిప్పుడు గోచరించుటలేదు. అది యా కాలమున గేయరచనారూపమై సామాన్యజనుల హృదయసీమలయందు పెరుగుచుండుటచే, నది గ్రంథస్థమై స్థిరరూపమును దాల్చలేదు. దేశి కవితయం దభిమానము చూపిన చాళుక్యరాజుల యా స్థానములందలి శిష్టకవులు దానినెల్లెంతవరకు గ్రహించి శాసన

బద్ధము చేసిరో, అంతమట్టుకే యీ దేశికవితాస్వరూపము మనకిప్పుడు పొడకట్టుచున్నది. అల్పముగనే పొడకట్టుచుండిన యీ దేశీయ సాహిత్యపు మొక్క నొక్కసారిగా నల్పకాలముననే మహావృక్షముగఁ జేయనెంచియే, నన్నపార్యుఁడు మొదలగు శిష్టకవులు దీనిని సంస్కృతసాహితీవృక్షముతో నంటఁగట్టి పెంపొందించినారు. ఈ యుద్యమము నన్నయకుఁ బూర్వమే ప్రారంభించినను, నన్నపార్యుని రచనానైపుణ్యమే, యీ రెండు నంత చక్కగా నతుకుకొని వృద్ధినొందుటకును, మహాభారతమంతటి స్వాదుఫలము నదివెంటనే యొసంగుటకునుఁ గారణమైనది. కావుననే యాంధ్రభాషావాగనుశాసనుఁడై నెగడిన నన్నయ రచనానైపుణ్యము మహత్త్వము నెంతయు నెన్నఁదగిన దైనది.

ఈ దేశ భాషాసాహిత్యములకు నన్నయమూలముగఁ గలిగి స్థిరపడిన కొన్ని సంస్కార విశేషములు :—

1. దేశీయచ్ఛందమునందలి, సీసగీతాదులను, అక్కర తరువోజ కందాదులను గ్రహించి, కన్నడకవులవలె యతివిలంఘనముచేయక, దేశీయ సంప్రదాయ సిద్ధములగు వళిప్రాస నియమములతోఁ గూర్చి సంస్కృత వృత్తములను దెనుఁగు సాహిత్యమునకు దింపుట. కొన్ని సంస్కృతవృత్తములలోని యతిస్థానములను దన రచనకనుకూలముగ మార్చుట.

2. ఛందోవిషయమునవలెనే భాషావిషయమునను దేశీయ సంప్రదాయానురోధంబుగ "సకుర రమ్యత" నాదరించి సంస్కృత శబ్దజాలమును, దీర్ఘసమాసములను, అనర్గళధారా వాహి యగు శైలిలో శ్రుతిమహత మగునట్లు

తెలుఁగు పలుకులతో సమ్మేళనముచేసి-తెనుఁగు రచనకుఁ బరువత్వము లేని గాంభీర్యమును సమకూర్చుట.

3. అంతకుఁ బూర్వము భిన్నరూపముల నొందుచు నవ్యవస్థస్థితిలో రూపాంతరములతోఁ గూడియున్న దేశ్య శబ్దజాలమునందలి శిష్టరూపములను గ్రహించి తన గ్రంథమున వెలయించుటచే-వాని కొక వ్యవస్థ నేర్పఱచుట యైనది. భాషలో "ఱ" కారమంతరించి దాని స్థానమున డ-ళ-లు స్థిరపడినవి. "ఎఱుంబొది" - "పదియేఱు" "మహారాజుళాకన్" ఇరుభది, వంటి రూపము లంతరించి—ఎనిమిది, పదునేడు, మహారాజులకు, ఇరువది వంటివి స్థిర పడినవి. "సంవత్సరంబుళ్" "కొడుకుళ్"—ఇత్యాదులలోని "ళ్" అను బహువచన ప్రత్యయము పోయి "లు" స్థిర పడినది. సముచ్చయార్థక "ఉమ్" లోని-ఏఱువేళుం ఏలుచు, "అన్వయంబునవారెవ్వరై యుమ్" అను వానిలోని-"మ" కారము 'న' కారముగా మారి స్థిరపడినది.

4. కేవలము తాళబద్ధములగు పదములు పాటలరూప మునఁగాని_లేదా వృత్తముల నడుమ దేశీయ రచనలతోఁ గూడిన (కన్నడ బెదెండె) ఉదాహరణాదుల రూపమున గాని యున్న దేశీయ సాహిత్యమును వెనుకకుఁ ద్రోసివేసి కన్నడ పంపాదులమార్గము ననుసరించిన గద్యపద్య సమ్మిశ్రితమగు చంపూకావ్యపద్ధతి తెలుఁగులో నెలకొనుట.

5. జైనబౌద్ధము లింకను ప్రాధాన్యమునకై పెనఁగులాడు కొనుచున్న కాలమున "త్రిపురుషులఁ"బూజించి, వర్ణాశ్రమ ధర్మరక్షణ మహా మహిమ నొప్పిన చాళుక్య ప్రభువునాజ్ఞచే-

కృష్ణ ద్వైపాయనకృత మహాభారతబద్ధ నిరూపితార్థము తెనుఁగున నేర్పడ, పంపాదులవలె ప్రౌఢ ప్రబంధవర్ణనాపద్ధతిని స్వతంత్ర కథాకల్పనాశక్తిని గాక "ప్రసన్నకథా కలితార్థయుక్తిని" భారత సంహితారచన బంధురుఁడై-ఆంధ్రదేశమున వైదికమత స్థాపకుఁడైనాఁడు. కావుననే "ద్వైపాయనోద్యానజాత మహాభారత పారిజాతము" ధాత్రీసుర ప్రార్థ్యమై "యీ దేశీయులకు" నిరంతర సంతత పుణ్య సంపదున్నత్యభివృద్ధి చేయుచునే యున్నది.

6. ఇట్లీ సంస్కృత వృత్తసంగ్రహణము, తత్సమ భాషా బాహుళ్యము, చంపూ పద్ధతి, వైదికమత ప్రాబల్యములతో పాటు, నన్నయభట్టారకుని భారత రచనామూలముగా సంస్కృతభాషాలక్షణ సంప్రదాయలు కూడ నీ భాషలోనికి విశేషముగా దిగినవి.

విభక్తి ప్రత్యయములు—లేదా విభక్త్యర్థక శబ్దములు—వాని ప్రయోగరీతి సంస్కృతభాషా సంప్రదాయరీతి ననుసరించి విపులీకృతమైనది. తృతీయా పంచమ్యర్థముల చేత, తోడలు, ఉపయోగార్థమున తోడవర్ణక ప్రయోగము, చేసి, మెయి, పొంటె, కోలె, ఉండి, వలన, అందు, మొదలగు వాని ప్రయోగరీతి చాలవరకు సంస్కృతభాషాప్రయోగ సందర్భానుసారియై నెగడినది. ఇట్లే—"పడు" ధాత్వను ప్రయుక్తమగు కర్మణ్యర్థకరూపములు, తత్సమధాతురూప కల్పనము, దేశ్య ధాతువులనుండి విశేషార్థరూపకల్పనము, (cf. నమ్మనేర నయ్యెదను.) మొదలగువాని మూలముగా దేశభాషకు గొప్ప దోహదముచేసి దాని భావప్రకటనాశక్తిని

పెంపొందించి, తేనె లొలికించు మహా స్వాదుఫలముల నిచ్చు దానినిగాఁజేసి యాంధ్రభాషా వాగనుశాసనుఁడై యాంధ్ర కవిత్వవిశారదుండైనాఁడు నన్నయభట్ట మహాకవీంద్రుఁడు.

ఈతని రచనయందలి ప్రసన్నత, భావగాంభీర్యమును జూచినపిదప, వెనుకటిది కవిత కాదనియే యనిపించవచ్చును. ఆ భాషకు సురూపత లేదందురు. వ్యాకరణ సంస్కారము లేదని కొందరు తలంతురు. మన వ్యాకరణజ్ఞానమునకు లక్ష్యమొక్క నన్నయయే గదా. ఆతని రచనలలో గ్రామ్య ప్రయోగములట. అవి యనింద్యములని సమర్థన. అట్టివానినే నన్నిచోడ సోమనాదులు ప్రయోగించిరన్న—వారిభాష సంస్కారహీనము. వారు లాక్షణిక కవులు కారని చెప్పుదురు. వారికి భాష రాదందురు. ఇది ఛాసరుకవి కింగ్లీషురాదన్నట్లే యుండును. ఆతఁడు మహాకవిగా పరిగణింపఁబడకపోలేదు. ఆతని భాష కొక ప్రత్యేక వ్యాకరణ మేర్పడినది. నన్నిచోడాదుల రచనలను వదలి ఆంధ్రభాషకు సమగ్ర వ్యాకరణ మేర్పడవలయుననుట వట్టి భ్రాంతి. సమగ్రవ్యాకరణమనుట అర్థములేనిమాట. నన్నయకుఁ బూర్వమునఁ గల భాషా స్వరూపలక్షణములను గుర్తించి తరువాతి దానితోఁబోల్చి తత్పరిణామ రీతులను, చరిత్రను ఆరయుటయే చేయఁదగినపని. ఆంధ్రమునఁ జరిత్రాత్మక వ్యాకరణరచనమే సమగ్రవ్యాకరణ రచన మగును. నన్నయకుఁ బూర్వమునందలి భాషకు మన మనుకున్న సంస్కారము కలుగలేదు గనుక ఆ భాషలో నప్పుడు వ్రాసినది కవిత్వము కాకపోదు. కాని యీ దేశీయ కవిత లిఖితరూపమునొంది మనకు లభ్యము కాలేదు.

VI

దేశి రచనలు

తెనుఁగు దేశి సాహిత్యశాఖలలోఁ బ్రధానమైనవి ద్విపదోదాహరణ యక్షగాన రగడాదులని యిదివరకే తెలిసికొనియున్నాము. ఆంధ్రమునఁ బురాణ ప్రబంధశాఖలవలె ద్విపదశాఖయు బాగుగనే విస్తరించినది. తొలుత శైవమత ప్రచారమునకై పాల్కురికి సోమనాథుఁడు దీని నవలబించినను, జనసామాన్యమున వ్యాప్తికొరకు రంగనాథ రామాయణము, గౌరన హరిశ్చంద్ర ద్విపద, నవనాథ చరిత్రము శ్రీనాథుని-పల్నాటి వీరచరిత్రము, తాళ్ళపాక చిన్నన్న పరమయోగి విలాసము, అష్టమహిషీకల్యాణము, పిడపర్తి సోమన ప్రభులింగలీల మొదలగునవేగాక, దక్షిణదేశాంధ్ర వాఙ్మయమున తిమ్మన ద్విపదభారతము, రఘునాథరాయల ద్విపద రామాయణము మొదలగున వనేకములు బయలుదేఱి ద్విపదవాఙ్మయ శాఖను పెంపొందించినవి. ఆంధ్రమున నుదాహరణశాఖ దేశి రచనాశాఖలలో మిగుల ప్రాచీనమైనదే యైనను చిన్న ఖండకావ్యమువంటిదై, సప్త విభక్త్యంత పద్యములతోఁగూడి పరిమిత ప్రయోజనముకలదై కథాకల్పనా విస్తృతి కనకాశము కల్పించునది గాకపోవుటచే ద్విపదవలె నంతగా విస్తృతిఁజెందలేదు. భాషలో వెలసినయన్నిటిని ప్రోవుచేసినను 15, 20 కంటె నెక్కువగా నుండవు. వీనిలోఁ బ్రసిద్ధములు-ప్రకటితములగునవి పాల్కు-

రికి సోమనాథ రచితములు, త్రిపురాంతకోదాహరణము వంటివి మిక్కిలి యల్పసంఖ్యాకములు. "రగడలకు" ప్రత్యేక కావ్యగౌరవము కలుగనే లేదు. ప్రబంధములలో వర్ణనాదు లందు శిష్టకవులు కొందరు రగడలను రచించిరి. ఇవి పాటల రూపమున యక్షగానాదులలోఁ జేరుచు వచ్చినవి. ఇఁక యక్ష గానములు జనసామాన్యమునఁ బ్రదర్శనార్థమయియే యుప యోగపడుచుండుటచేతను, శిష్టకవులందరు పురాణ ప్రబంధ ఫక్కి ననుసరించియే తమ కవితారచనమును సాగించు చుండుటచేతను, ఈ దేశిశాఖారచనలు సామాన్య జనా దరణమును బడసిన కొందర కవులచేతనే రచింపఁబడి విస్తృతిఁ జెందుచు వచ్చినను, రాజాశ్రయముగాని, తగిన సంస్కారము గాని లేకపోవుటచే పెక్కు రచనలు గ్రంథస్థములై స్థిర రూపమును దాల్చుట కవకాశము కలిగినట్లగపడదు. రుద్ర కవి సుగ్రీవ విజయము, రంగాజమ్మ మన్నారుదాస విలాస నాటకము ముద్రితములైనవి. ఇటీవల చిరకాలమునుండి దేశమున భాగవతములని వీథినాటకములని ప్రదర్శింపఁబడు చుండినవానిలో గ్రంథస్థములై ప్రాచ్యలిఖిత పుస్తకాలయ ములోఁ జూచువారు లేక మూలపడియున్నవి నూరుపైగా నుండును. వీనిలో నిదేశమున ముద్రణమంది గుజిలీప్రతు లనఁబడుచు ప్రకటితములైనవి గరుడాచల నాటకము, శశి రేఖా పరిణయము, గయోపాఖ్యానము, ప్రహ్లాద, పారి జాతము మొదలగునవియే పది పండ్రెండో. అంతకంటె నెక్కుడుగా లభ్యమగునని తోఁచదు. వానినైనను జూచు వారిప్పుడు చాల అరుదే.

శశిరేఖాపరిణయ నాటకమునకు "మట్ట్రిగుంట శశిరేఖాపరిణయ" మని పేరు. దీనిని పంచమకులుఁడగు గొట్ట్రెముచ్చు రంగదాసుని తనయుఁడగు "అబ్బయదాసుఁ"డు రచించెను. ఇది మట్ట్రిగుంట గోపాలున కంకితము.

"అని మట్ట్రిగుంటగ్రామం
బున పంచమకులుడ గొట్ట్రెముచ్చు రంగదా
సుని తనయుం డబ్బయదా
సునిచే రచియింపనయ్యె సుస్థిరమయ్యెన్"

అని యాతఁడే గ్రంథాంతమునఁ జెప్పికొన్నాఁడు. ఇది మట్ట్రిగుంట నాయకుఁడగు బొంతా లింగప్పనాయఁడు

ద్వి. ఆరూఢి సింహాసనాసీనుఁడగుచు
భారతగ్రంథంబు భాగవతంబు
చదివించి వినుచుండి సంతోషుఁడగుచు
మదిలోన శశిరేఖ పరిణయంబపుడు
శృంగార నాటకము సేయింపదలఁచి
పొంగుచు సంతోష పూర్ణుఁడై తాను

కందార్థము—

ఘనుడగు లింగమనాయఁడు
పనివడి బిలిపించి నన్ను బహుసంతోషం
బునఁగాంచి కరుణతోడను
దనరగ యీ నాటకంబు త్వరితము—చెప్పూ

శశిరేఖా చరితమూ—గురుతుగ
శ్రీన్యగ్రోధగుంటపురి వరదునిపై కృతి
సరవితో నిల్పియు త్వరితమూ—చెప్పూ

అని ఇట్లానతిచ్చిన సంతసించి రచించెనంట. గ్రంథాంతమున నాశీస్సిట్లు గలదు—

ద్వి. ఈనాటకంబెపుడు నింపుగా జదివి
మానుగా వ్రాసిన మరువక వినిన
ఆడిన పాడిన నాయువుసిరియు
కూడియు సతి సుతులకూడి సుఖింతు
రెందాక రవిచంద్రు లెందాక తార
లెందాక వారిధు లెందాక ధరణి
యెందాక వేదంబు లెందాక నుండు
నందాక నీ కృతి కాయువుగల్గి
సుందరంబై యొప్పి శుభకర మమరు.

ఇట్లే భద్రాద్రిరాముని కంకితముగ యాదవదాసుఁడను కవి గరుడాచల నాటకమను యక్షగానమును రచించెను.

"ధరణిలో ఆదవాఖ్యాశను దండిగ నరహరిచరితమిప్పుడున్
మురియఁగ జెప్పితిన్ వినుడి ముప్పదిరెండు దినంబులలోపలన్
సరగున లక్ష్మినాథుడును సాధుజనంబుల భక్తులందరిన్
కరుణతో బ్రోవు భద్రగిరికాంతుడు దాసుల హృదయలోల్కుడై."

"ఈ కథ విన్నను వ్రాసిన
భూకాంతుడు లక్ష్మివిభుడు పురహరసఖుడున్
జోకతో మోక్షము నిచ్చుచు
సాకల్యముతోను బ్రోచు సాధులనెల్లన్."

అని యాశంసనము కలదు. ఇది 'శ్రీలక్ష్మీనృసింహ దేవుఁడు వేటకుఁబోయి చెంచు వనితను బెండ్లియాడుట యనెడి శ్రీ పద్మపురాణస్థ ప్రబంధంబునకు "నాటక రూపంబు". వెనుకటి నాటకములో కందార్థములవలెనే యిందు సీసార్థములు రచింపఁబడి యున్నవి. నాలుగు సీస పాదములు రచింపఁబడిన వెనుక గీతపద్యమునకు బదులుగా పాట చరణములు చేర్పఁబడియుండును. ఇందు ఎరుకలసాని వచ్చుట—లక్ష్మీదేవి కన్నకలకు ఫలితంబు చెప్పుట, ఈ యెరుకల నాచారును వెదకుకొనుచు భర్త "సోడిగాఁడు" వచ్చుట, వీరి వింత సంభాషణ ఏలపాటలో రచింపఁబడినది—ఇది సుగ్రీవ విజయములోని ఏలపాట ఫణితినే యున్నది:—(3+4 మాత్రలగణములు—4).

"సింగినీవూ నన్నువిడిచీ చెంగునాగం తూలువేసీ
ఎందుబోయీ నావుచెప్పా వే—ఆలవోలమ్యాసింగి నీ
వెందుబోయి నావుచెప్ప వే"
సింగినీవు బిలచెదవు అంగనాల యింటికీ
పొంగుచూను యెఱుకజెప్పీ తీ—ఆలబోలమ్యా
బంగారూ సొమ్ములూ యిచ్చిరీ
బుట్టచంకా బెట్టుకోసి పిట్టలాను దెచ్చినాను

పట్టివేగా వండిపెట్ట వే—ఓ ఆలఓలయ్యా
పెట్టకుంటే పారవేసే దా.

గయోపాఖ్యానంబను నాటకంబనుదానిని

“ఇమ్మనూరి వంశాబ్ధి చంద్రుడుఁ
గొనకొని శ్రీవత్సగోత్రపవిత్రుఁ
డనువంద నీలకంఠాఖ్య పుత్రుండు
సునయుఁ డా వెంకటసుబ్బ సత్కవియు
ప్రాపిత శ్రీ వెంకటాంపల్లె వెలయు
గోపాలు పేర మక్కువ నంకితముగ
చాటి కృష్ణార్జున సంవాద కథయు
నాటకం బొనరించె నవ్యమృదూక్తి”

నీ కథఁ జదివిన నింపుగా విన్న
చేకొని వ్రాసిన చెలఁగి యాడినను
ఆయురారోగ్యభాగ్యాది సంపదలు
తోయజాక్షుఁడు కృపతోడుత నొసగు

కులగిరులెందాక కూర్మమెందాక
జలనిధులెందాక సత్యమెందాక
సోమార్కులెందాక చుక్కలెందాక
భూమియు నాకాశ భూతమెందాక
యందాక వెలయు కౌంతేయుల కీర్తి
నందాక యీ కృతి యవనిఁ బెంపొందు.”

గ్రంథాంతమున వ్రాసిన చదివిన విన్నవారినిగూర్చిన యీ యాశంసనము శిష్టకవిత్రయములోఁ దొలుత నన్నిచోడుని కుమారసంభవముననే గానవచ్చునుగాని తరువాతి కవులలోఁ గానరాదు. ఇది కన్నడ కవులలో నంతకుఁ బూర్వమునఁ గాననగును. గావున యిది కన్నడాంధ్రములకు సమానమగు ప్రాచీన దేశీయ సంప్రదాయమేమో యని తలంపఁదగి యున్నది.

ఈ వెంకటసుబ్బ కవి గ్రంథాదిని

"వ్యాసవాల్మీక వరకాళిదాస ముఖ్యు
లైన గీర్వాణ కవులను నభినుతించి
సొంపుమీరఁగ తిక్కన సోమయాజి
మొదలుగా నాంధ్రకవులను మదిదలంచి"-యున్నాఁడు

"నా యొనర్పంబూనిన శ్రీ గయోపాఖ్యానాటకంబునకు కథాక్రమంబెట్టిదనిన" అని ప్రారంభించినాఁడు. దీనిలో కథాభాగమును సూచించు సంధివచనముగా, పద్యములును గూడ నెక్కుడుగా నున్నవి. పైవానికంటె రచనయు మిన్నగాఁ గనఁబడును. వీనిని రచించిన కవు లెప్పటివారో చెప్పుట కాధారము గానరాదుగాని, మిగులనాధునికులనియే యూహింపవచ్చును. దీనిలో చక్కని రచనలును లేక పోలేదు. వీనిలో ననేక విధములగు దేశీయ రచనలు, ద్విపదలు, పాటలు, దరువులు, కందార్థములు, సీసార్థములు, మంగళహారతులు, ధవళములు, ఏలలు, జోలలు మొదలగునవి కొంతవరకు సరఁజన సామాన్యమగు వ్యావహారిక

భాషలో రచింపబడియుండుటనుబట్టి యివి లాక్షణికుల యొక్కగాని, పండితులయొక్కగాని పరిశీలనకు నర్హమైనవిగాఁ దలంపఁబడినట్లు లేదు. ఈ కారణముచే దేశీయ వాఙ్మయశాఖలలో నొక ముఖ్యమైన శాఖ మూలఁబడి ముక్కిపోవలసినస్థితి యేర్పడినది. ఆంధ్రదేశములోని యీ పై యక్షగాన రచనల కాలము నిర్ణయించుట కవకాశము లేకపోయినను, నాయకరాజుల కాలములోని రంగాజమ్మ మొదలగు విదుషీమణులచే రచింపఁబడిన యక్షగాన రచనలు తంజావూరు సరస్వతీ పుస్తకభాండారమున సుమారు రెండు వందలుగా నున్నవి. సంస్కృతాది నాటకములతోఁ బోల్పఁ దగినవి కాకున్నను ఆంధ్రదేశి వాఙ్మయశాఖా పరిణామ చరిత్ర పరిశీలన సందర్భమునైనను ఇవి భాషా వాఙ్మయ పరిశీలకుల దృష్టి నాకర్షింపఁ దగినవే. దేశి రచనా పరిశీలనమునకేగాక, భాషా పరిణామ పరిశీలనమునకుఁగూడ నివి యత్యంత సహాయకారులు కాఁగలవు.

ఈ యక్షగానములు ప్రాచీన దేశీయ ప్రదర్శనానుకూల రచనలనియేగాక, వీనియందు, వీని మూలముగాను నిలిచియున్న వివిధ రీతులగు దేశీయచ్ఛందోరచనలనుబట్టి కూడ వీని ప్రాధాన్యమును మనము గుర్తింపవలసి యున్నది.

ద్విపద, ఏల, దరువు, ధవళము, మంగళహారతులు, మొదలగునవేగాక, ఇంక ననేకరీతుల తాళబద్ధములగు రచనలు వీనియందుఁ గానవచ్చుచున్నవి. ఇవన్నియు రగడ భేదములే యనియు, వాని నా యా తాళములను బట్టియే

గ్రహింపనగుననియు, నవి యనేక రీతులుగా నుండుననవనియు నప్పకవి సూచించియే యున్నాఁడు. ఇవి పాటలరూపమున నుండుటచే జక్కుల రేకులను పేరుతో లాక్షణికులు కొందరు వానిని బేర్కొని లక్షణము కల్పింపక-వ్యావహారిక భాషలో నవి విరచింపఁబడుటచేఁగాబోలు వదలివేసినారు. ఇంక ననేక విధములగు పదములను, పాటలను, లాక్షణికులు, ప్రబంధ కవులునుగూడ నా యా సందర్భములఁ బేర్కొనిరేగాని, వానిని రచించి చూపలేదు. కావున నవి సామాన్య జనుల నోళ్ళలోను, ఇండ్లలో పండుగలు, పెండ్లిండ్లు, నోములు, వ్రతములు, పూజలు మొదలగునవి జరుగు సందర్భములలో స్త్రీలు పాడుకొను పాటలలోను, చిన్న పిల్లల యాటపాటల లోను, కొందరు భక్తుల భక్తి, శృంగార వేదాన్త కీర్తనల రూపముననను నిలిచియున్నవి. ఇట్టి కీర్తనలను తొలుత రచించి ప్రత్యేకముగా రాగిరేకులపై వ్రాయించి స్థిరత్వ మును గల్పించినవారిలో ముఖ్యులు తిరుపతి వేంకటేశ్వర భక్తులై యాతని సాన్నిధ్యముచే ధన్యులైనవారు తాళ్ళ పాకాన్వయమువారు. వారిలో అన్నమాచార్యులు అనేక వేల భక్తి శృంగార వేదాంత సంకీర్తనలను రచించి సంకీర్త నాచార్యులని ప్రసిద్ధికొందినవాఁడు. వీరి కీర్తన లిటీవల శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధన సంస్థలో ప్రకటితములై ప్రసిద్ధిఁగాంచుచున్నవి. త్యాగరాజాదులు వీరికి తరువాతి వారు.

తాళ్ళపాకంవారు తిరుపతిలో వెంకటేశుని సన్నిధాన మున క్రీ. శ. 15, 16 శతాబ్దములలో నుండినవారు. అం

యన్నమాచార్యులు క్రీ. 1408 మొదలు 1503 వరకు నుండిన వారు. ఈయన కుమారులు పెద తిరుమలయ్య, చిన తిరుమలయ్య యనువారలు. వీరు కీర్తనల రచనచే ప్రసిద్ధులు. పెద తిరుమలయ్య కుమారుఁడు ద్విపద కావ్యకర్తయగు "చిన్నప్ప" యను తిరువెంగళనాథుఁడు.

అన్నమాచార్యుల కుమారులలో పెద తిరుమలాచార్య లనునాతఁడు తండ్రివలె శృంగార, వైరాగ్య సంకీర్తనలేగాక, యితర విధములగు దేశి రచనలనుగూడ రచించినాఁడు. శైవమతపరముగ దేశి రచనలను రచించిన పాల్కురికి సోమన తరువాత, వైష్ణవమతపరముగ పెక్కువిధములగు దేశి రచనలను చేసినవాఁ డీ తిరుమలాచార్యులే. సోమనవలెనే- ఆతఁడు బసవోదాహరణమును రచింపగా, నీతఁడు వెంకటేశోదాహరణమును రచించెను. ఆతఁడు చెన్నమల్లు సీసములు, వృషాధిప శతకము రచింపగా-నీతఁడు "నీతి సీసములు, శంగారవృత్త శతకమును రచించెను. ఇంకను "సుదర్శన రగడ" శృంగార దండకము, చక్రవాళ మంజరి, అనునవి యీతని యితర కృతులు. ఈతని కుమారుఁడే చిన తిరుమలయ్య. "చిన్నన్న" యని ద్విపద కవిత్వమునకుఁ బ్రసిద్ధిగాంచినవాఁడు. పరమయోగి విలాసము, అష్టమహిషీకల్యాణము, ఉషాపరిణయము అను గ్రంథములను రచించినాఁడు. వీరినిగూర్చియే

చిన్నన్న ద్విపదకెఱుగును
పన్నుగఁ బెద తిరుమలయ్య పదమున కెఱుగున్

అని చెప్పఁబడినది. వీరి రచనలలోనివే కొన్ని యీ క్రింది రచనారీతుల కుదాహరణములుగా గ్రహింపఁబడినవి.

ఈ దేశీయరచన లనునవి పదములని పాటలని రెండు విధములుగా నున్నవి. అట్టివానిలోఁ జేర్పఁదగినవే యీ క్రిందివి కొన్ని :—

పదములను పేరుతో నున్నవి—

తుమ్మెద పదములు

ప్రభాతపదములు–ఇవియే మేలుకొలుపులు గావచ్చును:

వెన్నెల పదములు–ఇవియే చందమామ పదములు.

కోవెల పదములు

చిలుక పదములు

విరాళి పదములు

గొబ్బి పదములు

నివాళి పదములు–ఇవియే ఆరాత్రికములు–ఆరతులు గావచ్చును, మంగళ హారతులును గావచ్చును.

మువ్వగోపాల పదములు—శిరి శిరి మువ్వ

హరిహరీ నారాయణ పదములు

పాట లను పేరుతో నున్నవి—

లాలిపాట

జోలపాట

ఏలపాట

సువ్విపాట—ఇదియే దంపుళ్ళపాట, సువ్వాలపాట.
ఉయ్యాలపాట
జాజరపాట
ఐరేనిపాట
అప్పగింతల పాట
శ్రావణ శుక్రవారంపాట
శ్రావణ మంగళవారపు పాట
అక్కలపాట
అల్లోనేరేళ్ళు
శోభనములు
ధవళములు
సూళాదితాళ క్రొత్నములు
చద్దులు—కృష్ణుని చద్దులు,
సుద్దులు—(గొల్లసుద్దులు etc.)
ఉరుటణులు
గాడుగీతములు
కందార్థములు
గీతార్థములు
సీసార్థములు
దరువులు
చిందులు
కీర్తనలు
సవతుల కయ్యము etc, etc.

తాళ్ళపాక అన్నమాచార్యులు

తిరువెంగళనాథుమీద విన్నపము చేసిన శృంగారకీర్తనలు.

అల్లోనేరెళ్లు.

(నాలుగేసి మాత్రల నాలుగు గణములు.)

రాగం, దేసాళం.

పల్లవి.

నెయ్యము లల్లో నేరేళ్లో।
వొయ్యన వూరెడి వువ్విళ్లో॥

చరణము.

పలచని చెమటలు - బాహుమూలల
చెలములలోనాఁ - జెలువము లే।
దళదళమనుము - త్యంపుజెఱుంగు
దులిపెటి నీళ్ళా - తుంపెళ్లో॥ —నెయ్యము

తొటతొటఁ గన్నుల - దొరిగెడి నీళ్ళా
చిటిపొటి యలుకల - చిరునగవే
వటఫలంబు నీ - వన్నెల మోవికి।
గుటకల లోనా - గుక్కిళ్లో॥

గరగరికల వేం - కటపతి కౌఁగిట
పరిమళములలో బచ్చన లూ।
మరుని వింటికి - మ్మనియంప విరుల
గురితాకూ లినుప - గుగ్గిళ్లో॥

శోభనము. రాగం. వసంతం.

పల్లవి.

శోభన మేశోభన మే
వైభవ ములపా వనమూ ర్తికీ ॥

చరణము.

అరుదుగ మునునర కాసురు డూ
సిరులతో జెరలు దెచ్చిన సతులా
పరువపు వయసుల పదారు వేలను
సొరిది పెం డ్లాడిన సుముఖుని కీ ॥

చెండిన వేడుక శిశుపా లుండూ
అది పెం డ్లాడగ నవగళించి
విందువలెన తా విచ్చేసి రుక్మిణి
సందడి పెండ్లా డిన సర సునికీ ॥

దేవదానవులు ధీరతను
దావతిపడివార్ధి దరువంగను
శ్రీవని తామణి జెలగి పెండ్లాడిన
శ్రీ వెంకటగిరి శ్రీనిధికీ

సువ్వి. కేదారగౌళ.

పల్లవి.

సువ్వీ సువ్వీ సువ్వా నీ
సుదములు దంచెద రో—లాల

చరణము.

వనితల మనసులు కుందెన చేసేటు
వలపులు తగనిం చో (ఓ)-లాల

కనుస న్నలనెఱి—రోకం—జ్ఞానూ
క న్నెలు దం చెద—రో—లాల

బంగరు చెఱగుల—పట్టుపు ట్టముల
కంగులు దూలగ—నో—లాల

అంగన(నా) లంచలు(లూ)—నతివేడు కా—తో
సంగడి దం చెన—రో—లాల.

కురులుదూలగమూచి-గుబ్బచన్నూలపై
సరులుదూలాడంగ-నో-లాల
అరవిరిబాగుల-నతివలు ముద్దులు
గురియుచు-దంచెద-రో-లాల.

ఘల్లుఘల్లుమని-కంకణరవములు
పల్లవపాణులకో-లాల
అల్లన నడుములు-అసియాడుచు-సతు
లొల్లనె-దంచెద-రో-లాల ॥

కప్పురగంధులు కస్తూరిపుష్పాల
చప్పరంబులనే-ఓ-లాల
తెప్పలుగారతి దేలుచుం గోనే
టప్పనిం బాడెద-రో-లాల ॥

ఉయ్యాలపాట. రాగం, శంకరాభరణం.

పల్లవి.

ఉయ్యాల బాలూ నూచెద రూ-కడు
నొయ్యనొయ్య నొయ్యనుచూ ॥ ఉయ్యా.

చరణము.

బాలయవ్వనలు, పసిండి వుయ్యాల
బాలునివొద్దం బాడేరు ।
లాలిలాలిలాలి, లాలెమ్మయెల్ల
లాలిలాలి లాలెనుచు ॥

తమ్మిరేకుగను దమ్ముల నవ్వుల
పమ్ముంజూపుల బాడేరు ।
కొమ్మలుమట్టుగునుకుల నడపుల
ధిమ్మిధిమ్మిధిమ్మెనుచు ॥

చల్లుంజూపుల జవరాండ్రు రే
పల్లె బాలునిం బాడేరు
బల్లిదు వేంకట పతిజేరియుండెలు
ఘల్లుఘల్లు ఘల్లనుచు ॥

గొబ్బిళ్ళపాట. రాగం, దేసాళం.

పల్లవి.

కొలనిదోపరికి - గొబ్బిళ్ళో - యదు
కులముసామికిని - గొబ్బిళ్ళో

చరణము.

కొండగొడుగుగా - ఆవులగాచిన
కొండాక శిశువుకు - గొబ్బిళ్లో
దుండగంపుదై - త్యులకెల్లను తల
గుండుగండనికి - గొబ్బిళ్లో ॥

పాపవిధుల శిశు - పాలుని తిట్టిన
కోపకానికిని - గొబ్బిళ్లో
యేపున గంసుని - యిడుమల బెట్టిన
గోపబాలునికి గొబ్బిళ్లో ॥

దండి వైరులను - తతిమిన దనుజుల
గుండె దిగులునకు - గొబ్బిళ్లో
వెండి పైడియగు - వేంకటగిరిపై
కొండలయ్యకును - గొబ్బిళ్లో ॥

అత్తా కోడళ్ళ జగడము. రాగం, పాడి.

రావే కోడల - రట్టడి కోడల
పోవే పోవే - అత్తయ్యా - పొందులునీతో - జాలూనూ

చరణము.

రంకెలువేయుచు - రాజునెదుట నీవు
కొంకూ గొసరూ - లేనీ - కోడాలా ।
పంకజముఖి - నీవు పలు దొడ్డవారిండ్ల
అంకెల దిరిగేవు - అత్తయ్యా ॥

ఈడాడ, నలుగురు - నేడ్గురు మగలతో
కూడీ - శిగ్గూ - లేసీ - కోడాలా
వాడకు బదుగురి - వలపించు - కొనినీవు
ఆడాడ - దిరిగేవు - అత్తయ్యా.

బొడ్డున బుట్టిన - పూపనికే నిను
గొడ్డెరు తెస్తీ - నే కోడాలా
గుడ్డముపయినున్న - కోనేటిరాయుని
నడ్డగించుకొంటి - వత్తయ్యా.

గయోపాఖ్యాన నాటకములోని యొక "దరువు"
రాగం—తోడి, ఆది తాళం—ఇది "ఏలా" లక్షణము
కలదై యున్నట్లగపడుచున్నది.

"నందివాహను డగుచువచ్చె నూ - గౌరీశు డిదిగో
నందివాహను డగుచువచ్చెను.

నందివాహను డగుచువచ్చెను - నందనందనుడైన యీ గో
విందునకును పు రందరప్రియ నందనునకును, సంధిసేయగ
(నంది)

జడలలోమిన్నేరు సగము నొడల పార్వతి మెరయుచుండగ
బుడుత చందురు నందముగదల పువ్వుగను సిగదురిమి వేగమె
(నంది)

కరమునను శూలంబు మూడవ కన్నుఫాలమునందు మెరయగ,
వరదుడా (శ్రీ) వెంకటంపలె-వాసుడౌ (శ్రీ) విష్ణుకడకు (నంది

శోభనము.

(మృత్యుంజయ విలాసము-గోకులపాటి కూర్మనాథ కవి.)
(ఐదేసి మాత్రల గణములు)

శోభాన మే - శోభాన మే

శోభనమె - శర్వానకు, శోభనమె - పార్వతికి
శోభనమె కైలాస, శుభమంది - దనకూ (శోభానమే)

మణితతుల-హారతులు, మదవతులు ఇయ్యరమ్మ,
మతియుతుడు-శివ్వన్న, మగువగా-రమ్మాకు (శోభానమే)

సుగ్రీవవిజయము.

శ్రీరాముడు-గుణధాముడు, వారిజదళ లోచనుడూ
శూరతరా-వణుగూలిచి, నారీమణి-దేవలయున్ (శోభానమే)

రామునికృప కపిరాజ్యము క్షేమంబున బాలించీ
శ్రీమంతుడు సుగ్రీవుడు, భూమండలి బొగడొందున్ (శోభా)

సంగరవిజ యముతోను-ప్పొంగెడు సుగ్రీవునకు
సంగతిగా యువరాజై యంగదుడిల బెంపొందున్ (శోభా)

కొట్నముల పాటలు.

చెలియారావె, చేడెరావె, చిన్నిరావె, పొన్నరావె
వెలదిరావె, కొట్నమూలు, వేగదంచుమూ.

గరుడవాహ నములు మంచి, గౌరికుంకు మములు రత్న
నరులు పచ్చగన్నేరులు సన్నదిను సులూ
కలయగూర్చి దంచిరపుడు. (మృ. వి. 3-60)

గజేంద్రమోక్షము—కథాగీతమను పేర నున్నది.

రాగం, ఆనందభైరవి ఆటతాళము.

రాజేంద్ర వినుముని రాజిత మగుగజ
రాజమో క్షణకథనూ.
మహాసుధను రహితమనోవ్యధనూ॥
రాజిల్లు భువిసుధా రాశిత్రి కూటాద్రి
యోజనా యుతయామ మున్నత త్వంబూ వి
భ్రాజితంబుగ కాంచనంబున రాజితంబు గయోమయంబున
రాజెలంగెడి శృంగములుమూ డతులమణిధా తువుల వెలు
గును॥ రాజేం.

ఇవ్వారి చరమున-కెవ్వర-డ్డమువత్తు
రెవ్వారు నాకాధ్యు డూ-పరమేశ్వరు
డెవ్వాడు కారాణు డూ-సర్వాధారు
డెవ్వాడు పరిపూర్ణు డూ
పారాత్మకు డెవ్వాడు నిర్దారణు డూ-మహాత్మకూ
డెవ్వానిచేగ ర్త నెవ్వానినుంచ నెవ్వనిలోడించు యీ జగ
[మంతాయు
ఎవ్వడీలో కంబులునులో కేశులునులో కస్థులునుదెగి
నవ్వాలనుపెం జీకటినినే కాకృతినివెలు గొందునతనిని॥

దేశిరచనలు

గజరాజ మోక్షణ కథవిను వారికి
కలుషాము హరియించు నూ
దుస్స్వప్నము తొలగును యశమెచ్చు నూ
దుఃఖమూ బాయూ కలుములు ప్రాప్తించూ నూ
సౌఖ్యము గల్గుకై వల్యములభించునూ.

తలుపుదగ్గర పాటలు.

శ్రీకాం-తామణి-నేని-సఖుడను
శీఘ్రము-వాకిలి-తీవే-నీవు
శీఘ్రము-వాకిలి-తీ-వే.

ఓ కాం తుడనీ-గుణములు-తెలిసెను
ఊరికె-వెళ్ళగ-దో-యీ, నీవు
ఊరికె-వెళ్ళగ-దో-యీ.

ఈమా టలునీ-వెన్నడా-డవది
ఏమే-అలుమేలు-మం-గా-అది
ఏమే-అలుమేలు-మం-గా.

భామల-మరిగిన-వాడవు-నాతో
పలుకు-లేలపో-వో-యీ-యీ
పలుకు-లేలపో-వో-యీ.

పరభా మలనే-కూడితి ననియిటు
పలుకుట-కారణ-మేమే-సఖి
పలుకుట-కారణ-మేమే.

తరుణులు-కూడక-యుంటే-పువ్వుల
దండలు-ఎక్కడి-వో-యీ-పూల
దండలు-ఎక్కడి-వో-యీ.

హరిహరి-నేనే-మెరుగను-భక్తులు
అర్పించిరెవో చెలీ యా-నా
కర్పించిరెవో చెలీ-యా.

మంగళవారం పాటలు.

కైలాస-గిరిలోను-కల్పవృ-క్షముక్రింద
ప్రమథాది-గణములు-కొలువగా-నూ
పార్వతీ-పరమేశు(లు)-బాగుగా-కూర్చుండ
పరమేశు-నడిగెఁదా-పార్వతపు-డూ,
జయమంగ-ళంనిత్య-శుభమంగ-ళం.

ఏ వ్రతము-సంపదలు-నెలమితో-డుతనిచ్చు
ఏ వ్రతము-పుత్రపౌ-త్రావృద్ధి-నొసగూ
అనుచునా-పార్వతీ-యాహరూ-నడిగే.

శ్రావణా-మాసాన-శుక్లప-క్షమునందు
శుక్రవా-రమునాడు-మునిమాపు-నా
పంచకల్యాలుదెచ్చి-బాగుగా-నూనిల్పి
భక్తితో-బూజించు-మనిచెప్పె-నూ.

అయి దేసి మాత్రలతోఁ గూడిన నాలుగేసి గణము లొక్కొక్క పాదమునకు. మూడవ గణము మొదటియక్షర మున యతి. రెండవ పాదము-తుదిగణ మేకాక్షర గణము కావచ్చును.

ఆనంద గీతములు.

ఆనంద మానంద మాయెనూ మనశ్రీ
రాములూ పెండ్లికొడు కాయెనూ-మన
జానకి పెండ్లికూతు రాయెనూ-యెల్ల
జనులాకు సంతోష-మాయెనూ-సుర
మునులాకు-వినవేడు-కాయెనూ.

లాలిపాట—కృష్ణ జననము.

కస్తూరి-రంగరం-గా, మాయన్న-కావేటి-రంగరం-గా
శ్రీరంగ-రంగరం-గా-నినుబాసి-యెట్లు నే-మరచుందు-రా.

జో అచ్యుతానంద-జోజో-ముకుందా
లాలి పరమానంద రామగోవిందా-లా-లీ.

లాలి శ్రీకృష్ణలాలీ-లాలిమానల్లనయనా,
లాలి మాబొజ్జతండ్రీ-లాలినావరహాల పంట-లాలీ.

మేలుకొలుపు పాట.

(3+4 మాత్రల 4-గేసి పాదాలు)

మేలుకొనవే-చంద్రశేఖర-మేలుకొనవే-ఇంద్రవందిత
మేలుకొనవే-నీలలోచన-నీలకంఠా-హరహరా మేలుకొనవే.

శంభుశంభో-యనుచు వేడ్కతో-నమ్మునీశ్వరు-లరుగుదెంచిరి,
జృంభణమ్మున-నారమోముల-సూనుడే తెంచెన్
పండువెన్నెల-గ్రుంకుతూర్పున-కొండపైనుద-యించెసూర్యుఁడు
దండికలువల-జారచోరుల-దర్పమడగగ మా
హరహరా-మేలుకొనవే?

మేలుకో-శ్రీరామ-మేలుకో-రఘురామ
మేలుకో-గుణధామ-మేలుకో-నాస్వామి-మేలుకో.
చాలునిం-కానిద్ర-పూనికతో-నిన్నుబూ
జించువా రలనుబో షింపవలె వేగ-మేలుకో.
నాస్వామి-మేలుకో.

వెన్నెల పాటలు.

కాకీ కాకీ గంతుల కాకీ
కాకిని తీస్కెళ్ళి గంగలో ముంచితే
గంగానాకూ పాలూ ఇచ్చే
పాలూ తీస్కెళ్ళి అమ్మాకిస్తే
అమ్మా నాకూ డబ్బానిచ్చే
డబ్బా తీస్కెళ్ళి పంతులకిస్తే
పంతులు నాకు చదువూనిచ్చే
చదువూ తీస్కెళ్ళి మామాకిస్తే
మామా నాకూ పిల్లానిచ్చే
పిల్లా పేరూ—మల్లెమొగ్గ
నాపేరు జమీందార్.

అట్ల తద్దెలలో వెన్నెట్లో వెన్నెల పరుగులు—చిన్ని చిన్నిలని పిల్లలు పాడుకొనే పాటలు—

చిన్ని చిన్ని కెన్నెళ్ళూ
సింగలగారీ కెన్నెళ్ళూ
తరళనేత్రా కెన్నెళ్ళు
తామరసిరీ మొగ్గల్లు

ఏల.

ఓబలేశుని కొండల నడుమా
ఒంచేగడ్డీ కోసేదానా
ఒంచేగుడ్డా వాల్లీ గుడ్డేమే !
కాళింగి కిణికిణి, ఛణక ఛణకని
ఒంచెతీసి, పంచపరవా లే.

గిద్దెగిరీ కొండలనడుమా
ఎద్దులతో-లే ముద్దులమరిదీ
నన్నుసూసీ నవ్వాబోకోయీ—హరిఓబాబులేశా
నన్నుసూసీ నవ్వాబోకోయీ.

"ఏగంటివారి వచనాలని" సామాన్యజన వ్యవహారమున సుప్రసిద్ధములు. వానిలో గొన్ని ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమున సేకరింపఁబడియున్నవి. వారిశిష్యుల రచనల లోనివి. శైవము—వేదాంతము, గార్లపాటిలక్ష్మణకవిరచితము.

తుమ్మెద పాట. అయిదేసి మాత్రల గణములు.

శ్రీకరుం డను పువ్వు-తుమ్మెదా-మూడు
లోకాము లాయెను-తుమ్మెదా
సాకారమైయుండు-తుమ్మెదా-పర
మేకాంతమునజూడు-తుమ్మెదా.

శివశివ యనవే-ఏ-తుమ్మెదా
శివుడనగ వినమేలు-తుమ్మెదా
శివునిభక్తూలాకు-తుమ్మెదా
శివశార-ణనమేలె-తుమ్మెదా ॥

ఆఱు రేకులపూవు తుమ్మెదా-అది
మీఱీన వాసనె తుమ్మెదా
వేఱుసేయక నీవు తుమ్మెదా-శివు
చేరి భజించవె-తుమ్మెదా ॥

ఈళ పింగళాలు-తుమ్మెదా-సుషమ్న
నాళిమధ్యమున-తుమ్మెదా.
మేలిమెఱిగే-నీవు-తుమ్మెదా-శివ
కేళి జరించవె-తుమ్మెదా ॥

చిలుక పాటలు——అయిదేసి మాత్రల గణములు.

చెలగి చెప్పెదబుద్ధి చేకొనీ వినినీదు
చింతమీా దానుండు చిలుకా

కులముతో వైరంబు కొఱగాదు మిక్కిలి
గూడువె ళ్ళకయుండు చిలుకా
పట్టుబసలేని యాపదలకై కెమ్మోవి
పండ్లకే రాకుమీ చిలుకా
పట్టముట్టగరాని బట్టబైటను తేనె
పండు ఉన్నదిచూడు చిలుకా,
గురుతైన యేగంటి గురుపాదములుచేరి
గిరిగడచి యామీద చిలుకా
సిరులుమాయని తెలిసి జీవగుణమది యెఱిగి
చిగురుమే తలబోకు చిలుకా ॥

ఏల పాట.

సూర్యచంద్ర వహ్ని నడుమా
శౌర్యమానే చిలుకగంటి
సూర్యదీప్తి గాయుచుండా గా—యేగంటిలింగా
చూడజూడా శ్చర్యమాయె రా—యేగంటిలింగా

కాంతాల పాలెములోన
చింతమానూ పుట్టెగదరా
చింత అనలూ కొనలుసాగా నా—యేగంటిలింగా
చింత పూసీ–వండు పండే–రా

కానరాని యడవిలోన
వానలేని మడుగునిండె

వానలేని మడుగుమీదా దానూ—యే గంటిలింగా
మానరానీ అగ్నిపొడమే-రా
ఆకులేని యడవిలోన
తోకలేని మృగముపుట్టె
తోకలేని మృగము కడుపూ నా—యే గంటిలింగా
ఈకెలేనీ పక్షి బుట్టేరా.

లాలి పాట.

లాలనుచు ఊచేరు లలనలందఱునూ
ఫాలలోచన నిన్ను బాన్పుపైనుని చీ-లాలీ
ప్రణవపంచాక్షర పాన్పుతాగాగ
భరితచిత్ప్రణవమే బాలీసుగాగా
చరలింగ చిత్కళలు దీపములుగాగ
పరమసద్గురువందు-పవళించుకోగా-లాలీ
లాలిచిద్రూపాంగ లాలయ్య లాలీ
లాలి సజ్జన హృదయ లాలయ్య-లాలీ.

మంగళం.

అరుదొంద వృషభవాహనుడు ఏగంటీశు
డరయలక్ష్మో భక్తవరదుడనుచూ
పరికింప నేలినా ప్రమథాగణములాకు
సరససా యుజ్యశివ సామూహ-మునకూ
జయమంగళం నిత్య శుభమంగళం.

దేశి రచనలనుగూర్చి భరతుని నాట్యశాస్త్రమందు వలెనే, మతంగుని బృహద్దేశియందును పార్శ్వదేవుని సంగీత రత్నాకరమందును గొంత చెప్పఁబడియున్నది. వీనినిబట్టి చూడఁగా ఏలా భేదము లనేకములుగా నున్నట్లగపడును. ఏలలే కాదు - దేశీ ప్రబంధములే అసంఖ్యాకములనియు వానిలోఁ గొన్నిటినే తాము తెలుపుచున్నట్లును జెప్పినా రీ లాక్షణికులు.

" దేశీకారప్రబంధోఽయం హర వక్త్రాద్వినిర్గతః
అసంఖ్యాకాస్తు కథితాః న జ్ఞాయంతేఽల్పబుద్ధిభిః
తేషాం మధ్యాత్ సముద్ధృత్య యుక్తలక్షణలక్షితాః
శ్రీమతఙ్గో మునిః ప్రాహ మునీనుద్దిశ్య తద్యథా
ఆద్యః ప్రబంధః కన్దాఖ్యో వృత్తా నామ ద్వితీయకః
గద్యరూపః తృతీయస్స్యాత్ దండకః స్స్యాచ్చతుర్థకః
పంచమో వర్ణకః ఖ్యాతః షష్ఠ కర్వ్యాభిధాయకః
సప్తమీ కథితా గాథా తతో ద్విపదకోఽష్టమః

9. వర్ధతీ; 10. అడ్డిలా; 11. చతుష్పది; 12. తోథకము; 13. తోటకము; 14. వస్త్వాఖ్యప్రబంధము; 15. క్రౌంచ పదము; 16. హంస; 17. శుకసారికః; 18. అశ్మలీలా;...
......28. త్రిపదీ-షట్పదీ; 29. బంధకర; 30. పాటకరణం; 36. ద్విపదీ; 37. వర్తనీ; 38. ఏలా.

" అష్ట త్రింశత్తమాత్వేలా బహు భేద ప్రవిస్తరా "
39. ఢేంకీ; " ద్వ్యర్ధేకాచైకతాళకా."

ఏతేషా మధికః ఖ్యాతః ప్రబన్ధో మాతృకాహ్వయః
ప్రబన్ధోఽయం స్వరార్థస్స్యాత్ జ్ఞేయోఽసా గీతవేదిభిః
తాలశోభాఢ్యే యః పాఠైర్విరుతైశ్చసమన్వితః
స కన్ద ఇతి కర్ణాటభాషాదిపదమిశ్రితః
కన్దాది ప్రబన్ధా లత్యతః ప్రసిద్ధా ఏవ.
గీయతే యత్ తదత్రాహు ర్గద్యం గీతవిశారదాః
తాలయుక్తం స్వరోపేతం మధ్యే పాటవిరాజితం.
దేశీగీతేఽపి వస్తుస్స్యాన్నాటకేఽపి ప్రయుజ్యతే
గీతే తు ప్రతితాలేన పదస్వరసమాయుతః
మతః క్రౌంచపదో నామ స తు గాంధర్వవేదినాం
సంస్కృతం పాదమేకం తు ద్వితీయం దేశసంయుతం
సప్రాసం గీయతే యత్ర గీతం హంసపదం విదుః
యస్తు తాలద్వయోపేతపదపాటవిరాజితః
యా స్యాత్ కరణతాలేన ద్విపదీ వృత్తసంగతా
సా భవేత్ ద్విపదీనామ ప్రోక్తా వస్తువిచక్షణైః
ఆద్యం పాదద్వయం యత్ర స్యా దనుప్రాసవర్జితం,
అనుప్రాస స్తృతీయేఽపి చతుర్థే వాథ గీయతే,
చతస్రో గీయతే యత్ర పాదే పాదే భవన్తి చ
గీత్వా తదీయపాదార్థం అనుప్రాసో విధీయతే,
త్యాగసౌభాగ్య సౌందర్య శౌర్యధైర్యాదివర్ణనా
యస్యాం భవతి గీతజ్ఞా స్తామేలాం సంప్రచక్షతే.

మట్టేనాథ ద్వితీయేన కంకాలేన తథైవచ
సంయుక్తా ప్రతితాలేన కర్తవ్యైలా మనీషిభిః
వర్ణనీయస్య గాతుశ్చ సాతునామాఙ్కితా భవేత్
ఆదౌ నాదవతీ ప్రోక్తా-తతో హంసావతీ మతా
నన్దావతీ తృతీయాచ-తుర్యాభద్రావతీ స్మృతా
ఇత్యేలా గణమార్గేణ బుధైరుక్తా చతుర్విధా.

ఏలా నాదవతీ రమ్యా వర్ణాలంకార శోభితా
గీయతే మట్టతాలేన నాదయుక్తా పదేపదే
శ్వేతోవర్ణశ్చ విజ్ఞేయః శృంగారః కథితో రసః
కైశికీవృత్తిరాఖ్యాతా పాంచాలీ రీతి రిష్యతే
యత్ర చంద్రగణాః పంచస్వర్గణైకేన సంయుతా,
ఏలా నాదవతీ నామ సా స్మృతా పూర్వసూరిభిః.

హంసస్యేవ గతిం కాసా నాదేన చ పదేన చ
సమం ప్రవర్తతే యస్మాత్ తతో హంసావతీ స్మృతా
తాలో ద్వితీయకస్తత్ర హిన్దోళేన తు గీయతే
రక్తో వర్ణః సమాఖ్యాత శ్చండికా దేవతా భవేత్
యత్రానలగణాః పంచ, షష్ఠో వాయుగణస్తథా
ఏలా హంసావతీ నామ సా స్మృతా గీతపారగైః ॥

లఘుభిర్గమకైర్యుక్తా రాగో మాళవకైశికీ
ఏలా నన్దావతీ నామ ప్రతితాళేన గీయతే.
యత్రాంబరగణాః పంచ మార్తాణ్డగణ సంయుతాః
ఏలా నన్దావతీ సా తు విజ్ఞేయా గీతివేదిభిః ॥

ఏకైక పదసంయుక్తా మూర్ఛనాధ్వని సంకులా
కంకాలతాల సంబద్ధా కకుభేన ప్రగీయతే
ఏలా భద్రావతీనామ శూద్రజాతి సముద్భవా॥
యత్ర భూమిగణాః పంచ షష్ఠో జలగణ స్తథా
త్రిపదం పాదసంఖ్యానం మూర్ఛనాబిన్దు సంకులం
యత్ స్థితం గమకం కుర్యాదేత దేలాసు లక్షణం

ఇతి గన్ధైలా చతుష్టయం.

తృతీయపాదవత్ పాద శ్చతుర్థో యది వర్తతే
ఏలా సంకరతా మేతి మతంగముని భాషితం,
రతిలేఖా, కామలేఖా, బాణలేఖా తథైవచ
కథ్యతే చన్ద్రలేఖా చ-మాత్రైలామాహ వల్లభః
యస్యా మంఘ్రిద్వయే మాత్రా రుద్ర సంఖ్యా స్తృతీయకే
రుద్రహా స్తసమాశ్చైవ, రత్యాఖ్య గణసమ్మితాః
కథితా గీతి శాస్త్రజ్ఞై రతిలేఖేఽపి నామతః.

సంగీత రత్నాకరం.

ప్రబంధో రూపజం వస్తు నిబద్ధస్యాభిధాయకం
చతుర్భిర్ధాతుభిః షడ్భిశ్చాంగై ర్యస్మాత్ ప్రబధ్యతే
తస్మాత్ ప్రబంధః కథితో గీతలక్షణకోవిదైః,
ఉద్గ్రాహకశ్చ మేలాపః ధ్రువ ఆభోగ ఏవచ
ఏలాయాం ఢేంకికాయాం చ స్యాద న్తే నియమాదిమా
అంగాని తు ప్రబన్ధానాం వదామః సాంప్రతం క్రమాత్,
పాద, తేనా, చి విరుద, పాటో-తాలస్వరా తథా
సన్దేహో వాద్యవర్ణానాం పాటస్తాలానుగో భవేత్.

తేన్న తేన్నేతియే వర్ణా గీతేఽసౌ తేన్నకోమపః.
అంగమాత్రేణ విహితా అనిర్యుక్తా ఇతీరితాః
ఛందస్తాలాదినియమాన్నిర్యుక్తాస్తే నిరూపితాః
ధవళశ్చర్చరీ చైవ వదనం ఝంపట స్తథా
చరిజా త్రిపదీచైవ సింహపాద స్తథైవచ
పదం తాలసమాయుక్తా మంగళం స్తవమంజరీ
అమీ సర్వప్రబంధాశ్చ నిర్యుక్తాః పరికీర్తితాః
హరిర్విజయసంజ్ఞస్స్యాత్ ఏకతాళీ తథైవచ.

ఏలా.

ఉద్గ్రాహేంఽఘ్రిద్వయేఽనుప్రాసైః ప్రతిపాదం గణాశ్చ షట్
పాదస్యాంతే ప్రయోగస్స్యాత్ పల్లవాఖ్యం పదం తతః,
పల్లవాఖ్యే పదే నాస్తి నియమో గణవర్ణయోః,
అనేనైవ ప్రకారేణ ద్వితీయాంఘ్రేః ప్రకల్పనా,
గీత్వా తతస్తృతీయాంఘ్రిం దేయో మేలాపకో భవేత్
తదా పాదత్రయే గీతమేకమేవ విధీయతే.
సప్రాసోఽథ ధ్రువే గేయో వర్ణ్యనామ్నా సమన్వితః.
ఆభోగశ్చ తతో గేయో గాతుర్నామ్నా విరాజితః,
ధ్రువం గీత్వా తతోన్యాసః సర్వైలాసు ప్రశస్యతే.

గద్యం.

అపాదః పదసందోహో గద్యం షోఢా తదిష్యతే
వృత్తగంధి తథా చూర్ణముత్కలికాభిధం,
లలితం చ తథా ఖండం చిత్రం తల్లక్ష్మ కథ్యతే.

పద్యభాగాన్వితం గద్యం వృత్తగన్ధి నిగద్యతే
అసమస్తైస్సమస్తైర్వా ద్విత్రైస్తు చతురైః పదైః
రచితం చూర్ణమాఖ్యాతం గద్యం గద్యవిశారదైః
గౌడరీత్యా యుతం గద్యం ప్రోక్త ముత్కలికాభిధం
సమస్తైః పంచషైర్బద్ధం పదైర్లలిత మీరితం
ప్రక్రాన్తరీతిభంగేన బృహల్లఘుపదైర్యుతం
గద్యం ఖండ మితి ప్రాహుః గద్యభేదవిశారదాః
గద్యం చిత్రమితి ప్రోక్తం నానాకృతిసమన్వితం
ప్రణవాద్యం భవేద్గద్యం గేయం తాలవివర్జితం
మిథః సయమకైష్షడ్భి రష్టభిర్వా సమన్వితం,
పదాన్యేతాని మేధావీ గాయేత్ గీతానుసారతః

ఏకతాళీ.

ద్విరుద్గ్రాహం ధ్రువం ద్విశ్చ గీత్వా భోగం సకృత్ పునః
ధ్రువం గీత్వా తతః కార్యో న్యాసో గీతవిశారదైః
ఘనద్రుతా ఘనప్రాసా యత్యా చ ఘనయా యుతా
ఏకతాళాఖ్యతాలేన గేయా స్యాదేకతాలికా
ఆలాపానిర్మితః కైశ్చిదస్యా ఉద్గ్రాహ ఇష్యతే.

దీనినిబట్టి తాళప్రధానములు, మాత్రాగణబద్ధములు, ఉద్గ్రాహాదులతో గూడి గేయములగు నీ దేశి రచనలకు దేశీయపద్ధతిని లక్షణ మేర్పఱచుటలో నీ సంస్కృత లాక్షణికు లెట్లు శ్రమపడినదియు సువ్యక్త మగుచునే యున్నది.

కందము, ద్విపది, త్రిపది, చతుష్పది, షట్పది, ఏల, పదం, పాట, గద్యం, కళిక, ఉత్కళిక, ఏకతాళి, ధవళం, మంగళం, మంజరి మొదలగువానిని లక్షణయుక్తముగాఁ జేయుటకు గొంత ప్రయత్నము జరిగినది. ఇవి తెలుఁగు కన్నడ సాహిత్యములకు సంబంధించినవై యున్నవి. మరికొన్ని-ఢేంకా, ఝోంబడకం, వర్తనీ, ముక్తావళీ మొదలగునవి మహారాష్ట్రాది దేశ ప్రాంతములలోని దేశి రచనా భేదములు కావచ్చును. తెలుఁగు లాక్షణికులు పైవానిలోఁ గొన్నిటిని వదలివేసినను, వీనిలో పెక్కు చిరకాలమునుండి సామాన్య జన వ్యవహారమున నుండిన దేశి రచనలనుటకు సందేహాము లేదు. వీనికి సరియైన లక్షణ సమన్వయము, లక్ష్య సంపాదనము, భిన్న భాషలలోని దేశి రచనలకుఁ గల పరస్పర సంబంధాన్వేషణము, భిన్నములగు నీ ఛందోరీతుల మూల తత్త్వ పరిశీలనము, ఆ యా దేశ భాగములం దింకను నిలిచి యున్న దేశి రచనల సంగ్రహణము, ప్రకటనము మొదలగు కార్యము లాంధ్రదేశి సాహితీపరుల యాదరాభిమానముల నాకాంక్షించుచున్నవి. వారు వీనియందు శ్రద్ధాళువు లగుదురు గాక.

S.V.O. ...
TIRUPATI
Acc. No. 26297
Date

PRINTED AT THE LIBERTY PRESS, MADRAS